శ్రీరామమూర్తి, గురుజాడ

కలభాషిణి

మద్రాస్, 1911

Record no. 93

Śrīrāmamūrti, Gurujāḍa

Kalabhāṣiṇi

Madrās, 1911

Record no. 93

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

శ్రీరామమూర్తిపంతులు, గురుజాడ.
కలభాషిణి / గురుజాడ శ్రీరామమూర్తిపంతులు.- మద్రాస్:
జోతిష్మతీముద్రాక్షరశాల,1911.
128p. ;20 cm.
Record no. 93

Śrīrāmamūrtipantulu, Gurujāḍa.
Kalabhāṣiṇi / Gurujāḍa Śrīrāmamūrtipantulu.- Madrās:
Jōtiṣmatīmudrākṣaraśāla,1911.
128p. ;20 cm.
Record no. 93

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

క ల [illegible]

ఇది

కవిజీవితాది గ్రంథకర్తలగు

గురుజాడ, శ్రీరామమూర్తిపంతులుగా

[illegible]

[illegible]

[illegible]

(రెండవకూర్పు)

...పఁబడి ప్రకటింపఁబడినది.

మద్రాస్.

లోసి తథ రు.

మిక్కిలి చిక్కులుగల సం...

సామాన్యముగాఁ దెలియునట్టి పదశ... ...ప్పు ప్రౌఢమగు ప్రబం నొప్పి కథాసందర్భానుసారము లగు ప్రబంధవర్ణనములతోఁ బ్రకాశింపఁ జేం

ఇట్టివే మఱికొన్ని కారణములు నుండుటచేత నీకావ్యముం జదువువారు కథార్థము తెలియువఱకుఁ గొంతచదివి పిమ్మట కథయును దానితో నన్వయమును దెలియనివారై గ్రంథమును వదలుచున్నారు. నేనును ప్రథమములో నిట్టివారిలోనివాఁడను గానే యుంటిని. కాని ప్రస్తుతకాలములో "నవలలు" వ్రాయుటకు యత్నించువారి యుత్సాహములఁజూచి యాంధ్రభాషలో నిట్టి యుద్యమమునకుఁ ప్రథమములోఁ బ్రయత్నించిన పింగళిసూరకవి తన కళాపూర్ణోదయములో నెంతవఱకీకల్పన నడిపించెనో చూచెదఁగాక యని యుత్సహించి తిరుగఁ గళాపూర్ణోదయ కథఁ జదువ నారంభించితిని కాని తొంటియట్లే కథలకుఁగల సంధులు బెసికిపోవుచుండుటఁజూచి చదివినకథ వచనముగా వ్రాయ నారంభించితి. ఇట్లుగా నీగ్రంథమంతయుఁ జదువఁగా నీ సూరనకవికిఁగల కల్పనాచమత్కృతియును, ప్రాబంధికతాశక్తియు, వాక్య కౌశలంబును, ప్రాచీన నవీనకవుల కందరానివై యున్నట్లు గాన్పించె. ఇన్ని యాధిక్యత లున్న నీ గ్రంథము పై కారణములచేత నాంధ్రపండితలోకమును దనియింపక యుండుటకుఁ జింతించి యాకొఱఁత కొంతమైనఁ దీరఁగల దనునమ్మకముతో సాధ్యమగునంతవఱకు సూరకవి వాక్యసందర్భమును, వర్ణనాంశములతో నొప్పు నెన్నిక పద్యంబులను జేర్చి "కలభాషిణి" యనుపేరఁ బ్రకటించినాఁడను. ఈకథలోనుండు చమత్కార మంతయుం వెల్లడించినచో స్వారస్యము చెడిపోవును గావున పాఠకులకుఁ జదివినవెంటనే యద్భుతానందము కల్గుటకుగా నేనట్టి మతుకులు వెల్లడి చేయలేదు. ఇట్టి గ్రంథములు చదువుకొనువారికిఁ గథానందము గల్గుటయుఁ బ్రబంధప్రవేశము కల్గుటయు ననుఫలంబులు రెండును గలుగఁగలవు. నాగ్రంథము కొంతబాహుళ్యమైనందులకు మన్నింపఁ బ్రార్థించుచున్నాఁడను.

ఇట్లు

గురుజాడ, శ్రీరామమూర్తి.
విజయనగర సంస్థానపండితుఁడు.

విజయనగరము
22-8-98

స్తంభుఁడు — ... ...

మృగేంద్రవాహన — అద్భుతమహిమలుగల యొకశక్తి.

.. సుగాత్రి — మలయాళదేశములోని శారదాపీఠములో నుండెడు పూజారిబ్రాహ్మణుని పుత్త్రిక. (సుముఖాసత్తి.)

౭. శాలీనుఁడు — పై సుగాత్రి భర్త. (మణిస్తంభుఁడు.)

౮. అలఘువ్రతుఁడు — మలయాళదేశమునుండివచ్చిన యొకబ్రాహ్మణుఁడు.

౯. రంభానలకూబరులు.

౧౦. కృష్ణుఁడు. మొ.

౧౧. దేవలోకశుకము.

౧౨. ఇంద్రుఁడు.

౧౩. మాయారంభ.

౧౪. మాయానలకూబరుఁడు.

౧౫. మణికంధరహారము.

ఉత్తరభాగము. (9—16 ప్రకరణములు)

౧. కళాపూర్ణుఁడు — కథానాయకుఁడు.

౨. మధురలాలస — కథానాయిక.

౩. మదాశయుఁడు — మధురలాలస తండ్రి.

౪. రూపానుభూతి — మధురలాలస తల్లి.

౫. అభినవకౌముది — గంధర్వస్త్రీ. కళాపూర్ణుని ప్రథమభార్య.

౬. ప్రథమాగమాదులు — మదాశయునిపురోహితులు. (నలుగురు)

౭. స్వభావనాముఁడు — ఒక సిద్ధుఁడు.

౮. సత్త్వదాత్ముఁడు — కళాపూర్ణునిమంత్రి. (సుగ్రహుఁడు)

౯. బ్రహ్మ.

౧౦. సరస్వతి.

౧౧. దత్తాత్రేయుఁడు.

౧౨. యజ్ఞశర్మ.

౧౩. దేవవిమానము.

శ్రీ

కలభాషిణి.

మొదటి ప్రకరణము.

కథాప్రారంభము.

శ్రీలకు నాకరమై, శ్రీహరికిఁ గేళీభవనంబై తనరారు ద్వారక యను నొక పురవరంబు గలదు. అయ్యది పశ్చిమసముద్రతీరంబున సమస్తవస్తుజాలనిస్తులంబై, ఆత్మస్వర్ణమయాగమ్యహర్మ్య ధరీకృతామరపురంబై ప్రకాశించుచుండును. అట్టి పట్టణోత్తమంబునకు గర్భీకృతానేకబ్రహ్మాండభాండుం డగు కమలానాథుం డధినాథుండై యుండు.

ఆ పురీవరంబున నివసించియుండు నొక నటముఖ్యునకు నానాగుణరేఖం దనరారు నొక నందన కలదు. ఆ బాలిక కలికితనమును జతురతయుఁ గల పలుకులు పలుకు చుండుటంజేసి దానికిఁ గలభాషిణి యను నామంబన్వర్థంబయ్యె. నామమునకుఁ దగిన యట్లే యాబాలికకు రూపరేఖాదులునుండె. ఎట్లన:—

సీ. మెఱుఁగుదట్టంపుమించు మించుబాగుఁ నింపు నింపుచక్కనిముద్దు నెమ్మొగంబు
నవచంద్రికలనవ్వు నవ్వు తీవులఁ జూపు చూపుల చొక్కఁపు సోయగంబు
నారూఢిబలుమారు మారువిండ్లను నేర్పు నేర్పుకన్బొమదోయి నెఱతనంబుఁ
గటికిచీకటిఁగప్పు కప్పుఁబూనిన కొప్పు కొప్పుతోరంపు జక్కఁదనంబు

తే. గుబ్బపాలిండ్లు తేఁగొను గొప్పపిఱుఁదు । బాహులతికలు మృదుపదపల్లవములు
బంగరుసలాకపసభంగపఱుచు మేను । గలికిచెలువొందుచుండు నాచెలువమిగుల.

ఇట్టి యా రమణీమణి మహావిభవంబున నొక్కనాఁడు చెలికత్తియలతోఁ గలిసి వసంతవిలాస భాసుర పురోపవనంబునకేఁగి తద్వనవిశేషంబులు చెలుల కీక్రింది విధంబునఁ జెప్పె.

సీ. క్రొన్ననల్ వలరాచవన్నెనల్ గరగర మల్లికల్ గొనియున్న మల్లికలును
సంతానములకలిసంతానములయాటపాటలములఁ జూపు పాటలములు
తీవిచేకొన్నపూఁదావిచేఁ బథికాంతరంగముల్ నొంచు సారంగములును
మారుమేలైన బంగారుమేడలఁ బోల్ప భంగిరై మించు సంపంగిగములు

తే. మంజులములైకనంబడు వంజులములు । కుందములును వాసంతికాబృందములును
గేసరములును నవనాగకేసరములు । కాంతలార కంటిరె కడువింత దగుచు.

అని యిట్లు కలభాషిణి పలుకు పలుకులకుఁ జెలు లెంతయు సంతసిల్లుచు నొండొరులతో వార లనేకవిధంబుల సరససల్లాపంబులఁ బిసాళించుచు నింపుదళుకొత్తఁ గ్రొత్త విరిగుత్తులచేత నేత్రపర్వం బగుచున్న యాపువ్వుఁదోటఁ దఱియంజొచ్చి పుష్పాపచయం బుసల్పి డోలావిహారంబు సల్పుచుండిరి.

ఇట్లుండ లీలామానుషవిగ్రహధారుం డగు వాసుదేవుం దర్శింప నానాఁడు పరమభాగవతావతంసుండును, స్వశరీరకాంతివినిర్జితనారదుండు నగు నారదుం డను మహామునీశ్వరుండును, తద్గానవిద్యావిశేషాభిలాష నమ్ముని వెంటం జనుచుండిన మణికంధరుం డనంబరఁగు నొక గంధర్వకుమారుండును నామార్గంబున వచ్చుచుండిరి. అంతకుమున్నె తద్ద్వారవతీ వారశిరోరత్నం బగు కలభాషిణి సంతతోద్యానకేళీవినోదంబుల హితసీమంతినీపరివృతయై పూఁదీఁగెలఁ దూఁగుటుయ్యెలలఁ దూఁగుచు నొకరితో వేఱొక్కతె పంతములాడుచు మిన్నుఁ దన్నునటులఁ జేయు డోలావినోదంబులఁ జూచి మణికంధరుండు నారదముని నుద్దేశించి యిట్లనియె. మౌనివర్యా! పరికించితే, ఈ లతకూనల డోలావిహార ప్రగల్భతాగరిమ. వీర లూఁగుచు మింటికిఁ దమ పదంబులు గెంటుచున్నసొబగు చూడ నాకలోకంబున నుండు మచ్చకంటులను సౌందర్యాదులఁ దమతో గయ్యంబునకు రమ్మని కాలుద్రవ్వుచుండునటులఁ గాన్పించెడిని. భూలోకభామినుల విలాసంబు లిట్లుండవలదా! అనుడు నారదుండిట్లనియె.—భళిరా! నీవు సత్కవివే యగుదువు. నీవర్ణనం బెంతయుఁ దగియున్నది. ఈ డోలావిహారంబుసలుపు బాలామణుల ఖేలనంబు సర్వ సుపర్వ నారీగర్వాపహారంబు సేయ నూర్ధ్వంబుగాఁ దలఁ దన్నుటకుఁ బర్వునట్లున్నదియౌన మఱియు నొప్పునుగదా!

రంభా నలకూబరుల విహారము.

ఇట్లా గురుశిష్యులు తమలోఁ దమరు మాటలాడుకొనుచుండ మేఘంబులచాటున విమానస్థులై విహరించు రంభా నలకూబరు లవ్వాక్యంబు లాలించిరి. వారిలో రంభ ఆ గురుశిష్యుల వాక్యములకుఁ గొంచెముకనలి భావవికృతి యెఱుకపడనీయక యడఁచిపెట్టి తన ప్రియుం డగు నలకూబరునితో నిట్లనియె. ప్రాణనాయకా! వింటివిగదా యీవాక్యములు, అవి కలహాశనునివిగాఁ దోఁచుచున్నవి. కలహాశనమునియే యచ్చోనుండిన మన మతనిం దర్శించి యుచితాలాపంబులాడి పోవుట మంచిది. పోయినత్తెముగాక, యని యా రంభయును కుబేరకుమారుండును దమ విమానోత్తమమును నారదముని పదాంభోరుహముల క్రిందిచాయఁ బోనిచ్చి పారిజాతకుసుమసౌరభములు వెదజల్లు తమశిరంబు లల్లనల్లన వంచుచు నతనికిఁ బాదాభివందనంబు గావించిరి. అపుడా

మునిశ్రేష్ఠుం డాసుందరాకారుల సంతతాన్యోన్యప్రేమభాజను లగుదురుగావుత మని దీవించె. అట్టి దీవెనలంది మందహాసాంచితవదనారవిందయగుచు రంభ సంరంభంబున నిట్లు పల్కెఁ. ఓ తపోధనవర్యా! మీయాశీర్వాదప్రభావంబున నీకుబేరుని ముద్దుపట్టికి మాయెడఁగల ప్రేమాతిశయంబు చెడకనిలుచునేమొగాని మనుజకాంతల వింతసోయగములకీ యక్షేశతనయుండు భ్రమయక యుండఁగలఁడా? అని రంభ తన మనంబునంగల యారసంబు సైరింపంజాలక యెక్కసక్కెయంబుగా నాడుమాటలకు సందియంబు నొందుచు నిలిచి నారదుం డిట్లనియె. ఓ అచ్చరముచ్చకంటీ! నీమాటలలోనియభిప్రాయ మతిగూఢముగా నున్నది. నాకది తెలియంజెప్పినఁగాని బోధకు రాకయున్నది. వివరించి చెప్పుము. అనుడు రంభ యిట్లనియె. మహాత్మా! మీరు నిలిచి యడుగనేల? దేవరకు ప్రస్తుతగమననిరోధంబు గాకుండ నీ విమానంబులోనికి విచ్చేసితిరేని 'ఏకక్రియాద్వ్యర్థికరీ' అనునట్లగును. ఇదియునుంగాక మహానుభావులఁ గొంత మేరయైనం గొలిచి వచ్చుటయు భాగ్యంబుగాదె. అని ప్రార్థించి శిష్యసమేతుండైన నారదమహామునీంద్రుని దమ విమానంబునం దునుచుకొని తదలంకార చామరంబులు రెండును విచ్చిపుచ్చుకొని రంభయు నలకూబరుండును నిరుగెలంకులనిలిచి యల్లనల్లన వీచుచుండిరి. ఇట్లుండి కొంతవడి కప్పడంతి మెల్లన నిట్లనియె. ఓ మౌనివర్యా! ఇప్పుడు మీర లాడోలికావిహారిణుల ప్రసంగంబున శిష్యునితోడ నేమనిపల్కితిరద్దాని నానతీయవలయును. అనుటయుఁ జిఱునగవుతో నారదుం డీ క్రిందివిధంబునఁ దెల్పెః—

మ. భళిరా సత్కవివౌదు నిక్కము తగన్ భావించి నీవన్నయా
యలప్రాయంపు మిటారికత్తెలబెడం గెందునుంగాన వా
రల డోలాచలనోచ్చలచ్చరణముల్ త్రైవిష్టపస్త్రీల యా
దలఁదన్నం జనునట్లుమించె ననిసన్ దప్పేమి యొప్పే యగున్.

అని యిట్లుపల్కి, రంభా! ఇందేమైన నబద్ధమున్నయెడల దాఁపక చెప్పుము. అనిపల్కిన నవ్విలాసిని నవ్వి యిట్లనియె. మీరు పెద్దలును, త్రైలోక్యారాధ్యులును గాన మీ రేమనిన ననవచ్చును. అతిశయోక్తి వర్ణనలయం దిట్టి యవ్యాహతి చెల్లునని యాడియుండురుగాని యేవరారోహలును మాసరికారను మాధి సిద్ధాంతమునకు నిదర్శనము నిజేశుండైనట్టియు, మాదంట నేయుండునట్టియు, నర్థపుని ముద్దుపట్టి యగు నీ జగన్మోహనమూర్తియే యగుగదా! అనుడు నవ్వుచు నారదమునీంద్రుం డిట్లనియె. ఓ మృగేక్షణా! నీచెల్వుఁడు నిబ్బరమగు ప్రేమతో నిట్టువర్తిల్లుటంజేసి నీవిట్లాడుకొనినం జెల్లును. అయినను దినములన్నియు నిట్లేరావు. సవతి యేరీతిని వచ్చునో భావిని చూడవలదా!

క. నినుఁబోలువనిత నీకును । వనజముఖీ యితనిఁ బోలు వాఁడితనికి నెం
దునుగల్గి కలఁచునో యి । ట్టినిగాఢపుమదముసొంపు లీవులు చను నే.

అనుడు నించుకజంకి రంభ యిట్లనియె. ఓ మునినాథా! నేను నవ్వులకంటిని. మీరు దాని నన్యథాగా భావింపవలదు. మీమాటలమోఘములు. మీరిపుడాడినమాటలు నేను వినఁజాలను. అట్టివానిం బలుకవుడు. నన్ను మన్నింపుఁడని మౌనిపదంబుల కెఱఁగె. ఇట్లుండ నవ్విమానంబు కలభాషిణి విహరింపుచున్న యెలదోఁటలోనికిం దిగియె. అంత రంభా నలకూబరులు సవినయంబుగా మునిచే సెలవొంది తమవిమానంబుల తోడ నిజేచ్ఛం జనిరి.

కలభాషిణి నారదుని దర్శించుట.

అంతకుమున్నె యిచ్చట విహరించుచున్న కలభాషిణి తన కనతిదూరంబున వినంబడు నందఱి వాక్యంబు లాలకించుచుండె. తదనంతరంబ ధగధగిత దిగంతరంబగుచుండు విమానంబు నవలోకించి యాశ్చర్యంబు నొందుచుండి యందుండు నలకూబరుని రూప లావణ్యాది సౌభాగ్యంబునకు మిక్కిలి మెచ్చుచుఁ దదాలోకనంబునం దనియక కొంత మేర తద్విమానంబు క్రిందటిచాయ పొదరిండ్ల యీఁగమి మాటుఁగున వారి సల్లాపంబు లాలకించుచుఁ జని యంత నది మిక్కిలి దూరంబుగా నేఁగుటయుఁ దిరిగివచ్చుచుఁ దన మనంబున నిట్లుచింతించె. ఇంతరూపవంతుఁడగు పురుషుం స్వైవసము చేసికొని గర్వంబునఁ జెలంగు పువ్వుఁబోఁడి యెవ్వతెయోగదా. భాగ్యమన నిట్లుండవలదా. నిజేశుండగు నర్థపుని ముద్దుపట్టి యని పల్కుచుండ వింటిని. అర్థపుని ముద్దుపట్టి నలకూబరుండనియు నతని మోహింపఁజేసినకాంత రంభ యనియు వినియుంటిని. కావున నలకూబరుసన్నిధి నుండునది రంభయే కావచ్చును. అని యూహించి కలభాషిణి యాసంశయము గగనమునుండి దిగుచున్న యప్పరమమునీంద్రునివలన నివారించుకొనియెదంగాక యని నిశ్చయించుకొని యతండును యదుపతికడ కపుడపుడు వచ్చెడు నారదమహాముని నిగా గ్రహించి యొక్కతెగా నతనికడకుఁబోయి ప్రణమిల్లి లేచి విరచితాంజలియై నమస్కరించి నిలువంబడి, యో మౌనిచంద్రా! ఇపు డావిమానముతో నేఁగుచున్న మహాత్ములు రంభా నలకూబరులే కదా; అనుడు నారదమునీంద్రుం డట్లే యగుదురుగాని నీకది యెట్లు తెలిసెం జెప్పుమనుడు— మీరాడుకొను మాటలంబట్టి నేను పోల్చితినని యుత్తరం బిచ్చె. అపుడు నారదుఁడు కలభాషిణింజూచి మేమనుకొనిన మాటల నన్నిఁటిని వింటివా యనుడు; నవ్వనిత రంభ గర్వసంరంభంపు మాటలను, దానికి మీరిచ్చిన యుత్తరములును, వింటి నని తెల్పె, అంత నారదుం డిట్లనియె. ఓతరుణీ! మేమింతవార మనుకొనుట యేరికైనఁ జెల్లునా! ఇఁక చూడుము. రంభ కెట్టి సవతికయ్యము సంప్రాప్తించునో; సవతియనఁగా నెక్కడనో యున్నదా! దైవనియుక్తియుండినచో నీవే కాఁగూడదా? అనుడు, కలభాషిణి యిట్లనియె. ఓమహాత్మా! రంభవంటి సౌందర్యవతికి సిద్ధింపవలయుఁగాని మాబోంట్లెన్నిపాట్లుపడినను మాకు దైవనియుక్తి సిద్ధించునా!

అనఁగా, ఆమాటకేమిగాని నీసౌందర్యమహిమంబు రంభ మొదలగు నేయచ్చరలకుఁ దక్కువయగు? అని నారదుండు కలభాషిణితో నిట్లనియె. ఓసుందరాంగీ! నిన్నెచటనో యీవఱలోఁ జూచినట్లున్నది. నీవు నలిననాభుని కొలువుకూటమున కెపుడైన వచ్చినది కలదా? అనుడు, నాయింతి— మీరు లెస్సగఁ బోల్చితిరనియె. అంతట నారదుం డాయింతింజూచి యవునవును, ఇపుడు నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది; కొన్నినాళ్ల క్రిందట మాశిష్యుం డగు మణికంధరుండు ప్రథమమున శ్రీకృష్ణుని దర్శింపవచ్చినపుడు నామహాపురుషునిపైఁ జెప్పిన దండక మతఁడు చదువఁగా దాని నేకసంతగ్రహించి తిరుగఁబఠియించిన నేర్పరివి నీవుకావా; నీపేరు కలభాషిణి కాదా? అనుడు; చిత్తము, నేనే యా కలభాషిణి నని యాయింతి మాఱువల్కె. నారదుం డాదండకము నీకు ముఖస్థముగా నేని మఱియొకపరి చదువుమనుడు, నా కలభాషిణి దానినంతయుఁ జదివె. ఇట్లుగాఁ జదివిన కలభాషిణి ప్రజ్ఞావిశేషంబునకు సంతోషించుచున్న నారదమునీంద్రునితో— స్వామీ! పై దండకము మూలముగా మీ శిష్యుండు శ్రీకృష్ణుని స్తవముచేయ నాప్రభుం డాతని కవిత్వప్రజ్ఞకు మెచ్చె, అపు డాదైత్యారి బహుమాన మిచ్చినదే గదా యిపుడు మీ శిష్యుని కంఠంబున నొప్పు విమలరత్నహారము. ఈ మణికంధరునికవిత్వ మీ రత్నహారంబునకుఁ దగియే యున్నది.

సీ. పొసఁగ యుక్తిప్రసరల్ పోహళించినలీలఁ దగులొనఁదొరయు శబ్దములుగూర్చి
యర్థంబు వాచ్య లక్ష్య వ్యంగ్య భేదంబు లెఱిఁగి నిర్దోషత నెసఁగఁజేసి
రస భావములకు నర్హంబుగ వైదర్భి మొదలైన రీతు లిమ్ముగ నమర్చి
రీతుల నుచితంబులై తనరారెడు ప్రాణంబు లింపుగాఁ బాదుకొల్పి
తే. యమక నుపమాదులనుయమకాదులనగు । నట్టియర్థశబ్దాలంక్రియలు ఘటించి
కవిత జెప్పంగ నేర్చు సత్కవివరునకు । వాంఛితార్థంబు లొసఁగనివారు గలరె.

ల. చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
లలిగినను సౌరభముఁ జలువయుఁ దలిర్పం ।
బొలుపెసఁగు కప్పురపుఁ బలుకులకుఁ గోమలత
నెలకొనిన సౌరభముఁ జలువపసయుం గో ।
మలతయును గలిగి జనముల మిగులఁ బెంపెసఁగు
మలయపవనంపుఁగొదమలకు మధురత్వం ।
బలవడిన నీడు మఱి కలదనఁగ వచ్చుఁగడు
వెలయఁగల యీ సుకవి పలుకులకు నెంచన్.

అని చదివి స్వామీ మహాకవిత్వము లగు నిట్టికవితలు మీయట్టి మహాత్ముల సన్నిధిలోఁ బఠియించిన నెట్టికోరికలైనను సిద్ధింపకయుండునా? దేవర వీణియ మోచి

కోరుచుఁ గొలుచుచుండఁ గోరుకొందును. దేవర దేవకీనందనుని రాణీవాసంబులోనికిఁ బోవుతరిఁ దదంగణమున మణికంధరుని నిల్పి వీణావీణియ పాణింబూనుచు బోవుచుండ దాని నే నందుకొని యెప్పుడువత్తునో యని యుత్సహించుచుండియు దేవర చిత్తంబున కేమితోఁచునో యని యట్లు సేయ వెఱతును. అంతమాత్రపు టూడిగంబు నాకు నొదలఁ బెట్టుఁడు. అని సవినయంబుగా నాయింతి వేఁడుకొనిన నటులనే కావచ్చునని నారదుం డనుమతించె. అంతఁ గలభాషిణి యంతరంగంబున నిట్లు చింతించె. ఇమ్మహాత్ముని యనుగ్రహం బీపాటిగలిగె. దీనంజేసి నావాంఛితంబును సఫలం బగు. అని సంతసిల్లి రంభా నలకూబరులవలనఁ గడపట మునివలన వినంబడిన యొకవాక్యంబుఁ దలంచుకొని దానిం దెలిసికొను తలంపునఁ గృతాంజలియై వినయభరంబున నుండె. అట్లాయింతి కొంకుచున్నం జూచి మణికంధరుం డెద్దియో రహస్యశంక నామె యట్లుండియుండు నని యూహించి యెడగలుగం జనియె. అంతటఁ గలభాషిణి నారదమునితో నిట్లనియె.

ఓమహాత్మా! మీరలు భూమికిదిగియుండు కారణమున గల్గు సంకోచమునఁ గాఁబోలు విమానమునందు మిథున మవ్విమానమును గొంతదూరము భూమిచేర్పననే పోనిచ్చిరి. నేనును వృథా భ్రాంతితో దానివెంబడినే పోవుచుంటిని. అపుడు నలకూబరుఁడు రంభతోఁ బల్కుచున్న మాటలలో నొకదానిని వింటిని. దానిసందర్భం బెట్లున్నదన వివరించెద వినుండు. 'రంభా! నారదమునితో సంభాషించుచుఁ గళాపూర్ణునికథ తరువాయి చెప్పమఱచితివి. దానిం దుదముట్టింపుము. అనుడు రంభ యిట్లనియె. ప్రాణనాయకా! నీకాకథ చెప్పరాదని యప్పుడే చెప్పితినికాదా. నాతోడు దాని బైకి రానీయకుఁడు.' అని యిట్లుగానున్న వాక్యసందర్భముతో నొప్పుకథ నే నెఱుంగక నుత్సహించుచున్న దానను. మహాత్మా, యనుగ్రహించి యాకళాపూర్ణుం డనువాఁ డెవ్వఁడో యతనివార్త రంభ ముందుగ నెంతవఱకుఁ జెప్పె; అనుగ్రహించి దానిందెల్పుఁడని కలభాషిణి యడిగిన నారదుండును నెఱగంది యిట్లనియె.

ఓయింతీ! యిది యెంతయు నపూర్వంబు. అయిన దానిందెలిపెదంగాక. అని కొంతసేపు నిశ్చలుండై తన దివ్యదృష్టిచే నివ్విశ్వంబునఁగల భూతభవిష్యద్వర్తమానవర్తనంబులన్నియు విమర్శించి తత్ప్రకారంబుంగాంచి కలభాషిణింజూచి యిట్లనియె. ఓ యిగురుబోఁడీ! రంభ తన ప్రియునకుఁ జెప్పరాదనుకథ యత్యపూర్వంబు. అది నాకుఁగూడఁ జెప్పఁదగదు. అనుచు, కలభాషి యిట్లనియె. ఓ యనఘచరిత్రా! చెప్పఁగూడని కథాభాగమును నేనుమాత్రము చెప్పమందునా. అది యట్లేయుండనిండు. ఆకథ నేకారణమున రంభ నలకూబరునితో ప్రశంసించె. దానినైనం దెల్పి యనుగ్రహింపుడు. అనిన నారదుం డిట్లనియె. కలభాషిణీ! రంభా నలకూబరు లిర్వురు నేవేళ రతిక్రీడా పరాయణులై

యుండెదరు. అట్టి వేళలో వారి హాసవిభ్రమోక్తులను, మఱి యితరచేష్టితములును మన్మథోద్దీపనమహిమఁ జొక్కించుచుండును. అట్లుండఁగా నేఁడు మమ్ముఁ గన్గొనుటకు ముందుగా రంభ నవీనమార్తాండుదండ శుభ్రమగు మేఘరేఖయొందు వర్తిల్లఁగాంచి నవ్వుచు బ్రహ్మతోనున్న శారదా మణివలెనున్నది చూచితివా? యని పల్కఁగా, ధనదపుత్త్రునకది మన్మథోద్దీపనముకాఁగా, నతఁడు రంభ మోవిని దన పంట నొత్తె. అట్లొత్తుడు నారంభ కంఠంబుననుండి యొక కలవాగ్వ్యాప్తి వొడమె. అట్టి యపూర్వమై యింపుగుల్కెడు గళస్వనంబున కద్భుతింబందుచు నలకూబరుం డింకొకపరి దానిం జేయుటకు రంభనుత్సహించె. అట్టి పల్కులు కాయింతి తనచేఁగాదనిపల్కె. పల్కినను దనియక నలకూబరుండు తనకుఁగల కుతుకంబున మరలమరలఁ బ్రార్థించిన నక్కాంత తనకాంతుని సంతసంబునకుఁగాఁ గొంతకొంత సత్ప్రార్థనంబు సఫలంబుచేసె. అపుడు నలకూబరుం డది యీవఱకెన్నండును విన్నదికాదు. అది యెప్పగిది నొదవె యని గ్రుచ్చి గ్రుచ్చి యడుగ నారంభించె. అట్టివాక్యంబులకు రంభ దాఁచలేక యది నేఁడు నేర్చినదికాదు; తడవు దినాలనుండి నేనెఱుంగుదు. అది యొక కారణంబున నెఱుకపఱుపక నెఱియ మఱచియు నేఁడు బాలభాను పాండుమేఘసంసర్గవిశేష వీక్షణంబునఁదలంచినంత మానసంబులోనన పూనియుండి యిప్పటి నీదుఁడగంబుకలనఁ దలఁగి వెలివిరియ నిచ్చితిని. అనుడు నలకూబరుం డోలతాంగీ! యేమికారణమున నిన్నినాళ్లు దీనిదాఁచితనుఁడు రంభ యిట్లనియె. ఓ పురుషాభరణా! తత్ప్రసంగంబున గళాపూర్ణుని కథలు వచ్చు ననుభయంబున దానిం దాఁచితిని. వచ్చిన నేమాయెనంటివేని వినుము. ఆకథలు చెప్పినట్టివారును వినినట్టివారును ధాత్రియందు పుత్త్రపౌత్త్రాది బహుసంతితోఁ జిరకాలము ప్రచురసంపదభివృద్ధితో శుభసౌఖ్యములుగాంతురని కలదు. నీకీకథ నేను చెప్పుటయేఁగల్గిన దీనికిఁగా నవనిఁ బుట్టవలసివచ్చు. నీయంగసౌఖ్యంబునఁ దృప్తినందు నాకట్టికోర్కె యిష్టకార్య మగునా? కావున నేఁ దెల్ప వెఱచుచున్న దానను. నీవుమాత్రము వినలేదా, నీకీబాధ యెట్లుతప్పె? నని యానెవవేని తెల్పెద వినుము. నేను వినినపిమ్మట నే యొక్క యమోఘవాగ్విలసనం డిట్టికట్టుబాటు జేసెను. కావున నీ వృత్తాంతము వచియించుటకుఁగాని వినుటకుఁగాని, వలనుపడదు. అని రంభ యిట్లుపల్కె నని నారదుండు కలభాషిణికిం జెప్పి, యో సుందరాంగీ! రంభకుఁగల భయమే నాకును గల్గుటకతన నీకాకథ చెప్పఁగూడదు. ఇట్లున్నను ఈకథ యీభూవలయంబునఁ బ్రకాశింపఁగలదు. దానికి మార్గంబులును గలవు. అది యటుండనిమ్ము. రంభా నలకూబరు లవ్విధంబున సల్లాపంబొనరించిన యనంతరంబ తద్విమానంబు మత్సమీపంబున కేతేర మీఁదొలికా ప్రసంగంబులు జరిగె. తక్కిన వృత్తాంతంబు నీవు ఎఱిఁగినదేగదా. అని యిట్లు నారదుండు పల్కి, తద్వనలక్ష్మీవిలోకన కౌతుకంబున నెడఁగాఁ జనియున్న మణికంధరుం బిలిచె. అతఁడును గలియరాఁగని,

ఓయీ, మన యంబుజాక్షుని కొలువువేళ దప్పకుండఁ బోవలయు రమ్మని నారదుండు నడువం దొడంగె. కలభాషిణియు నతని యనుజ్ఞఁ గొని తన చెలికత్తియలఁ జేరవచ్చి నిజగృహంబునకుం జనియె.

రెండవ ప్రకరణము.

నారదుఁడు శ్రీకృష్ణుని దర్శించుట.

నారదమహామునీంద్రుం డిట్లు కలభాషిణితోడ సంభాషణంబు వదలి ద్వారకానగరంబునకుఁ బోవుచు దనలో నిట్లు చింతించె. ఆహా యిప్పుడుగదా నా హృదయములోని వేఁగు కొంత శమియించినది. తానే యందగత్తె యని గర్వించి సంచరించెడు రంభకుఁ గ్రొవ్వడఁగింప నవలిపోరు గణించుట కంకణధారణంబు చేసినాఁడను. ఇట్టి నా మనోభీష్టము నెఱవేరుపఁ గలభాషిణియే చాలును. దీని మాటలం బట్టి చూడ దీనికి రంభపై నసూయ యున్నట్లే కాన్పించు. ఇది నా మార్గమున కొకింత చుట్టైనను గాక. ఇదియే యోగ్యమార్గము. దీనివలన రంభను సాధింపఁగలను. పోరు కల్పింపని ప్రతి నిమిష మొక యుగమై నాకుఁ దరింప శక్యము కాకయుండు. అని తలపోయుచు నారదమునీంద్రుండు శిష్యసహితుండై పురప్రవేశమార్గంబున నడచుచుండె.

ఇట్లు వచ్చు నారదమునీంద్రుం జూడఁగాంచి పురజనంబు లంజలిపుటంబులు శిరంబుల ఘటియించి మ్రొక్కుచుండిరి. అట్టియెడ,

మత్తకోకిల. కొందఱంగడకంటిచూపులఁ గొందఱన్నెఱచూడ్కులన్
గొందఱం జిఱునవ్వుడాలునఁ గొందఱందగుదీవనం
గొందఱం జెయిసాచిలెమ్మని గొందఱంగయిదండగొం
చుందపోధనుఁ డాదరించెను సొంపుగాఁ బ్రణతాత్ములన్.

ఇవ్విధంబున సకలజనసేవల నాదరించుచు శిష్యుండును దాను నమ్మునివరుండు ద్వారకానగరంబు దరియంజొచ్చె. ఇట్లు వచ్చి యంబుజాక్షుని కొలువుకూటంబు గాంచి మణికంధరు నుద్దేశించి యక్కాంచనగర్భసూతి యిట్లనియె. మణికంధరా! యీ సభామంటపముం జూడ నా వైకుంఠపురముఁ జూచినట్లే కాన్పించు. ఈభూస్థలి నిది యొక్కటియే మేలివస్తువై చూచునపుడెల్లఁ గ్రొత్తరుచితో నొప్పుచుండు. అని యిట్లు నారదముని దగ్గరుచుండ బహిశ్చారిణు లగు పరిచారిక లంబుజాక్షున కవ్వార్త నెఱింగించిరి. అపుడు శ్రీకృష్ణుండు తన దంతపుటుయ్యెలమంచమునుండి దిగి, యేమీ నారదమునీంద్రుం డెప్పుడు నంతరిక్షమార్గంబున వచ్చువాఁడుక మాని హజారపుత్రోవను వచ్చుచున్నాఁడు! చిత్రము! దీనికిఁ గారణమేమో? యని సంభ్రమంబునఁ దూఁగుటుయ్యెలఁ దూఁగుచోఁ

జెదరిన యరవిరియట్లే యుండఁగా, నడపపుత్రోయ్యాలి మడిచి యిచ్చు తెలనాకు చీలిక చేతియందే యుండఁగా, నట్టిటుగాఁ దొడిగిన యంఘ్రులయం దున్న రత్నసమ్మాళిగెలు జాఱుచుండఁగా, రాణివాసపు చామరగ్రాహిణులు గొంత దూరమువచ్చి తమంతనే మఱలుచుండఁగా, తనకు గైదండ యొసఁగిన స్త్రీ కేలు వదలుటకుమఱువ నది తనతోడనే వచ్చుచుండఁగా మధుసూదనుండు వాకిటిహజారమున కెదురుగా వచ్చె. ఇట్లు వచ్చి ముకుందుండు నారదమునీంద్రునకు దండప్రణామంబు గావించి కైదండ యొసంగి తన శుద్ధాంతమున నొక మణిమయపీఠంబుంచి అందా మునీంద్రుం గూర్చుండఁబెట్టి, క్రొత్తఁగా వచ్చిన యతిథిం బూజించినట్లుగాఁ బూజలు సలిపె. ఇట్లు సలిపి కమలనాభుండు నారదమునీంద్రు నంతిపురంబునకుఁ దోడ్కొనిపోవుచుండ నారదుండు తన శిష్యు నచ్చటనే నిల్పియుంచి తన వీణియ నందుకొనియె. అంతలో కలభాషిణి యతిత్వరితంబుగా నిజమందిరమునుండి వెడలివచ్చి నారదమునిని సమీపించి యతనిచేతివీణియ నందుకొనియె. అట్టి కలభాషిణిం జూచి శ్రీకృష్ణుండు చిఱునగవుతో నేమీ శిష్యత్వంబున నీ మునివరుని సేవింప నిచ్చవొడమెనా. అనుచుఁ గలభాషిణీ, యట్టి దెద్దియు లేదు మహాప్రభూ; యని అటునిటు నొదిగియుండె. అట్టి కలభాషిణిం జూచి యో హరిణాక్షీ! యిట్లొదుగుట మంచిదికాదు. నీకిట్టిబుద్ధి పుట్టుట శ్లాఘ్యమేగదా. ఇట్టి మహాత్ములకు సేవచేయుట శుభప్రదమే. నీబుద్ధిబలంబును, నీపాటనేర్పును, నీమృదుమంజులమగు స్వరసంపత్తియు, మాధుర్యముం జూచునపుడు నీవు నారదునకుఁ గొన్నిదినంబులు పరిచర్యచేసిన నింకను విద్యామహిమతో నొప్పుదు వని నియఁజూచునపుడెల్ల నూహించు చుందును. అట్టిచో నీవే యాప్రయత్నము చేసితివి. నీ కింకను వృద్ధినందఁగలవు. అని పల్కుచు శ్రీకృష్ణుండు నారదమునీంద్రుని జాంబవతీ గృహంబునకుం దోడ్కొనిచని జాంబవతిసతిం జూచి కలభాషిణిం జూపి నీకొక శిష్యురాలిం దెచ్చితిని. దీనిఁ గైకొని శిక్షింపవలయు ననుచు నామహాదేవి యిట్లనియె. ప్రభువంతసా! నాతో మీర లీకఱలో సెలవిచ్చిన కలభాణి యిదియేనా. అని వినయంబునం బల్కి వచ్చియున్న మునివరునకు వివిధోపచారవిధు లందిచ్చె.

నారదుఁడు శ్రీకృష్ణభార్యలవలన సంగీతము నభ్యసించుట.

అంత గోవిందుండా జాంబవతిం జూచి యిట్లనియె. వనజాయతాక్షీ! యీ నారదమునీంద్రుండు గానచాతురిలోఁ బ్రోడయయ్యును దుంబురుమీఁది మత్సరంబున మనవిద్యఁ గూడ సాధింతునని పూనియున్నాఁడు. మనమార్గ మీవఱకెవ్వరు నెఱుంగరు. కావున నీ వెఱింగిన విశేషము లీమునివరునకుం దెల్పి దిద్దుము. అనుడు; స్వామీ! నాతప్పొప్పులు మీరెఱింగి దిద్దవలయు. నాకుఁగల విద్యఁ బరీక్షింపుఁ డని యచ్చటి వీణియ నందికొని తేనెలు చిందుగతి మాధుర్యంబు పొందుపడగ వాయించె. ఆగానంబు విని మేలు

మేలు. నీవాద్యంబున కొక కొదువలేదు. ఈరీతినే యీమునివరుని దిద్దుము. అనిచెప్పించి శ్రీకృష్ణుండు నిజమందిరంబునకుం జనియె. అంత నొక్కవత్సరంబు పర్యంతంబు జాంబవతి నారదుం దిద్దినపిమ్మట శ్రీకృష్ణుండు నారదమునిని సత్యారుక్మిణులకడకుం దోడ్కొనిపోయి వారిచే నొక్కవత్సరంబు దిద్దించె. అదియు నైనపిమ్మటం గమలాధినాథుండు తాను నొకవత్సరం బామునిం దిద్దె. ఇట్లుగా నారదుండు దిద్దంబడునవసరంబుల నతని వీణియం గైకొని పోవుచుం దత్సమీపంబున నుండుటం జేసి కలభాషిణియు నావిద్యనంతయు నభ్యసించె. అట్టిలాభంబు లేకయున్నను మణికంధరుండును వాసుదేవుని కటాక్షపాత్రుం డగుటం జేసి యతండును సకల సంగీతవిద్యారహస్యసంపన్నుం డయ్యె. అంత నామువ్వురం జూచి దేవకీనందనుం డీభువనత్రయిలో మీసంగీతవిద్యతో సమమగు విద్యలేదని పల్కె. అంతిపురిలోని కాంతాజనంబులును నారదుని సంగీతవిద్యతో సమమగు గానవిద్య లేదని నిశ్చయించి పలికిరి. అంతట నారదమునీంద్రుండు యాదవప్రవరునికడ ననుజ్ఞం గొని భూసంచారమై బయలువెడలు కోర్కెతో మణికంధర కలభాషిణులు వెంటరాం గొంతదూరంబు సాగిపోయె. ఇట్లుగాం బోవుచుం దన సంగీతవిద్యావిషయమై సరసిజాక్షుని యంతఃపురాంగనలు చేసిన ప్రసంగంబుం దలంచుకొని వారితో నిట్లనియె. కృష్ణాంగనలు మువ్వురు నా సంగీతచాతుర్యంబు గీతు లతినూతనంబు లనియు నీతెఱంగు లూరులకు దొరకవనియుం బలికిరి. అవి ముఖప్రీతికొఱకుం బలికిన వాక్యంబులో యథార్థంబులో యెఱుంగరాదు. నాపరోక్షమున వారు తమచెలులతో తత్ప్రసంగంబునం బలుకునది నిజంబగు. దానిం దెలియువఱకు నామనంబు సంతుష్టినందదు. అనుడు, తత్తపోధనునితోం గలభాషిణి యిట్లనియె. స్వామీ! నేను మీవెంట వచ్చుచుం బోవుచుండుటం జేసి నన్ను వారు మీదానినిగా నెఱుంగుదురు. నేనిపుడు వారిం బరీక్షింప నేఁగుదు నేని వారు నాయెదుట యథార్థము దెల్పియాడరు. నాకపేక్షితమైన స్త్రీరూపము ధరియించుకొను సామర్థ్యము లభియించినచో నేనామగువల సఖులరూపము దాల్చి సముచిత సమయముల వారి హృదయముల నరసిరాఁగలను. అనుడు; నారదుండు తన మనంబున నిట్లు చింతించె. ఓహో కలభాషిణి యీమిషంబున రంభరూపము నుధరియించుటకుం దగుసామర్థ్యము సంపాదించుకొని నిధీశసుతు నారూపంబునం గూడ నూహించుచున్నది. అదియును నాకార్యానుకూలమే యగుంగదా. అని యూహించి కలభాషిణితో నిట్లనియె. బాలికామణీ! నీవుకోరిన సామర్థ్యము నీకు లభియించుటకు వరమొసంగితిని. నీవు నీవలసినట్టి యంగనలరూపము ధరించుకొని యబ్జనాభుని భార్యల తలంపెఱింగిరమ్ము; అనుడు, మహాభాగ్యమని కలభాషిణి వనజాయతాక్షుని రాణివాసంబునకుం బోయి వారి సఖులరూపమును ధరియించి వారలు సన్నిధిలో లేనిసమయమున నారదుని ప్రసంగంబు దెచ్చినంత, వారలు సంయమీంద్రుని సంగీత చాతుర్యభంగు లనన్యసాధారణంబు లని

నుడువ విని, యావాక్యంబులు మునిపుంగవునకుం దెలిపె. అట్టివాక్యములు వినుటకంతయు సంతసించి నారదుండు కలభాషిణితో నిట్లనియె.

తే. కొమ్మ మున్నునీవాత్మలోం గోరినట్టి । కాంతు రంభామనోహరాకారుఁడగుచు
మెఱయువానినిగూడి రమింపఁగలవు । నమ్ము పొమ్మిఁక నీభవనమ్మునకును.

అని కలభాషిణికి సెలవొసంగి దాని నింటికిం బంపి నారదమునీంద్రుండు మణికంధరునితోం గొంతముచ్చటించి నిజేచ్ఛం జనియె. మణికంధరుండును నారదాదేశంబునం దీర్ఘయాత్రకై చనియె.

మూఁడవప్రకరణము.

ఇట్లు కలభాషిణి నారదమహామునిచే వరంబునందికొని నిజగృహంబునకువచ్చి గానాభ్యాసం బుడుగుటచేతను, నాగరకుల రాకపోకల తగులంబు చాలమిచేతను, క్రమంబునం దనచిత్తంబు నలకూబర చింతాయత్తంబగుచుండం దత్సమీప గమనంబున కుపాయం బరయుచు బహుకాలంబు గడపె. కాలయాపనంబు క్రమక్రమంబుగా దుష్కరంబగుచుండ యొక్కనాఁడు తా నొక్కతియ వీణియం గైకొని స్వగృహారామంబునకరిగి యందు గూర్చుండియుండె.

కలభాషిణికడకు సిద్ధపురుషుండు వచ్చుట.

అంత భూతిపూఁతయును, లాఁతపుఁగోలయును, కక్షపాలయును, మందులపొత్తమును, నాగబెత్తమును గల్గి, శృంగినాదములతో నొప్పు నొకసిద్ధుండు సింహవాహనంబుతో గగనంబుననుండి కలభాషిణి యున్న తోఁటలోనికిం దిగుచుండుట కలభాషిణి వీక్షించె. అట్టి మహిమ కద్భుతమందుచుం గలభాషిణి యాసిద్ధపురుషునకు నమస్కరించి యర్ఘ్యపాద్యాదులొసంగి యాసనం బొసంగి యతని విధ మరయ నుండునంతలో సిద్ధుం డిట్లనియె.

కలభాషిణీ! నీగురుండగు శ్రీకృష్ణునిం గొలువం జనుదువా? సంగీతవిద్య పూర్ణముగ నభ్యసించితివిగదా? దేవఋషి యగు నారదుం డిపుడు రాకపోకలు మానినట్లు కాన్పించు. ఆకారణముననే కావలయు నీ మన మితర ప్రపంచమునందలి చింతలు వదలి నలకూబరునియందే నిలిచియుండ నోపు. నారదమహాముని కడపటినాఁడు నిన్ను నీయింటికనుపుచో నీ కడను యభీష్టసిద్ధి యగుటకుం దగుదీవెన యిచ్చెం గదా! అట్టి మహామునివాక్యము లమోఘములే యగును. ఇంతలో నీ తాల్మిని చలియింపనీయకుము. నీప్రాణసఖులు నీవు బడలియుండుటం జూచి యోర్వఁగలరా? మణికంధరుండు చిరకాలమునుండి తపము చేయుచుండుటం జేసి పాటపాడుట మానెను. నా చెవు లక్కారణంబున

నుపవాసఖేదము నందుచున్నవి. నీవు వీణియవాయించితివేని, నేఁడైన నావీనులు తృప్తిఁగఁ బారణసేయఁగలవు. ఈ భువనములో మీయిర్వురి పాటలే గాని యన్యములు నాకింపు గావు. అని యిట్లుచెప్పిన సిద్ధుని పల్కులకద్భుతం బావహిల్ల యా పల్లవాధర కరపల్లవంబులు ముకుళించి వినయవినమిత గాత్రియై యిట్లనియె. ఓ మహాత్మా! నీవు సాక్షాద్దేవుండవో లేక యోగాయతులగు కపిలాది మహాసిద్ధులలో నొక్క సిద్ధుండవో. నీ యనుభావ మత్యద్భుతముగా నున్నయది. నీ నామమెద్దియో సెలవీయఁగోరెదను. అను కలభాషిణి వాక్యములు విని, ఓ జలరుహాననా! నేను నీవువక్కాణించు మహాత్ములలో నెవ్వండను గాను. నేను మణిస్తంభుం డను నొక సిద్ధుండను. అనుడు కలభాషిణి యిట్లనియె.

ఓ మహాత్మా! మీ వాక్యములలో నొక్కొక్కటి వినునప్పుడు నా మనంబున కెంతయు నద్భుతం బావహిల్లుచున్నది. మీరు మహిమవలన సర్వంబు నున్నదియున్నట్లుగాఁ గంటిరి. ఇట్టి మీకు బ్రపంచమునందు వానిలోఁ గానరానిదేదియు లేదనియే చెప్పవలసి యున్నది. నాకుఁ దార్క్షాణమైనయంతయును దిరుగఁ జెప్పవలదా. మణికంధరుఁడు తపముచేయుచున్నట్లు చెప్పితిరి. ఆతనివృత్తాంత మానుపూర్వికముగాఁ జెప్ప వేఁడెద ననఁగా, సిద్ధపురుషుఁ డిట్లనియె.

మణికంధరుని తపోవృత్తాంతము.

ఓ కాంతాలలామా! నాకు దూరదృష్టియు, దూరశ్రవణంబును గలదు. ధ్యానం జేసి యే నున్నచోటనేయుండి సమస్తంబునుం గనుగొనఁగలను. నీ వెఱింగిన యర్థం బెల్ల సరిదాఁచెను. అది యటుండనిమ్ము. నీవనిపించుకొనిపోయిన వెనుకటి నారద మణికంధర సంభాషణప్రకారంబును, తపఃపర్యంతంబైన మణికంధరు వృత్తాంతంబును వివరించెద వినుము. నారదుండు గానశిక్షాపూర్త్యనంతరము నిన్న నీయింటికనిచి మణికంధరుం జూచి యిట్లనియె. మణికంధరా! నీవు సంగీతవిద్యలో నతిలోకపరిశ్రమంబు చేసినాఁడవు. అట్టి నీవిద్యకు ఫలముగా సర్వేశ్వరుం డగు విష్ణుదేవునింగూర్చి గానము చేయుచు నమ్మహాపురుషుని వేసరక సర్వకాలము భజియింపుము. ఆమహాపురుషునకుఁ గానమం దతిప్రీతి యుండుటంబట్టియు, నట్టి గానము దురితవినాశహేతువగుటం జేసియు, నే నా మోక్షోపాధినిగూర్చి యత్యాదరమున నీ వీణియ ధరించి పాడుచుందును. విశ్వావసుం డను గంధర్వుండు బృహస్పతి యను వీణనువహించియుండును. తుంబురుండు కళావతి యను వీణియను ధరించు. నా వీణియకు మహతి యని పేరుగలదు. జగదంబ యగు శారదాదేవి కచ్ఛపి యను పేర నొప్పు వీణియ ధరించు. వీనిభంగుల నెంతయుఁ బరిశీలింపఁదగియుండును. విద్యలన్నిఁటిలో సంగీతవిద్య యత్యుత్తమము. అట్టివిద్య పురుషోత్తమున కర్పితం బగునేని చెప్పవలసిన దేమియున్నది. మణికంధరా! నీవట్టికృతార్థుండ

వని చెప్పవచ్చును. తపములఁగూడఁ గనరాని జగత్పతి యగు శ్రీకృష్ణుండు నీకు గురుండై గానసత్కళ నీకుపదేశించె. ఇట్టి భాగ్యోదయశాలి వగునీవు నీవిద్యను సర్వదా హరిభజనంబున నావర్తింపుము. ఇఁక నేనును వేగమె పోయి నా పడిన పాట్లుదీరునట్లుగా స్వర్గలోకంబునఁగాని, సత్యలోకంబునఁగాని, విష్ణులోకంబునఁగాని యెచ్చోఁదటస్థించినఁ దుంబురు నెదిర్చి నా గాన ప్రౌఢిం జూపి యతని గర్వమును ఖండించెదను. అనుడు, ముకుళితకరకమలుండగుచు మణికంధరుండు నారదు నుద్దేశించి యిట్లనియె. స్వామీ! మీ మాటలంబట్టి మీరు గానవిద్యచేతఁ దుంబురుఁ గెల్వనున్న సంభ్రమంబు గానిపించుచున్నది. మీయట్టి వారి కిట్టి బద్ధమత్సరంబు గల్గుటకుఁ గారణంబేమి? వినందగునేని వివరింపఁ బ్రార్థించుచున్నాఁడను. అనుడు, మణికంధరునితో నారదుం డిట్లనియె.

తుంబురునిపై నారదుని మత్సరకారణము.

మణికంధరా! నా మాత్సర్యకారణ మంతయు వివరించెద వినుము. తొల్లి యొక్క సమయంబున వైకుంఠపురంబున మహావిష్ణుండు బ్రహ్మాది దేవగణంబులును, సనకసనందనాది పరమభాగవతులును, సేవింపఁగా నిండోలగంబుండె. అట్టిసమయంబున నప్పుండరీకాక్షుని సేవింపఁ గౌండిన్య, శాండిల్య, మాండవ్య, మార్కండేయాది మహామునులందఱు నేఁగియుండిరి. ఇట్లుగా దేవముని సంఘంబులువచ్చి సేవించుచుండ నంత విష్వక్సేనుండు వేత్రహస్తుండగుచువచ్చి యందఱ నెడగలుగ జడియుచు బరాబరి యొనరించుచుండె. అంతట మేఘమండలిలోని మెఱుములభంగి నొప్పు సఖీజనంబులతో నెగ్గడిక త్తియలు భజియింపుచుండ జగన్మాత యగు పద్మాలయామహాదేవి యా కొలువుకూటంబునకు విచ్చేసె అప్పు డనేకులు బద్దలవారువచ్చిపడి కొలువుకూటములోనుండు వారినందఱ నెడగలుగందరిమిరి. అట్టిచో నస్మదాదులమాట చెప్పనేల! హిరణ్యగర్భుండు గూడ నచ్చోటువాసి యతిదూరంబున వచ్చి నిలువఁబడియెను. ఇట్లుగా మేమందఱమును బహిరంగణంబున నిలువంబడియున్న సమయంబున లోనుండి యొక వేత్రహస్తుండువచ్చి వోయితుంబురా, సెలవగుచున్నది, రమ్ము రమ్ము; అని యెలుగెత్తిపిలిచి అతివేగంబున నతని లోనికిం దోడ్కొనిపోయె. అపుడు అచ్చటనున్న వారలలోఁ గొందఱు ఏమొకో తుంబురుని మరలఁ బిలిపించిరనియు, మఱికొందఱు గాన ప్రసంగము లేమైనవచ్చియుండనోపు, అయినను గానమునందు మఱియెవ్వరును లేరాయనియును పల్కుచుండిరి. అపుడు నేనును దుంబురుం బిలుచుటకుఁ గారణంబేమియగునో యని మనంబునఁ జింతించుచు నిలిచియుండఁగా నంతలో నతనిపాట వినంబడియె. అపుడు నాసమీపమునం దున్నవారందఱుఁ బురుషోత్తముఁడు తన యంగనామణితోఁ దుంబురు గానంబు చిత్తగించుచున్నాఁడు. ఆ గాన మతనిదే యని పల్కఁగా నమ్మునందఱుఁ బైకిఁదోలించి హరియును సిరియును తుంబురుని గానంబు వినుచుండిరిగదా యని మనమెఱియఁగా నుంటిని. అంతలోఁ దుంబురుండు హరి యొసంగిన యొక మణి

పదకంబుగాని భగభగితంబుగా రాఁగని నాహృదయం బద్దానిం జూచి భగభగమనియుండె. ఇట్లుండి నాలో నేనిట్లు చింతించితి. తుంబురుండు తన్ను హరి రమ్మని పిలువం బంచినపుడు నాతో విచారింపకయే పోయియుండె. పోయినం బోయె. నేనచ్చోటనుండుట యెఱింగియు నన్నుఁ గూడఁ బిలువక తాను నెఱజాణయై తనవిద్య చూపించె. చూపించినఁ జూపించుఁ గాక; తన కీబహుమతినియ్య దానినందివచ్చునపుడైన దాఁచికొనిరాక యందఱ కద్దానిం జూపించె; ఆహా! యేమి యీతుంబురు తగువరితనము, అని పండ్లుకొఱికికొని నాలోపల నే నేనుగొంతతడవు వుడికితిని. ఇట్లుండి యనంతర మతనితో నెందేనియు వాదు పెట్టుకొని భంగపఱిచి మదీయసంగీతచాతుర్య వార్తలు క్రమంబున నిజగన్నాయకునకు వినంబడునట్టి యుపాయంబు వెట్టెదఁ గాక యని యూహించి నాయీర్ష్యబుద్ధిని లోపలనే యడంచి అతని గానవిద్యలోని విశేషము లరయుటకుఁ గా నతనితో స్నేహముగ నేయుండిన లెస్స యని యాలోచించితిని. ఇట్లుండి యొకనాఁ డతనియింటికిఁ బోయి అతఁడు పాటకా యతముగ మేళగించియుంచిన వీణియ నతఁడు లోనికిఁ జనుసమయంబున దానిం బుచ్చుకొని పలికించి దాని యపూర్వ మగు శ్రుతులపెంపు నిర్దోషమై నాకుఁ గడు వెఱఁగు పుట్టింప దానినచ్చటనే మరలనునిచి లజ్జించి నాలో నిట్లను కొంటిని. ఆహా! గాంధర్వ విద్యా పరిపూర్ణుఁడ నని యెల్ల యెడలఁ బ్రసిద్ధివడసియున్న నాకంటెను దుంబురుం డధికుండుగాఁ గాన్పించుచున్నాఁడు. 'తాఁడిఁదన్ను వానిఁ దలదన్ను వాఁడును గలఁడు' అను వాక్యము యథార్థమే—ఇన్ని దినంబులవఱకును బ్రహ్మగర్భాదుల సభలలో నేనును దుంబురుండునుగలిసి పాడుచుందుము. ఎన్నఁడును దుంబురుండు తనకింత విద్య యున్నట్లు చూపింపక నేఁడు పురుషోత్తముండు వినఁగోర తనవిద్యనంతయుఁ జూపించె. లోకములోఁ బుధులగువారు తమవిద్య నెవ్వ రెంతవఱకుఁ గనఁజాలుదురో వారి కంతమాత్రమే చూపుదురుగదా. 'నీరుకొలఁది తామర' యను నట్లుండుటయే యుత్తముల లక్షణము. అదియును గాక, వినువారి యోగ్యతకు మించిన విద్యజూపిన నది చెవిటివానికడనూఁదిన శంఖము వలె విఫలమగుఁగదా. అని యూహించి అప్పటికి నేను శాంతుఁడ నైతిని.

అదిమొదలుగా నెక్కడెక్కడ నక్కజపుఁ గానవిద్య గలవారుగలరో వారినరసి యరసి తద్విద్య సాధించుచు నెందునుం దుంబురున కీడుగాఁజాలమికి వగచి యీ నామనోరథంబు సర్వజ్ఞుం డగు పుండరీకాక్షుని యనుగ్రహంబునఁ గాని ఫలియింప నేరదని నిశ్చయించి తద్దేవుం గూర్చి చిరకాలంబు తపంబొనర్చితిని. అట్టి నాతపంబునకు మెచ్చి దర్శనమిచ్చిన పచ్చవిలుకాని తండ్రిం జూచి నేను గానకలనవలనఁ దుంబురు గెలువ వరంబు వేఁడితిని. అప్పు డయ్యచ్యుతుండు తాను ద్వాపరయుగంబున వసుదేవునకుఁ బుత్త్రుండ నగుదు ననియు, ననంతరము ద్వారకానగరంబున వసియుంచియుందు ననియు, నపుడు వచ్చిన నా యభీష్టముం దీర్చెద ననియు, వరంబొసంగి యంతర్ధానంబు నొందె. అది

మొదలు బహువత్సరంబులు వేచియుండి నేటికిఁ దన్మహిమంబున సంగీతకళాపారగుండ నైతిని. మణికంధరా! నేనిన్ని పాట్లుపడి సంపాదించిన యీగానమహిమ నీవును గలభాషిణియును హరికరుణ ననాయాసముగ సంపాదించుకొంటిరి. అనుడు మణికంధరుం డిట్లనియె.

మహాత్మా! మీయట్టివారల పరిచర్యవలనఁ గలుగని మహిమ లోక కొన్ని యున్నవి. మేము మీదాసులమై యుండిగదా యిట్టి మహామహిమం గంటిమి. అది యటుండనిండు. శ్రీహరి యొక్కసమయంబునఁ దుంబురుం బిల్పించి యతనిపాట వినె నంటిరి. అది మహాపూజ్యమంటిరి. ఎల్లకాలము వైకుంఠమందు నివసించి తన గానవిద్య హరికి సమర్పించుచు నయ్యపారకృపాపయోధిని సేవించి తనియు మహాసౌభాగ్య మబ్బుటకు సాధనం బెద్దియున్నది. అద్దానిం గరుణించి నా కుపదేశించి నన్నుం గృతార్థుం జేయఁ బ్రార్థించెద. అనుడు నారదమహర్షి మణికంధరా! యెంత మంచిమాట యడిగితివి. ఇట్టి సద్బుద్ధి యెవరికైనఁ గలదా? లోకములో ననేకులు వేదశాస్త్రముల నభ్యసించి కొంచెము తెలివిగాంచి 'విట్టిదిర గోఁకలి తలఁజుట్టుఁడు' అనుగీతి నన్యులఁగొల్చెదు కోర్కులతో నుందురు. నీవట్లుగాక మోక్షేచ్ఛ నుండుట యద్భుతంబు. ఇట్లుగాఁ బ్రశ్నించితివి గావునఁ దెల్పెదను:—

సీ. వినుముగంధర్వనందన భూతములయందుఁ బ్రాణు లుత్తమములు ప్రాణులందు
బుద్ధిజీవులు మేలు బుద్ధిజీవులయందు మనుజులు శ్రేష్ఠులు మనుజులందు
బ్రాహ్మణులధికులు బ్రాహ్మణులందు విద్వాంసులుఘనులు విద్వాంసులందు
విదితార్థకృతిలోలహృదయులుముఖ్యులు విదితార్థకృతిలోలహృదయులందు

తే. కర్తలెంతయుపూజ్యులు కర్తలందు । బ్రహ్మవిదులెక్కుడామీఁదబరము మొకటి
గలుగదనుచును మున్నుదాఁబలికె మనువు । ధర్మశాస్త్రప్రసంగవర్తనల వేళ.

అనియున్న తారతమ్యపు మార్గములలోఁ గడుదూర మగు మార్గము లక్ష్మీవరుని నిత్యసన్నిధిని వసింపఁగోరుమార్గము. అట్టిమార్గము ద్రొక్కుటకు నీబుద్ధి యుత్సహించుచున్నయది. అట్టి మహత్త్వావాప్తికిఁ బెద్దలవలన ననేక యుపాయములు వివరింపఁ బడినవి. వానిలో నే నెఱింగిన యుపాయమును నీకుఁ దెల్పెదను. అధికారికానివానికి కధిక పదవిం బొందుమార్గ ముపదేశించినను, అధికారియైనవారికి యుక్తమార్గ ముపదేశింపక పోయినను పాపంబు లభియించు నని పెద్దలు చెప్పుదురు. నీప్రస్తుతపరిజ్ఞానాదులవలన నీవధికారివి గావున నీకు వివరింపకయుండరాదు. వివరించెద వినుము.

సీ. తనశక్తికొలది సత్కర్మముల్ ఫలవాంఛ మాని కృష్ణార్పణమతిసలుపుట
ప్రతిషిద్ధకర్మంబు పరిహరించుట విష్ణుభక్తిపై గ్రమమునఁ బాదుకొనుట

తద్భక్తిగల పుణ్యాత్ముల సంసర్గంబు దుర్జను లున్నట్టి త్రోవఁ జనమి
విష్ణుసన్నిధి కళావిఖ్యాత వివిధ దివ్యక్షేత్ర తీర్థయాత్రాచరణము
తే. బ్రహ్మచర్యంబు దపము వైరాగ్యగుణము । వలయు వైకుంఠమును గోరువారి కెల్ల
వీనిలోపలఁ గొన్ని గావింపఁగనిన । పృథజనవు చేర్పుఁ గ్రమమున విష్ణుపదము.

అని చెప్పి నారదుండు మణికంధరునితో మరలనిట్లనియె. గంధర్వనందనా! నీవు నీశక్తికొలది నైమార్గంబునఁ బ్రవర్తింపుము. కృష్ణానుగ్రహంబునఁ గల్గిన నీ యనన్యసాధారణ సంగీత చాతుర్యంబు వృథసేయక శ్రీ పురుషోత్తమ, శ్రీరంగాది దివ్యక్షేత్రంబులందు ముకుందసన్నిధినిఁ దద్దివ్యగుణనామ సంకీర్తనంబు గావించుచుండుము. అదియ సకల శ్రేయోనిదానం బగును. అని యుపదేశించి నారదమునీంద్రుండు తన మహతిని మ్రోయించుచు హరినామస్మరణంబు చేయుచు నిజేచ్ఛం జనియె. మణికంధరుండును దచ్చరితంబులకు నతివిస్మయప్రమోద హృదయుం డగుచుఁ దనదృష్టిమార్గంబు గడచునందాఁక వీక్షించుచు నెట్టకేలకు నాలోకనంబులఁ ద్రిప్పుకొనియె.

నాలవ ప్రకరణము.

ఇవ్విధంబున గురుం డరిగిన మణికంధరుండు తదుక్తప్రకారంబునఁ బుణ్యకర్మంబులు నడుపుచుఁ గ్రమంబున విష్ణుభక్తి హృదయంబునం బొదలఁ దీర్థయాత్ర గావించె. అందు శ్యామతోయంబగు యమునం గాంచె. అంబా వీణాప్రవీణుండు తీర్థవిధ్యుక్తముల నొనర్చి యచ్చో హరినామసంకీర్తనంబుచేసి, మధురాపురంబు సేవించి, అంతట హరిద్వారంబును, సాలగ్రామపర్వతంబును, నైమిశారణ్యంబును, గురుక్షేత్రంబును, బ్రయాగయుఁ, గాశియు, నయోధ్యయు, గంగాసాగరసంగమంబును వీక్షించి యాయాస్థలంబుల స్నాన దానాది విధుల ననూనంబుగా నడుపుచు నుదధితీరంబుననున్న పురుషోత్తమక్షేత్రంబు సందర్శించె. ఇట్లుచేసి అచ్చోటనుండు నింద్రద్యుమ్నమును సగస్సునరోహిణికుండంబున సారూఢభక్తిఁ దీర్థమాడుచు నాతం డాత్మీయ గాననైపుణిం జూపుచు జగన్నాథుం గొలిచె. అటనుండి కదిలి శ్రీకూర్మనాయకు సంస్థిసగోరుహంబులు కనుదమ్ములకు విందుగానొనర్చి, సింహాచలాధీశు సేవా విశేషంబుల జన్మంబు సఫలంబు గావించి, అహోబిలస్వామి పాదనఖోరుజాలసంగము ఫాలశశికి నొసంగి, వేంకటేశ్వర చరణారవిందంబులు సేవించి విపంచిసముచితమృదుమధుర నినదంబును గంఠస్వరంబును నేకంబగుచు లోకుల ననల్పసమ్మదాశ్చర్య సంభృత స్తంభభావులఁ గావించి యద్దేవుని దివ్యమంగళగుణగానం బులొనరించి మూఁడు రాత్రులు సేవించి, వేంకటనగంబు డిగ్గి చని ముందట గాంచీనగరంబుం గాంచె. దానింజూచి యిది ముక్తిహేతు పురసప్తక

ములో విఖ్యాతపట్టణం బనియు నేకామ్రనాథ కామాక్షీ నివాసం బనియు నిందే తొల్లి చతుర్ముఖుండు యజ్ఞంబుఁ జేసి సాక్షాత్పరబ్రహ్మసన్నిధానభాగ్యం బందె ననియు నిట్టిపురంబున నివసించుట తనయదృష్టంబనియు సంతసించి యందు గొన్నిదినంబు లుండి యచ్చటి దేవతలనందఱ సేవించి కరిశైలంబునకుఁ జని వరదరాజస్వామిం గాంచి యచ్చోటు వదలి చోళమండలంబుఁ బ్రవేశించె. అందున్న కవేరజం జూచి తదీయపావనతర ప్రభావమున తను మెచ్చుచుఁ దత్సమీపవర్తియగు రంగనాయకుం దర్శించి కతిపయవారంబు లచ్చట నివసించి యచ్చోటువదలి తూర్పుగాఁ జనిచని కుంభఘోణముం జూచి యందలి కుంభేశ్వరుని సేవించి దర్భశయనంబునకరిగి యందు రామభద్రు నిర్నిద్ర భక్తితాత్పర్యంబుల సేవింపుచు వీణావాదనానువాదమేదుర గానకౌశలంబుతోడ నద్దేవు ననేకవిధంబుల నుతియించి అచ్చోటువదలి యా గంధర్వకుమారుండు సేతుబంధనంబునకుం జని యందు రామేశ్వరు బహువిధ భక్తివిశేషంబున నారాధించి యచ్చోటువాసి యనంతశయనంబునకేఁగి యందుఁ బద్మనాభునిఁ గొలుచుచు నతనిసన్నిధిఁ గొన్నినాళ్లు తన గాంధర్వవిద్య హృద్యంబుగా నెఱపుచుండె.

కలభాషిణీ! నేను గానప్రియత్వంబున నుండుటం జేసి నా వెనియొగ్గి తత్తత్ప్రదేశంబుల మణికంధరుండు పాడెడు పాటను వినుచు దృష్టియుం బాగవిడిచి యది యంతయుం గనుంగొనుచుండు. అవ్విధంబున ననంతపద్మనాభుని సన్నిధినుండి మణికంధరుండు గదలి తత్సమీప వనవాటిలో వనరుహనాభుంగూర్చి తపమ్మొనరింప దొరఁకొనియె. ఆకారణంబున నా సరసుని గానకళామధురిమ నా కనుభవింప లభియింపక యుండె. అని యాదిక్కునకు దృష్టిసారించి, లోచంచలాక్షీ! అదె మణికంధరుండు గాఢపద్మాసనమున గూర్చుండి దృఢసమాధినిష్ఠుండై యున్నవాఁడు. అనుడు, నాలతాతన్వి కడునద్భుతంబంది చు నోసిద్ధవర్యా! మీకన్నుఁగవ కిప్పుడట్లు కాన్పించుచున్నది కావలయు ననుడు, సిద్ధుండు— కంజముఖీ! యది యథార్థము. అనుమానింపఁ బనిలేదు. నీవు జనుల నేర్పైనను బంపుదువేని యచ్చోటజరుగుచున్న వృత్తాంతము లన్నిటినిఁ దెలిసికొననగు. అనుడు, కలభాషిణి— మహాత్మా! మిమ్ముంతి నారయనడుగ నేనెవ్వరాలనా; మీ పల్కులయం దభిమానము లేకున్నగదా, యని యిట్లు పల్కుచున్న సమయంబున తత్సమీప భూజంబుననున్న యొక చిలుక యిట్లనియె.

మహాత్మా! నీపల్కులయం దొకప్పుడు నసత్యశంక కల్గునా, నీవుచెప్పినకథలన్నియుఁ బరికింప యథార్థములే, నామనంబునకు సరతాఁకె, నను నప్పలుగుం గనుంగొని యద్భుతంబందుచుఁ గలభాషిణి — ఓచిలుకా! నీవు చూడ మిగులఁ జాతుర్యవతిగా దోచియుంచుచున్నావు. నీవెచ్చోనుండు దానవు? నీవృత్తాంతం బెఱుంగింపుము, అనవుడు నా శుకవనముగా నాశుకవతంసం బిట్లనియె.

ఇంద్రలోకశుకవృత్తాంతము.

ఓపూవుఁబోఁడీ! నానివాసంబు నందనవనంబు, యాదవరత్నంబు మున్ను పారిజాత భూజాతంబు భూమికిం దెచ్చునపుడు దానిపై వసియించు పక్షులన్నియు మరలి పాఱుచుండ నాభార్య ప్రసవార్తయగుటం జేసి పఱవంజాలక యెట్లయినను గానిమ్ము, నేనిచ్చట నేయుండెద నని యొక తోఁటలో నడఁగియుండె. నాను దానిని వెనుకను తోడుకొని పోవనువులేక పిల్లలు పెద్దదియగువఱకును నిరీక్షించి పలుమాఱు వచ్చి రమ్మని పిలుచుచుంటిని. అట్టి నన్నుఁ జూచి నాసతి యిట్లనియె. ఇపుడేనున్న వనికంటెనందనవనంబున సౌభాగ్యాతిశయంబులేదు, నీప్రేమమాత్ర మందు విశేషించియున్నది. అనుడు, నేనిట్లంటి. మన బంధువులందఱు నందనవనంబున నునికిం జేసి నేనుదానిని వదలంజాలను, అనిచెప్పి నేనెల్లప్పుడును రెండుచోటులకు వచ్చుచుఁబోవుచుండెదను. అట్టి యే నిప్పు డుప్పరవీధి నేఁగుచుండి మణికంధరుండని మీరాడుకొనుచుండ నతనిసుద్ది యిక్కడ గలుగుటకు నిమిత్తంబేమియగునో తెలిసికొనెదనని నిలిచితిని. సిద్ధుండు నీకుం జెప్పిన మణికంధరు తీర్థయాత్రా తపశ్చర్యలవృత్తాంతంబు నిక్కువంబుగా నాకుం దెలిసిన ప్రకారంబు వివరించెద నాకర్ణింపుము.

మణికంధరునికడకు రంభవచ్చుట.

నేఁటిదినంబునఁ బురందర పులోమజలు నందనవనంబునకు వచ్చియుండఁ జారుండొక్కరుండువచ్చి యిట్లని విన్నవించె. మహాప్రభూ! తీర్థవాసియొక్కరుం డత్యుగ్రతపంబుఁ జేయుచున్నవాఁడు. అతని తపోవిభవంబున బయలువెడలిన జ్వాలాజాలంబులు రోదోంతరాళంబు నిండుచున్నయవి. ఈతపంబు మాసాష్టకంబున సిద్ధింపఁగలదు. ఏలిక యాజ్ఞానుసారంబునఁ బోయి దీనిం దెలిసివచ్చినాఁడను. అని యిట్లు చారుండు దెలుప నాజంభభేది యులికిపడి సంరంభంబున రంభం దోడ్కొని రా నొకగూఢచారుం బనిచె. అంత రంభవచ్చి బిడౌజుని యెదుట నిలువంబడియుండ నాసునాసీరుండు దానితోఁ జారుండెఱింగించిన తాపసివృత్తాంతంబు వివరించి చెప్పెను. ఇట్లుచెప్పి యోయింతీ, యతండింత యుగ్రతపం బాచరించుట నాసురరాజ్యలక్ష్మిని తాఁ గోరియుండుటం జేసి కావలయును. కావున నీ వతిత్వరితగతిం బోయి యా మునిశార్దూలుని తపోదర్పం బడంచి రావలయును. వడిం బోయిరమ్ము. అనుడు, రంభ జంభారితో— పాకశాసనా! యమ్మునీంద్రుఁడనవ్వం డని దేవర చిత్తంబునకు వచ్చియున్నదో యతండు సామాన్యుండు కాఁడు, నారదశిష్యుం డగు మణికంధరుం డని వింటిమి. అతని నిట మున్ను పరికించుచుండువారము. అతఁ డస్మదాదుల విలాసంబుల నెన్నండును సరకుగొనినవాఁడు కాఁడు. నేఁడు విశేషించి తపశ్చర్యాతత్పరుండై ప్రవర్తిల్లుచున్నవాఁడు. అట్లగుటంజేసి యవశ్యంబు దేవరకార్యంబు నిర్వహింపఁగల నను ధైర్యంబుచాలదు. అనుడు పురుహూతుం డవ్వా

లుగంటిం జూచి, యో సుందరాంగీ! నీవు దొంటికంటె వయో రూప లావణ్యాది విలాసంబు లెక్కుడగునట్లుగా వరం బొసంగితి; గార్యసిద్ధియు నయ్యెడు, బొమ్మని పల్కు జంభవైరి శాసనానుసారంబున రంభ నెచ్చెలులు వెంటరా వియచ్చరులు మెచ్చు సౌందర్య సౌకుమార్యాదుల మెఱయుచు బయలువెడలి భూలోకంబునకు వచ్చి చేరె.

నేనును నందనవనంబు వదలి యిచ్చటికి వచ్చి చేరితిని. ఊహింప రంభాదులును నిప్పటికి మణికంధర తపఃస్థానంబునకుం జేరఁగలరు. అని యిట్లు పలుకు నాచిలుకపలుకులకు నత్యంతంబు సంతసింపుచుఁ గలభాషిణి యిట్లనియె.

ఓశుకవర్యా! నిన్ను విడిచిపెట్టుటకు నాకు మనసొప్పకుండినను నీవు నీ ప్రాణనాయికను జూడవచ్చినదాన వగుటంజేసి తడవు నిలుపంగోరను. అని యిట్లుపలికిన నాచిలుక సెలవుఁగైకొని తన వనితపాలికిం బోయెను. అంత నాసిద్ధుండు కలభాషిణింజూచి— యో పికవాణీ! నేను నీచెంతకువచ్చుట వింత యగు నీపాట నాలించుటకుఁజుమీ. కావున నీ విపంచిం గైకొని గానంబున నావీనులఁ దనియింపుము. అనుడుఁ గలభాషిణి, వీణియఁ గైకొని తన గానవిద్యానైపుణిని నాఁటిదినము సిద్ధునకుఁ బ్రొద్దుపుచ్చె.

రంభ మణికంధరు తపోవనము జేరుట.

అప్పట రంభ తన చెలికత్తియలతోడ మణికంధరుండున్న తపోవనికిం జని యవనికిం డిగ్గి యతని యాశ్రమవిశేషంబులు పరికించుచుండె. ఇట్లుండ రంభ యొంటరిగ మణికంధరుండు తపంబుసేయుచున్న తావునకుం బోయి యతని యుగ్రరూపంబు వీక్షించి యింద్రుని పను పెట్లుచేయంగలదాన నని భయంపడఁదొడంగె. అంతఁ గొంతవడికి ధైర్యం బవలంబించి తాను జెలులను గూడి ముని యగ్రభాగంబునఁ జరియింపుచుఁ బుష్పాపచయం బొనరింపుచుఁ బూవుఁదేనియ సోనవానలఁ దోఁగుచుఁ దూఁగుటుయ్యెలలఁ దూఁగుచు వనకేళి సలుపుచు మునివర్యుని సమీపించి, తన యొయ్యారంబు తోరంబుగా నతనియెదుట సంచరించుచుండ దైవనియుక్తింజేసి యతని మనస్సమాధి విరతంబగుడు నమ్మునీంద్రుండు రోదసేయుచున్న యాసరోజముఖింజూచి ధృతిబూని కన్నులుమూసికొని శ్రీహరిని ధ్యానించుచుండె. ఇట్లుండినను మనంబు వికృతిం జెందుడు నత్తపోధనుండు తిరుగ కన్నులువిచ్చి కృష్ణ కృష్ణ యని కన్నులు మూసికొనియుండె.

ఇట్లుండ నొకవైపుననుండి మనోజాతవికారంబును మఱియొకప్రక్కనుండి యంతస్సంజాత్మధైర్యంబును యుద్ధసన్నద్ధులై కుమ్ములాడుచుండ నేమియుఁ జేయఁజాలక తా మధ్యస్థుండై చూచుచుండె. అంతట అఘటనకార్యసంఘటనాపటువగు కమ్మవిలుకాఁడు తనశరమ్ముల రంభాకాంతను మణికంధరమునికాంతుని నాటనేసినప్పుడా తాపసుని చిత్తంబు దర్పకకీలికీలలపాలై యత్తలిరుఁబోఁడి చెలువం బను నమృతంపుఁ గొలనిలోఁ జిత్తజాత

సంజాతతాపావసానార్థంబు జోలలాడుచు నందే కాపురంబు జేయుచున్నట్లుగా గాన్పించె. ఇట్టిదియగు నబ్బద్ధాకార రేఖావిలాసంబు లెంతయుం బరికించి యప్పల్లవాధరతోడ సల్లాప పరిరంభణాదులకు నువ్విళ్లూరుచు దదీయ లీలావిహారణంబు లత్యాదరంబున విలోకింపుచుం దనలో నిట్లు చింతించె. ఈ నెలంతతోడి సంగతి కలుగని నాకలోకంబు కంటె నట్టిసుఖంబు గల్గెడు నరలోకంబె శ్రేష్ఠం బగు. మునిధర్మంబులకు దూరమయ్యెనని జనములు నవ్విన నవ్వనిండు. తపోధనంబంతయు వ్యయంబైన గానిమ్ము. చిరకాలార్జితంబు లగు జ్ఞానవాసనలు మొదలంటం జెడిన జెడనిమ్ము. ఈ నారీరత్నముం గూడక యెట్లును దమి నివారింపం జాలను; అని చింతించి సాహసంబున ననుమానంబుల నన్నింటిని విడిచి మణికంధరుం డా సుందరాంగియున్న స్థలసమీపంబునకు వచ్చి మెల్లన నిట్లనియె.

ఓ చంచలాక్షీ! నీ వీ వనభూమి కెచ్చటనుండి వచ్చితివి? నీ రాకకుం గతం బేమి? నీ పే రెయ్యది? నీ వృత్తాంతంబు నాకుం జెవులపండువుగా వినుపింపు మనుడు, రంభ యిట్లనియె.

ఓ తపోధనా! ఇచ్చటికి నా రాక క్రీడార్థమై యున్నది. అనుడు, మణికంధరుండు తక్కుంగల సంప్రశ్నంబుల కుత్తరంబుం గోరకయే— అట్లయిన నా తపఃఫలంబవే యగుదువు. అని పలుక, నా నాగవాసంబు— ముసిముసినగవు నగుచు మోము వంచి యూరకుండె. అపుడు మణికంధరుండు రంభ కేలుం దన కేలం బట్టె. తోడనె సమీపంబున గుసుమాపచయం బొనరించు పువ్వుంబోండ్లందఱు దవ్వుదవ్వులకుం గా నరిగిరి. అంత మణికంధరుండు నాబాల్యకృతనైష్ఠికబ్రహ్మచర్యవ్రతోత్సర్జనంబుం గావింప మనసిజుం డధ్వర్యుండుగా శుకపికనికరంబులు హోతలుగా మనోరథపూర్ణాహుతి చిత్తజానలంబునం గావించె.

మణికంధరుని యనంతర వృత్తాంతము

ఇక్కడ ద్వారకానగరంబునం గలభాషిణివలన గానంబు వినుచున్న సిద్ధుండు తత్ప్రశంసా ప్రసంగంబున మణికంధరునిమాట తడవుటయు నా చంచలాక్షి సిద్ధుని వీక్షించి— స్వామీ! యా జంభభేదిపనుపున రంభ వచ్చెం గదా; అనంతరము మణికంధరుని తపం బేమి యయ్యె? మీ దివ్యదృష్టిం జూచి నుడువు డనుడు నతండు, వల్లె యని తనదృష్టి సారించి చూచి— ఓ మించుబోడీ! యింక నేటి తపంబు? మణికంధరుండు రంభతో నొక లతాగృహంబున లతాంతాయుధాభంగ సంగరంబున మెలంగుచున్నవాడు. అని పల్కు సిద్ధుని దివ్యబోధంబునకుం గలభాషిణి యచ్చెరువందుచు ననేకవిధంబుల దాని బ్రశంసించి మరల నిట్లనియె.

మహాత్మా! యొకటి రెండు పూటలు మా యింట నిలిచి యేము సేయు పరిచర్యల గైకొనవలయును. అనుడు, సిద్ధుండు— ఓ కీరవాణీ! గానలోభంబున నీ భవనంబునకు వచ్చి [illegible] వీధివారునుంబలె పట్టంబుల గట్టుకొని మహిమలు పచరించువా[illegible]

గాను. గృహప్రకారంబున నిలుపనోపుదువేని యట్లు నిలిపి యుపచారంబులు సేయుము అనుడుం, గలభాషిణి— అట్లే సేయుదు నని యతనిం దనగృహారామంబున నిలిపి యతి రహస్యంబుగా సిద్ధునకు నిష్టంబులైన యన్నపానాదు లొసంగి మోదంబొనర్చుచు నతని కడకు నేరిం బోనీక తానే పరిచర్య సేయుచు రెండుమూడుదినంబు లుండనిచ్చి యతని హృదయంబు రంజిల్లం జేయుచుండె. ఇట్లుండి కలభాషిణి తన యంతరంగంబున నలకూబరసంగమాభిలాషం బతిశయిల్ల నతని ప్రియవనిత యైన రంభ తెఱం గడుగుటకుం గోర్కి గలదియై ప్రసంగవశంబున నా వృత్తాంతంబులోనికి డించి సిద్ధునితో నిట్లనియె.

స్వామీ! మణికంధరుండు తన తపంబుం జెడిచికొనియె ననుమాటలకు మిగుల విచారమయ్యెడి; అతండు తిరుగం దపమారంభించెనా, లేక యిప్పటికిని రంభతోడనే యున్నాడా? అని యడిగిన నా సిద్ధుండు తనదృష్టి మణికంధరుదెసం బ్రసరింపంజేసి నవ్వుచు— ఓ తరుణీమణీ! యింకం దప మేటిది. ఇపుడు మణికంధరుండు రంభ కౌగిటనే యున్నాడు. అనుడు, కలభాషిణి యిట్లనియె.

సిద్ధవర్య! అట్లయిన వారలింక నచ్చటనే యున్నారా? లేక మఱియొక చోటికిం బోయిరా? యెఱుంగవలయును. దానిం బరికించి కటాక్షింపవలయు ననుడు, సిద్ధుండు— మణికంధరుని వైపునకుం జెవి యొగ్గి యాలకింపుచు నొకచేతం గలభాషిణిని మాటలాడక యూరకయుండ సన్నచేసి నిశ్చలత్వమున నొకించుక సేపు విని 'ఔరౌరా వారకామినుల మేలిట్టిదియే' అనుచు నవ్వి యూరకుండె. అపుడు కలభాషిణి దాని నెఱుంగింపు మనిన నాలతాంగి కా సిద్ధుం డిట్లనియె.

ఓ నీరజాక్షీ! నీ కేమని చెప్పుదును. అడంచుకొనుదుననిన నవ్వడంగక యున్నయది. అట్లు రంభ ఆసంయమీంద్రుని తపంబు జెడిచినదియే కాక తుద కతనితోం జేసిన తగవు వినుము; అట్లా తపసితో రంభ కలసి మెలసియుండి రతివివశయై యతనిమనంబు చివుక్కురన 'నలకూబరా యలసితి విడువు మని పలికె' అనుడు, కలభాషిణి యిట్లనియె.

సిద్ధవర్యా? యింత నవ్వెందులకు? రంభ యేమిసేయును. మహావాల్లభ్య సౌభాగ్యవర్తనలచే నర్థేశుని కుమారుండు మఱపురాని ప్రేమతో రంభ నేలుకొని యుండ [illegible]. కావున నతని పేరు రంభ యవశయై ప్రమాదంబునం బలికె. అది యటుండనిమ్ము. అట్లు పరస్పరానురాగంబునం బ్రవర్తిల్లుచుండు నా దంపతులలో రంభ తన్నెడబాసి పోవుటకుం గుందుచు నలకూబరుం డెందున్నవాడో చూచి నెలవీయవలయు ననుడు నవ్వుచు సిద్ధుం డిట్లనియె.

ఓ యింతీ! నీ కిదియే కదా ప్రధానప్రయోజనంబు; అని పల్కి యిటునటు బరికించి చూచి నలకూబరుం డున్న చోటు గాంచి— ఓ సరోజముఖీ! నలకూబరుండు దేవకార్యార్థమై రంభ పోవునపుడును దానిం వదలంజాలక దాని వెనువెంటం బోయి యదియుండు వనసమీ

పంబున నీ నివసించియుండు. కావున నిప్పుడును నతఁడు మణికంధరుని తపోవన సమీప భాగంబున నుండెడు వనములో పుష్పఫలసమంచిత మగు నొక చూతవృక్షంబు క్రింద నున్నవాఁడు. నీకా నలకూబరునియెడ గల ప్రేమాతిశయంబున నీ దృష్టి యచ్చోట లేకుండుటం జేసి వీణియ నాయించుటలో నీసామర్థ్యంబుఁ జూపలేక యున్న దానవుఁ మా కితరము లగు పనులు లేవా? కావున నిచ్చటనుండి నీవనిచిన పోయివచ్చెదను. అనుడు, కలభాషిణి యిట్లనియె.

ఓ సిద్ధవర్యా! నిన్ను నాపాలిటి భాగ్యదేవతగా నమ్మియున్న దానను. నా బ్రతు కేమిజేసిపోయెదో యెఱుఁగింపు మనుడు, నా సిద్ధవర్యుండు— ఓ పర్వేందుముఖీ! నన్ను నీ విపుడు కోరినది యెయ్యది? ఇదివరలో ప్రసంగంబున నపుడపుడు నన్నడిగినవాని నెల్ల వివరించుమనే యుంటిని. అనుడు, కలభాషిణి— స్వామీ! నన్ను మీ రీవఱకుఁ గటాక్షించిన దంతయు యథార్థంబ. కాని నామనంబునం గల కోర్కెను నీకింకను విన్నవింపలేదు. దానిం దెల్పెదను. నేఁటిదినంబున నన్నెట్టులైన మీరు నా నలకూబరుం జేర్పవలయును. ఇదియు నామనంబులోని రహస్యకాంక్షితంబు. ఇట్టి నాకాంక్షితంబు నెఱవేరుప మీకంటె ప్రభావశాలురు కనుపింపరు. అనుడు, సిద్ధుండు— ఓ కాంతా! నేఁడు నిన్ను నీ కాంతు నితోఁ జేర్చి పిమ్మట నే నీపాట విను వేడ్క విశేషించి కలదు. కాని యది యొక దుర్ఘట కార్యముగాఁ గాన్పించుచున్నది. దాని నీవు నూహింపవచ్చును. అనంతశయనంబున నున్న పద్మనాభసమీపభూభాగవర్తి యగు నలకూబరునితో ద్వారవతి నున్న నిన్నుఁ జేర్చుట యెట్టి దుర్ఘటమో యరయుము. అయినను నే నెక్కుచుండెడి యీ సింహమునకు గురువు నేర్పిన శిక్షం బట్టి యిది నాల్గుగడియల ప్రయాణము కావున, దీనిం గూర్చి నీవింతగా నాలోచింపఁబనిలేదు గాని, నిన్ను దీనిపై నునిచికొని పోయినచో తోడి సిద్ధులు వేరొకలాగున నెంతురు. ఎవ్వరి యంతస్సారం బెవ్వ రెఱుంగుదురు. అదియునుంగాక మీబోంట్ల సంస్పర్శమాత్రమైన నస్మదాదులు సమ్మతింప నుచితంబు గాదు. నాకు మఱియొక విధంబగు సామర్థ్యంబు లేదు. నాకుంగల దూరదృష్టి దూరశ్రవణంబుల శక్తి యిందులకేమియు నుపచరింపదు. ఇందులకు నీవేమి తెల్పెద వనుడుఁ, గలభాషిణి యిట్లనియె.

ఓ సిద్ధశేఖరా! మీ రేవిధముగనైన నన్నుం గొంపోయిన మంచిదియే. నేను రా సిద్ధముగ నున్నదానను. మీ మహాత్త్వ మెఱుఁగని జడులు ఏమనుకొనిన నేమి? మిమ్ము నెఱింగిన మహాత్ములు వేఱువిధముగా భావింపరు. మాబోంట్ల సంస్పర్శమాత్రంబునకు సమ్మతించుట యనుచితంబు గాదంటిరి. అట్లయిన నా ప్రాణహాని కోర్చుట మీ కుచితమేమో యరసి చూడుడు. పలుమాట లేల? ఇంక నా చెలులు గిలులు వచ్చి నా ప్రయాణ విఘ్నంబు గావింప నోపుదురు. ఇతరు లెఱుంగకుండ శీఘ్రంబ నన్నీవు కొనిపొమ్ము. నీకు వెనుకగా గూర్చుండెద. నన్నుఁ గొనిపోయి నా విభునికడఁ బడవైవుము. అనుడు, నా

సిద్ధుండు ఆమాట కియ్యకొని తాను ముందుగ సింహము నెక్కి తన వెనుక కలభాషిణిం గూర్చుండఁబెట్టుకొని నింగికై తన సింగంబును దోలి యనంతశయనంబు మొగంబై యనేక దేశంబులు దాఁటిపోవుచుండె.

అయిదవ ప్రకరణము.

ఇట్లు గగనమార్గంబున బోవుచుండ వైభవనిరూఢిం జెలంగు కొందఱంగనలు గానకలాకలనాకలాపలై వచ్చువార లెదురైరి. వారిం జూచి సిద్ధుండు వారి సంభాషణక్రమంబున వారు రంభాసఖు లౌటయెఱింగి వారలం గాంచి— యువతులారా! యిది యేమి, మీ యనుంగుఁజెలి నెచ్చట విడచివచ్చితిరి? అచ్చెలువ మణికంధరునిమీఁది యనుగ్రహంబు వదలక నింకం గొన్ని నాళులు తద్వనంబున నిలుచునో యనుడు, వారలతని కిట్లనిరి.

సిద్ధవర్యా! యింకెక్కడి మణికంధరుఁడు, అతం డెక్కడఁబోయెనో యెఱుంగము, ఇపుడు రంభ ముదంబున నలకూబరుం గూడియున్నది. ఆమె ప్రియసమాగమోత్సవము పెంపున నావనంబు విడువం గాలనికతంబున మేము మామాస్థలంబుల కరుగుచున్నవారము. అని యిట్లు పల్కు వనితల మాటలవలన రంభానలకూబర సమాగమంబు విని విన్నఁబోయియున్న కలభాషిణిం జూచి, సిద్ధుండు— అయ్యయ్యో, దీనికి వీర లుత్సాహభంగంబు గావించిరి. దీని మరల సముత్సాహిం జేయవలయు నని నవ్వుచు— ఓ యిందువదనా! నీవు చింతింపవలదు. నీబుద్ధిని దిరంబుఁ జేసికొమ్ము, ధైర్యము నవలంబింపుము. నీమనంబునం గల శోకమంతయు గొంచెము సేపులోపలనే పుచ్చివైచెద, నామాట నమ్ముము, అనుడు, కలభాషిణి— నీ వేరీతిని జేసినఁ జేయుము. నేను దానికి సిద్ధనై యున్నదాన ననుడు, సిద్ధుం డిట్లనియె.

ఓ మృగాక్షీ! యేరీతిని నే చేయుదునో దానిని నీవే యరయుదువుగాక! [illegible] బోవుకూరరుచి యెంచనేల; అనుసమయంబున నతని కంఠీరవంబు కంఠం బెగయించి చూచి ముందు కదలక నిలిచెను. అపుడు దానిని హుంకారములు సేయుచు ముందుకు నడిపింప యత్నింపుడు నది ముందుకుఁబోక తోఁక ద్రిప్పుచు గర్జారవంబు సేయుచు వెనువెనుకకు జరుగఁ దొడంగె. అట్టి క్షోభంబునకు కళవళపడి కలభాషిణి యిదియేమి యని యడుగ సిద్ధుండు— తరుణీమణీ! వెరువకుము! పరాకుపడితి నని తన వాహనంబును కొన్ని యడుగులు తిరుఁగబట్టి ధరణికి దిగం దోలికొనివచ్చి యచ్చట నచ్చెలువతోడ నవరోహణంబు జేసి కేసరిని మేఁతకు విడిచి యీ పడంతితో, యీముందటి నికటంబున మృగేంద్రవాహన యను శక్తి కలదు. తన్మందిరంబు ముందరనున్న మృగేంద్రంబునకు గ్రింద మీఁదఁ జుట్టుపట్టున నెట్టిబెట్టిదంపు సింగంబులును జన వెఱచును. దీనిని మఱచితి గాన, నేనెంత

తొల్లింటి మృగవాహనం బదటికి తెల్లెడుదురనుచును. మన మిష్టపాశక్తి నభినందించి పోయినం గార్యసిద్ధి యగు! రమ్ము పోద మని కలభాషిణిని మృగేంద్రవాహనగుడికిం దోడ్కొని పోయి తద్బాహ్యమంటపంబున నునిచి యద్దేవిపూజకుం బూవులు తెచ్చెద నని తత్సమీపంబున నున్న యొక్క పూవుందోటకుం జనియె.

ఒక ముసలిది కలభాషిణిని గనుంగొనుట.

సీ. పసిమిపోనెండిన కసవుబట్టయుంబోలె నెరవెండ్రుకలుబర్వు శిరమువలన
ముడిగొన్న చెలందిపుర్వులనూలివల్లునా నమరెడు ముడుతకన్బొమలవలన
గడుంజిట్లినట్టి బంగరుపూంత పొక్కిళ్ళ వడువు చూపెడి మేనివళులవలన
తునిసి వ్రేలెడుఁ బ్రామఁ దునకలదలపించు బాహువక్షోజలంబనమువలన

తే. ఘూకరవములఁ జాడ్పన ఘోరవృత్తి। దనరు ఘనకాస కుహుకుహుధ్వానులవలన
భావజుండు వెళ్ళిపోయిన పాడుమేడ। పగిది గాన్పించు ముదుసలిపడంతి యొకతె.

కలభాషిణిని సమీపించి, అయ్యయ్యో సుందరాంగీ! నీ వెచటనుండి వచ్చితివి? బావురుపిల్లిని చిలుక జేరినట్లే దురాత్ముం డగు నీసిద్ధుం జేరితివి. హా! విధి నేమని చెప్ప వచ్చు. ఇట్టి సౌందర్యశాలిని వగు నిన్ను దైవంబు నిర్దయుండై యీదుష్టస్వాంతుని పాలు చేసెనే. అని పలికి, యోసితల్లీ! యీకలుషాత్ముండు మగల నిచటికి రాకపూర్వమే యెచటికైనం దొలంగిపోరాదా! యించుకయైన నాలస్య మింక చేయంగూడదు. వాండు రాక పూర్వమే నీవు తొలంగిపోవుట నాకెంతయు బ్రియంబు సేయుట యగు. ఓరమణీ! నీ కితం డెట్టివాడో తండ్రియో జనకుండో తోంబుట్టువో నాకుం దెలియదు. లేనియెడల నీ కార్యార్థమై నిన్నెచటికైన గొంపోవుచుండెనా? అటు గాకున్న నీ వితని వెట్టివై యేల వెంబడించితివి? అని పలుకుచున్న వృద్ధాంగనమాటలు విని కలభాషిణి తన మనంబున నిట్లు చింతించె. ఈ యవ్వవాక్యము తలపోయంగా నాయుల్లమునకు సరిపడి యున్నవి. ఈ సిద్ధుం డొక్క మాయావి గావచ్చును. ఇతం డింద్రాక నెకింత సేపునకు ముందు 'నీ మనంబునంగల శోకమంతయు గొంచెము సేపులోపలనే పుచ్చివైచెద' నని పలికె. ఇచ్చటికి వచ్చినకోడ నే యీ యమ్మ చెప్పిన మాటలం బట్టిచూడ నన్నితండు శక్తికి బలి యిచ్చుట నిశ్చయముగా గాన్పించుచున్నది. అని మఱియు జింతించె.

సీ. ప్రజలకందఱకు నాపదలు మాన్పెడునట్టి చక్రిపట్టణములో జననమంది
వారకామినియయ్యు గౌరవంబున సభ్యజను లిటు చేరరమ్మనంగ బ్రతికి
త్రైలోక్యగురుండు నారదమౌని ప్రియశిష్య నిర్విశేషముగ మన్నింప నలరి
జగదీశు రాణివాసపుసతుల్ శిక్ష గావింపంగ సంగీతవిద్య నేర్చి

తే. తుద నొకానొక కపటసిద్ధుం డొనర్చు। శక్తిపూజకుం బశువై బలి జర్చ సేయ
నెంతవారికి దప్పింప నెట్లువచ్చు। బ్రహ్మ తా మున్ను వ్రాసిన వ్రాతఫలము.

అనియిట్లు చింతింపుచుం దనప్రియసఖులం గను మొఱంగి వచ్చుటకు దుఃఖించుచు ననుభావ్య మనుభవమునం గాని క్షీణింప దనిదలంచుచు మనంబున గుందుచుండె. ఇట్లుండి తద నంతరంబ డెందంబు డిందుపఱుచుకొని ధైర్యావలంబనంబున కంఠగద్గదిక వారింపుచు నా వృద్ధభామినితో — తల్లీ! నీపల్కులు నిజములే, యిమ్మాయాప్రకార మిట్లగుట యూహింప లేక వీని కృప నెక్కుడు యర్థముం గణింతు నని యత్యాశ ప్రేరేపగా నిమ్మాడ్కి దెగివచ్చితి. ఇపు డే నెచ్చటికైనం బాఱిపోయెదను? నే నొకవేళ కను మొఱంగిపోయిన దూరదృష్టి నన్నుం జూచి యతిశీఘ్రగమనంబుగల సింహవాహనంబునవచ్చి నన్నుం బట్టక మానండు, అన విని యాముదుసలి యిట్లనియె.

ఓవనితా! వీనికి దూరదృష్టి యున్నమాట నీవెఱుంగుదే! యనుడు, కలభాషిణి— అయ్యయ్యో! అదియకాదా నన్ను భ్రమించి యింతదూరంబు తెచ్చె! అని చెప్పి తన్ను ప్రథమంబున సిద్ధుండువచ్చి తన గృహాంగణంబున గాంచుట మొదలుగా సమస్తంబును వినిపించి తత్ప్రసంగంబునం దనపేరును గులమును విద్యయును నప్పటి తనకోరికయును జెప్పి యాకోర్కి సాధించు చింతతక్క వేఱొకచింత యెఱుంగ ననియు, దాని కొఱకుగా నిట్లువచ్చితి ననియు పలికె. అంత నాముదుసలి — ఓలలనామణీ! యిదియే యథార్థము. నీ కటులాస చూపి యీనింద్యవర్తనుండు నిన్నిటం దోడ్తెచ్చె. ఇదియ యితని దూరదృష్టిసాధనంబునకు ఫలంబు. ఎన్నియో పాట్లుపడి సంపాదించిన యావిచిత్రమహిమకు రాజ్యసంపద గలిగించుకొనుట వీనికోర్కి యైయున్నది. అట్టి కోర్కికై లోకోత్తర గానయుతయు, లోకోత్తరరమ్యాకృతియుం గల యొకవారస్త్రీ కావలయును! అద్దానిం గూర్చి తన దూరదృష్టిని వెదకుచు నిన్నుం గాంచెం గావలయు. అని చెప్పిన వృద్ధవనితకుం గలభాషిణి యిట్లనియె.

అమ్మా! యీదురాత్ముం డిప్పుట నే దూరదృష్టియు దూరశ్రుతియు సాధించియుండ నోపు! నాని వలన నెందఱికొంతుకలు వీడుకోసియుండెనో దాని నీవెఱింగిన వివరింపం గోరెద! అందువలన కాలయాపన మగునేమొ. మేలుగీడులు తప్పింప రామి ధ్రువంబ. ఇంక నోండువచ్చి యేమి సేయునో నచ్చుట యెట్లో అని దెగడుచునుండ నేల? జగదంబ యగు నీశక్తి సేయవలసినట్లే సేయుంగాక. అన విని యాయమ కలభాషిణి ధైర్యవివేకమహిమల దలంచి యది యుత్తమభామిని యౌనని యూహించి యిట్లనియె.

ఓ చెలీ! దూరదృష్టియు దూరశ్రవణంబును బడయు త్రోవలు ఘోరములైన పరహింసారూపములు గావు అవి సాహసమాత్ర లభ్యములు. ఆరెండు నితండు వడసె. కోరికలనెల్లం గోరికొని నిజనయనోద్ధారమొనర్చి చెవి నొక ఘోరనారసము వరపికొని యారెంటిం బడయువచ్చు; అనుచుం దన్నంటపాగ్రభాగంబున మృగేంద్రవాహనంబు దండన నికాంతుగప జక్కిచిప్పిలిత శిలాస్తంభంబున వ్రేలంగట్టిన యా శస్త్రియుగ్మంబును మఱియు

వచ్చుట గంధపుష్పాద్యర్చితంబులైయున్న యొక సురియను గండగత్తెఱను చూపి— ఓనీరజవదనా ! నీకాలిపి తెలిసియున్న నాకాసవాతురముల జదువు మనుడు, కలభాషిణి యందున్న యర్థము నీక్రిందివిధంబున జదువం దొడంగె.

సీ. ... ...
ఇచట రెండేండ్లు జితేంద్రియత్వంబున భువనేశ్వరీమంత్రమును జపింప
నెల్లకోర్కెలనిచ్చు నిద్దేవి మఱియట్లుగాక సద్యస్సిద్ధి గావలసిన
దూరవీక్షార్థి యీగోరుగంటు హృతాత్ముఁ డయ్యు దూరశ్రవణార్థి చెవిని
తే. ఘోరమైనట్టి యీబలునాశనంబు । వరవుకొనియు సారస్వత ప్రౌఢిమార్థి
యీసురియచేత నాలుక గోసికొనియు । నిమ్మహాశక్తి మెప్పించి యిష్టమొందు.
క. ఈమెఱుఁగు గండగత్తెఱ । చేమిడిదలయిచ్చు సాహసికుఁడు సిరంబ
చ్చో మగుడగ నదుకుకొనం। గామని చంపుదను జంపఁగడఁగిన వానిన్.
క. పదిలముగ నిర్విపక్షా । భ్యుదయమువనిరాజ్యలక్ష్మిపొందు న్వశతన్
సదమలరూప సుగాత్రా । స్పద వారవధూటి నిచట బలిగానిడినన్.

అని యిట్లున్న చివరపద్యమువలన నాత్మనిధనశంక నిస్సంశయంబై తోఁప కలఁగి కలభాషిణి తన ధైర్య గౌరవంబున మనంబుఁ బదిలపఱచుకొని కడపటిపద్య మీ క్రింది విధంబునం జదివె.

ఉ. ఈసిద్ధులందునెందును నెకింత సమర్థతలేని వృద్ధులి
ద్దేవతయొద్ద నిర్భయత దేహము నెమ్మెయిబాసిరన్ లస
ద్యౌవనరూప సిద్ధియగు నప్పుడ యంగవిమోక్షవేళ ని
చ్ఛాకృతమొద్ది వారికదిసంఘటిలుం దిరమై తదాదిగన్.

ఇట్లుగా చదివిన విధానములలోని తుదిదానికి నవ్వుచు నో యింతీ! దీనింగూర్చి యెసుమీ యనిశము నే నిచ్చో నివసించి యుందును. నా పేరు సుముఖాసత్తియండ్రు. కాశ్మీరభూమిప్రఖ్యాతిమైన శారదాపీఠమున సరస్వతిం గొల్చునట్టి పూజరి బ్రాహ్మణునకు నేను పుత్త్రికను. అని యిట్లు వృద్ధాంగన పల్క వారిర్వురు తమలోఁ జముదు ముచ్చటించుచుండిరి.

అంతట సిద్ధుండు దేవపూజకుం దగిన గంధ మాల్యాదులు సంపాదించుకొని వచ్చి యమ్ముదుసలిపడంతిం జూచి, ఓ యవ్వా! సిశాలంబున నున్న దానవే ? నిర్మానుష్యం బయిన యీశక్తిస్థానంబునఁ జిరకాలంబునుంబట్టి యెట్లు వేగింపుచున్న దానవు? అనిపలికి కలభాషిణిం బిలిచి, యో చెలువ! మనము నవ్వల చనవలయుఁగదా, మిక్కిలి ప్రొద్దుపోవు చున్నది. ఈ శక్తిం బూజించిపోవుదము. ఆయమ్మచేత సెలవొందిరమ్ము. అనుటయు, కలభాషిణి, యతి భయాకులమానమానసయై వృద్ధాంగనం జూచి యిట్లనియె.

ఓ యమ్మా! నేనొంటిం బోవ వెరతును. లోనికి నీవును రాగదే యనుడు, సిద్ధుండు నేనుండ నెవ్వరేల రావలయును ? అని పలికి యప్పటి దాని భయచేష్టభావించి యిమ్ముదిజంతచే నిది యొకింత యేమైన నాతలఁ పెఱిగెఁ గాఁబోలు. విలంబమైన విఘ్నం బేమి యగునో ? అని చింతింపుచు నిట్లనియె.

ఓ చెల్లీ! యిమ్ముదుసలివగ్గు నీకు తోడువచ్చునో. మఱి యేమైన కలదో అని పలుకుచు నాయిగురుఁబోఁడి కొప్పువట్టి తివ్వంబోవ నప్పడంతి ప్రాణభయంబునం గలంగి యో యవ్వా, నీకు నేను బిడ్డను, నాకడ్డపడి కావవే యనుచు కలభాషిణి యావృద్ధనారి మాటునకుం జరిగె. అపుడా వృద్ధనారియుఁ గరుణావిలమతి యగుచు భయార్తయగు నామృగాక్షిని తనవెనుక నిముడుకొనుచుఁ గావుము కావు మని సిద్ధుని కరంబులు పట్టె. ఇట్లు తన కరంబులు పట్టినంత, సిద్ధుండు—దీని లోపలికిం గొనిపోవ విఘ్నంబు జేసితివి గాని యిపుడిది యున్న చోటుమాత్రము దేవికిముందరగాదే. అని పలుకుచు నప్పడంతిచేతులు నులిచి పాఱద్రొబ్బి కలభాషిణి వేనలిని యొక్కకేలంబట్టుబట్టి వేఱొక్కకేల నొరంగత్తి వెఱికి కైకొనుమిదె యనుచు సత్తికి గత్తినెత్తి మ్రొక్కి వైవంబూనుఁడు నమ్ముదుసలి యిట్లనియె. వలదు వలదు, దీనివైచితేని యిద్దేవియాన సుమ్ము. అనుచు డాసి యానెలంత మెడకడ్డంబుగాఁ దన మెడయొగ్గి యనూనకృపనుండె. ఇవ్విధంబున కలభాషిణి కంఠంబునకు తనకంఠంబుజేర్చి వ్రేటున కనువీయక దాని నిఱుగేలం బొదిగి పట్టుకొని పరమకరుణాపరవశత్వంబున తొలంగక యావృద్ధభామిని మఱల నిట్లనియె.

ఓయి సిద్ధుఁడా! నీకుఁ గార్యసిద్ధి కాదుసుమీ, యిద్దేవిమీఁదియాన నతిక్రమింపకుము. అని పలుకుచు నో మహాశక్తీ, నన్ను సత్యవచనం గావింపుమీ యనుచునుండ నా సిద్ధుం డతిరోషంబున తొలుత దాని మెడ ఖండించి విచిత్రవేగంబునఁ గలభాషిణి కొప్పువట్టి పట్టెంబుఝుళిపించి వైవనెత్తె. ఇట్లెత్తిన సిద్ధునిచేయి తత్క్షణంబ యందుకొని మృగేంద్రవాహన నిజ శపథ సముల్లంఘనోత్సాహదోషదూషితు నతని నతిదూరంబున బడవైచె! సుముఖాసత్తియు నట్టి సంప్రాప్తంబైన యసివిఘాతంబున తన జరద్దేహంబు విడినట్టి క్షణంబునందు,

సీ. నిండుచందురునవ్వు నెమ్మోము సిరితోడ నిరులు గ్రమ్మెడి వేణిభరముతోడ
ఆకర్ణలోలంబు లగు నేత్రములతోడ తళుకొత్తు చెక్కుటద్దములతోడ
మిగులమిటారించు బిగిచనుంగవతోడ లలితంబు బాహువల్లరులతోడ
నతికృశత్వమున జవ్వాడు మధ్యముతోడ నభినవంబైన నూగారుతోడ
తే. వలపుమీఁదికిఁదొలకు సువర్ణపులిన। గురునితంబ ప్రభాపరంపరలతోడ
మహితసర్వాంగలావణ్యమహిమతోడ। నమరుప్రాయంబురూపుచిత్రముగఁ దాల్చె.

ఇట్లు దాల్చి యవ్వికచోత్పలదళాక్షి చూచుచు సిద్ధుండు ఒక కేలం గత్తి, వేఱొక కేల కలభాషిణియు వీడకయే యభ్రింబున జనుచుండుటను గనుంగొనియె. ఇట్లు గాంచి యా కలభాషిణి యవస్థను తన యాత్మలో కలంగుచు వ్యాకులమానమానసయై యుండుటంజేసి యాయింతి తన చిరకాంక్షిత సిద్ధి పెంపును గనుంగొనలేకయుండె. అంత క్రమంబున నా సరోజాక్షి సంసారస్వభావవిచారమహిమవలన తన దుఃఖంబు వారించుకొని దానంజేసి భోగ్యాపేక్షవిదలి దేవీకటాక్షలబ్ధంబగు తన జన్మసాఫల్యత్వము వృథ గాకయుండ యోగవిద్యాభ్యసనోపయోగంబున గాలంబు గడపెదఁగాక యని నిశ్చయించుకొని యమనియమవర్తనంబులతో నాసనాదు లభ్యసింపందొడంగె. అట్టి యోగాభ్యాసంబునకు నాశక్తిని గురువుగా భావించుకొనియె. అంతటఁ గొన్ని దినంబులకు మరల కలభాషిణి యచటి కేఁగుదెంచి యాచంచలాక్షింజూచి నీ వెందుండి వచ్చితివి యెవ్వటి దానవని యడుగుటయు నప్పడంతి యిట్లనియె.

ఓ యింతీ! మును నీకడ్డపడి సిద్ధునిచేత ఖండితమైన సుముఖాసత్తియను వృద్ధవనితం జూమ్ము. క్రమ్మర నిమ్మహాశక్తివలన నిట్టి యలబ్రాయంపు సొంపువడసియున్న దాన నని తత్ప్రకారం బెఱుంగించి, ఓ కలభాషిణీ! అట్లు సిద్ధునితోడంగూడి నిమ్మహాశక్తిచేత దూరవిక్షిప్తవై యచ్చటఁ బడితివి? ఎంతయు నొవ్వక యిట్లు తిరిగివచ్చుట యద్భుతంబగుచున్న యది యనుడు, కలభాషిణి యిట్లనియె.

ఓయమ్మా! నీవు ధర్మగుణంబున నిమ్మహాదేవిని మెప్పించి తిరుగ నలబ్రాయంబు గనుట యద్భుతంబుగాని యింతటి మహాపుణ్యనిధివైన నీకారుణ్యంబుగలుగ నే దిరిగి వచ్చుట యేమి యద్భుతంబు. నావిధంబంతయు విన్నవించెద, సావధానంబుగా వినవలయుఁజుమీ, యని పల్కుచుండు సమయంబున బంధురంబగు వీణాసహితస్కంధంబుతో రత్నమాలికాఘటితజటాబంధంబుతో నొప్పు మాణికంధరుం డచ్చటికి వచ్చిచేరె.

ఇట్లు వచ్చిన మాణికంధరుంజూచి యచ్చెరువందుచు కలభాషిణి యాతనికి మ్రొక్కె. మణికంధరుండును కలభాషిణిం జూచి ముదంబున నచ్చెరువున వికసితాననుండగుచు నోహోహో మాబంధువ్యూహమంతయు వచ్చియున్నట్లయ్యె. కలభాషిణీ! పరమస్నేహనిధి వగు నిన్నిటఁ గన్గొంటి. నీవిట వచ్చుట జూడ వింత యగుచున్నది. ద్వారకాపురంబున నీవారలందఱు సుఖముగా నున్నారుకదా, యనిపలికి మఱియు నిట్లనియె.

సీ. ఉత్తమశ్లోకుఁ బద్మోజాతు సేవింప నేగెఁ దే యీ వెనుకన్నఁ డైన
నాజగత్పతితోడి యలవజ్రమణిసభ కేతెంచి కొలువుసేయించుకొనునె
తిన సేవగాఁ బురందరుఁడు గట్టించు కెంపులహారముకడము లైనొక్కొ
మనవీణియఁ దలంచుకొని భ్రమియించు నీలపుటరంగులకు బోనిపుడు గలదె

తే. యంతకంతకువర్ధిల్లు హారికమాళ్ల । బలగమున కిదిచాలద న్తలఁపులోడ
తిరుగఁగట్టింత మని పైడిగరిడిసాల । యట్లయున్నదియే వికచాబ్జవదన.

అనియడిగిన నవి యన్నియుఁ దొల్లిటియట్ల శుభవర్తనక్షాభాసిల్లు ననిపలికిన వాసుందరాంగిం గనుంగొని మణికంధరుండు.—

సీ. సంగీతవిద్యాప్రసంగంబునందైన మము దలంతువో లేదో మనసునందు
దనుజారి కేనొసంగిన దండకంబు నీవెందైన మఱి వెలయించితొక్కొ
యిప్పుడెన్నాగదుఁ డెప్పటప్పటికి వచ్చునో రాఁడో వసుదేవసూనుగొలువ
నాలోకవిభుసుతుల్ మేలెంచియిచ్చిన నీవీణ యేమయ్యెఁ దేని నటికి
తే. నేమిగామిము నాఁడు నీహృదయమునను । గోర్కె యొక్కటి గలుగుటకొమ్మ వింటి
నది ప్రవృద్ధంబుగాఁ బెంపె యాత్మలోన । విడిచిపెట్టితె వీణపై వేడ్కలెల్ల.

అనుడు నజ్జలజముఖి నవలజ్జ పెంపున నించుక యోరగాతలవాంచి యోయనఘచరితా! నే నేమని చెప్పుదు, నాసెఁగల యాకోర్కె గాదె నాబలగంబులనెల్ల బాపి యీగహనప్రదేశంబునఁ బడఁ ద్రోసి పాటులపాలుచేసె. అని పలికి కలభాషిణి, తన గానవిద్యాభ్యాస పరిసమాప్తియైన పిమ్మట దనయున్న చోటికి మణిస్తంభుండు వచ్చిన ప్రకారంబును, అతఁడు దూరదృష్టి దూరశ్రవణశక్తిబలంబున దనకుఁ జెప్పిన యర్థంబును, తను నతండు మృగేంద్రవాహనా భవనంబునకు దెచ్చిన తెఱంగును, బలిపశూపకరణోద్యమప్రకారంబును, సుముఖాసత్తి తన్ను రక్షించుటయును, వివరించి యాపుణ్యసాధ్వి యీయమ యని జూపి తత్కాలస్థానవర్తనంబులఁ దెలిపి యిట్లనియె.

ఓగంధర్వోత్తమా! యింక నీ చందంబు వినవలయు, నవ్విధంబున రంభచే నీతపంబు విఘ్నంబునందుట యమ్మణిస్తంభుని చేత నేను విన్న ప్రకారంబు వింటివిగదా! అటుపిమ్మట భవదీయవర్తనం బెఱుంగింపు మనునంతలో మణిస్తంభుండు వచ్చి వారి యెదుట సాక్షాత్కరించె. అతనింజూచి కలభాషిణి— మణికంధరా! యిప్పు డేను జెప్పిన సిద్ధుం డితండె సుమీ. అనుడు, మణికంధరుండు, వానింజూచి దరహసితవికసితాననుండగుచు నితండా యనిపలికి యతని తగుతెఱంగున సంభావించె. అపుడు సిద్ధుండు మణికంధరాగమనమునకు నచ్చెరువునందుచు మీ రెచ్చోటనుండి వచ్చితిరి? యిది యచ్చెరువు గదా! యని పలికి కలభాషిణింజూచి యిట్లనియె.

ఓ బాలికామణీ! నిన్నెల్లచోట్ల వెదకి వెదకి యెందును గానక చోద్యమందితిని; అప్పుడీ వెక్కడనుంటివి; యిప్పుడిచటి కెట్లు వచ్చితివి; అని పలికి సిద్ధుండు సుముఖాసత్తిం జూపి యీపె యెచ్చట నుండివచ్చినది? యీయమ పేరెద్ది? అని తత్ప్రకారంబు తెలిసికొని వెరగంది వినుతిఁ జేసె. సుముఖాసత్తియు సిద్ధుం గనుంగొని యదరి

పలుకుచు నాతనితో,— ఓసిద్ధుఁడా! నీవును గలభాషిణియు నిర్జరిచే సరభసవిక్షిప్తు లగుచుఁ బోయియుంటిరిక దా! నీవెచ్చటఁబడితివి, పడి యెంతయునొవ్వక తిరిగివచ్చు టయ్యు నచ్చెరువయి కాన్పించుచున్నది, నాకు నంతయు వినిపింపు మనుడు మణిస్తంభుం డామె కిట్లనియె.

ఓ యంబుజముఖీ! నీవు కోరినట్ల వృత్తాంతమంతయు వినిపించెద; నంతియకాదు; నేఁగనివచ్చిన విచిత్రంబులు పెక్కులు గలవు. అవి యొకరితోడం జెప్పనందాఁక హృదయంబు వేగిరపడుచున్నయది, కావున నన్నిటం బూజ్యురాలవగు నీకు వినుపించుటకంటె నాకు భాగ్యంబుగలదా! అట్టి కథల వినుటకు సావధానమనస్కవనుండి వినవలయు. అనుడు, సుముఖాసక్తి కలభాషిణి మణిగ్రీవుల యాభిముఖ్యతయునంది సిద్ధుం జూచి యతని వృత్తాంతంబుఁ బ్రారంభింపు మనుడు నంతండును దాని నీక్రిందివిధంబునం జెప్పఁ దొడంగెను.

ఆఱవ ప్రకరణము.

మణిస్తంభునివార్త.

అపుడు మణిస్తంభుఁడు, సుముఖాసక్తిం జూచి— ఓలతాంగీ! నేను మదాతిశయంబున కన్నుగానక దేవతమీఁదియానయుంగణింపక మన కలభాషిణి శిరోజములం బట్టిత్రుంచుట కాయుధ మెత్తితిని. అట్లెత్తిన నాకేలిదేవి గ్రహింపగా నంతట నేను పైకెగరవైఁ గలభాషిణితో బహుదూరంబుపోయితిని. ఇట్లు పోయిపోయి మణికంధరుని తపోవనభూమి నిత్తరుణియు నేను నొక్కమెత్తని క్రొందలిరుఁబాన్పునఁ బడితిమి. ఓమత్తే. భగమనా! మేము చావకయుండ నాసత్రియే యట్లు కృపచేసి యుండనోపు. అట్లేనుపడి మునుపటి భయమున బ్రాన్పడియునికింజేసి చేతికత్తియును తనశిరంబును విడువగ నెఱుఁగని నన్నుఁగనుగొని కలభాషిణి గడగడ వడంకుచుండె. అట్టిచో నేను దెల్విసంది కన్నులు విచ్చిచూచుచుండఁ గలభాషిణి యతిమనోహరాకారంబు నాకుఁ గాన్పించె. అది యెట్లుండె ననఁగా:—

సీ. అమృతంబుదొలకు నట్లమరంగ వెల్వెలఁబాఱు ముఖేందుబింబంబుతోడ
బాలకర్ణద్వయీకూలంకషంబులై తల్లడంబందు నేత్రములతోడఁ
గడుఁజెమర్చినయట్టి కలికిలేజెక్కుల నంటెడు విగళత్కచాళితోడఁ
వలిగుబ్బపాలిండ్ల నిలువ కిట్టట్టు సంక్షోభించు పయ్యెద కొంగుతోడ
తే. వెఱపునొకయొజ్జయై వింతవిలసనముల। గఱపఁజూపట్టు సౌందర్యగరిమతోడ
సరభసాకర్షణాక్షోభ చకితమైన। మదను జయలక్ష్మిలీల నిమ్మగువ తనరె.

ఇట్లుండ నేను నామనంబు పంచశరశరవశత నొందఁ గలభాషిణి నాలింగనంబు గావించితిని. అట్టి నావికృతిచేష్టితంబునకు సైరింపఁజాలక కలభాషిణి యెలుగెత్తి సత్పురుషులారా! యీపాపి నన్ను బల్మిఁబట్టుచున్నాఁడు. మీకు శరణుజొచ్చితి. నాయాపద వారించి నన్ను రక్షింపుఁడని యాక్రోశముం జేసె. అట్టియార్తధ్వానంబాలించి యాకసంబంటుకంఠధ్వనితో నిదె నే నతిత్వరితగతి వచ్చుచున్నాను. భయపడకుము. భయపడకు మనుచు నాసమీపంబుననున్న పొదరిఁటినుండి నలకూబరుండు రయోద్ధతి నెవెడలి వచ్చె; ఇట్లువచ్చి నన్నుద్దేశించి 'యెవ్వఁడవురా స్త్రీని వెతబెట్టుచున్నాఁడవు. నీ వెందు బోయిన వెన్నుదన్నిపట్టి నీ నరములూడఁ బెఱికెద.' అని యిట్లు వచ్చు నలకూబరుం జూచి వికలంబగు మనోధైర్యంబుగలవాఁడనై కలభాషిణిన్విడిచి దూరముగాఁ బాఱితి. అతఁడు నావెంటనంటివచ్చి నన్నుగ్రతంబట్టుకొనియె. ఇట్లుగాఁబట్టి 'ఓరీ నీవెవ్వండవు, పోతరించి యీయువతిం బట్టితివి. దాని నాకు ముందుగాఁ జూపుము, పిమ్మట నీకుఁ దగు ప్రాయశ్చిత్తం బొనరించెద' అనిపల్కుచు నన్నాతండు కొంతదూరము వెనుకకుఁదెచ్చె. ఇట్లుండగా మొదట నలకూబరుండు వచ్చిన మార్గముంబట్టియే రంభ మిక్కిలి సంరంభంబున వచ్చుచుండె. ఇట్లువచ్చి యాపె తనప్రియుంజూచి—ప్రాణనాథా! యేమి యింత సాహసకార్యం బొనర్చితివి. చేతఁ గైదువ్వమునలేక పోవఁదగునా? చాలుంజాలు. నేనీవరకే మిగుల నలసితిని. అని తనప్రియునితోఁబల్కు రంభ నన్నుంగనుంగొని యిట్లనియె.

ఆహా! వీఁడేనా యీయన్యాయమార్గ మవలంబించిన పుణ్యాత్ముఁడు. ఆర్తస్వనంబుతో నాక్రందించు నాయింతి యెచ్చటఁబోయె. అనుడద్దానిం జూపుటకేకదా యిపుడు వీని నిటుపట్టి తెచ్చుట అనుచు, రంభ నలకూబరునకు దయనైదమున్నట్లుగా, నాథా! యితఁడాయింతిం జూపక నీముందట నెంచిపోయెడిని. అతని చేయివిడువుము అని ప్రార్థించె. అతఁడు నాచేయివిడువ నేవారలఁ దోడ్కొనిపని యీ మనకలభాషిణి యున్నచోటికి మునుపు మేమున్న తలిరుటాకుపాన్పుం జూపితికాని యాయింతి యచ్చోటఁగానరాదయ్యె. అపుడు నలకూబరుండు రంభంజూచి— యితఁడు తొల్లి మనకొఱకమర్పఁబడియున్న యీపాన్పున నాపడతుకంజేర్చుకొని యుండఁబోలును. కానిమ్ము. సిద్ధుఁడుగావున నీసిద్ధశయ్య కుచితుఁడే. అచ్చోట సంపఁబడిన నాకత్తినెత్తికొని యీ జోగి పెద్దబంటుగాఁ గాన్పించెడిని. కానిచో దీని నిచ్చోఁ బాఱవైచిపోవునా. అనిపల్కి యాయువతి నెచట దాఁచితివి. నిజము దెల్పుమని నన్ను భర్త్సించి యడిగె. ఇట్లుగా నన్ను నిర్బంధించు ప్రియుంజూచి-నాథా! వీనితో నేమిపని మనకు; వీనిన్విడువుము. వీఁడాకాంత నవ్వదలిపోయిన వెనుక నయ్యది యెటుపోయి దాగియున్నదో, అతనింజూపుమన నెక్కుడుఁజూపఁగలఁడు. అతని వదలుఁడని నన్ను విడిపించి ఆకాంతను మనమే వెదుకుదమని రంభ తనప్రియునిందోడ్కొని మున్ను నేఁ బాఱినమార్గముగా నతిదూరము గొంపోయెను. ఇట్లు

పోవునప్పుడు రంభ నలకూబరుని యంసంబునఁ దనపాణి యుంచి రోమాంచితాంగియగుచు నడుచుచుండెను. నేను గురుకృపాలబ్ధ మగు నాకృపాణమున నలకూబరాక్రాంతమగుటం జేసి దానిం బాసిపోఁజాలక రంభానలకూబరు లెఱుఁగకుండ వారిననుసరించియే పోవుచుంటిని. ఇట్లు పోయిపోయి వారొకచోఁ గ్రీడార్థమై నిలువ నేను జాటుచేసికొని నిలిచి యుంటిని. ఇట్లుండి కలభాషిణి యెటుబోయెనో యని దూరదృష్టి సారించి యాకాననమంతయు వెదికితిని. అదేమి మాయయో గాని యాయింతి యెచ్చోఁ గానవైతిని. రంభానలకూబరులు తమతమ యిష్టక్రీడల సంతుష్టులై తారున్న పొదరిల్లుదాటి పైని విహరించుచుండ నచ్చటికి వేఱొకరంభ యద్భుతమగునట్లుగా వచ్చిచేరె.

ద్వితీయరంభ వృత్తాంతము.

ఇట్లు వచ్చినరంభ మొదటిరంభను మాచి రిచ్చవడియుండెను. దానింజూచి మవేగ పుత్తళిందు నద్భుత మందుచుండెను. అట్టి చమత్కారముంజూచి నేను నిర్విణ్ణుండనై యుంటిని. అంత నలకూబరుం డప్పుడు వచ్చినయింతిని దనయింతి నెంతయేని శ్రద్ధతో బరికించి వారి భేద మింతైనఁ బరికింపలేకయుండెను. ఇట్లుండ నలకూబరునియింతి యతనింజూచి యేమట్లు పరికించుచున్నావనుడు నలకూబరుం డిట్లనియె.

ఓ యిగురుబోడీ! దాని ప్రతిబింబము నీవో నీప్రతిబింబ మదియో యేర్పరుపవలయునని యిట్లు చూచుచుంటిని కాని ఆపనిచేయలేక యున్నాను. దైవవశమున నీవిచ్చో నుంటివిగాని నీవు నాచెంతఁదొలఁగుటయే తటస్థించిన నిన్ను మరలఁ బోల్చుకొనుట కడుదుర్లభమగుఁగదా. అనుడు నాయింతి యిట్లనియె. అటులైనను నీకాఁగిటి నేఁ బాయను ఇది యెవ్వతెయో యొక మోసకత్తెగా మాయలాడిగాఁ గాన్పించుచున్నది. ఇది రాక్షసి కాదుగదా. రాక్షసిమాయ లిట్లుండవే. దీని నీచుట్టుపట్లనుండనిచ్చిన మనకేమి ప్రమాదములు రాఁగలవో. త్వరలో దీని వెడలనడుపుము, అని నలకూబరు మెడఁ గౌఁగిలించుకొని రంభ వదలకయుండెను. క్రొత్తరంభ పైవిధమంతయుంజూచి ముక్కుపై వ్రేలుంచికొని తలపంకించి యుస్సురనుచు నిలిచె. అట్లున్న చంచలాక్షింజూచి నలకూబరుండు—ఓ మృగశాక్షీ! నీవెచ్చటనుండివచ్చితివి. ఉస్సురనుటకుఁ గతంబేమి. నా స్త్రీనిపోలినరూపము నీవెట్లుగా ధరియించితివి, నీవు రక్కసివో పిశాచివో తెలియకయున్నది. నీవృత్తాంతము జెప్పి నాసంశయమును దీర్పుము. అనుడు నాయింతి యిట్లనియె.

స్వామీ! నీకు నేనేమిచెప్పఁజాలుదును. నారూపముదాల్చి నిన్నీవిధముగా హత్తుకొనియున్న యీగయ్యాళి రక్కసియో పిశాచియో తేలువరకును నీవు రక్కసివేయునఁ గానరాదు. పిశాచివేయున్న నంశములనుఁ దగియున్నానని యనవలయును. ఏయేర్పాటును దనంతనే యగును. తప్పదు. సత్యమనియు, దైవమనియు, జనులకు లేనిచో నీజగ

మెట్లుగా నడుచును, నాకు దైవమనఁగ వేఱే యున్నదా. అది నీవు కాదా! నీవే యట్టియేర్పాటుం జేయఁగలవు. ఒక వృత్తాంతముం జెప్పెద నాలింపుము. ఇంతకుము న్నొకసురపొన్నగున్ననీడ నాతోడఁ బల్లవశయ్యను నీవు వేడుకనుండఁగఁ బడమటిదెసనుండి యొక పడఁతిసేయు నాక్రందనధ్వని విని నీవు దిగ్గనలేచి పోనుండ నేనుఁగూడ నిను వెంబడింపలేదా; అప్పుడొకయిత్తి డాపలివంక నేఁగ నది సుళువునంబు గాదని నేను వెనుక నిల్చితిని. అంతలో నీవు నుత్తకాశినివచ్చి యెట్లుగా నిన్ను హత్తికొనియెనో యెఱుకపడదాయెను. నీవృత్తాంతంబు భావింపుము. అప్పుడు నీవే కల్లనిజములం గనిపెట్టఁగలవు. అనుడు, ప్రథమరంభ నలకూబరు మొగముంజూచి యొక్కచేత నతని మెడఁ గౌఁగిలించుకొని నవ్వుచు నిట్లనియె.

హా! ఈమాయలాడి యెటనుండి చూచెనో గాని మన వృత్తంబు జరిగినది జరిగినట్లే చెప్పుచున్నది. ఇట్లు చెప్పుటయేగాక, పైగా నారూపమును ధరియించి నిన్ను నెడబాపఁ జూచుచున్నది. ఇంతమాత్రమున నిన్నుఁ బొందనగునని కావలయు; ఏమి దీని దురాశ! మాయకాండ్రు కార్యతత్పరులై తత్సముచితవ్యాపారంబులు చేయకయుందురా? కన్నులనుండి కనుపాపను దొంగిలింపఁగల ప్రముచ్చుగా నీలతాఁగి కాన్పించుచున్నది. ఇఁక దీని నిచ్చో నునుచుట తగదు. త్వరగా సాగనంపుము. అని ప్రథమరంభ రెండవరంభ నచ్చో నిలువనీక పోఁదోలుటకు నిజవల్లభుని వేగిరించె. అట్టి మాటలకు నలుకబలియు ద్వితీయరంభ ప్రథమరంభ నాక్షేపించుచు నిట్లనియె.

ఓసీ త్రుళ్లిపడకు. ఇల్లలుకఁగనే పండుగ యగునా? నీవే నావల్లభున కిల్లాలవు, నేనే పరాయిదానను. కావున, నన్నీవు పోఁదోలుచున్నావు. కోపించి నా మగఁడా కత్తినెత్తి నా నెత్తిఁగొట్టినఁ గొట్టనిమ్ము. నేను నాభర్తను మాత్రము వదలను. నీవు నా యెదుటనే నా భర్తమెడఁ గౌఁగిలించికొని కులుకుచుండ నేసైరింపఁగలనా. ఛీ యిటు లేచిరా. అనుడు, ప్రథమరంభ కనలి యేమే అంతగా మదించితివి, నీ గంతులు నడంచెద సుమీ యనుడు, రెండవరంభ—నీవు మదించితివి; నీ గంతుల నడంచెద చూడు మనియె. అపుడా యిర్వురుఁ జేతులఁ ద్రిప్పుకొనుచుఁ జూడు నాపంతము జూడు నాపంత మనియు, వలదుసుమీ యన వలదుసుమీ యనియు, నొట్టుసుమీ యన నొట్టుసుమీ యనియు, నొకరి నొక రధిక్షేపించుకొనుచుండిరి. అంత నలకూబరుండు ప్రథమరంభం జూచి నిలువుము నిలువు మని వారించెఁగాని, అది నిలువక రొదసేయుచుండ నతఁ డేమియుఁ జేయలేక ప్రాన్పడి చూచుచుండెను.

నారదముని ప్రవేశించుట.

ఇట్లుండుసమయంబున నహో నేడుగదా యీ సుందరులు నాకు వినోదొనరించుచున్నా రని పొరోగిరముతిండిపోతుతపసి తన విపంచి మొఱయించుచు నచ్చటికి విచ్చేసె.

అట్టి నారదమహామునిం గాంచి నలకూబరుండు నా లలనామణులును సమీపించి మ్రొక్కిలిడిరి. నారదుఁడు వారిం గాంచి, యోనలకూబరా! యీ యిర్వురు పర్వేందుముఖులలో నీ ప్రియురా లెవ్వతెయో చూపుము. ఆ భేద మెఱుఁగనిది నే దీవింపరాదు గదా. రంభ తనకంటెను బ్రియతర మగు వనిత నీకు లేదనియుఁ దన సౌందర్యమే సౌందర్యముగాని లోకములో నింక సౌందర్యమే లేదనియు గర్వింప, దాని గర్వమడంప నీవే ప్రతిరంభను సృజియించితివా ? లేనిచో నీతోఁ గ్రీడింపఁగోరి రంభ తనయొక్క మేనుచాలక యిట్లు రూపద్వయము దాల్చెనా ? ఆరహస్యము నాకుఁ గొంత చెప్పిన విని సంతసించెదను. ఏది యెట్లున్న నేమి? ఈ యిర్వురయెడ సమమగు ప్రేమయే యున్నది గదా. నీవు వీరి నిర్వురఁ దడవుగఁ బోరించుచుండ నే నాకసంబుననుండి చూచుచుంటిని. వా రీవరకలసియుందురు. అనుడు, నలకూబరుం డిట్లనియె.

స్వామీ! నేనా వీరం బోరించుచుంటిని, నాకును వీరి సమరూపతయుఁ బోరితెమును వెఱఁగు బుట్టించుచున్నది. మునిచంద్రా! నేనొకరంభతో నాక్రీడాగృహంబున నుండ నపు డనతిదూరంబున నబలాకృత మగు నొక యాక్రందనధ్వానము వీనులఁ బడియె. కరుణాసంభ్రమంబున నే నద్దిక్కునకై చనుటయు నాస్త్రీని బలాత్కరించు దుష్టుఁడు నా దృష్టిపథంబునఁ బడి పలాయనం బొనరించె. అపుడు వానిం దరిమిపట్టి యతఁడు మును పున్న చోటికిం దెచ్చుడు నావనిత యచ్చటికివచ్చి వాని న్విడిపించె. అంతట నాయువతియు నేనును మగుడ నిచ్ఛావిహారంబున నుండఁగా నీరెండవరంభ వచ్చినది. ఇది వచ్చినది మొదలుగా నారంభతోఁ గలహించుచున్నయది. ఇదియ జరిగిన వృత్తాంతంబు. అనుడు, నాద్వితీయరంభ మ్రొక్కుచు నారదమునీంద్రున కిట్లనియె.

సంయమీంద్రా! అల్లనాఁడు మనము ద్వారక చెంతనుండ మీరు పల్కినపల్కులే యిప్పు డింతపని చేసినది. అనుడు ప్రథమరంభయు, స్వామీ! అప్పటి మీపలుకులే గదా యింతపని చేసినదని పల్కె. అనుడు నవ్వుచు, నారదుండు ఓ యింతులారా! మీరు చెప్పినదంతయు యథార్థమే సుడీ, అని యామోదించి అప్పటిమాటలు సరిదాఁకుటం జేసియే గదా యిప్పుడు మాకీ నేత్రోత్సవము కల్గినది. ఇఁక మేము పోయివచ్చెదము. అను నారదమునీంద్రుం జూచి నలకూబరుం డిట్లనియె.

మునిసార్వభౌమా! యీ ముద్దియ లిర్వురను జూచి యథార్థము నే పల్కితి రంటిరి. దాని వివరముం దెల్పి మఱి చనవలయును. అనుడు నారదుండు—నలకూబరా! నాఁడాత్మసౌందర్య వైభవమున రంభ గర్వమున నాడుకొను వాక్యముల కేను సహింపఁజాలక సవతి యేగతిగల్గునో మీరుగంటే అను నామాటం దలంచి యాపలుకింత చేసె నని యొక్కతె తార్కాణచేసె. మఱియొకతె రంభారూప యుక్తిచేఁ బ్రియుంగూడఁ గాంక్షించి యొక కార్యఘటనాసమయంబున నాదియందు నాచే వరము గొనియె. ఆ నాపల్కు

హృదయంబునఁ దలఁచుకొని ఆపల్కే యింతచేసె నని రెండవది తార్కాణచేసె. కావున నా యిర్వురివాక్యంబులు నిజములే నని యేనంటి. అనుడు నలకూబరుం డిట్లనియె.

ఓతపోధనా! యథార్థము నెఱిఁగినవారు గావున మీరే తథ్యమిథ్యాభావంబుల నేర్పఱిచి దీని భావమిది, దీని భావమిది, యని నిశ్చయించి నా సంశయము నివారింపుఁడ డనుడు, నారదుండు—నలకూబరా! ఆతథ్యమిథ్యాభావంబులోఁ బనియేమి? రంభరమ్యాకృతి నీకు స్వభావముగున దే గదా. ఈప్రపంచమున నిజమని యొకటియున్నది గనుక నా నిజమిది యబద్ధమిది యని నీకుఁ జెప్పను. ఏది యెట్లున్నను నీ వొక దానిం జూపి రెండవదాని గర్వమడంచి నీ యిష్టానుసారముగా నీయిర్వురతోడం గూడి భోగింపుము, నీపుణ్య మిబ్బడియై నేఁడు ఫలించినది. అనుడు, నలకూబరుండు— నారదునితో దేవరవారు మహాత్ములు. పెద్దలగువారలఁ దడవునిలుపుట ప్రమాదకరము. కావున మిమ్మింక నిలుపను అనుడు నవ్వుచు, నారదుండు నలకూబరా! యుచితలీలల నుండుము, నేను పోయివచ్చెదనని యంతర్హితుండయ్యె.

అంతట నలకూబరుండు తనవెంట నంటియున్న రంభ కైదండగొనుచు రెండవ రంభం గనుంగొని యిట్లనియె. ఓయింతీ! నీ వెంత నేర్పులు చూపినను నాకవి మాయలే యని తోఁచుచుండెను నీసత్యత నెఱింగింపఁజాలినంత సాక్ష్యము సంపాదించుకొని రమ్ము, ఇపుడు పొమ్ము, అని తిరస్కారభావంబులోఁ బలికె. అపు డతని దండనున్న రంభ రెండవరంభం జూచి యానడంపుము—ఓసీ గయ్యాళీ! నీకి, సుంతైన సిగ్గులేదా, దోసము గాదా, సంతోషముతో వధూవరు లిరువురు నేకతమున నుండుచోటి కిటువచ్చి యిట్టి పేలాసలు చూపవచ్చునా. పో పో; అని పల్కెను. అట్టి ప్రథమరంభమాటలు విని రెండవరంభ రోషకషాయితవీక్షణంబుల నా పద్మాక్షి నీక్షించి యిట్లనియె.

ఓసీ, యేమి యీకోఱగామి. మోహాంధకారంబునంబడి నలకూబరుండు నిజముం జూడలేకున్న నంతటితో నగి యస్తమింతునా? సాక్షి యుండు లేఁడా, సూర్యాధ్యక్షుండు లేఁడా, హిరణ్యగర్భుండు లేఁడా, వారిమూలముగా నైన సత్యప్రతిష్ఠాపన కాక యుండునా? ఇంతమాత్రమునకుగా నింత త్రుళ్ళిపాటేల? అనుడు, ప్రథమరంభ నాయకాదరగర్వంబు ప్రకాశింప రెండవదాని మాటలు పాటింపక యిట్లనియె.

ఓసీ జంతా! యింతగా నేల యఱచెదవు? ఆఱచేతికిఁ బండ్లువచ్చినపుడు మమ్ము గఱచెదవుగాక; నీకు దిక్కుగల దైవములు వినునట్లుగా మొఱలిడుము. అనుటయు రెండవ రంభ—కానిమ్ము. కానిమ్ము. తొందరపడకుము. నా నిజమేర్పఱిచి యిప్పుడే నీకుఁ దగు శిక్ష చేయించెదను. అనిపల్కి ద్వితీయరంభ యచ్చోటువాసి కొన్నియడుగులు నడిచిపోయి అంతట దనకోపంబును మించి దీపించు ప్రియవియోగంబున దర్పితానల్పకందర్ప హేతిఘాతసంజాతచేతస్తాపంబున కోపంజాలక, యానీలాలక కడు గృశించి గళితకంకణయై నిలిచి యొక్కయుపాయంబు చింతించి తిరిగివచ్చి యిట్లనియె,

ఓ బొంకులాడీ! నీవిచ్చోనుండి కావరమున వలసినకైల్ల గయ్యాళింప జడిసి నేనిది యొక పెద్దమొఱగా వారితో వారితో నేలచెప్పకొన వలయును. నీవు నాతోడరమ్ము. మనమిద్దరముంబోయి దేవసభలో మనతగవుం దెల్పుదము. వారే దానిం దీర్చెదరు. రమ్ము రమ్మని బహుతీవ్రముగా దాని కొంగుపట్టి లాగెను. అట్లు రెండవరంభ బలాత్కరింప ప్రథమరంభ నలకూబరునితో నిట్లనియె.

ప్రాణనాయకా! చూచితివిగదా! ఇది యొకరక్కసివనితగాక వేల్పుమగువ యగునా? ఇట్టి గయ్యాళిగంపను ప్రథమముననే నీవుశిక్షింపక యోర్చినతప్పువలననే గదా యిట్టిఫలము సంప్రాప్తమాయెను. అనుడు నలకూబరుండు—ప్రియురాలా! మన కేమి భయము. దేవసభలో దీనిముందఱ నంతయుం దెల్పి దీనికిం దగుశిక్షం జేయించెదను. అనుడు రెండవరంభ యిట్లనియె.

రాజరాజపుత్త్రా! యథార్థమాయితలంపు నీమనంబున నున్నచో నీకది యిదివరకే బోధపడియుండునుగదా. అని ప్రథమరంభంజూచి, మోసీ! నీవుతిరుగఁబడిన యంతమాత్రమున నిన్ను విడుతునా? పద పద యనిగెంటుచు నడువసాగెను. అపుడు ప్రథమరంభ కొంతచింతించి నాథునితో, అప్సరస్త్రీలలో నగ్రగణ్యనైన యూర్వశి మేనక మొదలగు నుత్తమస్త్రీలవలన రావమ్మా పోవమ్మా యని పిలిపించుకొనుచు, నెన్నఁడు నెచ్చో నెవ్వరివలన వ్రేలు చూపించుకొనక యుండు నాకుఁ దుది నీపిశాచిని నరచేసికొని దేవసభకుం బోయి నీవంటి నీచరాలి దీనితోఁ బోరాడుచుండుట యెట్టి గౌరవకార్యమో నీవ యాలోచింపుము. పురుషశ్రేష్ఠా! యిట్టి తిట్లాటల కోర్చినబ్రతుకు నొకబ్రతుకా, ఇంతియ కాక స్వర్గములోని దేవతలందఱు నన్నుఁజూచి హహా! రంభను బ్రతిరంభ వచ్చి దానిని రచ్చకుం దెచ్చెనని యుపహాస్యము సేయకమానరుగదా. నాపరువున కిచ్చటఁ గలహించుటయే యనారోగ్యమై యుండఁగా స్వర్గములోఁగూడఁ గలహింప వలయునా? నాబ్రతు కిఁక నెటులైనఁ గానిమ్ము. నీకోరిక. ఇఁక నే భూమినివిడిచి స్వర్గమునకుఁ బో నడుగు పెట్టను. ఈవృత్తాంత మంతయును నాకలోకవాసుల యాననములం జూడనొల్ల. నిన్ను నిలుమనియుం బ్రార్థింపను. నన్ను మన్మథుఁడు బాధించిన బాధింపనిమ్ము. దానినైన నోర్చెదననియె.

అంతట రెండవరంభ యమ్మాట లాలించి, కాంతుఁడా! యీకాంత నేర్పుచూచితే, ఇది వేల్పులకడకేతెంచినఁ దనమాయ బట్టబయ లగునని దానినొల్లక సురలయాననంబు లేగతినాలోకింతు నని నాకగమనంబు పరిహరించె. అందుచే ధరణివిడిచి యడుగుపెట్టనని నీపైనొట్టుపెట్టుకొనియె. దానంజేసి యీయింతికి ఖేచరత్వంబు కలిమియును సంశయింపఁదగినదిగానే యున్నది. ఇంతవఱకును బ్రియకాంత యిది యని నీవెట్లు నమ్మితివినను.

ఇట్లు రెండవరంభ పల్కిన పలుకులు వివేకమార్గంబులే యగునని నిశ్చయించి

నలకూబరుండు, తద్వాక్యంబులకు నిరుత్తరుఁడై తన దండనున్న యాండజయాన నటుండుమని, మోసీ! నీవెంతమాయలాడివే! యని మెడఁబట్టి పొమ్మంత్రోచె.

అంత అది సందుగా ద్వితీయరంభ ప్రథమరంభను ధట్టించి యిట్టిపాడుచేతల నా నాథునకు నన్నెడచేసి నన్ను చేతోజాతహేతిఘాతంబుల పాలుచేసితివి గావున, నీవు నొక హేతిఘాత నిమిత్తంబునఁ గాయపీడాగ్రంబు నందుము. అని శాపంబిచ్చె. నలకూబరుండును దత్కాలంబెట్టిదియోగాని యీరాగముల వివేకింపఁజాలక, ఆమాయావనిత అట్టిశాపంబునకుఁ దగుతగునని పల్కె. ఇట్లు పల్కి, మోసీ, నీపేరేమి? నీ వృత్తాంత మెయ్యది? అనుడు తత్ప్రతిరంభ సైరింపక యిది యింతవఱకు నన్ను నిన్నుంజేగనీక మనోవ్యథఁ గుందు నట్లుచేసె. అవివేకి నా యీగోటను మూలగదఁ బుచ్చు వృథాకాలక్షేపము చేయుచున్నావు. అని ప్రతిరంభ ప్రథమరంభను మెడఁబట్టుకొని దూరముగా గెంటుకొనిపోయెను.

అని యిట్లు సిద్ధుండు చెప్పుచు సుముఖాసక్తింజూచి యిట్లనియె. నలకూబరుని యవివేక మెట్లున్నదో చూచితివా. అట్లు ప్రతిరంభ ప్రథమరంభనుపట్టి గెంటుకొనిపోవుచుండ నలకూబరుఁడు ప్రతిరంభపైనుండు ప్రేమమున నూరక చూచుచుండెను గాని ప్రథమరంభ యీరాగముల నాసించినాఁడు గాఁడు. కాముకులు నూతనప్రియులుగదా! అనుడు సుముఖాసక్తి యిట్లనియె.

ఓ సిద్ధవర్యా! నీ వా యిరువురి రంభలలో నెవ్వతెను యథార్థరంభగా భావించితివో, అట్లుగా భంగమునందియు నూరక యనుటమాడఁ బ్రథమరంభయే కపటరంభగాఁ దోఁచెడిని. అనుడు సిద్ధుండు కనుక నట్లేకాన్పించెననిచెప్పె. అపుడు సుముఖాసక్తి—సిద్ధపురుషా! అట్లేయగుంగాక. దానికేమి. నీవు చెప్పుచున్న వృత్తాంతమును వినినకొలఁది యద్భుతముగాఁ దోఁచుచున్నది. అదియట్లు తుదముట్టెనో విన మన ముత్సహించుచున్నది. కావున దయచేసి యావృత్తాంతంబు తెలుపవలయునన, సిద్ధుం డిట్లు చెప్పందొడంగె.

ప్రతిరంభనలకూబరాగమనము

ఓయింతీ! ఇంతకంటె నద్భుతము మఱియొకటి యున్నది. అట్లుగాఁ బ్రతిరంభ ప్రథమరంభను దొలఁగించి వచ్చి నలకూబరు నిష్ఠురవాక్యంబులాడి యాతనివలన నుపలాలితయై తిరుగఁ గ్రీడాగృహంబునకుఁ బోవుచుండు సమయములో మఱియొక నలకూబరుఁ డచటికి వచ్చిచేరెను. ఇట్లుగా వచ్చి వందనతో నెవ్వఁడునా నారూపమును ధరియించి దురాశ నారంభంగూడుకొన సన్నద్ధుఁడైనవాఁడు. అనిపల్కుచు, నేనచ్చో నతనింజూచి వెఱఁగంది యేమి యీచిత్రము; అని అభూమి మహిమ కావలయును. లేదన్న నొక దానికంటె నద్భుత మింకొక్కటి పుట్టునెట్లు. అని చూచుచుండ రంభ క్రొత్తనలకూబరుం జూచి తన ప్రియునితో నిట్లనియె. ఓ వల్లభా, యిది యేమిమాయ; వీఁడు నీరూపము

వాల్చి తేరమేమియును లేకయుండుటయేకాక, నా రూపు ధరియించితివా యని నిన్ను గర్జించుచున్నాఁడు. నారూపుతో వచ్చినదాని స్వదలించికొనుట యతిదుర్ఘటమైనది. ఆయాపద గడచితి మని స్థిమితపడియుండఁగా మరల వీఁడు నీరూపముతో వచ్చి దాపరించినాఁడు. వీని సాంగబనుపుట కిఁక నేమియుక్తి కలదు, మన యభిమత ఖేలనముల నోర్వలేని యేరాక్షసుఁడో యిట్టిమాయలఁ బన్నుచున్నాఁడు. సందియములేదు; మనపైని వాఁడు చలము బూనియుండు ననుచు రంభ మాటలాడుచుండఁ, బ్రతినలకూబరుండు రంభకడకు వచ్చి, ఓ యింతీ! నీవు వీనిమాయవలన వంచింపబడితివి కావున, నీ కాంతుండు వాఁడే నని భ్రమిసి నన్ను విడనాడితివి. వీఁడు నా యాకారమును ధరియించినవాఁడుగాని నేఁగానని నమ్ముము. నామాటలు నీవు నమ్మకయున్న నీవు దూరంబుగనిలిచి చూడుము. నా చేతి హేతి వీతిహోత్రునకు వీని నిపుడె యాహుతి గావించెదను, అపుడు నీకు సత్యత స్ఫురియించును. అనుడు రంభ తన నాయకుఁ డగు ప్రథమ నలకూబరుని మెడఁ గౌఁగిలించుకొని యో వేలుపులారా! నిరాయుధుఁడుగానుండు నాప్రాణనాథుని సాయుధుఁడుగానుండు నొక్కరక్కసుఁడు సంహరింపనున్నాఁడు. దయతో నాప్రియునిరక్షించి నన్ను బ్రతికింపుడు. అని యెలుగెత్తి మొఱయిడ నారంభించె. అట్టిమాటలు విని నవ్వి ప్రతి నలకూబరుండు రంభతో నిట్లనియె.

ఓ ముగ్ధయువతీ! నీవు నన్నే దనుజుని గాఁ దలంచితివా? ఏమి నీవివేకము, నీవు జడియకుము. నన్నెఱుఁగవా? నే నెన్నఁడైన నిరాయుధునిఁ, బలాయనమొనర్చువానిఁ, బ్రమత్తునిఁ, జంపెడువాఁడనా? నాకెదిరి వీఁడు నిల్చిన వీనిం జంపెద నని నాయభిప్రాయము. ఓసుందరీ! వీఁడెదిరించి నిలువఁగలఁడేని తన కైదు వెచ్చట నున్నదో చూచి తెచ్చికొమ్మనుము, అంతవఱకును వేచియుండెద. నీ నెమ్మనంబున యుద్ధంబున జయాపజయంబు లెంచినట్లుగా గావు. కావునఁ దోడింబడి వీని కొక్కటి యయ్యేనేని నేనేమి యగుదానవని నీవూహింపఁగలవు. అట్లైన నితని తథ్యమిథ్యాభావంబు లేర్పడునంతదాఁక నేను యుద్ధంబునకు వేగిరింపక సహించియుండెదను. మా యిర్వురివాక్యోపవాక్యములువినియు నీ వెఱిఁగిన పూర్వరహస్యంబులడిగియు నుచితోపాయంబుల మాకపటవర్తనంబులఁ దెలిసికొనుము. నాకుఁ బ్రియవనితవైన నీవు నాయెదుటనే యిట్లుగాఁ బరుని కంఠాలింగనంబొనర్చియుండ నాకు మచ్చరంబు పెచ్చుపెరుఁగకయుండునా? అట్లుగా మచ్చరంబు పెచ్చుపెరిఁగినచో సత్యాసత్యంబులు దేలునంతకును నిలువనెట్లోర్తునో యెఱుంగరాదు. కావున నాత్మహితంబుఁ గోరితేని యతనిక్ విడిచి యెడఁగలుగ నిలిచి నాపలుకు పల్కులు వినుము; అను ప్రతినలకూబరు మాటలు విని, రంభ యప్పటికిఁ దానెడగలిగి నిలిచియుండుటయేఁ దనప్రియుని కొంతవఱకు రక్షించుకొనుటగా నిశ్చయించుకొని మంచిది యట్లే చేసెద నని దూరముగా నిలిచియుండె. అట్టిదానింజూచి ప్రథమనలకూబరుఁడు రంభతో నిట్లనియె.

ఓయింతీ! నీవు భీతప్రకృతివి గావున నట్లొనర్చితివి. నేను వీని కత్తికిఁగిత్తికి జడియువాఁడనే. భయంపడకుము. అనుడు రంభ దూరంబుననుండియే ప్రథమనలకూబరు కటాక్షవీక్షణంబుల ద్వితీయనలకూబరు రూక్షేక్షణంబుల నీక్షించుచుండె. అట్టియెడ రెండవనలకూబరుండు రంభనుజూచి యిట్లనియె.

ఓ మోహనాంగీ! నీమనంబున లెస్సఁగా భావించుకొనుము. నీవు మున్ను పురందరుండుపనుప మణికంధరుం డున్న తపోవని కతని తపంబు విఘ్నంబుసేయ వచ్చితివి గదా. ఆతని నేచెట్టున గట్టితివి. వీఁడెచ్చో నిన్ను లంకించుకొనియె. దేవకార్యంబు చెడు ననుతలంపున విరహతాపభగంబునకోర్చి నీవెంటనంటిగాని నాపాపమే యీవెతలు గల్పించి నీవీ తేరగాని విభ్రాంతింబడియుండునట్లును, నే నిపుడువచ్చి నీకు భర్తనగుదును సుమీ యని బాసలుచేసి చెప్పునట్లును జేసె. నీవియోగదుఃఖంబున రేయింబవలు నేఁబొగలుచుండ నింతకుమున్ను నారదుండు నాకడకువచ్చి యిట్లని చెప్పె. నలకూబరా! నీవేల యిచట మన్మథార్తిం గుందిక కృశించుచున్నావు. నీరూపంబుధరియించి యొకండు రంభను విభ్రాంతినిముంచి యనేకభంగుల నేలుచున్నాఁడు. అని యాసంయమీంద్రుండు పలికిపోయిన నే నామాటలువిని యిచ్చటికి వచ్చినాఁడను. నీవిపుడు నీకుఁ బ్రియుండని భావించుచున్న నలకూబరు నతని పూర్వవృత్తాంతంబు చెప్పుమని కోరుము. అతఁ డెట్లు చెప్పఁగల్గునో చూచెదగాక. అనుడు, నాయింతి యతని మొగంబును జూచె. ఇట్లు చూచిన ప్రథమనలకూబరుండు రంభంజూచి—ఓశోభనాంగీ! యేమట్లు గాఁజూచుచున్నావు. నారదముని నాఁడుపల్కినమాటలు మఱచితివా. అతఁడు:—

"క. నినుబోలు వనిత నీకును । వనజముఖీ యతనిఁబోలు వాఁడతనికి నెం
దునఁగలిగి కలంచునె యి । ట్టినిగాఢపుసొంపునుదము తీవులు చనునే."

అని చెప్పియుండలేదా; అట్టి మునివాక్యములం జేసి నిన్నుఁజెందిన పాట్లన్నియు నన్నును జెందకయుండునా? నారదవాక్యము లెప్పుడైన వృథయైనవా? అయినను నీవు శంకింపకుము. నాచేతి పట్టంబున వీని గట్టబెట్టిదంబుగఁ దునిమివైచెద. ఆఖడ్గం బపుడల్ల కేళీనికుంజంబున బెట్టినాఁడను. ఇదే తీసితెచ్చెద నని నడువం జూచి తత్ప్రతిభటుఁ డిట్లనియె.

ఓయీ! నీకింత బీరంబుగలిగిన నూరక పోరుదూరంబుచేసి యిటునటు జననేల? నీవు నిరాయుధుండవంటేని నేను నిరాయుధుండ నయ్యెద. అని తనకత్తిని భూమిపయిం బెట్టి యతని కడ్డంబుగా వచ్చినిలిచె. ఇట్లు నిల్చినఁ జూచి ప్రథమనలకూబరుఁడును లెస్స యని నిలిచె. అపుడా యిరువురకు బెడిదంపు టీరసంబును, వీరరసంబును, ఘోరంబులగుచు నల్లసిల్ల మల్లయుద్ధంబు తద్దయుఁ బ్రవర్తిల్లె. అపుడా యిర్వురి యుద్దండదోర్దండచండతరాభీలస్ఫాలనంబులు కుంభినీధరగహ్వరసముద్ధతప్రతిధ్వానంబులు చేయం

కోదండగా. త్రిశతమజలధరవర్గనిర్గళితంబు లగు బలుపిడుగుల క్రోతల వడువున నిశ్శంక నిరంకుశాహంకారహుంకారగంభీరారావంబుల యార్భటులు నిర్భరసముద్భటంబులై దిక్తటుల బిక్కటిల్లుచు ద్రిక్కులింపంజొచ్చె. అప్పుడొక్కొకరి మిక్కుటంపు విక్రమంబుల కెక్కువ లెక్కగొనక యక్కజంపుఁ జేవుక్కున మిక్కిలి పేర్చి నిచ్చలపుటుగ్గలికలఁ దగ్గ మొగ్గ లేక డగ్గతి యాగ్రహంబు నెఱప నొడ్డాణింపుచు గడ్డురనీయ కడ్డంబుగా నొడ్డుకొనియెడు నెదిరిపిడికిలిపాయందట్టి బెట్టిదంపుటురువడిం దొడంబడఁగఁ దీసి కీలాకర్షణనిష్ఠురముష్టిఘాతప్రయోగనైపుణ్యంబుల దీపించుచుఁ గోపంబున నేపుఁజూపెడు నాటోపంబులఁ బోరుచుండిరి. దూరంబుననుండి మామచుండు రంభ పచ్చపుట్టంబున నొప్పువాఁడు తన భర్తగాను, చంద్రకావి దట్టి నొప్పువాఁడు తదన్యునిగాఁ బోల్చుకొనుచుండె. ఇట్లా యిర్వురు నించుకయైనఁ దీసిపోక పోరిపోరి శ్రమ యతిశయింపఁ గొంతతడవు దూరముగా నిల్చియుండిరి, ఇట్లుగా నెక్కువ తక్కువలు లేక తుల్యబలముతోఁ బోరినిల్చిన యా యిరువురంజూచి రంభ యిట్లనియె.

ఓ శూరాగ్రేసరులారా! ఊరక మీరిట్లేల పోరాడెదరు, మీ యిర్వుర నేతొల్లింటి యొకరహస్యగాథ నడిగెదను, దానిం జెప్పఁగలవాఁడే యథార్థ నలకూబరుఁడను నిశ్చయంబు నాకుఁ గలుగఁగలదు, అపుడు నేనే సత్యాసత్యంబులు మీకుం దెలిపెదుదానను, అనుడు నా మాటల కా యిర్వురు సమ్మతించిరి. అంత నయ్యింతి యా యిర్వుర దూరదూరంబుగా నిల్పి యొకఁడు వినకయుండ నొకనితోఁ దమసంఁదొల్లి కళాపూర్ణుని ప్రసంగం బెచ్చటఁ గలిగెఁ దత్ప్రకారంబు నీవేమివింటివి యని యడిగె, అట్టి సంప్రశ్నంబునకు ద్వితీయ నలకూబరుండు తగుసమాధానంబు చెప్పె, ప్రథముఁడు వెల వెలంబాఱుచుఁ జూచుచుండె. అప్పు డయ్యాతివ యతనింజూచి కటకటా! యింతదనుక నిన్ను నిక్కపుఁ బ్రియుఁడనుచు నమ్మియుండితి, నీవు కపటరూపధరుండవై తివిగదా, అని యద్భుతమును, జుగుప్సయు, భీతియుఁ, దనయాకారంబున దీపింప నతనిఁబడిచి యితరునిం బరిగ్రహించె. అపుడు ద్వితీయ నలకూబరుండు ప్రథమనలకూబరుని మోసకృత్యంబున కలిగి నీవిట్టి మాయఁ బన్నితివి గావున నల్పావశిష్టాయుష్కుఁడ వగుదువుగాక యనిశపియించె. పిమ్మట రంభ యక్కపటవర్తనుం జూచి—యోయీ నీవెవ్వండవు, ఎవ్విధంబున నిట్టిరూపంబుధరియించి నన్ను వంచించితివి? అని యడుగుటయు సత్యనలకూబరుం డిట్లనియె. ఓయింతీ, కందర్పదంతీ! వీఁడెవ్వఁడైన నేమి? ఇది కాకదంతపరీక్ష కాకపోదుగదా. నీ వియోగంబున నిన్నినాళ్లనుండి బొందుచున్న నామనస్తాపార్తిం గనుము. ఇఁక జాలంబు చాలింపుము, రమ్ము రమ్ము. అని రంభం దోడుకొని యతండుపోయె. అంత మాయానలకూబరుండు కొంతతడ వచ్చట నేయుండి దైన్యంబు ముఖంబునందోఁప మెల్ల మెల్లన మణికంధరుండు వసియించు పర్ణశాల దిక్కునబోయె.

కులభూషణసత్తీ! అట్లుగా నలకూబరుండు పోయినపిమ్మట నతఁడు మున్ను తన కేళికానికుంజంబునఁ బెట్టియుంచిన నా పట్టంబుఁ బుచ్చికొని తత్సంతోషమున నుబ్బుచు నే నచ్చోటువాసి పఱుగున నిటవచ్చి చేరితిని. ఇది యిచ్చిన నా గురుఁడు నాతోడ దీనినెవ్వరిని ప్రవేశంబూనిన వారి నవశ్యం బిది వధియింపకమానదు. అని ఆజ్ఞయిచ్చి యున్నాఁడు. ఏనిమ్మహాయుద్ధమును గలభాషిణి కంఠంబునఁ దగులునట్లుగా నెత్తితిఁ గావున నాపె యప్పుటికిఁ దప్పించుకొని పోయినమీఁదటనైన దీనివలనఁ గలభాషిణికి ముప్పుతప్పదుసుఁడీ అని యతఁడు తరువాయివృత్తాంతంబు చెప్పక నిలుపఁ గలభాషిణి యతని నీక్షించి యిట్లనియె.

సిద్ధవర్యా! సంకోచింపనేల? భవితవ్యతావశంబునఁ గానున్న యర్థంబు గాక మానదుగదా. అనుడు నమ్మాటకు మెచ్చుచు సిద్ధుండు—ఓవనితామణీ! నీవు వివేక ధురీణవు, కావుననే నీమాటలాడితిని. భవితవ్య మవశ్యముగా నగు. దుఃఖంబును దీరుననే నే దీనిం జెప్పినచో నిజమైన నిష్ఠుర మగుగదా. ఇఁక నీవృత్తాంతముం జెప్పుము. నేనట్లు. నిను బలిమినిఁబట్టఁగా మొఱవెట్టినయపుడ నిన్నుడించి నేఁబాఱితి, క్రమ్మఱవచ్చి నిన్ను గాననైతిని. అది మొదలు నీ వెచ్చోనుంటివో దానినంతయుం దెలుపు మనుడు నాపె తన వృత్తాంత మీ క్రిందివిధంబునఁ జెప్పఁదొడంగె.

పదవ ప్రకరణము.

కలభాషిణి తనకథను చెప్పుట.

అపుడు కలభాషిణి నవ్వుచు సిద్ధునితో నిట్లనియె. సిద్ధవర్యా! నావార్తనంతయు నీవ చెప్పివైచితివి. ఇఁక నేనుగూడఁ జెప్పవలయునా? బలశాలి యగు నలకూబరునివలన నీవు పట్టువడి నన్నుఁ జూపవచ్చుచో మీయిర్వుర కెదురుగావచ్చిన రంభ నేనసుమీ. నిన్ను విడిపించి నలకూబరుం దోడ్కొనిపోయి నా చిరకాంక్షిత మగు మనోభీష్టం బతనివలనఁ బడసియుండునంతలో వచ్చినదియే యథార్థరంభ. ఆ రమణినిఁ బ్రాణవిభునిఁ జేరనీయక యువ్విధి బోరాడి యంతమున శాపమునందినది నేనే సుఁడీ. అను నా మాటలు వినువారందఱు నతివిస్మయమంది, యెట్టెట్టూ కలభాషిణీ! నీవా రంభరూపమెట్లు ధరియించితివి. ఆ యనఘుని గూడుట కభిమతము నీ కెప్పటినుండి కలిగినది. ఆసందు నీవెట్లు గన్గొంటివి. దాని న్వివరించి చెప్పుమనుడుఁ గలభాషిణి యిట్లనియె.

ఓసిద్ధవర్యా! నిన్ను నలకూబరుండు తరిమెడు సమయంబున రంభ తన ప్రాణేశుతోడఁ గదలివచ్చుచుండె. అపుడాపె కొక యిత్తి యెదురాయెను. దాని కా రంభ శంకించి ముందుకు నడువక యచటనే నిలిచియుండె. అపుడే నద్దానిం జూచి యా పెరూపమును ధరి

యుంచి రంభ వచ్చినట్లుగానే వచ్చియుంటి. నలకూబరుండు నిన్నుఁ బట్టి తెచ్చుచోటికిఁ దనే రంభ వచ్చియుండలేదని యెఱుంగక యుండుటం బట్టియు నాయాకృతియు వేషభాషలును రంభ ననుకరించియే యుండుటం బట్టియు నపుడు నాచేతలన్నియు నతనికి సరిపడియుండె. అట్టి రంభ రూపమును నేను దాల్చుటకుఁ దగు నేర్పు నాకు నారదానుగ్రహంబునఁ గలిగె. ఈప్రస్తావనయంతయు మా కలహసమయములో నీకు వినంబడెగదా. అట్లు నారదుండు మా పూర్వవృత్తాంతంబుఁ జెప్పియు నా ముఖాకృతిం గనుంగొనుచు నతఁడు కరుణవహించి యిది మాయారంభ యని మాత్రము స్పష్టపరుపఁడాయెను. దానినంతయుఁ జెప్ప నేమి ఫలంబు గలదు. తుది నిట్టి ఘోరశాపంబునకుఁ గారణంబైన యీ రూపు రోసి యిదియంతయు బుజ్జగించి యవశ్యభోగ్యంబైన తచ్ఛాపఫలం బిమ్మహాదేవిసన్నిధి ననుభవించినఁ బరోపకారం బగు నని యిటవచ్చితిని. నీగురుఁడు నుడివినయట్లు గా నీ ఖడ్గ మవితథోద్యమమగుట సువ్యక్తంబయ్యె. కావున నే నిన్ను నన్నుఁగూడ దైవ మిచటికిఁ దోడ్తెచ్చె. ఇపుడు నీయిష్టము నందవచ్చును. అది యటుండ నిమ్ము. నేను పడిన శ్రమ యంతయు నూరక పోకయుండునట్లుగా నాప్రియుని భజియించుట కల్గె నని సంతసించి యుంటి. దానికిఁగూడ నొక లోపము కల్గినట్లుగా నీ చెప్పిన మాటలవలనఁ దేలుచున్నది. సత్యనలకూబరుఁడు వచ్చి తుదకు నేభ్రమించిన నలకూబరునిఁ గూడ శపియించెనని చెప్పితివి. అకటాత్ముఁ డెవ్వఁడగునోగదా యని శంకించుచుంటి. అను కలభాషిణి వాక్యములు విని మణికంధరుం డిట్లనియె.

ఓ తరుణీమణీ? యతఁ డెవ్వండో యని యెంచి నిరసించి మఱి యేమైన ననఁ గలవు. అట్లనఁబోకుము. ఆతఁడు నేనే. నా వృత్తాంతమంతయుఁ జెప్పెద. సావధానచిత్తులరై మీ ఱుందఱు నాకర్ణింపుడు. అని మణికంధరుండు తనవృత్తాంతంబు చెప్పం దొడంగె.

మణికంధరుని వృత్తాంతము.

అని యిట్లుగా మణికంధరుఁడు పల్కినపల్కుల కాశ్చర్యంబునందుచుఁ గలభాషిణి—మణికంధరా! నీ విట్లుపలుక మఱియు వింత యగుచున్నది. నలకూబరుని రూపుఁ దాల్ప నీ కెట్లుగా నవయ్యె. అనుడు, మణికంధరుండు—కలభాషిణీ! రంభ నా తపోవిఘ్నంబుఁ జేసిన యనంతరముపోయి నలకూబరుం జేరెననిక దా దాని సఖీజను లెదురై నీ కెఱిఁగించినట్లు చెప్పితివి. అచ్చో నొక కిటుకు గలదు. దానిం దెల్పెద నాకర్ణింపుము. రంభ నా తపోవిఘ్నంబు చేయఁ జనుదెంచెంగాని దాని చిత్తము నలకూబరాసక్తమవు టంజేసి నేను దానిని వదలినట్లుగా నటియించితి. అనంతరము నాతపంబు కొంత ధారవోసి నేను నలకూబరరూపమును ధరియించి దాని మఱలం గలిసికొని దాని మనస్సును రంజిలంజేసి నామనోభీష్టమును బూర్ణముగాఁ బడసితిని. అత్తెఱంగున నే నద్దివ్యాంగనతో యథేష్టంబుగ నుండుటంజేసి తత్ప్రీతిరూపంబు నందిన నీతోఁగూడఁ గ్రీడించుట కలిగె.

కాని నా మాయారూపంబునకు సద్యఃఫలంబుగా నిట్టి శాపంబు దెచ్చికొంటి. అంతటఁ గొంతబుద్ధిమంతుండనై యెప్పటి నాపన్నకాలకుం జని మాయనెల్ల జాలించి నావీణెయు రత్నమాలికయుఁ బుచ్చికొని యీస్థలమహిమంబుల నావఱకే నే నెఱింగినవాఁడనవుటం జేసి యిందేమి విశేషములు లభియింపఁగలవో యని యిచ్చటికి వచ్చిచేరితిని. అని యిట్లుగాఁ జెప్పి నవ్వుచు, ఓ సుందరాంగీ! రంభ పొందు విడువంజాలక ఘనప్రయత్నముం జేసి రంభ సంప్రాప్తమాయె నని కులుకఁగా నారంభ నీవేయైతివి. నలకూబరుం గూర్చి యతి ప్రయత్నముం జేసి యాతనిం గూడితి నని నీవు మురియఁగా నానలకూబరుఁడు నేనే యైతిని. ఎట్లైనను గొనసు నాకోర్కె కు నీవ చిక్కితివి. నేను మునిశాపభయంబున నెందు నెవ్వరికిం దెలియక యుండునట్లు చేసి ధైర్యంబున మనస్సు ద్రిప్పుకొంటిని. మన గానకళాభ్యాసకాలంబు నాటనుండియు నాతలంపు నీపైనేయుండెసుమీ. భాగ్యవిశేషంబున నేటి కీక్షణంబున ఫలప్రాప్తి యయ్యెను. అనుడుఁ గలభాషిణి యిట్లనియె.

ఆహాహా! ఏమి యీ చిత్రము, కుటిలాత్ముఁ డెవ్వఁడో నన్నిట్లు వంచించి కూడెనో యను విచారముతో నుంటిని. ఇపు డావంతయంతయుఁ బాసె. పైగా నాజన్మము కృతార్థతనందెనని చెప్పఁదగినట్లుకూడ జరిగె. నీ పొందును నాకభిమతమే. నీ తలంపు నే నెఱుంగక యుండుటంజేసి నీయెడఁగల నా హృదయకాంక్షను నీకేఁ దగ నను నిశ్చయమునఁ ద్రిప్పుకొనుచుండెదు. ఆ యాత్మేశతనయుం డని నిన్నే నేఁ బొందఁగంటి. నాభాగ్య మేమని చెప్పవచ్చును. పడఁబోయి పూపాన్పుఁపైఁ బడినయట్లే యయ్యెను. ఇట్టి మాటల నిపు డే ననుట యుచితంబు గాదు. వారకామినుల పలుకు లిచ్చకంబులే యనక వాని యథార్థములుగా నెవరు నమ్మెదరు. అని లజ్జాశోకంబులడర నవనతముఖియైయుండె. అట్టిచోఁ గలభాషిణి నుద్దేశించి మణికంధరుం డిట్లనియె.

ఓ, విలాసినీ! నిన్నితర వారాంగనలట్లసత్యవాదినిగాఁ దలంప నేనంత వింతవాఁడనా? నీవు పల్కిన యట్లే నీకు నాయందుఁ దెలుపు గుఱుతొక్కటి కలదు. అది యెద్దియంటేని చెప్పెదవినుము. మున్ను నారదమునీంద్రుండు కడపట నిన్నింటికి ననుపుచో నేను వినఁగా నాసంయమీంద్రుం డేమనిపలికెనో జ్ఞాపకములేదా. దానిని మరల వినిపించెద వినుము.

తే. కొమ్మ నీ వాత్మలో మనుగోరినట్లు । కాంతు రంభామనోహరాకారుఁడగుచు
మెఱయువానిని గూడి రమింపఁగలవు । నమ్ము పొమ్మిఁక నీ భవనమ్మునకును.

అని యిట్లుగాఁ బల్కిన నారదమునిశ్రేష్ఠుం డెట్టిసత్యభాషణుఁడో యోజింపుము. నీవు నలకూబరుం గూడెదనని దీవింపక అట్లుగాఁ బల్కినపల్కులు ఫలసిద్ధి నందఁగా నీవు నన్ను కోరియున్నట్లు పల్కిన పల్కు లనృతము లగునా? రంభాసాన్నిధ్యశోభితాభినవ విలాసభాసురుండైన నలకూబరునిరూపున హత్తిన నీ చిత్తంబునకుఁ దదన్యుం డెట్టిది

రైన మతే యింపుగానుండుటయుఁ జిత్రంబు గాదు. పురుషులందు నొక్కొక్కవేళల గుణంబున నిట్టివి గలవు. తత్ప్రీకారకంబైనది యొక్కకథగలదు. అది పాపనాశకంబునై యొప్పుచుండు. కావున దానిఁ దాత్పర్యంబున నాకర్ణింపుము. ముందు దానినే తెలుఁగున నెట్లుకర్గిసూ చెప్పవలసియున్నది. అని యీ క్రింది వృత్తాంతంబు నుడువం దొడఁగె.

శారదాపీఠంబునకు మణికంధరుండు పోనుద్దేశించుట.

కలభాషిణీ! తొల్లి నే ననంతదేవప్రశోద్యాపనముకొఱకు ననంతపద్మనాభస్వామి సన్నిధికి వచ్చియుంటి. అచ్చట నాదేవుని కవితచే వివిధభంగుల నుతిచేయు సత్కవులం జూచి అట్టి సౌభాగ్యము నా కేగతి సంభవించు నని యూహించి యచ్చటివారివలన నీమృగేంద్రవాహనామహాశక్తిమహిమలు విని యచటి కీదేవస్థానము సమీపమే కావున నేనిచ్చటికి వచ్చితి. వచ్చి శిలాక్షరోక్త సాహసకృత్యముంజేసి నాయభీష్టము నంది తిరిగి యనంతశయనముం జేరితి. అపు డద్దేవుని యగ్రమంటపమున గౌతమ కణాదమతములును, భేదవాదసిద్ధాంతమును, జైమినీయమతము, పాతంజలశాస్త్రము, కాపిలశాస్త్రమును పఠియించువారల వాక్యోపవాక్యముల బహుశ్రద్ధతో నాలకించితిని. అవి మనంబునకు సంతసంబు గల్పింపకుండుటంబట్టి యచ్చోటువాసి పాంచరాత్రాగమవేత్త లుండుస్థలంబు నకుఁబోతిని. అచ్చో:—

సీ. శ్రీమహితాష్టాక్షరీమంత్రజపపరాయణుల నారాయణ ధ్యానపరుల
దేవతాంతరచింతనావిదూరులఁ గామరోషవిరహితుల రూఢమతులఁ
జీవచిదీశ్వరతత్త్వవిదులఁ ద్రైలోక్యపావనచరిత్రుల బుధవంద్యపదుల
నకలంకశీలుర నఖిల శ్రుతిస్మృతి శాస్త్రపురాణ విజ్ఞానఘనులఁ
తే. దమకుఁ జక్రికి నిత్యసిద్ధంబులైన। శేష శేషిత్వములు చింతచేసికొనుచు
నతని దాస్యంబుగతిగాఁగ నరయుపగాను। వైష్ణవులఁగంటి సభయై ప్రవర్తిలంగ.

అట్లుగా వారిం గాంచి వారల కనేక దండప్రణామంబులఁ గావించి వారలడుగ నా పేరును గంధర్వత్వంబును వినిపించి నాకుఁగల హరిస్తవేచ్ఛం దెల్పితిని. అపుడు వారు నాకు నీక్రిందియంశములం దెల్పిరి. ఎట్లన్నను:—

సీ. ప్రకృతిపూరుషులందు బహిరంతరముల నెప్పుడుఁ జలింపక పరిపూర్ణుఁ డగుచుఁ
దనకు వాదియును మధ్యంబు నంతము సమానుఁడు నధికుండు నెందును గలుగక
సర్వజ్ఞుఁడై సర్వశక్తియై సర్వనియంతయై సర్వాత్ముఁడై వెలయుచు
సర్వంబుఁ దనకు శేషముగ సర్వమునకు శేషి తానగుచు లక్ష్మియును దాను
తే. రుచియురవియుఁ జంద్రికయుఁ జంద్రుఁడును వోలె నవ్యుత సిద్ధత్వ మొప్పంగ నాదిమిథున
మనఁగ సకలవేదాంతవేద్యతఁ దనర్చు। పరమపదనాథుఁ బొగడు నీ ప్రౌఢికొలఁది.

అని యిట్లు నా కాజ్ఞ యొసంగి వారు నాచేఁ బరమపదనాథుని సంవాదకథలు పేర్కొని యిట్లనిరి. మణికంధరకవీ! నీకిప్పుడే గాకున్న నింకొక జన్మమునందైన నాపరమపురుషుని భక్తి లభియింపఁగలదని యేకగ్రీవముగాఁ బలికిరి. అపు డచ్చోటు బాసి నేను నాకవిత్వధార శారదాపీఠమునందలి పండితుల వినుతికెక్కునందాక మిక్కిలి మెచ్చుకొనరాదని యూహించి యచ్చటికి బైలుదేరిపోయితిని.

శారదాపీఠ వృత్తాంతము.

అని చెప్పి మరల మణికంధరుఁడు కలభాషిణితో నిట్లనియె. ఓ సీమంతినీ! ఇంతవఱకు నేఁ జెప్పినకథ యవాంతరగాథ. ఇఁక ముందు చెప్పఁబోవునది ప్రధానకథ. దానిని బహుశ్రద్ధతో నాలింపుము. అట్లుగా నే ననంతశయను సన్నిధానంబువిడిచి కాశ్మీరదేశమందున్న శారదాపీఠంబుకడకుఁ బోయి తత్సన్నిధి పరికింపఁగా.—

సీ. ఋగ్వేదఘోషసమృద్ధి యెంపొకచోట నొకచోట యాజుషాభ్యుదయమహిమ
సామగానధ్యాన చాతుర్య మొకచోట నొకచోట నాథర్వణోక్తిగరిమ
గృహ్యసూత్రనిపాఠ ఖేలనం బొకచోట నొకచోట శబ్దతంత్రోపచయము
జ్యౌతిషసిద్ధాంత సంఘర్ష మొకచోట నొకచోట ధర్మశాస్త్రకలనంబు.
తే. లుభయమీమాంసల ప్రసంగ మొక్కచోట। నొక్కచోటను బటుతర్కయుక్తికథలు
యోగసద్గోష్ఠి యొకచోట నొక్కచోటఁ। గావ్యకలకల మొప్పారఁ గానఁబడియె.

ఇట్లుండ నచ్చటివిశేషంబులన్నియుఁ బరికించుచు నొక్కచోట నుజ్జ్వలబ్రహ్మవర్చసముతో బ్రహ్మచారులకు వేదముం జెప్పుచున్నట్టి యొకయొజ్జం గంటిని. ఇట్లతనిం గాంచి నే నతనిసమీపంబునకుఁ బోఁగని యతఁడు నన్ను రమ్మని పిలిచి తన సమీపంబున నన్నుఁ గూర్చుండఁబెట్టుకొని నాకులనామంబు లడిగి తెలిసికొనియె. ఇట్లుగాఁ దెలిసికొని బాలురం జూచి పూజ్యులువచ్చియున్నారు. కావున మీకు నేఁడుపూజ్యానాధ్యాయము. మీ చదువు చాలింపుడు. అని వారితోఁ బల్కి నాకు విహితోపచారంబులు సలుపుచుండె. ఇట్లుండ బ్రహ్మతేజఃపుంజముగా నుండు నొకబ్రహ్మచారి పుస్తక మొకదానింగొని యతిసంభ్రమంబున వచ్చి యొజ్జకుఁ గానిపించె. గురుం డపుడు వానింజూచి—చోరీ! యేమిరా యింతయాలస్యము చేసివచ్చితివి, అని సంప్రశ్నించె. అపు డావటువు గురునిం జూచి—స్వామీ! నేనాలసించుటకు నిమిత్తంబు చాలఁగలదు. మీకేమియు వినలేదు కాఁబోలు. అటులైన వినిపించెద వినుండు అనియిట్లు చెప్పందొడంగె. అట్లుగా నన్ను మీరుపంప నేను శాలీనునికడకుఁ బోయియుంటి. అపు డతఁడు తనపూఁదోఁటలో నొక్కలతాగృహంబునందుఁ దన పాదంబులు సుగాత్రి పిసుకతోడఁ దొడలమీఁద నిడుకొని యొత్తుచుండ నిష్టసల్లాపంబుల నలరుచుండె. ఇట్లుండి నన్నుఁ జూచి నగుచు శాలీనుం డిట్లనియె. ఈ పా

ధ్యాయులు పుస్తకంబుఁ గనుఁగొంచిరే. అదియిక్కడనే యుదే దాచినాఁడ. అని తనయుపరి భాగశాఖఁ జూపి కొంచుఁబోదువుగాని యటకూర్చుండుము. అని యెదుటనున్న యొక్క విహారవేదికతోడి లేమావినీడఁ జూపె. నేను నచ్చే కూర్చుండియుంటి. అంతట శాలీనుఁడు తనవనితమూఁపునఁ జేయిడి యాయమతో నిట్లనియె:—

క. అమృతము సేవించితివో । మణి యేమైన సిద్ధరసమబ్బెనొకో
కొమరుంబ్రాయము మిక్కిలి । గొమరారెడిను దినము గ్రొత్తగ్రొత్తఁగ నెలమిన్. అని.

క. మగవానికంటె మునుపుగ । మగువ కెడలుఁ బ్రాయమంద్రు మానవతీ నీ
జిగిబిగువు లంతకంతకు । మిగులఁగఁ బొలుపొందుటకు నిమిత్తము చెప్పుమా.

అనిపల్కుటయుఁ జిఱునవ్వుతో నాయింతి యతనితో నిట్లనియె. ప్రాణనాథా! దీనికిఁ గారణము నేనేమియు నెఱుంగను. అనుడు నట్లైన నేనే చెప్పెదను వినుమని శాలీనుండు సుగాత్రిం దన్నైనెయ్యగఁ గౌఁగిలించి చెవిలో నేమేమియో చెప్పె. అట్లుగాఁ జెప్పిన నాథుని మొగముఁ జూచి యచ్చెరువుతో నేనొకటి వేఁడిన సమ్మతించెను. అట్టి జగదంబ తన పలుకేమి చేయునో యిఁక దాఁపనేల యామాట చెప్పెదను వినుండు; అని యతని చెవిలో నెద్దియో చెప్పె. అపుడు శాలీనుండు దటాలున డిగ్గనలేచి పఱుగిడఁదొడంగె. సుగాత్రియు నతని వెంటనంటి సంభ్రమంబునఁ బోయె.

అంత శాలీనుండు తత్సమీపంబున నుండు శతతాళదఘ్నమను పేరఁ బ్రసిద్ధంబైన హ్రదంబున దా నుఱికె. అపుడు సుగాత్రి — నాథా! నీపాదములే నాకు గతియనియున్న నన్ను నీవు వదలిన నిన్ను సేవింతు నా యని యతివేగంబునఁబోయి భర్త యుఱికినచో టుననే తాను నుఱికె. ఆస్థల మచటికి మిక్కిలి దూరముగ నుండెనేని యాధ్వని మీకు వినబడియుండలేదేమో కాని ఆ ధ్వని వినిన చుట్టుప్రక్కల ప్రజలందఱు నచటికి నతిత్వరితగతిని వచ్చి వలలతో నాయిరువురను వెదకించిరి. కాని వారెంత గాలించిన నది నిష్ఫలమే యయ్యె. అపుడు వారందఱు మగుడి తమతమ నిలయంబులకుం బోయిరి. నేను దిరిగి శాలీనుండు మొదట పండియున్న స్థలంబునకు వచ్చి యతఁడు మున్ను చూపిన చోటనుండు పుస్తకంబును పుచ్చుకొని యిచ్చటికి వచ్చి చేరితిని. ఇదియే నా యాలస్యకారణము. అని వటువు చెప్పిన మాటలు విని యాయొజ్జ శోక విస్మయ విషాదముల మునుఁగుచు నిట్లు విచారించె. హా! యితరులవలె నా శుద్ధదంపతులకుఁ గూడ దుర్మరణమే తటస్థించెఁగదా. వారుపడిన హ్రదము సార్థకనామ మగు శతతాళదఘ్నము. అందుఁ బడినవారికి మరలఁ బ్రతుకు చిక్కదిది. ఎంతవారికైనఁ బురాకృతము తప్పదుగదా. అని యా బ్రాహ్మణుండు కుందుచుండ నేనతనిం జూచి యిట్లంటిని.

ఓ యనఘాత్మా! ఆశాలీన సుగాత్రు లను దంపతు లెవ్వరు? వారు మిక్కిలి యుత్తము లని నీవు చెప్పుచున్నాఁడవు. వారి వృత్తాంతము విన గోరిక పొడముచున్నది;

దయతో వినుపింపుమనుడు నావిప్రుం డిట్లనియె. గంధర్వోత్తమా! యిపుడు మా శిష్యుండు తెచ్చిన పుస్తక మాయనఘులచారిత్రమే. ఇక మే మాపుస్తకము వినియే సంతసింప వలయుఁ గాని యా పుణ్యుల దర్శనోత్సవము నోచుకొననైతిమి. అని బ్రహ్మచారి తెచ్చిన పుస్తక మందుకొని తన శిరంబున మోపుకొని కన్నులకద్దుకొని తిరుగ నావటుని చేతికిచ్చి దానిం జదువుమని యాజ్ఞయొసంగె.

ఎనిమిదవ ప్రకరణము.

సుగాత్రీశాలీనుల వృత్తాంతము.

కశ్మీర దేశమునకు గణ్యకగా నున్న కాశ్మీరపురమున శారదాదేవిపీఠము గలదు ఆశారదను పూజించు పూజారిబ్రాహ్మణునకు సుగాత్రి యను నొక పుత్త్రిక గలదు. ఆబ్రాహ్మణునకుఁ బుత్త్రసంతానము లేకయుండుటంబట్టి సుగాత్రిని శాలీనుఁడను నొక బ్రాహ్మణ చిన్నవానికిచ్చి వివాహముచేసి యతని నిల్లటపుట్టునిగాఁ దెచ్చి యింటనుంచుకొనియె. ఆ శాలీనుఁడు తనకు గల్గు దాసీసమూహమునఁ దనభార్య నలంకరించిన విభూషణములకుఁ దలకి యానెపమున రాత్రిముట్టక యుండెడి. సుగాత్రియు గదివిడిచి వెలుపలికివచ్చె. అటుల నేపాటికొన్ని దినంబులు జరిగె. అపుడు సుగాత్రి చెలులామెకుఁ గొన్ని బుద్ధులు గఱపి పతిమనసు గరఁగింప నుత్సహించిరి. అట్టివారియిష్టానుసారంబుగ సుగాత్రి చమత్కార కార్యంబులు పెక్కులొనర్చెను. అయిన నవి కార్యకారులు గావయ్యె. అపుడు సుగాత్రి తానే యుపాయమునను భర్త కోపింపని యుచ్చటికైనఁ బోవఁగలుగు. తన మంగళసూత్రంబాపాటి శుభస్థితినుండుటకు పరివేలు. అనుచు నెంచికొని వేయొక్కులాగునను డక యతనికి నాయువృద్ధికరంబులగు వివిధాలంకారంబుల నొప్పారు నేమముగ నొల్లుచుఁ దనతల్లి యతని నేమియు నిట్టట్టాడకుండఁ బ్రార్థింపుచుండె. తల్లియుఁ గూఁతు ప్రార్థనావశంబునఁ బెక్కుదివసంబు లెడనెడఁ గూఁతుచేత నివారితదురాలాపయగుచు నోర్చి గొణుర్చి యొకనాఁ డిట్లనియె.

కూఁతురా! యిట్టి నిర్గుణు నెందును గానము. ఏమనఁబోయినను నీవు తిట్టుదువు. నీకొక మంచిపిల్లఁగలిగిన నాసంపద కాధారమగునను నాసతో నుంటిని. ఇతని రీతి చూచిన నది వట్టి గొడ్డుతాకట్టువలెనున్నది ఇతనిని వెళ్లగొట్టిన నీవు దుఃఖించెదవు, ఇతఁడు పూవుఁదోటకుఁ బోయిన నప్పటి వ్యవహారమైన విచారించుమండు. కావున నితని నచ్చోటికిఁ బంపెదనని యల్లుం బిలిచి నేర్పుతో నత్త యచ్చటిపనులు పరికించుచుండుమని నియమించె. అట్టిమాటలు విని శాలీనుం డాపని పరదేవత యగు శారదాదేవి కుపచ

రించునది కావున దానింజేయుట కతిసంతోషముతో నంగీకరించె. ఇట్లంగీకరించి శాలీనుఁడు పూఁదోఁట పెంచుచుండె. ఇట్లు చేయుచుండి:—

సీ. నీరెత్తువేళల నీరెత్తుఁ బాదుపాదునకుఁ గాలువలు పొందుగ సమర్చి
త్రవ్వటంబులతతిఁ ద్రవ్వటంబులు వెట్టుఁ దగినట్టి కట్టు గుద్దలి గడించి
యెరువుఁజల్లెడువేళ నెరువుజల్లుఁ గతాభిమానుఁడై గంపలఁ దానె తెచ్చి
యంట్లొత్తుపదనున నంట్లొత్తు నెలమిఁ గాన్పించు లేఁగొమ్మలు వంచివంచి
తే. నారుపోయంగవలయుచో నారుపోయుఁ గొమ్మినాటంగదగు నెడఁగొమ్మినాటు
నొకటివిసువక యంతకంతకును హెచ్చు వాలితోడను శాలీనుఁ డవిరతంబు.

ఇట్లనేకవిధంబులఁ జేసి శాలీనుండు పువ్వుఁదోఁట నతిమనోహరమగునట్లుగాఁ జేసె. అతఁడు నిత్యము బ్రాహ్మముహూర్తంబున లేచి స్వజాతి విహితధర్మంబుల నడపి గురుపదం పరాస్తోత్రముం జేసి తమ కృజపంబు గావించి నియమముతోఁ బుష్పంబులుఁగోసి నేర్పుతో వింతవింతలగు పుష్పమాలికలను గందుకంబుల రచియించి శారదామహాదేవికి సమర్పించుచుండు. అప్పుడు సుగాత్రి పాతివ్రత్యధర్మనిష్ఠకతంబునఁ దన భర్త పూఁదోఁటపనులు చేయుట చూడలేక, యతనికిఁ దోడ్పడ నూహించుచుండియు లజ్జకతంబున వెనుక తీసె. ఇట్లుండ నొకనాఁడు శాలీనుఁడు తోఁటకు జనియుండె. అంతట నుఱుములు మెఱుపులతోఁ బిడుగులుపడుచు బెడిద మగు ధారలుగల యొకవర్షము గురిసె. అది క్రమక్రమంబుగ నతిశయించుచు భూనభోంతరాళంబులు చీఁకటులు గొనియె. లోకమంతయు జలార్ణవంబు వడువున నొప్పె. ఇట సుగాత్రి తన భర్త యా వర్షములోఁ దడిసి శ్రమపడుచుండు నోగదా యని వగచి తన యిలువేల్పగు శారదాదేవి నుద్దేశించి యిట్లనియె.

ఓ శారదామహాదేవి, యో పరమదయాశాలిని, యో మదంబా, నాకు నీవే శరణంబవు నా ప్రాణేశు నెట్లైన దయఁజూచి రక్షింపుము. అని ప్రార్థించి తా నీజన్మంబునఁ బూర్వజన్మంబుల వ్రతధ్యానదానాదుల నార్జించిన పుణ్యబలంబునఁ బ్రస్తుతవర్షపీడ తన భర్తం బొరయకయుండునట్లు చేయును గాత. అని తనతపం బంతయు ధారవోసి సుగాత్రి తనహృదయంబునఁ గులదైవతంబగు సరస్వతిం బ్రార్థించుచు నంతట నిలువంజాలక, తద్వర్షఘోరతయుఁ గైకొనక యత్యంతసాహసంబునఁ దల్లియు నెఱుంగకుండ నిల్లువెడలి తనదు పాతివ్రత్యధర్మంబుచే వృష్టిబాధఁ బొరయక తొలంగుచుండం బోలుపవెల్లియైన జలపూరంబు పాయయిచ్చుచు దెరవు విడువఁ బ్రాణవల్లభుం డున్న వనంబునకరిగి కడనయుండి పరికించి యప్పటి యవ్వాతవర్షోపద్రవంబులేక యెప్పటియట్ల శుభవర్తనంబున నున్న తనభర్తను దదారామంబునుం జూచి సరస్వతికిఁ గల భక్తవాత్సల్యంబుఁ గొనియాడుచుఁ గ్రమ్మఱి తనగృహంబునకు వచ్చిచేరె.

ఇట్లుగా నింటికివచ్చి లజ్జవెంపున సుగాత్రి తనరాకపోక లొరులకుఁ దెలియకయుండునట్లుగాఁ జేసి, లజ్జాభరంబునఁ గొన్ని నాళ్లుండి యొకనాఁడు తనమనంబునఁ బతి

భక్తి సంపూర్ణంబుగాఁగ సుగాత్రి లజ్జనువదలి తల్లిమాట నెంతమాత్రమును గైకొనక యెప్పటియట్లుగా నలంకృతయై తన ప్రియుఁ డున్న వనంబునకుం బోయి తనభర్త చేయుచున్న పనులలోఁ దోడ్పడు తలంపునఁ దన యొంటియాభరణములన్నియు నూడ్చి యొకచో నునిచి పైటకొంగు నడుమునఁ బిగియించుకొని భర్తతోఁ గూడఁ బనులు చేయుచుండె. అపుడు శాలీనుం డలసియున్న తద్భార్యసొబ గెంతయుఁ బ్రేమ నీక్షించి కుసుమసాయకశరవిద్ధుండై యో వెఱ్ఱిదానా! నీవెక్కడ? తోఁటపనులెక్కడ? వలదనిన వినవైతివి. అనుచుఁ దనయుత్తరీయంపుఁ జెఱఁగున నామె చెమటలఁ దుడిచి కౌఁగిలించుకొని యామె చిరకాలవాంఛితముఁ దీర్చి సంతసిలం జేసె.

ఇవ్విధంబునఁ బతి సమాగమంబుఁ బడసి సుగాత్రి గృహంబునకుం జనుచోఁ దన భర్త నా సుగాత్రి గృహంబునకుం రమ్మని ప్రార్థించె. శాలీనుండు నట్లనే గృహంబునకుం జనియె. అపుడు సుగాత్రిసఖులు సుగాత్రికిఁ దొంటికంటెను మనోహరమగు నలంకారం బొనర్చి యామె భర్తకడకు మఱలఁ బంపించిరి. శాలీనుండు తొంటియట్లే సుగాత్రి మేనునందు విలేపనపరాగాభరణాదులను తెప్పలుగనిచ్చి చూడలేక యెప్పటియట్లుగా నుండి యా సుగాత్రి కడనె సుగాత్రియు దనవలన నేమి యొప్పమి తటస్థించెనో యని విచారించుచుండె. అంతట మఱునాఁడు శాలీనుండు పుష్పవనంబునకుం జని యథావిధిని కార్యంబులు నడపుచుండె. సుగాత్రియు మఱలఁ బూఁదోఁటకువచ్చి తన యాభరణంబు లూడ్చి యెప్పటియట్ల భర్తచేయుపనులఁ దోడ్పడుచుండ్య; శాలీనుండును యథాప్రకారం మఱవసి యున్న తన వనితను బుజ్జగించి యామెమనోరథంబు నీడేర్చె. ఇట్లుగా నాతోఁటలోపలనే తన యిష్టసఖులం బంపుచు సుగాత్రి తనభర్తను గొన్నిదినంబులు సేవించియుండె. అట్టి వృత్తాంతము నెఱింగి సుగాత్రితల్లి యొకనాఁడు కూఁతుతో నిట్లనియె.

అమ్మా! నీవు సరస్వతీదేవివరంబున జనియించినదానవు, నీవలన నా వంశమంతయుఁ బవిత్రము గాఁగలదని బ్రహ్మపట్టపురాణి నాస్వప్నంబునఁ జెప్పియుండె. నీచరిత్రము మా వినవట్లే కాన్పించుచున్నది. నా పెనిమిటి దేశాంతరగతుండైనను నీగర్భవాసము ఫలించి నాముప్పునక[illegible]నని నీపుత్త్రజననంబున కెదురుచూచుచు నుందును. అట్టి యాస నిష్ఫలమైపోవునేమో యని శంకించి నీభర్త నిన్నుఁ జేపట్టకయుండుటం బట్టి యూహించుచుందు. అట్లున్న నీవు నీభర్తయెడ భక్తివదలక భర్తక్షేమమే యరయుచు నతఁడే దైవంబుగ భావించి యతఁడు హర్షింప హర్షింతువు, దుఃఖింప దుఃఖింతువు, అతఁడు మెచ్చిన గర్వింపవు, రేయింబగలిట్లుగా నీవు పతిభక్తిని దృఢసేవాతాత్పర్యంబున నుండుటం జేసి కాదె భారతీదేవి నీ పాతివ్రత్యంబునకు మెచ్చి నీతోడ దయతో సంభాషించుచుండును. అయినను నీభర్త చేయు నకాలరతిక్రియావలన నీకు సద్గుణసంఘాతములుగల పుత్త్రుండు పుట్టఁడేమొకదా యని మాత్ర మొకవిచారంబు కల్గుచున్నయది. తొల్లి నిన్ను నొల్లకుం

డుటంజేసి కోపంబున నతనిం బూఁదోఁట పనులలో నియమించితిని. ఆపనులఁ జేయుటకుఁ బనివాండ్రే యున్నారు. కావున నీభర్తగాని నీవుగాని పూఁదోఁటకుఁ బోవలదు. నీవు వయస్సునం బిన్నవైయున్నను వివేకములోఁ బెద్దవు కావున నీకుఁ దెలియని విధినిషేధములు లేవు, ఆలోచించుకొనుము. అని పలుకగా మొలకనగవు మొగంబున నిగుడ్పొత్త సుగాత్రి తల్లితో నిట్లనియె.

తల్లీ! వయసునకుఁ బ్రియమగునదియే సువర్తనము గాఁగ నతని కప్రియమగునది యాసచ్చరిత్రముగా నెన్నుట నాకు నైసర్గికము. కావున నావర్తనము నేను మానంజాలను. నాకీశ్వరుఁడును, వేదమును, గురుఁడును భర్తయే కావునఁ దదాజ్ఞ నేనే గైకొందుఁగాని విధినిషేధములతో నాకుఁ బ్రసక్తిలేదు. పెనిమిటి యంగీకరింపని పని నిషిద్ధమని విడుచుటగాని విధియని యాచరించుటగాని లేదు, ఇది నావ్రతము. అనియిట్లుగా సుగాత్రి పలుకు నవసరంబున నాపె పతివ్రతామహిమ కెంతయుమెచ్చి, పద్మజారాణి వాత్సల్యంబున నాపెకుఁ బ్రత్యక్షురాలై తజ్జనని నుద్దేశించి యిట్లనియె.

ఓసుగాత్రిజననీ! యీసాధ్వివర్తన కిట్టట్టుగా నీవు దిద్దఁ జూడకుము. ఈ బాలిక తనపతిభక్తిచేతఁ దనపాపమెగాక వీరియుభయవంశములవారి పాపోత్కరముల నిర్ధూతముగఁ జేసె. ఇఁక పైఁబోఁట నీసతి కథ నాకతిప్రీతికరంబును బవిత్రమునై తనంతన వెలయఁగలదు. అని యుడుపతిగదా సరస్వతి యిచ్చిన యాజ్ఞ, అనిచదివి వటువు పుస్తకముం జాలించె. అంత నతనిగురుండు నన్నుం జూచి—మణికంధరా! యిదియుసుమీ యీపుణ్యదంపతుల చరిత్రము. అని చెప్పి మరల నిట్లనియె ఆసుగాత్రి శాలీనులయందు నరవిందభవునికాంత కెంతదయగలదో యెఱుంగుము, నాను నద్దేవి కలలోనవచ్చి యీ పుస్తకంబు నిత్యంబును బ్రాతఃకాలంబునఁ జదువుకొనుమని యిచ్చె. మఱియు నీవీటం జదువ వ్రాయ నేర్చిన వారికెల్ల నారాత్రియందె యట్లు యిచ్చినది, యందఱు నది యొండొరులతోడఁ జెప్పుకొని వెఱగుపడిరి; నిన్న నేనాపుణ్యదంపతుల సందర్శనంబుకొఱకుఁ తత్కుసుమోద్యానంబున వారలచేతం బ్రత్యుద్గానాసనార్ఘ్యపాద్యాదివిధుల నుపచరితుఁడనగుచు నచ్చట నీ పుస్తకంబు మఱచివచ్చితిని. నేఁడు రేపకడఁ జదువంబోయి తెలంచుకొని యది తెచ్చుటకుఁ బంపిన నిట్టి ఘోరంపువార్త వినవచ్చెను. అని యాయత్యుత్తముల బ్రహ్మపాతంబునకు బెక్కులాగుల వగచె. నేను నాయధ్యాపకుని వీడుకొని యప్పటికి నప్పురంబు తత్పరిసరంబులంబగుట యరసి నాకీవిద్య యొరసిచూచుట కది సమయంబుగాదని నాగలోకంబునకరిగి యందుఁ గొంతకాలంబునకు సంగీతవిద్య సవిశేషంబుగా నభ్యసించి వేడ్కపుట్టి నారదమహామునిం గొలిచి తిరుగం దొడఁగొంటిని. అని చెప్పి మణికంధరుండు కలభాషిణితో నిట్లనియె.

ఓ నీలాలకా! శాలీనుని చిత్తంబు జానపదత్వముగ్ధదోషంబునం జేసి మున్నత్యంతాపూర్వవస్త్రభూషణాద్యాడంబరంబునం దలంకి, తదలంకృతపత్నీరూపంబునకు నెఱయఁ

గొలుపకుండుటయు, వెనుకఁ దోఁటపనుల నాకులితంబైన యత్తన్వివిచ్ఛిత్తివిలసితాకారంబునవార్త్తి యుతిరంబు నెఱుంగమి భవదీయవృత్తంబునకు దృష్టాంతంబైయున్నది. అనిపలికి సుముఖాసత్తిం గనుంగొని యాగంధర్వుం డిట్లనియె.

ఓ పర్వేందుముఖీ! నీ కులస్థానవార్తల నాలోచించి చూడఁగా సుగాత్రి ప్రసిద్ధచారిత్రంబు నీ వెఱుంగకుండుట తటస్థింపదే. నీవేల దాని నెఱుంగవు. అనుడు, సుముఖాసత్తి నవ్వుచు నేనా వృత్తాంతం బెఱుంగకయేమి, నే నెఱుంగుదు. దాఁచనేల, ఆ సుగాత్రిని నేనేసుమీ, అనుడు నాయింతివాక్యంబులకు వాఁడు అత్యంతచోద్యమునంది, ఓలలనామణీ! నీవా సుగాత్రివే యైన నీవు హ్రదంబునఁగూలి యెట్లు బ్రదికితివి. ఈమాఱుపేరు నీకెట్లు ప్రాప్తమాయె, దాని నెఱుంగింపు మనుడు నాపె తనవృత్త మిట్లు చెప్పం దొడంగె.

సుముఖాసత్తి పూర్వవృత్తాంతము.

గంధర్వోత్తమా! నావృత్తాంతంబు వినుము. నేనట్లుగా శతతాళదఘ్న మను పేరనొప్పు పెద్దమడుగులోఁ బడునపుడు నాపతిపాదపద్మముల నాహృదయంబున ధ్యానించుచు నేమునుఁగుచో నన్నొకకాహ్మాసలి మ్రింగె. ఇట్లు నన్ను దిగమ్రింగి పిమ్మట నరిగించుకొనలేక మఱునాఁడు తత్తీర భూమికివచ్చి పొగలుచు నన్ను వెలికిఁ గ్రక్కినది. ఆవృత్తాంతము నచ్చోనుండి చూచినవారు నాకుఁ దెలిపిరి. నేను నెల్లజనులును వెఱఁగందఁగా నింటికిఁ జని యెల్లవేళల వాణిని సేవించుచు, నెప్పటియట్ల నాపతిని నన్నుఁ దిరుగఁ గలుపుమని ప్రార్థించుచు, మ్రొక్కుచుంటిని. ఇట్లుగాఁ గొంతకాలముండి పెన్మిటి లభియింపకుండుటం జేసి విరాగమునంది కొంతతడవు వేదాంతశాస్త్రకోవిదు లున్నస్థలంబునను మఱికొంతతడవు యోగశాస్త్రజ్ఞులకడనునుండి కాలంబు గడుపుచుంటిని. కాని, యోగాసనాదిక మభ్యసించుటకుఁ దగుప్రాయము మతిక్రమించుటను వగఁ గొందుచుంటి. అట్టికాలములో నాకు సుముఖాసత్తినామ మొదవె. సుముఖులనఁ బండితులు. వారి సమీపవర్తనమున నిత్యము మెలంగుచుండుటం జేసి వారీసుముఖాసత్తినామ మిచ్చిరి. అట్టిపేరుతోఁ బ్రసిద్ధనై కొన్నిదినంబులుండ నంతలో నాతల్లి కాలధర్మము నందె. ఆబంధము తీఱెఁ గావున, నేఁ దీర్థయాత్రలఁ జేయ బయలువెడలి దేశము లన్నియుఁ గ్రుమ్మరిచ్చుచు నీమృగేంద్రవాహన మహిమంబులు విని యిచ్చటికి వచ్చిచేరితి, అనంతరవృత్తాంతము మీకెఱిఁగినదే, అని మరల నిట్లనియె. హితులారా! నే నావిధమ్ముగఁ బాతివ్రత్యమ్మున నుతిగని యిట్టి దశం జెందితిని. నేను మరల బ్రతికియును ము[illegible]బడిన భర్తయొక్క మో[illegible] యెఱుంగజాలనైతి, అనుడు మణిస్తంభుం డిట్లనియె.

ఓ పతివ్రతాశిరోమణీ! నీవు గ్రాహమువలన గ్రహింపఁబడియు నావలన క్లిష్టమూర్తితోఁ గాఁగల్గిన నీపాతివ్రత్యప్రభావము నీనాథునిమాత్రము రక్షింపక యుండునా,

నీవు సంశయింపవలదు, నీవు నీప్రాణనాథుం బొందఁగలవు. అతఁడు నెచ్చటికిని లేఁడు. నేనే యాతని నమ్ముము, అనఁగా వారలందఱు అత్యంతము వెఱఁగంది చూడఁగా మణిస్తంభుఁడును తన వృత్తాంతమును జెప్పం దొడంగె.

మణిస్తంభుని కథ.

హితులారా! నేను బ్రదికినవృత్తాంతమును వివరించెద వినుండు, అని చెప్పి, సుముఖాసత్తి నుద్దేశించి యిట్లనియె. అట్లు నీమాటలఁ గడునగ్గి యేమి కష్టదశమునకో కోపమాపుకొనలేక వేగోద్ధతిం జని నీటనుఱికినాఁడనుగదా. పిమ్మటఁ గొంచెము సేపునకు జలస్తంభవిలాస విద్యాగర్వుం డగు నొకసిద్ధునియింటికిఁ జేరితిని. అచ్చో తేజోవిధూతాంధకారుం డగు నొక మహాత్ము నీక్షించితిని. అతఁ డప్పుడు సమాధినిష్ఠుండై యుండెను. మఱికొంతసేపటికి నాసిద్ధుండు కనువిచ్చి నన్నుఁ జూచె, అప్పు డతనికి నే నమస్కారము లొనరించిన మన్ననతోడ నే నావృత్తాంతమంతయు నన్నడిగియున్నయట్లు వివరించితిని. ఆమాటలువిని యతఁడు యింతకోపివా యని మందహాసంబు జేసె, ఇట్లు నవ్వి యిది మిక్కిలి యేకాంత మగుస్థలము. కావున నేనిచ్చో వసియించియుంటిని. ఇచ్చో నొక క్షణమైనఁ బరుల నిలుపరాదు, అని నాముఖము చూచి దాక్షిణ్యముతో నాఁటిదినము మాత్ర ముండుటకు సెలవొసంగె. అట్లుచేసి నాగురుభక్తి కెలఁగు గర్వని యాలరి నాకు వయఃస్తంభనముచేయు నొక మణియును, నానెక్కుడింపుఁ దప్పిడియును, దద్వశీకరణౌషధజ్ఞానమును, వాదవిద్యయును, శస్త్రాలును దయచేసె. ఇట్లు గానిచ్చి యీపట్టెవ్వరి నేయాగ నెత్తఁబడునో వారి నది తుదకుఁ జంపకమానదనియుం జెప్పి నేఁగఁదలిపోవు టకాజ్ఞ యొసంగె. అట్టివాక్యముల కే నెంతయు సంతసించి యుంటిని. అంతట నతని వాక్యములు వినివచ్చి నిలువంబడియున్న సింహము నెక్కి కొంచెము మొదలు లోకింప మాత్రములో నా కుంభిద్వేషి. గంభీరప్రాభవము వెలసి యాకాశమార్గంబున కెగసి నడచుచుండె. అట్టి వాహనంబుగల్గియుండ నిభూలోకంబునఁగల విశేషంబుల నీక్షించవలెనని నాకు కోర్కె వొడమె. ఆకోర్కె ననుసరించి బహుదేశంబులు తిరుగుట కుటంకించి. మణివలన వయస్స్తంభనఁ గాంచుటం జేసి నాకు మణిస్తంభుఁడను నామము కల్గెను. నాగురువు లంగీకరించినయట్టిదని యీసిద్ధవేషము నే నేపను ధరియించి నాఁడు మొదలుగా సంచరించుచున్నాఁడను. ఆవేడుకలయం దాసక్తుండనై యుండ టంజేసి యిప్పుడు నీవేమైతివో యని యూహింపకయే యుండువాఁడను, నేనిచ్చో వచ్చియున్నమార్గములు నీవు నెఱిఁగియే యున్నదానవుగదా. అనుచు, నవ్వుచు నవ్వారిజాక్షి యిట్లనును. ఆర్యా! ఆశాలీనుఁడవు నీవే యయ్యెదవేని యానాఁ డంత క్రోధావేశమువచ్చునంతటి వికటవాక్యములు నీచెవిలోఁ జెప్పినవానిలో నావలన నేమువింటివి? ప్రథమములో నావయఃప్రస్తుతులు చేసి గూఢముగ నీవేమి పల్కితివి? ఆవృత్తాంతమంతయు జెప్పవలసి యున్నదనినను.

పిమ్మట సుముఖాసత్తి కలభాషిణింబిలిచి, ఓసుందరీ! నీవు నేనావాక్యముల రహస్యముగాఁ జెప్పెదను, వానికిఁ దార్కాణగా నాయన చెప్పెడు వాక్యములు నీవు వినుము, అనిపల్కి యోహో! అది యుపాయము కాదు. సిద్ధుఁడు దూరశ్రవణశక్తి నావాక్యములు వినఁగలఁడు. కావున నేను వానినివ్రాసి నీకుఁ దెలిపెద ననిపల్కి సుముఖాసత్తి మరల నిట్లనియె. అదియు నపువుగాదు, సిద్ధునకు దూరదృష్టియుఁగలదు, నేనువ్రాసినదానిం జదివియు చెప్పగలఁడు, కావున నింకొకయుపాయ మూహింపవలసియున్నది, అని యూహించి మణికంధరుం జూచి — గంధర్వపుత్త్రా! నీవు ముందు సిద్ధునివలన దొల్లిటి వృత్తాంతములోని ముఖ్యాంశముల వినుము. పిమ్మట నేనాయర్థమునంతయు నీకుఁ జెప్పెద ననిపలికె. అట్టివాక్యంబుల కంగీకరించి మణికంధరుండు మణిస్తంభుని నేకాంతంబునకుం గొంపోయి యాతనివలన నతని తొల్లిటి కోపకారణంబును, మునుపటి రహస్యవాక్యంబులను వినివచ్చి సుముఖాసత్తిం జూచి యింక నీవేమి చెప్పెదో చెప్పు మనుటయు, నవ్వనితామణి యిట్లని చెప్పందొడంగె.

శాలీనుండు మదువురఁ బడుటకు ముందు నాతో నేకాంతంబుననుండి ప్రసంగవశంబున నీక్రిందివిధంబునఁ బల్కె; ఎట్లనఁగా:—

క. అప్పాసము సేవించితివో, ‘మణీ యేమైన సిద్ధరసము బ్బెనొకో
కొమయుఁబ్రాయము మిక్కిలి । కొమరొందెను మిగులఁ గ్రొత్తక్రొత్తఁగ నెలమిన్.

క. మగవానికంటె మునుపుగ । మగువకెడలుఁ బ్రాయమంద్రు మానవతీ నీ
జిగిబిగువు లంతకంతకు । మిగులగఁ బొలుపొందుటకు నిమిత్తముఁ జెపుమా.

అని యిట్లుగా నన్నడుగఁ దన్నిమిత్తము నేనెఱుంగ ననిచెప్పితిని, అపుడు శాలీనుఁడు నన్నుఁ జూచి— లలనామణీ! యట్లగాక యిట్లంటిఁగాని తత్కారణము నేనే చెప్పెదను వినుమని తన మొగము నాచెవిం జేర్చి యిట్లనియె.

చ. అనిశము నీదయావన శుభాకృతిఁ గౌఁగిటఁ జేర్చు వేడుకన్
దనిరుమఁ జేసి వేడితిని దక్కక నీకును గర్భమెన్నఁడున్
జనితముగాక యుండ నల శారదఁ బూజ యొనర్చువేళ వా
రనికృప నట్టులిచ్చితి వరంబని యాయమ పల్కె నత్తఱిన్.

అనిచెప్పి యీకారణమునను సుమీ నీమేన సౌందర్యగుణసమృద్ధి గల్గియున్న యది యని వచియించె. అట్టివాక్యములకు నేను వెఱఁగందుచు నిట్లంటి, ప్రాణేశ్వరా! నే నొకనాఁడు శారదాదేవిం బ్రీతంజేయ ‘నాదుసంగంబునన నీకు నందనుండు గలుగ వరమిచ్చె’ ననిపల్కి నావరంబు నీవరంబు నెట్లుసరిపడు నని యడిగితిని. అడిగిన శాలీనుం డాగ్రహోయత్తుండై నాయిష్టమునకు విరుద్ధముగ దేవిని నీవు వరమడిగితివి కాదే, అదెట్లగునో చూచెదుగాక, యని ప్రాదంబున నుఱికె, అని యిట్లు సుముఖాసత్తి చెప్పిన

వాక్యములను మణిస్తంభుఁడు చెప్పిన వాక్యములు నైక్యమునొందఁగా మణికంధరుండు సుముఖాసత్తిం గనుంగొని, యోపతివ్రతాశిరోమణీ! సందియములేదు, ఈమణిస్తంభుఁడు నీభర్తయగు శాలీనుఁడే యని నిర్ణయించి చెప్పె. ఆమాటలువిని సుముఖాసత్తి సద్యః కందళత్త్రపాలంకృత మగు విలాసముతోఁ బతినీక్షించి సంతోష భయ భక్తి వినయము లుదయింప బాష్పము రానడుచుకొనుచు నిట్లనియె.

మహాత్మా! యింతవఱకు నేను మిమ్మెఱుంగక నేనన్న వాక్యములు క్షమియింపవలయును. నడకలను, మాటలను, నగవులను, మీయందుఁ దొంటిమార్గములే తోఁచుచున్నను మానిసిఁబోలుమానిసులు లోకమున నుందురా యని యూహించుకొనుచుందును. నాభాగ్యమిట్లుండుటంజేసి యీయన్నచే నదియిపుడు ఫలియించె సజ్జనులగోష్ఠి యిహపరసాధకమనుమాట రిత్తవోవునా! అని మణికంధరుంజూచి యిట్లనియె.

అన్నా! నీవు జాతిచేత గంధర్వుఁడవు, సంగీతసాహిత్యవిద్యాధురంధరుఁడవు, తాపసులలో నుత్తముఁడవు, దైత్యారికి భక్తుండవు, ఇట్లుండియు నీవు శాపసంతప్తుండవగుటకు మిగుల వగచుచున్నదానను, అనుడు నాపెవలెనే మణికంధరుని శాపంబునకుఁ గుందుచుండు కలభాషిణి యతని నుద్దేశించి యిట్లనియె.

మిత్త్రవర్యా! నీవు నారదునివలనఁ గళాపూర్ణుని కథ వినియుంటివిగదా, తెలిసియుండియు నా ధనమునిపట్టివలన నట్లేల తిట్లుబడితివి, అనుడు మణికంధరుం డిట్లనియె.

కలభాషిణీ! కళాపూర్ణునికథ నేనెఱుంగినదికాదే, నీవద్దాని నెచ్చట వినియుండుటచేతనో దాని నేనుఁగూడ వినియుంటి నని పొరఁబాటున నూహించి యుంటివి. అనుడు, కలభాషిణి కొంతవడవు చింతించి అవునవు నాప్రసంగంబు ఘటియిల్లినప్పుడు నీవు కొంత యెడగాఁబోయి యుంటివి. జ్ఞాపకమువచ్చినది, చెప్పెదను వినుమని యిట్లుగాఁ జెప్పందొడంగె. నాకు నారదమునీంద్రుని ప్రథమదర్శన మైననాఁడు నైకథకుఁ బ్రశ్న ప్రసంగము వచ్చె, అపుడాతపోధనుఁ డది యపూర్వమని యద్భుతమంది భూతభవిష్యద్వర్తమానములఁగల వస్తువుల నెల్ల దన యోగదృష్టిచే నెఱుకి చూచి తన కవి చెప్పరాదని పల్కి యట్లుగాఁ దాఁజెప్పరాకున్కి దానివలనఁ గల్గు బహుసంపదాదిసంప్రాప్తి కారణమనియుఁ దెల్పె. అని యిట్లు తెల్పి కలభాషిణి తాను నారదమునివలన వినినవృత్తాంతమంతయుఁ బూసగ్రుచ్చినయట్లు వివరించి చెప్పె. ఆమాటలువిని వారందఱు నత్యాశ్చర్యంబు నందిరి. ఇట్లుగా వీరందఱుఁ గళాపూర్ణుని కథలు నుడువుకొనుచుండఁగా నచటి కొక బ్రాహ్మణుఁడు మలయాళదేశవాసి యలఘువ్రతుఁ డను పేరుగలవాఁడు సంపత్కాముఁడై వచ్చియుండుటంజేసి యాకళాపూర్ణుని కథలు బహుశ్రద్ధతో వినుచుండె.

ఇట్లుగా నాయలఘువ్రతుఁడు విని తనలో నిట్లు చింతించె. ఆకళాపూర్ణుఁ డనునతఁ డెట్టిఘనుఁడో, అతనికథ యంతయు విను నదృష్ట మెపుడు లభియించునో, సంపద

ర్థమై జపముచేసిన నాయపూర్వకథ విను పుణ్యము లభియించును. ఆకథ వినునట్టి భాగ్యమును సాధించినచో దాని మహత్త్వముచేత సమస్తభోగవైభవములు లభియించుటమాత్రమే కాక దీర్ఘాయువును బుత్త్రపౌత్త్రాదివిభవమును గలుగుననియు నున్నది ఇంత మంచి మార్గము దొరకెను గావున నాకథాశ్రవణార్థమే నేనీదేవతనుబ్రసన్నఁగా జేసికొనియెదను; అని నిశ్చయించుకొని శిలాశాసనాక్షరోక్తక్రమంబున భువనేశ్వరీమంత్రజపము నలఘువ్రతుఁడు చేయుటకుఁ బ్రారంభించె.

కలభాషిణి యాలోచన

ఇట్లు తమవృత్తాంతములఁ బైనల్వురు వివరించుకొనుట యైనపిమ్మటఁ గలభాషిణి తనలో నిట్లు చింతించె. నాకుఁగల శాపము లన్నియు నుండఁగనా, అట్టిశాపఫల మనుభవించుట కిచ్చో వృథాగాఁ బడిపోవలసివచ్చునో, కావున నాలస్యము కూడదు. అని సిద్ధుని యతని వాలుంజూచి — సిద్ధశేఖరా! నీ వాలస్య మేల చేసెదవు, నీకత్తికిఁ గల నియమమును గంభశాపము నాలోచించి వాని కనుకూల మగునట్టి పనింజేసి నీవు వాంఛించిన రాజ్యపదవి నందుము. అనుడు సిద్ధుండు కలభాషిణితో నిట్లనియె.

ఓయక్కా! ఈసుముఖాసత్తి మున్ను నీపై నేను కత్తి నెత్తినపుడు నిన్నఁ బ్రవేగకుండ నీజగదంబ మీఁద నాన వెట్టె. ఆకారణమున నీపై మరలఁ గత్తినెత్తఁ జంకుచున్నాఁడను. ఇదివఱకు నాకవచ్చినపాట్లే చాలును, అని మణికంధరు నుద్దేశించి యిట్లనియె.

ఓగంధర్వోత్తమా! నీకు నాయాయుధంబు నిచ్చెద, దీనిం గైకొని కలభాషిణి చెప్పినట్లు చేసి సఫలమైన రాజ్యలక్ష్మిని నీవే యందుము. అనుడు సుముఖాసత్తియు మణికంధరా! సిద్ధుని వాక్యానుసారము చేయుటయే మంచిపనిసుఁడీ యనిపలికె. అనుడు మణికంధరుఁడు సిద్ధునితో నిట్లనియె.

సిద్ధశేఖరా! నలకూబరుశాపానుభవనంబునకుం గాచుకొనియున్న నాకీదుష్కృత్యంబున సాధించిన రాజ్యవైభవం బేమికీర్తిసుకృతంబులకు సాధకం బయ్యెడు. అనఁగా, సిద్ధుండు.— మణికంధరా! నీవట్లూహింపకుము. అనివార్యంబైన శాపానుభవంబు పరోపకారంబు నెక్కింప నుద్యోగించి తనయంతనేచేర యత్యంతప్రార్థనంబు చేయుచున్నయిన్నెలఁతచేత మహాదేవికి సంతర్పణంబు సేయించుట దుష్కర్మం బనరాదు. కావున నప్పడంతి చెప్పిన చొప్పున నడువుము. అని యనేకవిధంబుల మణికంధరు నొడంబడఁ జేసె. అతండును దయాళుండు గావున దాని కియ్యకొని నియమపూర్వకంబుగా నవ్విధికిఁ గడఁగె. కలభాషిణియు మణిస్తంభునకుఁ దదంగనకుఁ బ్రణామంబులుచేసి కన్నీళ్లు గ్రుక్కుకొనుచు ఓపుణ్యదంపతులారా! యిక్కలంకపాటు భయంబునం జేసికాదుసుఁడీ, మిమ్ము నెప్పుడు గురుభావన నారాధించు నదృష్టము కలుగకుండుటంజేసియే, అనుడు, సుముఖాసత్తి ఓయమ్మ! మన నెమ్మనమ్ములకూర్మి యింతటితోఁ బోవునదియా, మీఁదటి జన్మంబున నైన

నీవు నీపతియు మమ్ము సేవింతురుగాక. అనుడు, గలభాషిణి పునఃపునఃప్రణామంబులాచరించి ముకుళితకరకమలయై యిట్లనియె.

ఓపతివ్రతాశిరోమణీ! నాకు ముందుజన్మమునందైనఁ బవిత్ర మగు పాతివ్రత్యము గల్గునట్లుగా దయతో నాశీర్వదింపవలయును. ఇదియ నేఁ జేయుప్రార్థన, అనుడు, సుముఖాసత్తి యిట్లనియె.

కలభాషిణీ! నీవు ముందుజన్మములోఁ బరమపతివ్రతవై రాజ్యవైభవముల ననుభవింపుము నీభర్తంగూడి మమ్ము బోంట్లను రక్షింతువు, నిన్నట్టిటు చంచలింపక ధైర్యముతో నుండుమని మేము చెప్పవలసినదిలేదు. నీవే పెండ్లికిఁబోవునట్లుగాఁ గన్పట్టుచున్న దానవు. నీకుఁగల వికాసము నుత్సాహము చూడఁగా నీవు దేవతవుగాక మనుష్యభామినిగాఁ గానిపింపవు; అనుడుఁ గలభాషిణి సుముఖాసత్తింగనుంగొని నేఁబోయివచ్చెద ననిపల్కి సిద్ధంగమునుంగొని, నన్నంపెదరా, ఖడ్గముదయసేయుదురా, యని యతనికత్తి తనచేతఁ బుచ్చుకొని దానిని మణికంధరునిచేతికిచ్చి యోగ్యము లగు గంధమాల్యముల ధరియించుకొని మృగేంద్రవాహనాశక్తికి నభిముఖముగాఁ బద్మాసనము నవలంబించి కూర్చుండి మణికంధరునుద్దేశించి యిట్లనియె.

మిత్రవర్యా! నీవు నిశ్శంకతో దద్దరిల్లక నిశ్చింతను శత్రుకంఠలుంఠనవిచక్షణ మగు నీదక్షిణబాహుశౌర్యమును మెఱయింపుము. రణరంగమున నెదిర్చు మత్తశాత్రవులఁ జెండాడుట వీరపురుషునకు జగుణమేగదా, అట్టి శౌర్యమును మఱువక యీసమయంబునఁ జూపవలయును. అనియిట్లుగాఁ దెలుపుచున్న కలభాషిణి ధైర్యమున కరుదందుచు మణికంధరుఁడు కొంతవడికిఁ దనమనసును పదిలపఱుచుకొని కలభాషిణి వాక్యానుసారంబుగఁ గార్యంబు నడపె. అపుడు మృగేంద్రవాహనాశక్తి మణికంధరు నుద్దేశించి యిట్లనియె.

గంధర్వకుమారా! నీవు దయాళుత్వంబునంజేసి బలిసమర్పణవిధానం బొకించుక విలంబనంబుగా సలిపితివి. కావున జన్మాంతరమాత్రవ్యవధానంబున సద్యోయౌవనుండవగుచు మహారాజ్యవైభవంబు లనుభవించెదవు. కలభాషిణి మాత్రము ప్రాణభయంబు లేశంబునులేక మత్ప్రీణనతాత్పర్యధైర్యాదిగుణంబులచేత నను మిక్కిలి మెప్పించెఁగావున మామకప్రసాద విశేషంబున నిపుడ పునస్సహిత మస్తకయై నిజపురీవర్తియునై తనబంధుమిత్రాదుల నలరించు. అని పల్కినతోడనే కలభాషిణి బ్రతికి కనువిచ్చి నలుదిక్కులఁ బరికింపఁగా నప్పుడు తా ద్వారకానగరవేశవాటీభూషణాయమానస్వభవనారామభూమియందు నివసించియుండె. అట్టి తనయునికి కొంతయు వెఱగంది యదియంతయు నామృగేంద్రవాహనామహాశక్తికృపావిలసనంబుగా నుద్దేశించి యద్దేవింగొనియాడి తన గమనాగమనప్రకారంబు సఖీప్రముఖనిఖిలజనంబులకు వినిపించి ఘనతరాద్భుతంబుఁ గావింపుచుండె.

ఇట మణికంధరుఁడు లవ్వాగవర్తినీ శరీరఖండంబు లదృశ్యంబు లగుటకు వెఱగంది యయ్యాదిమశక్తి మహిమను బలుదెఱంగులఁ బ్రశంసింపుచుండిరి. అనంతరము మణికంధరుండు మృగేంద్రవాహనకు దండప్రణామంబులు గావించి సుముఖాసత్తి మణిస్తంభులఁ దగువిధంబుల వీడ్కొలిపి శాపానుభవకాలంబుఁ బ్రతీక్షించుచుఁ గృష్ణదత్తంబైన తనరత్నమాలిక యచ్చట జపపరుండై యున్న యాలఘువ్రతునకుఁ గృష్ణార్పణబుద్ధి సమర్పించి తన్నిపంచిని యద్దేవిగృహంబున నొక్క వలభివిశేషవివరంబున నన్యులకుఁ గానరాకుండఁగ స్థాపించె. ఇట్లు చేసిన యనంతరము మణికంధరుండు సలిలహంసశాపంబు తన మనంబుఁ బ్రేరేప భృగుపాతలంపటమతియై శ్రీశైలంబునకుం జనియె.

సుముఖాసత్తి మణిస్తంభుల వృత్తాంతము.

ఇట్లుగా మణికంధరుఁడు తన్నుఁబాసిచనిన యనంతరము మణిస్తంభుఁడు సుముఖాసత్తి తనకు శుశ్రూషసేయుచుండ నామృగేంద్రవాహనాభవనంబుననే జితేంద్రియత్వముతో నష్టాంగయోగవిద్యాభ్యాసంబుఁ జేయుచుండె. సుముఖాసత్తియుఁ బతియాజ్ఞను మునుపటి తనయోగవ్రతంబు ప్రేమువదలక తత్పరిశీలనము చేయుచుండె. అంతట మణిస్తంభుఁడు దేశాంతరవస్తుదిదృక్షను దిగంతయాత్రాపరుఁడై తన కేసరి నాకర్షించె. అంత నామృగేంద్రంబు సన్నద్ధమై నిలువ నాసిద్ధుండు పరమోత్సాహంబున భార్యాయుతుండై దాని నధిరోహించి గగనమార్గంబున యథేచ్ఛావిహారంబులఁ జనుచుండె. ఇట్లు పోవుచు నొకచో భీకరమకరతిమింగిలాదిజలజంతుసంకులగభీరగర్భసాంద్రుని ఘుమఘుమరావాపన్నసముద్రుం గనుంగొనియె. ఇవ్విధంబున నాశ్చర్యంబునిధిం గనుంగొని తత్పరికాలంబు కౌతుకకారణంబగుచు సొంపువీఱఁ దనవనితతో నాసముద్రునిం జేరం జనుదెంచు సలిలనిధి లగు నదులు కలనసములఁ దెలుపుచు నానాసకథామిషంబునఁ దమ వృత్తాంతంబులు నుండవలయునని సూచించి తాను దన బ్రహ్మచర్యవ్రతోత్సర్జనంబు గావించి యథేచ్ఛావిహారంబు సలుపుచుండె.

అలఘువ్రతుని వృత్తాంతము.

ఇక్కడ నలఘువ్రతుండా మృగేంద్రవాహన సన్నిధిని సముజ్జ్వల మగు నియమంబున రెండు వత్సరములు పూర్ణములగునట్లుగాఁ దపంబు సలిపె. అట్లుగా నతని భువనేశ్వరీమంత్రజపంబు పూర్ణంబుగాఁగని యామృగేంద్రవాహనాశక్తి యతనికిఁ బ్రత్యక్షంబై, ఓయీ బ్రాహ్మణుఁడా! నీయభీష్టంబు వేఱొకచోట సిద్ధించు నని వరమిచ్చె. ఇట్టి దివ్యవచనంబు లాపాఱుండు విని సంతసించుచుండె. అంతట నాకస్మికముగా నొక పెనుగాలి వీవ నారంభించె. తద్వాతోద్ధూతుండై యాభూసురుఁ డనేక జనపదంబులు దాఁటి యొకచో నొకపురమధ్యంబున నున్న రాజాస్థానంబు నడుమం బడియె. ఇట్లుగా పడి తదీయవాతోభావలత్వంబున నొక్కింతతడవుండి యూరివకను లెప్ప ల్లల్ల నవిచ్చి నలుగెలంకులఁ బరికించె. అపు డలఘువ్రతుఁడు తన పతనప్రకారంబునకు వెఱఁగుపడుచుఁ దనచుట్టు

నున్న కొండఱు సభాసదులను గట్టెదుట రెండవదేవేంద్రునింబోలె నపూర్వవైభవం బునను న్న యొక్కరాజోత్తముని, యతని యగ్రభాగంబునఁ బసిడి తొట్లెలోపలఁ బొత్తులలోపలనున్న యొక్క చక్కని బాలికనుంజూచి యొక్కింతతడవు నివ్వెఱపా టున నిశ్చలుం డగుచు నుండె. ఇట్లుండి యనంతరము దిగ్గనలేచి మణికంధరదత్తంబైన తన రత్నమాలిక గైకొని యాలఘువ్రతుం డాశీర్వాద పూర్వకంబుగా నారాజునకుఁ గానుక పెట్టె. ఆరాజేంద్రుండు నామాలిక నత్యాదరంబునఁ గైకొని బ్రాహ్మణోత్తముని తనకుఁ గొంతసమీపంబునఁ గూర్చుండ నియమించి యప్పటికిఁ దత్కులనామములు మాత్ర మడిగి తెలిసికొనియె. ఇట్లుచేసి యారాజవర్యుం డోభూసురోత్తమా! యిప్పటి మీయాగమనప్రకారం బత్యద్భుతంబు. దాని ముందు దెల్పెదవుగాక, యొక్కింతమాట లాడక నిలువుము. అనిపల్కి సభాసదులం గనుంగొని, సభ్యులారా! యిప్పటిలో నాకు వచ్చెడు కానుక లెవ్వియైన నీ బాలికసొమ్ములే గదా. అని యమ్మణిహారంబుఁ దనయొద్ద నున్న యమ్ముద్దుబాలిక మెడ నిడియె. అపుడా పొత్తులలోని బాలిక యామణిహారము తన చిబుకము గళము పయిని హత్తగా నద్దానింజూచి లేఁజెక్కులు తెల్లనగునట్లుగా నొకనవ్వు నవ్వెను. ఇట్లుగా నవ్వి యీహారోత్తమును తిరుగ రెండేండ్లకు నేజూడఁగల్గె. నాకన్నులు చేసికొనినపుణ్యము నేఁడు మనల ఫలియించెను. అని యిట్లుగా నాబాలిక పల్కినమాటలు విని సభ్యులందఱును జిత్తరువునవ్రాసిన ప్రతిమలగతి నద్భుతమున నిశ్చలతనంది యుండిరి. అపుడా భూపతిపుంగవుం డబ్బాలిక మోముఁ జూచి యీశిశువు పల్కిన పల్కు లత్యంతము వింతగా నున్నవి. ఇదెట్టి దేవతాకాంతయో, లేక యేవిధ మైన కారణజన్మయో, కావున దీని మాటలాడించి చూచెదఁగాక. అని తన మనంబున నిశ్చయించుకొని యానిసువుతో నిట్లనియె.

ఓయద్భుత బాలికా! నీవు పుట్టి రెండుమాసము లింకను బూర్తియయ్యెనో లేదో, ఇట్టి నీవీహారమును రెండేండ్లక్రిందట నెట్లు చూచితివి. ఆసంశయము తీరునట్లుగా ననుగ్రహింపుము. అనుడు; నాబాలిక—పృథ్వీవల్లభా! తొల్లిటి నాజన్మములో దీనిఁ జాల గుఱుతుగాఁ గనుఁగొనిన దానను. కావున నేనట్లుగాఁ బలికితిని, అను డమ్మహీపాలుం డబ్బాలికంజూచి—ఓబాలికామణీ! నీవు కారణజన్మవుగాని సామాన్యంబైన మనుజ శిశుమాత్రమవు గావు. నీతెఱంగంతయు నెఱుంగునందాక మనంబునఁ బుట్టిన సంభ్రమంబు బాయదు. నీపూర్వజన్మవర్తనంబు లెయ్యవి? ఏమికారణంబున నిచ్చటఁ బుట్టితివి? వాని నన్నిటి నిట వివరింపఁ బ్రార్థించుచున్నాఁడ. అనుఁడు, నబ్బాలిక తన పూర్వజన్మవర్తనంబును దజ్జన్మనిమిత్తంబైన తత్పూర్వవర్తనంబును సంస్మరణ సంబంధ పరంపరావశంబున సమస్తంబును గరతలామలకంబుగా నాకళించి తనపలుకు లాస్థానంబెల్ల సావధానం బగుచు వింజమాకిడినట్లు వినుచుండఁ జెప్పందొడంగె.

ఇది పూర్వభాగము.

శ్రీ

కలభాషిణి.

ఉత్తరభాగము.

తొమ్మిదవ తరంగము.

బాలిక పూర్వజన్మ వృత్తాంతము.

ఓయి రాజేంద్రా! నావృత్తాంతము విన నుత్సహించుచున్నాఁడవు గావున, దాని న్వినుపింతు వినుమని యాయద్భుత బాలిక యిట్లనియె. నేను నా వెనుకటి జన్మమునఁ గాక యంతకుఁ బూర్వజన్మవృత్తాంతమును ముందుగా వివరించి యనంతర జన్మవృత్తాంతమును తరువాత వివరించెదను. మొదటి జన్మములోఁ జతురాననుని రాణివాసంబులో వాణీమహాదేవి పెంచిన రామచిల్కను. ఆజన్మములో నాకొక శాపము కల్గుటంజేసి రెండవ జన్మ మెత్తవలసి వచ్చినది. శాపకారణ మంతయు వినిపించెదను. ఈనిమిత్తమున నైన జిహ్మ కల్గినందులకు ఫలభూతమై, సముజ్జ్వలరసభావయుతమై, ఆయుర్వృద్ధికరమై, వంశవిస్తారహేతువై, యతిపవిత్రమైన యొక యపూర్వకథ వక్కాణించుట కల్గె నని సంతసించెదను. సావధానమనస్కుండవై యాకర్ణింపుము.

వాణీచతురాననుల ప్రణయకలహము.

నేను విరించి రాణివాసమున వసియించుకాలములో నొకనాఁడు ద్రుహిణుండు వాణితో నిజభవనారామంబునకుం జని యచ్చో నిష్టఖేలనంబు లొనర్చి అరవిందవనామోదభరము లగు పవనామోదములచేత భావములు గనుపట్టు నొక శ్వేత సంతానవృక్షచ్ఛాయఁ దలిరాకుపాన్పున నచటి సరోవరమున కభిముఖముగాఁ బవ్వళించి యుండె. అపుడు వాణి యతని పాదపల్లవములు తన యూరువులందుఁ జేర్చుకొని యొత్తుచుండె. ఇట్లుండఁ గొంతవడికి నలువ తన నలుమొగంబుల నాజలజాక్షిని ముద్దిడ యత్నించిన నాపూఁబోఁడి నవ్వుచు నిట్లనియె.

ప్రాణేశా! నీవు న్యాయ మింతైన వలదా? నీమొగములు నాలుగు నీగతి విజృంభించి నొక్కమొగముతో నున్న నేనేమి చేయఁగలను. అని మెడ బిగించి తన ముఖము

గొంచె మెడగలుగఁజేసి తన యధరం బందకయుండునట్లుగా వాణి తనపాణితల మస్తు చేసె. అపుడా యబ్జసూతి యయ్యబ్జాక్షి ముఖాబ్జము గ్రహించి బల్మిని వంచి మోవిపై నుంచియున్న కేలు విడిపించి కించి ద్దంతక్షతంబు గావించె. దానంజేసి యక్కళావతికిఁ గళాభిదురమై కంఠసీమనుండి మధురాంచితధ్వని జనియించె. అంత నాకమలభవుని రాణి తద్విధంబున నొదవిన కళామర్మభేదనసామ్రాజ్యసంపదను భవావస్థను మానలాఘవశంక నప్రకాశంబుగాఁ గడపిపుచ్చుటకు యోజించి యొక యుపాయంబు జేసె. కాని యా విభుని యభిమతకేళికి విఘాతం బొనర్చునది యగుటంజేసి యధాపీడ సాహసత్వమిషంబున నలుక యొకటి కల్పించుకొని యవ్వలి మొగంబుగా నొత్తిగిలి పవ్వళించి యుండె. నే నపుడు తదీయభావం బంతయు కామశాస్త్రప్రసిద్ధంబుల నెఱుంగుటంజేసి పోల్చుకొని యుంటిని. హిరణ్యగర్భుండు తద్వాగ్విహారశాపికలితస్ఫూర్తియ్యండయ్యును, దన యిల్లాలు లల్లంబున నల్గుటకు శంకించి యిట్టట్టుగాఁ దెల్పుటకుఁ జొరక యుండె. ఇట్లుండ పురోవర్తితశాఖాసమంచితసమంజసరత్నపంజరాంతస్థనై యున్న నన్నుం గాంచి యిట్లనియె.

ఓ చిలుకచెలువా! యబుసుపోదు. కథ యొక్కటి చెప్పుముగా, అనుటయు, నేను నిట్లంటి. దేవ! దేవరముందట నెట్టికథ నైన నే నుపన్యసింగలదాననా. ఏలిక తెలిపెను, కథయున్న దాని నే వినన నుత్సహించెదను, అనుటయు, నట్లైన నేనే యొక కథను దెల్పెదను వినుమని చతురాననుం డిట్లనియె.

కళాపూర్ణావిర్భావకారణము.

కాసారసంజ్ఞ గల యొక పట్టణము గలదు. అప్పట్టణము నేలు బరిపాలించెడువాఁడు కళాపూర్ణుం డని చెప్పఁబడును. అతఁడు సంపన్నసమృద్ధికలవాఁడును విలాసవంతుండునై భాసిల్లుచుండె. అతఁడు జయధురంధరుఁడై యీజగమునఁగల తన సరిరాజుల నందఱి నిజలీలాకళాపరాజితు లగునట్లుగా నొనరించె. అతఁడు నద్యోగయావనుఁడై వెంటనే స్వభావుఁ డను సిద్ధునిచేత నొక నూతనమణి, శార్ఙ్గము, మెఱుఁగుతూపులును పడసెను. ఆమణిశలాక యరుణ మగు నద్భుతమైన రంగు కలిగియుండు. ఆ మెఱుఁగుతూపు లక్షయములు. ఆశరాసన మతని విజయగౌరవసంప్రాప్తి కారణ మైయుండు. ఇట్లుండ నొకనాఁడు మదాళసుఁ డను రాజు రూపానుభూతి యను భార్యాసహితుండై ధీరభావుఁ డను మంత్రి తోడురాఁగ నట యదృచ్ఛ నొక్కింత పొలయుటయును, దత్కళాపూర్ణు తన కోదండవిహారపటుత్వమున ధీరభావునిఁ గడుమూఢముగాఁ బల్లాయన మొందించె. అపుడు మదాళసుఁడు కళాపూర్ణుని శరణు చొచ్చె. దానిపైనిఁ గళాపూర్ణుఁడు మదాళసు నతని భార్యాయుతముగాఁ దనకు దాసునిగాఁ జేసికొని యూడిగంపుపనులు చేయించుకొనుచుండ, నతఁడును దదాజ్ఞావర్తియై నడుచుకొనుచుండె. అని

యిట్టుగాఁ జతురాననుండు పల్కిన పల్కులు సభ్రూవిలాసలోలలోచనాంచలకషితకర్ణిక యగుచు వాకర్ణించి యించుక నగుచు సవ్వరించి రాణి నన్నుంజూచి యిట్లనియె.

శుకయువతీ! యాకళాపూర్ణుండు మఱి యేమియయ్యె? అతనికిఁ దలిదండ్రు లెవ్వరు? మీ యజమాని నడిగి తెలిసికొమ్మని నాకుఁ గఱపె. అట్లే నే నడుగ నాలోకేశుం డిట్లనియె. ఆకళాపూర్ణుఁ డభినవకాముని యను నొక వనితామతల్లిచే వరియింపబడియె. ఆ రాజునకు సుముఖాసత్తి యనునది తల్లియు సుశీస్తంభుం డనువాఁడు తల్లియునై యుండిరి. అనుచు, నామాటలు విని హాసంబుతో నాసుజ్యేష్ఠుని రాణి తనప్రియుని కభిముఖముగాఁ దరిగి కౌఁగిలించుకొని, ఔరా యింతలో నెన్ని తబ్బిబ్బులు గలిగె. దద్దరిల్లకుఁ డని యతని వీపు చఱచి— ప్రాణేశ్వరా! యిట్టిట్టూ ఆ రాజునకు తనని మగవాఁడును, జనకుఁ డాఁడుదియు నయ్యెనా! అని మఱియు నవ్వుచు నట్లైన యా రాజు మఱియేమి యయ్యెనో వివరించి పల్కుఁడనుడు శతానందుం డధికసంభ్రాంతుండై తాను నాయింతి మెడఁ గౌఁగిలించుకొనియె. ఇట్లుగాఁ జేసిన ప్రాణేశమణుని వదనవక్షస్స్థలములను వదలక గట్టిగా మెలిపుగోఁ గంతులు మలచిమలచి అధరపానమహోత్సవం బొనరఁగ. ఇట్లుండ నందొక ముఖంబునఁ జనితార్థసంపిడిగలదియై శారద మీవారిని గొలఁదియుంచలేనని కోపముం జూపుచుఁ జాలుఁజాలు, అని కౌఁగిలి విడిపించుకొని మోముల నిసుకేలను బాయఁబట్టి మీరు చెప్పుచున్న యా జవ్వాల నేమి యయ్యెనో చెప్పుఁ డని సంప్రశ్నించె. అట్టె నెనరులాటలఁ బ్రకాశిలములైన తత్కథాసంబంధములును, లేఁగొనుబెడంగును, గొంత కన్గొని చొక్కుచు నజుఁడా మగల మోవి తీపానెను. అపుడా సరస్వతి మీ రిట్టిపనుల నెన్నియైన నేర్తురు. దీని కేమి? ఆ రాజేమాయె నతని వృత్తాంత మేమి? దాని నాకుఁ దెలియవలయు నని ప్రార్థించె. ఆమాటల కుత్తరముగా నాతండిట్లనియెను.

ఓ పలుకులవెలఁదీ! యేమియు నేల యయ్యెను. ఆ మహారాజును సత్వదాత్ముండను మంత్రి యంగదేశములోని క్రముకకంఠోత్కటపురమను పట్టణోత్తమమునకుఁ దనమహిమతోఁ దనకుఁ బట్టముఁగట్టి సామ్రాజ్యవైభవమున నొప్పియుండె. అతని యాపట్టణమునకు మదాళసుఁడు పసిడికోట వెట్టించి యతని యధికదయకుఁ బాత్రుం డయ్యె. అంతట మదాళసుఁడు తనభార్యయును దాను నభినవకౌముదీయుతుఁ డగు కళాపూర్ణుని విడువక గొలుచుచుండి తన్మణిసులోకగుణమహత్త్వమువలన సౌభాగ్యలాలస యను పుత్త్రికం గాంచె. ఇట్లొసఁగిన యామణిగుణమునకు మెచ్చుచుఁ బ్రథమాగముఁడు, ద్వితీయాగముఁడు, తృతీయాగముఁడు, తురీయాగముఁడు నను నామములఁ బ్రసిద్ధివడసిన మదాళసు పురోహితులు నల్వురు సత్త్వరముగఁ గళాపూర్ణుంజేరి యతఁడు ధరియించుమణిని పర్యాయముగఁ దారుపట్టి తత్సంస్పర్శమహిమచే నానందమగ్నులైరి. కళాపూర్ణుండును

దద్వశీకృతాత్ములై వారాశ్రయించి యుండుటకుఁ దన హృదయమునకు నియతవశలేఁ జాల ప్రియముగుచుండఁ దత్క్రియలకెల్ల యంగీకరించి యుండె. అంత వారిలో నొక్కండు మిక్కిలి మందె మేలమ్మున నమ్మణిని గరంబు నొక్కిపట్టుటయుఁ గళాపూర్ణుండు కోపించి వారిఁ బాయందోలి; తదపరాధంబునంజేసి తత్స్వామి యైన మదాశయుని కనకప్రాకారంబు నొల్లక విఘటితంబుగాఁ జేయించె. అతఁడును దానికిఁ దలఁకక యందులకేమి, ఎటులైనను తనవాఁడ నతనిదేశంబునందె యెందైనను బ్రతికెద. అని కళాపూర్ణుని సేవవిడిచి సకుటుంబంబుగాఁ గ్రముకకంఠోత్తరపురంబు వెల్వడి యొక్కించుక చనుచుండె. ఇట్లుగాఁ జనుచుండ నెదురుగాఁ బూర్ణకలశద్వయంబుఁ గని వేడ్కనుబ్బుచుఁ జని మధ్యదేశంబున సుఖంబుననుండె. క్రముకకంఠోత్తరపురము వెడలునప్పుడు ప్రయాణక్షోభమునఁ గృశత్వమునుబొంది తేరని తన ముద్దుపట్టి యగు మధురలాలసను దలంప నెఱుఁగ దయ్యె. ఆబాలిక యెట్టివారికైన గణియింపక యుండె. మదాశయునకు మీఁదమీఁద సుఖనిమిత్తంబు లొదవె. తన జనులకు నడుమపీడయుఁ దటస్థించె. అంతట మదాశయుఁడు నిజకుటుంబయుక్తముగాఁ దిరిగి క్రముకకంఠోత్తరపురమునకుం జన నభిముఖుఁ డయ్యె. అంత మధురలాలస యనుబాలికామణి భాగ్యమెట్లు ప్రేరేచెనో గాని మదాశయుం డెందు నిలువక యతిత్వరితగతితో వచ్చి క్రముకకంఠోత్తరపురము జేరె. అపుడు తత్పుత్త్రియైన మధురలాలస కళాపూర్ణుం గనుంగొని నిజకృశత్వాపగతోల్లాసినియై చెలంగ. అంతట మదాశయుఁ డట్లుగాఁ దేటి యభివృద్ధినందెడు తనపుత్త్రికను దోడ్కొనివచ్చి కళాపూర్ణుని సమ్ముఖమ్మున నిల్పి యతనికిఁ దత్ప్రకార మంతయుం దెలిపి, రాజేంద్రా! యిట్టి చిత్రమహత్త్వము నీక కాక యిఁక నేరికైనఁ గలుగునా. అని యతని ననేకవిధంబుల భా[illegible] యుక్తుండై మదాశయుండు కొనియాడి యత్యానందంబున నుండిరి. అంత నతని పురోహితులగు ప్రథమాగమాదులును దిరుగఁ జేరరాఁ గని కళాపూర్ణుండు ప్రసన్నుఁడై యాత్మ నిచ్ఛగించుకొనియుండె. మధురలాలస క్రమంబునఁ దల్లిదండ్రుల ప్రోదిని సంప్రాప్తయౌవనయై యాకళాపూర్ణుని చేత ననన్యసదృశమైన యౌవనఫలంబు ననుభవించె.

కళాపూర్ణునికథకు వాణి యర్థాంతరము చెప్పుట.

అని యిట్లుగాఁ జతురాననుండు కథ ముగియింపఁ జతురాస్య యగు వాణి కృత్రిమరోషంబు దోఁపంజేయుచు బొమలు ముడివెట్టి యిట్లనియె. ఆహాహా! మీ రెంతటి మహాత్ములు. నామీఁదనా వచనరచనాకౌశలం బుపచరించుట. అనుడు నవ్వొరించి నవ్వి యిట్లనియె. ఓహంసయానా! నీవేమియూహించి యీకిటుకు గ్రహించితి వంటివి, నీ వద్దానిని గ్రహించుటయే కల్గినచో దాని నాకు వివరించి చెప్పుము. అనుడు నాపద్మజురాణి యిట్లనియె. ప్రాణనాథా! చాలుం జాలు. ఇంతకాలమునుండి మీ సేవఁ జేయుచు నింతమాత్రమైన నే నెఱుఁగలేనా? ఈదంటుమాటలు నీభావములవిధములు నే నిచ్చినవిద్యల

వలన నేఁగదా కల్గెను. ఈకథ యంతయు నిప్పటి మన వృత్తాంతమే. ఇంతవఱకు నీకథ నెట్లు మీరలు తుదముట్టించెదరో చూత మని వేచియుంటిని. మీకు నావలననే వినఁ గోరిక గలదేని వినిపించెద. సావధానచిత్తులరై వినుండు. అని వాణి యిట్లు చెప్పందొడంగె.

౧. ఈ కొలనే కాసారపుర మని పల్కితిరి.

౨. అందుఁ బ్రతిబింబించు నామోమునీడను పూర్ణశశిగా భావించి దానిని గళాపూర్ణుం డను రాజని పల్కితిరి.

3. ఆరాజు సరిరాజుల నెల్ల స్వలీలాకళాపరాజితులఁ జేసె ననుట యా వదనప్రతిబింబచంద్రుఁడు సర్వముఖచంద్రులను నెక్కుడగు సౌందర్యము గల్గియుండె నని యతిశయోక్తిగాఁ బల్కితిరి.

౪. ఆరాజు స్వభావుఁ డను సిద్ధునిచేత ధనుర్బాణములు, నొక్కయరుణమణిశలాకయుఁ బడసె నని యంటిరి. భ్రూలతావీక్షణంబులును, అధరంబును, స్వభావముగానే కలిగియున్నవనుటయే.

౫. మదాశయుం డనువాఁడు రూపానుభూతి యను భార్యయు దానును ధీరభావుం డను మంత్రితో నలవోక యటుల వలసినమాత్రన గళాపూర్ణుం డాధీరభావుని తన ధనుర్విలాసంబునఁ బలాయనమొనర్చి మదాశయు నతని భార్యతోఁగూడ నొక్కించుక ప్రవర్తించె నంటిరి. అది మత్ప్రతిబింబంబు నిజభ్రూవిలాసంబున స్థైర్యంబుం బాఱఁ ద్రోలి మీహృదయంబును దృష్టిసహితంబుగా నాకర్షించి విడువదనుట యైనట్లు కానిపించు. అంతట మీపలుకులకు నాకు నవ్వు వచ్చినది. మత్ప్రతిబింబంబునం దోఁప చూచి యానవ్వును లేతవెన్నెలతో సామ్యంబు దోఁపఁ దదభేదవ్యవసాయంబు గల్పించి యాభినవశబ్దంబునఁ బలికి యది స్త్రీలింగత్వసామర్థ్యంబున స్త్రీనామధేయంబై కానిపింప నభినవకౌముది యను కాంతచేత నాకళాపూర్ణుండు వరియింపఁబడియె నని పలికితిరి.

౬. ఆకళాపూర్ణునకు సుముఖాసత్తి యనునది తండ్రియును, మణిస్తంభుం డనువాఁడు తల్లియు ననుటకుఁ జెప్పెదను వినుండు. ఆప్రతిబింబంబు శోభనముఖసామీప్యంబు గారణంబుగాఁ దత్కాసారమధ్యమణిస్తంభగర్భంబున నుదయించె ననుట గాదె. అందు స్త్రీత్వ పురుషత్వంబులు మీ రేమి తడబాటుననో విజ్ఞోదుపడఁ గల్పించి పలికిన నీహాసోత్సుకత్యంబుల నాపలేక మీకభిముఖంబుగాఁ బొరలినఁ గాసారమధ్య విద్యోతమాన ప్రతిబింబంబుపోయి మస్ముఖంబు మీకు నెదుటఁ గాన్పించినది. అది మదీయదేహంబునందుఁ గంఠోపరిభాగంబునఁ గనుపట్టుటంజేసి యాకళాపూర్ణుఁ డంగదేశంబునఁ గ్రముకకంఠోత్తరపురంబునకుఁ బట్టంబు గట్టుకొనియె నంటిరి.

౭. అది మదీయాత్మాధీనంబు గావున, సత్త్వదాత్ముం డను మంత్రిపట్టంబుఁగట్టుటగాఁ జెప్పితిరి. సత్త్వదాత్ముం డన సమీచీనత్వదాత్ముం డనుట తోఁచుచున్నది.

౮. అంతట మీరు మత్కంఠపరిరంభణంబు గావించి యిది యుష్మదాత్మాధీనం బగుటను మీ బాహువులు సువర్ణంబులగుటను మదాశయుండు క్రముకకంఠోత్తరపురంబు నకుం బసిండికోటవెట్టించె నని యంటిరి.

౯. మీ యాత్మయు దృష్టియు నెట్టి మమతావశంబుననో మన్ముఖంబుం బాయక వర్తిల్లును మధురాధరేచ్ఛ యాగ్జించుట యగని మదాశయుండు రూపానుభూతిసహితుండై కళాపూర్ణునకు సేవచేయుచుఁ దన్మణిశిలాకమహత్త్వంబున మధురలాలస యను తనయం గాంచె నంటిరి.

౧౦. అట్టి మధురలాలసం గనిన తన్మణిశిలాకమహిమను మెచ్చుచు బ్రథమాగ్రగు ప్రముఖులైన మదాశయుని పురోహితు లమ్మణిశిలాకంబట్టి మామదుఁ దత్సంస్పర్శన మహత్త్వంబున నానందమగ్నులై రంటిరి. అనంగాఁ జాంబనేచ్ఛానంతరము మీ ముఖం బులు వ్రాలును మదీయాధరపానంబున నింపొందె ననుటగాదె ఆ ముఖంబులు బుఖ్యస్వామాధర్యాంత్రపాదుర్భావకారణంబు లగుటను మీ యాత్మకు నధీనంబు లగుటను గ్రమం బుగఁ బ్రథమాగమాదులు తత్తన్నామధేయములుగల మదాశయుని పురోహితు లంటిరి.

౧౧. అంతట నేను మీ ముఖచేష్టలచేత నధరపీడజనించినఁ గోపించి వానివారించి కౌఁగిలి విడిపించుకొంటిని. అది కళాపూర్ణుఁడు తాఁ దాల్చిన మణిశిలాక నా బ్రాహ్మ ణుల యందొక్కరునిచేతఁ గొంతపడిపోయినదై నగరి వారిం గాయం గోలించె ననియుం దత్స్వామి యైన మదాశయుని కనకప్రాకారంబు విఘటితంబు చేయించె ననియుఁ బల్కితిరి.

౧౨. అంత దేవర చిత్తంబు తృప్తిసహితంబై మన్ముఖంబు గడిచి పరిరంభవిశ్లేష ప్రకాశితంబులైన యితరావయవంబులకుఁ బోయె. అపుడు మదాశయుండు నిజభార్యా సమేతుండగుచు నాకళాపూర్ణు సేవవిడిచి తదాశ్రయంబైన యంగదేశంబునకుఁ బోయె నని యంటిరి.

౧౩. అట్లుగాఁ బోవుచు నెదుట నొదవిన పూర్ణకలశద్వయము శుభనిమిత్తదర్శనం బున నబ్బుచు నేఁగి మధ్యదేశంబునఁ జిరనివాసంబు గావించె నంటిరి. వక్షోజయుగళ సందర్శనంబున నానందించుచు నరిగి వలగ్నభాగము నవలంబించి తడవు నిలిచె నని పలు కుట యగును.

౧౪. ముఖంబు బాయుట యాదిగా నధరేచ్ఛ యడగుటను ప్రయాణక్షోభంబు నకు మధురలాలస కృశత్వంబునందె నని యనుటగాదె.

౧౫. అంత దృష్టిసహితంబుగా మీ యాత్మ మరలి మన్ముఖంబునకు వచ్చుటయుఁ దానఁ జాంబనేచ్ఛ మగుడఁ బరితుష్టి నొందుటయు నది ముఖపానంబుచేత సఫలమగుట యని మీ యభిప్రాయమగుఁగదా.

౧౬. క్రమంబున మదాశయుండు కుటుంబసహితంబుగా మరలి కళాపూర్ణుసేవకు వచ్చెననియుఁ దత్కారణంబున మధురలాలసకుఁ గృశత్వంబు మానెననియు నది యౌవనం బునఁ గళాపూర్ణు ననుగ్రహంబువడసె ననియును మీ కాముకత సముచితవచనరచనలఁ దేటపఱిచితిరి.

అనియిట్లుపల్కి శారద మరల నిట్లనియె. మహాత్మా! యిదియంతయు నిట్లగునో కాదో యానతీవలయు. అనుడుఁ బగమేష్ఠి యిట్లే యగుట తప్పదని నవ్వుచుఁ బలికెఁ. వాణి నవ్వి యవ్విధాత యథార్థవాదిత్వంబునకు మెచ్చుచు నిట్లనియె. పరిహాసోక్తులపట్ల నైన మీవలన బొంకు వినముగదా! అనుడు, పద్మజుండు తనప్రియభామిని పల్కులకుఁ బ్రమోదంబునందియుండె.

అని యిట్లుగాఁ గనకగర్భుండు మిక్కిలి రహస్యముగాఁ బలుకుల వెలఁదితోఁ జెప్పి నట్టి సరసపుకథ వినిపించి యాశుకవు తనకథ వినుచున్న రాజేంద్రున కిట్లనియె. రాజ చంద్రా! అట్లాదంపతులు రమశేళితమిసూ, నేను తిర్యగ్జంతువు నని గణియింపకయో యివ్విధంబునఁ జెప్పుకొనుచుండ నే నాపల్కులు వినుచుండియు నానడుమఁ గదిలిపోఁ జడిసి యుంటిని. తదనంతరము పంజరంబు వెడలి గంతులిడుచు నేను పైకి రాఁగని యా యింతి యింతవఱకును జిలుక యున్నది యను జ్ఞాపకములేక మనము మాటలాడుకొనుచుం టిమి. అని యలుగఁగా విధాత యని విన్న నేమాయె నని సమాధానము చెప్పి యూరకొనియె.

పదియవ ప్రకరణము.

—०※०—

రంభ చిలుకతో సంభాషించుట.

అంత నొక్కనాఁ డయ్యంభోజసంభవు సేవింప నిర్జరేంద్రుండు రా నతని వెంట రంభయు వచ్చియుండె. ఇంద్రుం డాలోనికిఁ జన రంభ వెలినిలిచి యచ్చటి విశేషముల నరయుచుండె. నేను నచ్చోనుండు పంజరముననుండి వాగ్దేవి మణితవిశేషము నాత్మకు సుఖ మగునటులఁ బల్కుచున్న నన్నుఁ జూచి యిట్లనియె. ఓ శుకవనితా! నీ వీవిచిత్రపు పలుకు నయ్యవారిసేవాసమయమున నమ్మవా రుగ్గడింపఁగా నేర్చితివి కాఁబోలు. అని యడుగఁగా నేను దాపురం బెఱుఁగనిదాన నవుటంజేసి తత్స్వరోదయంబైన తెలుంగును దత్ప్రభవమైన కథయు నామూలాగ్రముగా వివరించి చెప్పితి. అంతట రంభ యతి ప్రేమతోడ దానినే మరలఁ బలుకు మన నేనాపలుకునే రెండుమూఁడుమాఱులు పలికితిని. అంతట నజునిరాణి యచ్చటికేతెంచి కనుబొమలు ముడివడ నన్నవలోకించి, యోసీ! యేమికథలు తలపెట్టినదానవు. నీవు పెనుద్రిమ్మరికూఁతలదానవేగదా. ఇట్లొనర్చుటం

జేసి జాగిలజన్మమున భూలోకములో జనియింపుము పొమ్మని శాపం బిచ్చె. రంభ సరసిజసంభవుని రాణి చేయుచున్న కోపసంరంభంబునకు వెఱచి యచ్చోనుండెను మణిమయ స్తంభంబు వెనుక నొదిగియుండె.

వాణీహిరణ్యగర్భ సంవాదము.

అంతఁ గమలాసనుండు వచ్చి-ప్రాణేశ్వరీ ! యింత యలుకపలుకులు పలుకుటకుఁ గారణంబేమి ? యని చిఱునగవుతోఁ దన వనిత ననునయించె. అపుడు వాణి యతనితో నిట్లనియె. వింటిరా యీచిలుక దుండగము. మున్ను ద్యానవనిలో మన మాడుకొనిన యాకథ యాద్యంతము రంభతోఁ జెప్పుచున్నది. నే నాపల్కులు గోడచాటుననుండి వినుచుంటిని. అని యతినిష్ఠురముగఁ బల్కిన విని పరమేష్ఠి యిట్లనియె. అయ్యయో! చిలుకకొఱకా యిట్లు కోపించుట. చిలుక యీకథలోని మంచి చెడ్డల నేమి యెఱుఁగును? నిర్దయవృత్తి దాని నిట్టి బెట్టిద మగు తిట్టు తిట్టుదురే. యని వాణి కుత్తరం బిచ్చి లోకగురుండు నన్నుంజూచి కరుణాతిశయంబున నిట్లనియె.

ఓ చిలుకా! మీయమ్మ శాపమ్మునకు నేఁ గా దన నేరితంబు. అది యట్లే యనుభవించి యనంతర జన్మంబున మదాశయుం డను తపపతికి మధురలాలస యను తనయవై జన్మించి కళాపూర్ణుం డను రాజునకు భార్యవై యనన్యసాధారణంబు లైన యైశ్వర్యభోగంబు లనుభవింపుచు సహజం బైన పరమపాతివ్రత్యంబున సకల ధర్మంబులను సాధించి కృతార్థురాల వయ్యెదు, విచారింపకు, మని యానతిచ్చె. అట్టిమాటలువిని శారద చతురాననున కిట్లనియె.

మహాత్మా ! యేమి మీరు కలవరింతలోఁగూడ మదాశయుండును, మధురలాలసయును, గళాపూర్ణుండు ననుచుఁ బల్కుచున్నారు. ఇంతట నైన వానిని మీరు మరువరు కావలయును. అనుడు నవ్వుచు ధాత యిట్లనియె. పువ్వుఁబోఁడీ ! భవదీయవదనవర్ణనా సంబంధికథలయందు సంతతము నాకుఁ గలవరింతలు గలుగుట నైజమే గదా. అది యటుండనిమ్ము. ఇలాతలంబున నింక ముందుఁ గళాపూర్ణుం డను రాజు పుట్టఁగలండు, ఆరాజునకీ శుకసుందరి ధర్మపత్నియుఁ గాఁగలదు. అని కమలోద్భవుండు పలికిన వాణి యిట్లనియె. నాథా! యారాజుకథ యెట్లుండఁగలదో యానతీవలయు ననుడు లోకేశుం డిట్లనియె.

వనితామణీ ! మునుపు నీవు వినిన యాకథయు నీకథయు నొక్కటియే. ఇదివరలో భూతార్థముతోఁ జెప్పినక్రియలకు భవిష్యదర్థక్రియ లుంచినం జాలును. ఇంతియ గాక శ్రోతృజనాపేక్షానుసారంబునఁ దత్తన్మిత్రోపాఖ్యానంబులచేత నిదియు కొంత విస్తరితంబుఁ గాఁగలదు. దాని నంతయుఁ జెప్పఁ బనియేమి? ప్రధానకథాభాగంబు మాత్ర మింతియే. అనుడు, సరస్వతి యద్భుతంబంది యొక్కింత విచారించి యిట్లనియె. మీరు చెప్పినదంతయు బాగుగనే యున్నదికాని, యాకళాపూర్ణునకు సముఖాసత్తి యనునది

తండ్రియును మణిస్తంభుం డనువాఁడు తల్లియు నెటు లయ్యెడు నని సందియంబు పొడముచున్నది. అదియు నగునా? అనుడు చతురాననుండు నవ్వుచు నిట్లనియె. మందగమనా! దాని కొకసందియము ముండునా. అదియు నీచేష్టావిశేషంబుచేత నే కాఁగలదు. అనుటయు వాణి యిట్లనియె.

నాథా! మీరు సృష్టికర్తలు; ఎట్లెయ్యది చేయ నుద్దేశించిన నది యట్లే చేయఁ గలరు కాని యీకథాస్థితి యిఁకముం దెన్నటికినిఁ గలనైనఁ దలపెట్టవలదు. మన మేకాంతముగాఁ జెప్పుకొనిన వృత్తాంతము వెంటనే మరల నిక్కడనే పుట్టినది. ఇంతమాత్రముతోఁ జాలక యిఁక మీఁద నిది పృథివిపైఁగూడఁ వెలయఁగల దని చెప్పితిరి. సంతసము మీఁదియు, నగుబాట్లు నావియు నైనవి. ఇంక నైన నన్ను మన్నించి మీర లూరకుండుటకై వేఁడుకొనుచున్న దానను; దయచేసి యీకథను గుప్తంబు గావింపుడు, అనుడు, సరసిజభవుఁడు నవ్వుచు నిట్లనియె. హా ! హా ! నీమాటలు నాలుక చివరనుండి వచ్చినవికాని నాభినుండి వచ్చినమాటలు కావుగదా. ఆత్మశృంగార లీలల యశ మేరికప్రియ మగు. నీ మనోవాక్కు లేకీభవించియే యుండిన నీనాలుక కొనతో నీముక్కు నంటుకొనుమా చూతము. అని సరస్వతీదేవితోఁ బలుక నాపె నవ్వుచు, నాథా! మీరింతచలమున సమర్థింప నాకు నేఁగా దన నేల? అదియునుఁ గాక కళాపూర్ణరాజు ధరణిపైఁ బుట్టగలండట! రాజ్యంబును జేయునట ! అతని చారిత్రం బెట్లుగనో వెలయఁగలదట! ఇది యంతయు నిశ్చయంబే యైనచో దానితోడనే మన రహస్యకథ జగద్వ్యాపక మగుటయు నగుఁ గదా, ఇదియేగదా మీ నిశ్చితాభిప్రాయము. అనుడు, ముందుగ మనకథ వెనుకగ నీకథ వెలయఁగల దని ధాత నిశ్చయించి పలికె. అటులైన నది వెలయుభంగు లెవ్వియో తెలిపెదరుగాక యని పితామహుం బ్రార్థించి, వాణి నన్నుం గనుంగొని యిది ప్రస్తుతము భూలోకములో వారాంగనయై పుట్టఁగలదు. అందు నేతద్బోధశంక నెఱయ లేదు. అనిపల్క రంభ యిప్పు డెందుబోయె. దానికిఁ దగినబుద్ధి సెప్పవలసియున్నది. అనుడు, నప్పుడంతి గడగడవడఁకుచుఁ గంబపుమఱుఁగు వెడలివచ్చి యడుగుల కెఱఁగినఁ జూచి వాణి దానిని లేలెమ్ము! నీవీకథ యెక్కడఁ దడివిన నాలా గెఱుంగుదు గదా. జాగరూకతతో నుండుము, అని పల్కు వాణి వాక్యంబులకు విధి నగుచు నిట్లనియె.

లలనామణీ! నీలాగు మఱి యెవ్వ రెఱుంగుదురు. ఈకథ నిఁక జెప్పినట్టివారును వినినట్టివారును భూతధాత్రియందుఁ బుత్త్రపౌత్త్రప్రపౌత్త్రాది బహుసంతతి దనర్చుచు జిరకాలంబు ప్రచురసంపదభివృద్ధిశోభిత శుభసౌఖ్యంబులం గాంచెదరు. ఇది యంతయు నవశ్యంబు మదీయాశీర్వాదంబుగా నెఱుంగు మని పల్కిన పతిం జూచి భారతీసతి యిట్లనియె. ప్రాణేశ్వరా! మీచలము సాగినఁ జాలును. మీరు నిర్ణయించిన పద్ధతి నిరర్గళత ధాత్రిం బ్రవర్తిల నిండు. అని వాణియు నామోదించి పలికె,

ఓధాత్రీధవా! నేనపు డచ్చోటు వాసి యీభూలోకంబున ద్వారకానగరంబున వారశారినై జన్మించితిని. ఆజన్మమందు నాకుఁ గలభాషిణి యనునామంబు గల్గియుండె. అందుండి వాణీశాపవిధిఫలము నాలీల గడపితి. ఇపుడు నలినజుని దయావాక్యఫలముగా నాకీజన్మంబు లభియించినది. పూర్వజన్మంబున శక్తిగుడిలో నాకీ దివ్యహార సందర్శనంబు కలిమిం జేసికదా యది జ్ఞప్తికివచ్చి యిపుడు క్రమ్మర రెండేండ్లకు దీనిం గంటినంటిని, అని యాబాలిక తనపూర్వజన్మవృత్తాంతం బంతయు నత్యాశ్చర్యంబుగ వివరించి చెప్పిన నలఘువ్రతుండు లేచి యాశిశువునకు సాష్టాంగనమస్కారం బొనరించి యిట్లనియె.

ఓబాలికామణీ! తొల్లిటి జన్మములో నీవు కలభాషిణి యను పేరితో నుండి చేసిన నర్తనములలో నొకటి నా కిపుడు తార్కాణ యయ్యె. అనుడు నారాజిట్లనియె. ఓయలఘువ్రతోత్తమా! నీకిపుడు తార్కాణయైన వృత్తాంత మెద్దియో దానిం దెలిపి మాకర్ణంబులఁ దనియింపుము. అనుడు నలఘువ్రతుం డద్దాని నీక్రింది విధంబునఁ జెప్పం దొడంగె.

అలఘువ్రతుండు కలభాషిణి చరిత్రను చెప్పుట.

మహాప్రభూ! నేను తెలిసికొనినవఱకుఁ గలభాషిణి వృత్తాంతంబుఁ జెప్పెద. ఆ యింతి ప్రసంగవశంబునఁ గళాపూర్ణుని వృత్తాంతంబు తన మిత్త్రిలతోఁ బల్కుచుండ నే నద్దాని వినుచుంటిని. అట్టి మహామహుం డెవ్వఁడో యతని చారిత్ర మెట్లు విన నగునో యనుకోర్కె నాకుఁ బొడమె. సంపదర్థమై నే నప్పటికిఁ దపంబుచేయ నరుదెంచియుంటిం గావునఁ గళాపూర్ణుని కథ వినుటవలన నాకు సంపల్లాభముతో ననేకలాభంబులు కల్గుట తెలిసికొని తదర్థమయ్యె తపంబు సేయఁ బ్రారంభించితిని. అట్టి నాతపంబు రెండేండ్లు పూర్ణమగుతఱి మృగేంద్రవాహనాశక్తి నాకుఁ బ్రత్యక్షమై నా వాంఛితంబు వేఁడుమనియె. నే నపుడు నాకుఁ గల కళాపూర్ణకథాకర్ణనకుతూహలంబు తెలిపి దానిం దయసేయ నమ్మహాశక్తిం బ్రార్థించితిని. అంత నొక మహావాతంబుపుట్టి నన్నెత్తి తెచ్చి యీసభలోఁ బడవైచె. ఇట్టి నారాకకు మూలంబైనకథ కలభాషిణివలననే వినియుంటిఁ గావున నాకుఁ గలభాషిణి వాక్యములలో నొకటి తార్కాణయయ్యె నంటి; అని యారాజున కుత్తరంబిచ్చి యలఘువ్రతుండు చేతులుమోడ్చి బాలికతో నిట్లనియె.

ఓబాలికామణీ! నీవాక్యములు తప్పవు; నీవు మధురలాలసవైన విధంబంతయుఁ జెప్పితివి. ఇఁక నీనాథుం డగు కళాపూర్ణనృపాలుని చూచుభాగ్యంబు నా కెప్పుడు కల్గునో దానింగూడ దయచేసి చెప్పు మనుడు నాబాలిక యిట్లనియె.

ఓక్షితిసుపర్వా! ఇఁక నది నేఁ జెప్పి నలెస్సయై యుండదు. దానినంతయు వీరందఱు నెఱింగినవారే గావున నావృత్తాంతము వీరినే యడిగి తెలిసికొనుము, అనుడు నాభూసురోత్తముఁడు సభాపతిం జూచి యిట్లనియె. నృపాగ్రణీ! బాలామణివాక్యములు వింటివి

గదా. కావున మీరెఱింగిన వృత్తాంతమంతయుఁ దెలియపఱచవలయు నని ప్రార్థించెద. అదియును గాక, యిది యేలోకము? ఏపుర మిది యగును. మీ రెవ్వరు.? ఈబాలిక యెట్టిది? ఈవృత్తాంతములం దెలియక కలగుఁడువడిన నాచిత్తభ్రాంతి నివారితము గాదు. కావున నాచిత్తవిభ్రాంతిని మీరు నివారింప నగును. ఇతవఱకీసంప్రశ్నంబుల కవకాశము చిక్కక యుండె. అనుడు నజ్జనపాలుండు తన సభావృత్తాంత మీక్రింది విధంబున వక్కాణించి చెప్పె.

కళాపూర్ణుఁడు విప్రునకుఁ దన్నెఱిఁగించుట.

ఓభూసురగ్రామణీ! నీవలె నాకు నే వృత్తాంతము లడుగుటకు నవకాశ మింత వఱకుఁ జిక్కదాయెను. ఈబాలికవలన నద్భుతపుకథలు వినుచుండుటం జేసి యట్లయ్యె. ఆబాలిక నావృత్తాంతము నాముఖముననే నీవు వినవలయు నని చెప్పెం గావున నావృత్తాంతంబు చెప్పెద వినుము. నేనే ఆబాలిక సూచించిన కళాపూర్ణుఁ డను భూపాలుఁడను. స్వభావుఁ డిచ్చిన మణియిదె; ఇవియె సింగిణియు నమ్ములు నని తనకడనుండు వానినెల్ల చూపించె. ఇట్లు చూపి తన సన్నిధినున్న పురోహితులంజూచి వీరే ప్రథమాగమాదు లనం బఱగునలుగురు పురోహితులు. అని సత్వదాత్మ దిక్కు మొగంబై యతండె సత్వదాత్ముఁడు. అని మహాశయుంజూపి యతఁడె మదాశయుండు. అతని వామభాగంబున నొప్పునదియే యతని ధర్మపత్ని యగు రూపానుభూతి. ఇపుడు మనల నందఱ నద్భుతవృత్తాంత సముద్రమున ముంచిన యీయరిదిబాలికయే మదాశయరూపానుభూతుల ప్రియపుత్త్రిక. ఆమె వక్కాణించినట్లుగ నే మదాశయుఁడు తొలుత మమ్ము భజించియుండి కొంత కాలము మమ్ము విడిచిపోయె. మరల నతఁ డిపుడె నాకడ కరుదెంచి నాదర్శనమున సేదదేరినదని తాను తనజాయయుఁ దమశిశువు నీ పసిఁడితొట్లెలో నిడి నాముందట నీసభాస్థలిలోఁ బెట్టి యున్నారు. ఈబాలిక పేరు మధురలాలసయే యగును. మఱియు ఈదేశ మంగదేశం బననొప్పు. ఈపురి పేరు క్రముకకంఠోత్తరపురమే. నేను జనియించిన పట్టణము మాత్రము కాసారపురము. అది యిచ్చటి కనతిదూరంబుననే యున్నది. ఇన్నియుఁ జెప్పనేల? వెరసుమాట యొక్కటి గలదు. ఆపద్మసంభవుఁడు తనరాణితోఁ జెప్పినకథలోని వారి పేళ్లును వారివర్తనంబులు నొక్కటియును దప్పక యుండుటయేకాక మాపేళ్లును మావర్తంబులును మాకే మిగుల నద్భుతము నొనరించుచున్నవి. శారదావదనప్రతిబింబాది నామకర్మకల్పనాకేళీప్రకారమాత్రములై యెందు నొకింతయైన విజ్ఞోడుపడక సమ మగుట యెట్లు కల్గెనని యెంచుచుఁ బైకథకు విఘ్నంబు సేయఁగూడ దని యూరక వినుచుంటిమి. ఇట్లుండఁ దత్కథావృత్తాంతము మాసందేహముల నన్నిటిం దీర్చె. అనుడు నలఘువ్రతుం డత్యాశ్చర్యంబునందుచుఁ గళాపూర్ణుంజూచి యిట్లనియె.

ఓ రాజోత్తమా! పద్మగర్భుఁడు చెప్పినకథయే నిజమైన నీకుఁ దల్లి మగవాఁడును దండ్రి యాఁడుదియుఁ గావలసియుండుఁగదా. అది యెట్లు పొసగియుండు నను సంశయ మొకటి బాధించుచున్నది. దానినిగూడ నివారింప వలయును. అనుడుఁ గళాపూర్ణుం డిట్లనియె.

ఓభూసురవర్యా ! ఆవాక్యము నాకుఁగూడ విచిత్రముగనే కానిపించుచున్నది. మన యీసంశయ మబ్బాలికయే తీర్పవలసి యున్నది. కావున నీవృత్తాంత మామె నడిగి తెలియుము. ఆవాక్యముతోటిపాటుగ నాబాలిక యావనఫలకథయును అవిదితార్థములే గదా. భావివృత్తాంతమునకేమి, యది యటుండనిమ్ము. మొదటి వృత్తాంతమునే ప్రథమములో నడుగుము. అనుడు నలఘువ్రతుండు కృతాంజలియై బాలికంజూచి యిట్లనియె.

ఓబాలికామణీ! మున్ను నీకారణమున నీకళాపూర్ణకథాకర్ణనాఫలమహత్త్వంబు వింటిని. పదంపడి మజ్జపంబునకు ఫలంబైన యీ రాజుకథాకర్ణనమును నీవలననే కలిగెను. అదియునుగాక యిట్టి కల్యాణచరిత్రముగల మహానుభావునిఁ బ్రత్యక్షంబుగ సందర్శించుటయు నీవలననే సంభవించె. ఇఁక నత్యద్భుతంబైన యీకళాపూర్ణునిప్రకారంబును వినవలసియున్నది. నాయెడఁ గరుణించి యాకథయును సవిస్తారంబుగాఁ దెల్పి నన్నుం గృతార్థుం జేయవలయు నని ప్రార్థించుచున్నాఁడను.

మణిస్తంభ సుముఖాసత్తుల విశేషములు.

అపు డా యరిదినిసు విట్లనియె. ఓభూవిబుధోత్తమా ! నీవు నన్నడిగిన వృత్తాంత విశేషము లత్యమానుషము లగునవి. వానిఁ వినిపించెద వినుము. మున్నీవు మృగేంద్రవాహన గేహమునకువచ్చునప్పటికి మణిస్తంభుఁ డను సిద్ధుఁడును, సుముఖాసత్తి యనునతని పత్నియు, నాతో భాషించుచుంట నీవెఱిఁగినదేకదా ? ఆదంపతుల పూర్వవృత్తాంత మీ సభ్యులు వినవలసియున్నది. అని వారి పూర్వవార్తనంతయుఁ దావినినయట్లుగా సభ్యులకుఁ జెప్పి యనంతరవృత్తం బిట్లు చెప్పందొడంగె. ఆదంపతు లనంతరము యోగప్రవర్తనముల నమ్మహాశక్త్యాలయంబున జితేంద్రియత్వనియతి గొన్నినాళ్లుంట నీవు నెఱుంగుదువు కదా. అంతట వారామృగేంద్రవాహనాలయంబు విడిచి యొకవనంబునకుఁబోయి యచ్చో యథేష్టమన్మథక్రీడల వర్తించుచుండిరి. అపుడు సిద్ధుఁడు తనభార్యంజూచి నీవు పురుషుఁడవు గమ్ము, నేను నాతిరూపుఁ దాల్చెదను. అని విపరీతరతేచ్ఛ నతఁడుపలికిన సుముఖాసత్తి యిట్లనియె. నాథా! నీవు కోరినట్లే నీవు స్త్రీత్వమునందుము, నేను బురుషత్వమునందెదను. అనుడు సత్వరముగా వారి స్త్రీత్వపురుషత్వములు విపరీతము లయ్యెను. అట్లు తమతమ రూపములఁ జూచుకొని వా రిదియేమియనుచుఁ గొంతతడవు చింతించుచుండిరి. అపుడు సుముఖాసత్తి తన్నిమిత్తము మనంబునకు జ్ఞప్తికి రాఁగని యిట్లనియె.

ప్రాణేశ్వరా ! ఇట్టి మన రూపవిపరీతకారణము నాకు జ్ఞప్తికి వచ్చినది. దానిం దెల్పెద వినుండు. తొల్లి నాజరత్కారుయము శక్తిసన్నిధి వదలుకొను సమయంబున 'లోకజననీ ! నన్ను సత్యవచనగా నొనరింపుము' అని యామహాదేవిం బ్రార్థించి యుంటిని. ఆ నాకోర్కి వృథమై చనదని యచటి శాసనస్తంభలిపియే సాక్ష్య మిచ్చుచుండునుగదా అనుడు నాసిద్ధుండు నౌ నౌ నని పల్కి యిట్లనియె.

సుందరీ ! నీవింకెద్దియుఁ బల్కకుము. ఎద్దియాడిన నెట్లగునో ! అని భవిష్యదర్థవశతచే నాసిద్ధుం డట్లుపల్కి వెండియు, ఓయంబుజాననా! ఒక చిత్రంబుఁ జూచితివా, తొల్లి నీకు గర్భము గాకయుండునట్లు నాకును, నాకూటమిన నీకు కొడుకు గల్గునట్లు నీకును శారదాదేవి వరద్వయ మిచ్చియుండె. ఆవాక్యము లేవిధముగా ఫలితమునకు రానున్నవో మన మూహింపలేముగదా. నే నిట్లే స్త్రీరూపంబునను నీవు పురుషాకృతినే యుండి కొన్నినాళ్లు విహరింతము. అనిన విని సుముఖాసత్తి యిట్లనియె.

ఓయనఘా ! నీవేరూపంబున నుండుమనిన నట్లేయుందును. నాకు నీవాక్యములే విధితుల్యంబులు గావున నీ చెప్పినయట్ల చేసెదను. అనిచెప్పి యాయింతి పురుషరూపంబుతోడను మణిస్తంభుఁడు నారీరూపంబుతోనుండి యతనుక్రీడలఁ గ్రీడింపుచుఁ గాలంబు గడపుచుండిరి. ఆసమయమున సుముఖాసత్తి మణిస్తంభ నామధేయములు స్త్రీత్వపురుషత్వంబుల వెంబడిన వీడ్పాటుగా సంకేతంబులు చేసికొనిరి. ఇట్లుండి నానావిహారయోగ్యములైన యారామప్రదేశంబులు చూచువేడుక తమసింహంబు నాకర్షించి తదారూఢులై దాని యథేష్టసంచారవేగంబునకు సంతసిల్లుచు నంతరిక్షంబునఁ జరియించుచుండిరి. అని యిట్లుగాఁజెప్పి మధురలాలస యలఘువ్రతుంజూచి యిట్లనియె.

ఓవిప్రోత్తమా ! కళాపూర్ణమహారాజామిథునమున కట్టి సమయములో జనియించుటంజేసి యితనికిఁ దల్లి మగవాఁడును, దండ్రి యాఁడుది యని చెప్పవలసియున్నది. అనుడు నలఘువ్రతుండు కళాపూర్ణుఁ డుదయించిన కథయును దెలుపఁ బ్రార్థించుచున్నాఁడ ననుడు, నాబాలిక యాకథనంతయు వినిపించెదను; సావధాన మనస్కులై యుండుఁ డని సభ్యులకుం దెల్పె.

పదునొకండవ ప్రకరణము.

అట్లు సభ్యుల నుత్సహించి మధురలాలస యిట్లనియె. విప్రోత్తమా ! ఆసుముఖాసత్తి మణిస్తంభులు గగనచారులై పోవుచుండి యొకచో నెదురుగ నొకపురంబు కాన్పించుడు సుముఖాసత్తి మణిస్తంభున కిట్లనియె. ప్రాణనాథా ! మన కెదురుగ నొకపురం

బద్ధ్వజగోపురంబై పరిఖావలయంబుతో నొప్పుచున్నదికంటే. అపరిఖవలయము ప్రాకారంబుల తోడఁ బద్మాకారము గా ప్రాకటనొప్పంగా దీనిని గాసారపురం బని తెలుపుదురు. ఇది యొకకాలని చొప్పున నున్నయది. తోరణము లింద్రధనువుతోరణ మొనర్పనున్నట్లుగా నున్నవి. పూర్వ మీపట్టణము నేఁ జూచియుంటిని. దీనిలోఁ గొంతకాలము నివసించి యుండ మనసగుచున్నది. అనిపలికి నేలకుఁ దనసింగమునుపట్టి డిగ్గనుటికి యాజంపతులు పురవీథిఁ బోవుచుండిరి. తత్సమయంబునఁ దత్పురం బేలు నేలిక వాహ్యాళినుండి తిరుగ స్వపురంబున కేతెంచుచుండె. అపుడు రాజమార్గమున నడుచుచున్న సుముఖాసత్తిరూప లావణ్యంబు లాపోవక నిర్నిరీక్షుండై యారాజీక్షించె. ఇట్లు వీక్షించి తనలోఁ దానిట్లు చింతించె. ఈవఱకే ననేకుల రాజుల జయించి వారి రాణివాసములనుండు గుబ్బెతల ననేకులఁ గంటిని. కాని వారికీ యబ్బురపు సౌందర్యాదులు గలుగుట లేదు; ఇట్టి సౌందర్యవతి కేకారణంబుననో యీసిద్ధునిసంబంధంబు గల్గె. నేనిపుడు మెల్లన వారి కడకుఁ బోయి వారివలననే వారివృత్తాంతము దెలిసికొనియెదనుగాక, అని నిశ్చయించుకొని యాపుడమిఱేఁడు తన వారువంబు డిగ్గనుటికి తానొక్కరుండ యాసిద్ధుని జేరంబోయి యిట్లనియె.

ఓమహాత్మా ! మీ రెచ్చటినుండి యిట వచ్చితిరి ? ఇపు డెందుఁ బోవుచున్నారు? మీమీ నామధేయంబు లెవ్వి ? అనుడు, నాసిద్ధుండు తనపేరు మణిస్తంభుఁ డనియుఁ దనభార్య యగు నాపూఁబోఁడిపేరు సుముఖాసత్తి యనియు నుత్తరంబిచ్చె. అంత నారాజన్యుం డా కురంగలోచన యెత్తెఱంగున నైనఁ దనసన్నిధి నుండుటయే చాలు ననియు, మీఁదట భాగ్యవశంబున నెట్టులైన నగుఁగాక యనియు నిశ్చయించుకొని కపటవినయంబు దోఁపఁ గృతాంజలియై మిమ్ము భక్తితోఁ గొన్ని నాళ్లు మాసదనంబున నునిచికొని శక్త్యను సారముగఁ బరిచర్య సేయ నా మది యుత్సహించుచున్నది. కావున నా యభిమతంబు నెఱవేర్పఁ డని ప్రార్థించె. ఆమాటలువిని మణిస్తంభుఁడు త్వర యంగనవదనం బవలోకించె. దాని కాపె సమ్మతింప నవటియునికి తనకు సమ్మతమే యని రాజునకుం దెల్పె. ఆమాటకా పృథివీపతి యతిసంతోషమునంది యాదంపతుల నొకమణిమయశిబికారూఢులం జేసి నిజాలయంబునకుఁ దోడ్కొని చనియె. ఇట్లుగాఁ దెచ్చి యచ్చో నొక మణిగేహమున నాజాయాపతులఁ గుతుకంబునవిడియించి పలుమాఱు తా నచటికి వచ్చుచుఁ బోవుచునుండె. ఇట్లుండి కొన్ని నాళ్లయిన పిదపఁ దన కా సిద్ధాంగనయెడలఁ బ్రేమ యున్నట్లుగా నాపెకు రహస్యముగాఁ దెలియు నట్లొనరించె. అపు డా లతాంగి తనకు గర్భజననశంక కలదని చెప్పి సిద్ధునిసుతుని సిద్ధునకీయక తా నన్యులఁ గలయ వలనుపడ దని చెప్పిపుచ్చె.

ఆ పిమ్మట యావారిజముఖికి వేవిళులుదయించె; గర్భసూచనలును గానిపించె. అట్లుగా నుండ నవమాసంబులు నిండె. అంత నొక్క శుభదినంబున దివిజదుందుభులు

మొఱయ సకలామరులును జయజయ శబ్దంబులు సేయ శౌర్య, గాంభీర్య, సౌజన్య, నీతి, సత్య, కీర్తి, ప్రతాపాది సకలగుణంబుల నొప్పారు నొకపుత్త్రరత్నం బుద్భవం బయ్యె. అనిచెప్పి యబ్బాలిక, సభ్యులారా! వింటిరిగదా, తొల్లి చతురాననుఁ డాబాలుని తలిదండ్రుల కాగంతుకంబులైన స్త్రీత్వపురుషత్వ నామధేయంబులు మాడక సహజ స్త్రీత్వ పురుషత్వ నామధేయంబు లవలంబించి యవ్విభునకు మణిస్తంభుండు తల్లియనియు, సుముఖాసత్తి తండ్రియనియుఁ బలికి యుండె. అట్టి లోకేశుని వాక్యముల కన్యథాభావశంక కలదే. అనిచెప్పి మనోలాలస మలయాళపుబ్రాహ్మణునితో మరల నిట్లనియె.

విప్రవర్యా ! ఆమణిస్తంభుఁడు పుత్త్రోదయమైన యనంతరము తన తొల్లింటి మగతనంబు తనకును, సుముఖాసత్తి యాఁడురూప మాపెకును గల్గునట్లుగా నాయమచేఁ బల్కించి యథాస్థితినుండి తనభార్యయుఁ దానును మణిస్తంభుఁడు తమతమ నామములతోఁ దిరుగ యోగాభ్యాసభాసురు లగుచుఁ గాసారపురంబునందే యుండిరి. వలయు నేని యీరహస్యం బంతయు వారివలననే తా రొక్కాణ చెసికొనఁ జను నని మనోలాలస పలికి యనంతర వృత్తాంత మిట్లు చెప్పందొడంగె.

ఓభూసురశిఖామణీ ! ఈరాజేంద్రుఁడు తల్లిగర్భంబుననుండి యుదయించినతోడనే యితని కతి విచిత్రలీల యావనోదయం బయ్యె. ఆవెంటనే స్వభావసంజ్ఞతో నొప్పు నొక సిద్ధుండు వచ్చి యొకమణియు, విల్లు, నమ్ములు నొసంగె. ఇట్లుగా నిచ్చిన యాసిద్ధుండే యీరాజునకుఁ గళాపూర్ణ నామకరణంబును జేసె.

అపుడు కాసారపురాధీశుండు కళాపూర్ణుని సద్యోయౌవనాది మహోన్నతిని విని యతఁ డొకదివ్యపురుషుఁ డగు నని భావించి యట్టిమహాత్ముని జనని నే నితరసాధారణ వనితగా భావించి కామించి పాపంబుఁ గట్టికొంటి నని పశ్చాత్తప్తుం డయ్యెను. అటు పిమ్మట నారాజు సుముఖాసత్తి కడకుం జని, యోసాధ్వీ! నిన్నెఱుఁగక నే నొనర్చిన యొగ్గులు నీమది నుంపక నన్ను క్షమియించి రక్షింపవలయును. అని ప్రార్థించి యాయింతికిఁ బ్రియంబుగా నాబాలునకు నిజాధిపత్యంబు సర్వంబును సమర్పించి తాను మంత్రియై కొలిచియుండె. అని యిట్లుగా నాబాలిక కళాపూర్ణుని తలిదండ్రుల గాథలు ప్రారంభించి యతని జన్మవృత్తాంతంబు వఱకుఁగల వార్తలు ననంతరచరిత్రమును దెలుప నలఘువ్రతుండు—ఓబాలికామణీ ! స్వభావుఁ డనంబరఁగు సిద్ధుఁ డెవ్వండు. అతఁ డేమికారణమునఁ గళాపూర్ణునకు మణియు శరచాపంబులును దెచ్చియిచ్చె. ఆకథగూడ విన నభిలాష నొడముచున్నయది. కరుణించి దానిం దెలియఁ జెప్పుము అనుడు నబ్బాలిక యిట్లనియె.

స్వభావసిద్ధుని వృత్తాంతము.

ఓవిప్రోత్తమా ! స్వభావుఁ డనంబరఁగు సిద్ధునివృత్తాంతము జెప్పెద నాకర్ణింపుము. అతఁడు సుముఖాసత్తిజనకుండే, శారదాపీఠమున నుండు పూజరిబ్రాహ్మణుఁ డతఁడే. అతఁడు

తనకుఁ బుత్త్రిక పుట్టిన యనంతరము తన భార్యను విడిచి దేశాంతరి యయ్యె. అట్లు గాపోయి పోయి యతఁడు మాహురీపురీరాజముం జేరె. అచ్చో నఖిలయోగవిద్యారహస్యకోవిదుం డగు దత్తాత్రేయమహాయోగిని తన తపశ్చర్యచేఁ బ్రసన్నుం జేసికొనియెను. అపుడా యోగీంద్రుని కృపచేత నా బ్రాహ్మణుఁడు యోగవిద్యావిశేషములు సమస్తంబును నభ్యసించె. ఆ యోగవిలసనమున భావ మెప్పుడును దనయందే పాదుకొలుపు మంచుటం జేసి యతనికి స్వభావనామ మొప్పె. అన విని కేల్మోగిచి యలఘువ్రతుం డా బాలికామణి కిట్లనియె.

ఓ చిన్నితల్లీ! నీవు సకలబోధములకు నిధివి. నీ వెఱుంగని వెవ్వియును లేవు. కావున నా కా యోగవిధానంబు సర్వంబు నుపదేశింప వలయు ననిన వల్లె యని, ఓ విమలాత్మా! జీవాత్మ పరమాత్మల సంయోగమే యోగ మనంబడును. దాని కంగము లెనిమిది; తత్ప్రకారం బంతయు నీకు వినిపించెద వినుము, అని చెప్పం దొడంగె.

యోగోపన్యాసము.

ఆ యోగాంగములు వినుము. ౧ యమము. ౨ నియమము. ౩ ఆసనము. ౪ ప్రాణాయామము. ౫ ప్రత్యాహారము. ౬ ధారణము ౭ ధ్యానము. ౮ సమాధి. అనఁ బ్రసిద్ధంబులై యుండు. అందులో నొక్కొక్కటి యనేకభేదంబులు గలది యగును. వాని నెఱింగించెద వినుము.

౧. యమము.

యమము పదివిధంబుల నొప్పారు. అవి యెవ్వి యనఁగా—౧ సత్యము. ౨ దయ. ౩ క్షమ. ౪ ధృతి. ౫ మితాహారము. ౬ ఆర్జవము. ౭ బ్రహ్మచర్యము. ౮ అస్తేయము. ౯ అహింస. ౧౦ శౌచము. వానిలోఁ బరులకు బాధపెట్టని బొంకు సత్య మనంబడు. పరులయార్తి కోర్వకయుండుట దయ యనఁబడును. ఇతరుల తప్పుల యెడఁ గోపింపక సైరించుట క్షమ యనఁబడును. ధన బంధు వియోగాదులు కల్గినప్పుడు జిత్తము కలఁగనీండక బట్టియుంచుట ధృతి యని చెప్పఁబడును. సన్న్యాసి కెనిమిది కబళములును, వనవాసికిఁ బదియాఱు కబళములును, గృహస్థునకు ముప్పదిరెండు కబళములును, ఇతరులకు మితభోజనము సేకొనుటయు మితాహార మని చెప్పఁబడును. విహిత కర్మముల నొనర్చునప్పుడును నిషిద్ధకర్మముల మానునపుడును జేయు వాఙ్మనఃకాయకర్మప్రవర్తనమే యార్జవ మనంబడును. సన్న్యాసికిని, బ్రహ్మచారికిని, నైష్ఠికుం డగు వనస్థునకును, స్త్రీసంగమము త్రికరణంబులయందును గూడదు. అట్లు చేయకుండుట వారికి బ్రహ్మచర్య మనంబడు. గృహస్థునకు ఋతుకాలమున స్వభార్యాసంగమంబును, అన్యస్త్రీలతో విహరింపకుండుటయును గృహస్థబ్రహ్మచర్య మనఁబడు. అస్తేయ మనఁగ నెందును చోరకృత్య మెఱుఁగకయుండుట యెప్పుడు

నేజంతువునకు నెగ్గొనర్పకయుండుట యహింస యనఁబడును. శౌచము రెండువిధంబులై యొప్పు. అందు నొకటి బాహ్యశౌచము. అందు బాహ్యశౌచము మృత్తువలనను జలమువలను నాచరింపఁబడు శరీరశుచిర్భూత మగు కార్యంబు. అంతశ్శౌచ మనఁగా ధర్మముతో నధ్యాత్మవిద్యచేతఁ జేయంబడు శుద్ధి.

౨ నియమము

నియమంబు పదివిధంబులై యుండు. ౧ తపము. ౨ సంతోషము. ౩ ఆస్తికత్వము. ౪ దానము ౫ ఈశార్చనము. ౬ సిద్ధాంతశ్రవణము. ౭ లజ్జ. ౮ మతి. ౯ జపము. ౧౦ వ్రతము లనునవి. అందుఁ గృచ్ఛ్రము చాంద్రాయణము మొదలగు కార్యములవలనఁ గాయశోషణము చేయుట తప మనంబడును. ౨ లాభము బొందినపుడు తృప్తినంది యదియు చాలు నని యుండు హృదయవృత్తి సంతోష మనఁబడును. ౩ పుణ్యమును పాపమును గలవను విశ్వాసము గలిగియుండుట యాస్తిక్య మనంబడును. ౪ న్యాయార్జిత మగు ధనము నర్థులకొసంగుట దానం బనఁబడును. ౫ పరమేశుఁ డగు హరిం బూజించుట ఈశార్చన మనఁ బడును. ౬ వేదాంత శాస్త్రంబులు వినుచుండుట సిద్ధాంతశ్రవణ మనం బడును. ౭ వైదికలౌకికవర్తనలకు దూర మగు నింద్యకర్మంబులందుఁ గల జంకు లజ్జ యనఁ బడును. ౮ విహితము లగు సదాచార విధులయందు శ్రద్ధ మతి యనఁబడును. ౯ వేదబాహ్యము గాని మంత్రమును గురూక్తమార్గమున జపించుటయును, అధీత మగు శ్రుతిస్మృతీతిహాసాదులఁ బఠియించుటయును జప మనఁబడును. ౧౦ శిష్టాచారంబును, జతుర్విధపురుషార్థదంబు నగు నుపవాసాదికము వ్రత మనఁబడును. ఈ యమ నియమంబులు గలవాఁడు ఆసనప్రాణాయామాదు లగు నుత్తమ ప్రయత్నముల కధికారి యగును. అని తెల్పి యా బాలిక యాసనభేదంబుల వివరించెద నని యిట్లనియె.

౩ ఆసనము

ఆసనంబు లనేక భేదంబులఁ బ్రవర్తిల్లు. అందు ముఖ్యంబు లెవ్వి యనఁగా:— 1 స్వస్తికాసనము. 2 గోముఖాసనము. 3 పద్మాసనము. 4 వీరాసనము. 5 సింహాసనము. 6 భద్రాసనము. 7 ముక్తాసనము. దీని నే కొందఱు వజ్రాసనమనియు, నింకొక కొందఱు గుప్తాసనమనియుఁ బల్కుదురు. 8 మయూరాసనము. 9 పశ్చిమతానము. ఇట్టి యాసనముల వలన శరీరమునకు లఘుత్వము కల్గును. సమస్తరోగములు హరియించును. ఇంతియ కాక సమస్తపాపములుగూడ నశింపఁగలవు.

౪ ప్రాణాయామము.

ధౌతాదియోగషట్కర్మములచేత దేహశుద్ధిం గావించికొని, భద్ర, సింహ, పద్మాసనాదుల పరిచితిచేతఁ బ్రకాశించు రేచక పూరక కుంభకము లనఁ నొప్పు ప్రాణాయా

మము నభ్యసింపఁ గ్రమక్రమముగ వాయుజయంబు గలుగును. అంతట శరీరములోని నాడు లన్నియు సంసిద్ధిం జెందు. అపానమునకు రెండుఁ వ్రేళ్లకుమీఁదను దాని పైభాగము నందుండు పావకుని స్థానమునకుఁ బైని తొమ్మిది వ్రేళ్లకు దిగువను నాడీకందం బుండును. శరీరమునం దంతట డెబ్బదిరెండు వేలనాడులు వ్యాపించి యుండును. వానిలో నూఱు ప్రశస్తములు. వానిలోఁ గూడ నొక్కటి ముఖ్యము. పైనివివరించిన పదునాల్గు నాడులలోపల సరస్వతీప్రముఖంబు లైన యేకాదశనాడులు జిహ్వాది వ్యాపారకారణం బులై పరఁగు. ఇడా పింగళ లను నాడీద్వయంబు వామ దక్షిణ నాసారంధ్రగామిను లగుచుఁ బ్రాణాయామసాధనంబై ప్రవర్తిల్లు. ప్రధానంబైన సుషుమ్నాహ్వాయనాడి బ్రహ్మ నాడి యనంబరఁగు. అది నాడీకంద మధ్యవర్తినియై బ్రహ్మరంధ్రగామినియై యుండు. అట్టి బ్రహ్మనాడిలోఁ బవనంబు ప్రవేశింపఁజేయుట యుత్తమయోగం బనంబరఁగును. ఇది నాడీవిషయముగల ప్రాణాయామాంగము. ఇఁక ప్రత్యాహార ప్రకారంబు వినిపించెద వినుమని యిట్లనియె.

౫ ప్రత్యాహారము.

యోగశాస్త్రవేత్తలు ప్రత్యాహారము నాల్గువిధములుగా వివరించెదరు. ఎట్లన—

౧. ఇంద్రియార్థములయందు నింద్రియములఁ బ్రవర్తిల్లనీయక మఱియించి త్రిప్పుట.

౨. ఇంద్రియార్థములందు నింద్రియములు చరియించినను అది సమస్తంబు నాత్మ యనియే మనంబున భావించుట.

3. నిత్యకర్మముల నన్నింటిని యాత్మయందే యల్లప్పుడును చేయుచుండుట.

౪. శరీరమందుండు పదునెనిమిది మర్మస్థానములలో వాయువును నిలుపుట.

ఇట్టివానిని సంప్రదాయానుసారముగ నభ్యసింపుచుందురు. ఇది ధ్యానప్రకారము. ఇఁక ధారణక్రమ మెఱింగించెద వినుమని యిట్లనియె.

౬ ధారణము.

౧. పాదాది జానుపర్యంతము పృథివీస్థానము. దీనికి బ్రహ్మ అధిదైవతము.

౨. ఆపృథ్వీస్థానము మొదలు నాభిపర్యంత ముదకస్థానము. దీనికి విష్ణువధిదైతము.

3. ఉదకస్థాన మాదిగా హృదయకమలపర్యంతము అగ్నిస్థానము. దీని కధిదైవతము రుద్రుఁడు.

౪. అగ్న్యాదిగా భ్రూమధ్యపర్యంతము వాయుస్థానము. దీని కధిదైవతము ఈశ్వరుఁడు.

౫. వాయుస్థానము మొదలు మూర్ధ్నిపర్యంత మాకాశస్థానము. దీని కధిదైవతము సదాశివుఁడు.

ఈపైస్థానములలో నైదేవతలను ప్రణవముతో ప్రాణాయామభంగిని ధారణ మొన రింపవలయును. అని తద్రహస్యవిశేషంబులును, బ్రాణాదివాయువుల తెఱఁగును, పదునెని మిదిమర్మములును, నాడు లుండు విధంబును, దెలిపి యింక ధ్యానమునకుఁగల విధానంబు తెలిపెద నని యిట్లనియె.

౭ ధ్యానము.

ఇది రెండు తెఱంగులై యుండు. అందు మొదటిది సగుణధ్యానము. రెండవది నిర్గుణ ధ్యానము. అందు మొదటిదానిం జేయుచుండ రెండవది సిద్ధించును. సగుణధ్యాన మనఁగా, శంఖచక్రాదిచిహ్నితుఁ డగు పురుషోత్తముని యాకారధ్యానము. రెండవది నిష్కలమైన ట్టియు నిత్యమైనట్టియు చిన్మయ మగు పరమాత్మరూపధ్యానము. ఇది యబ్బుట కిడుదు ర్లభము. ఇది ధ్యానప్రకారము, ఇఁక సమాధినిఁగూర్చి వివరించెదను.

౮ సమాధి.

మానసమును విష్ణువునందు లీనముం జేసి యించుకయుఁ జలింపనీయక యుండునట్లు చేయుట సమాధి యనంబడు ఇదియే యోగవిద్యా ప్రకారము. దీని మహత్త్వమునఁ జేసి దీనిలోఁ జెప్పిన ప్రకారము భావము తనయందు స్థిరముగా నిల్పుచు నాసిద్ధుం డుండుటం జేసి యతఁడు స్వభావుఁ డను పేరం బరఁగె. ఆసిద్ధుఁడు నిత్యము చేయు నాత్మయోగ సమాధికి విజనస్థలంబుఁ గావలయు నని కోరి యనేక దేశములు తిరిగి దైవగతివశమున జన్మ దేశమును గాంచి అందలి శతతాళదఘ్న మను హ్రదము విక్కలి వివిక్త స్థల మని దాని యందు జలస్తంభనామహిమంబున నివసించి యుండె. అట్లుగా వసియించి యోగా రూఢుండై యుండుచో నాసిద్ధుఁడు తన యల్లుఁ డాలిపై నలిగి మఱుగునఁబడి తన్నుఁ జేరఁ గాంచి యతనికి వయఃస్తంభమణి మొదలగువాని నిచ్చి పంపెను. కాని పోయిన బంధము మరలఁ దగిలించుకొన నేల? యను తలంపునఁ దనవనితతోఁగల సంబంధంబు స్వభావుండు మణిస్తంభునకుఁ జెప్పఁడాయెను. ఇట్లు కొంతకాలము చనియె.

పండ్రెండవ ప్రకరణము.

స్వభావసిద్ధుఁడు శ్రీశైలమునకు వచ్చుట.

స్వభావసిద్ధుఁడు శతతాళదఘ్నమను హ్రదంబునఁ గొన్ని వత్సరము లుండి తాను నిర్ణయించుకొనినకాలము ముగియ యోగనిష్ఠవదలి హ్రదమునుండి బయలువెడలి యోగిజన సేవ్యం బగు శ్రీశైలముంజూడ నేఁగెంచె. అందు సిద్ధమణుల నీను గనులును, సిద్ధౌషధ మూలికలును, సిద్ధరసధునులును నిండియుండె. ఆనగరాజంబునకుఁ బాతాళగంగ కాలి

కడెమునా నొప్పుచుండును. ఇవ్విధంబున పవిత్రచరిత్ర మహిమంబుల నతిశయిల్లుచున్న యన్నగోత్తముం బత్యంత భక్తియుక్తులఁ జొగడుచు నధిరోహణంబుచేసి మల్లికార్జున మహాదేవసేవావిధానం బనూనంబుగా నడపి, యదృచ్ఛావిహారంబున సంచరించుచుండె. ఇట్లుండి యచ్చో భృగుపాతంబున కాయత్తపడుచున్న మణికంధరుంజూచి సిద్ధుండిట్లనియె.

స్వభావసిద్ధ మణికంధరుల ప్రసంగము.

ఓతీర్థవాసీ! నీ వెవ్వండవు.? ఇట్టి సాహసకార్యంబున కుత్సహించుటకుఁ గతంబేమి? అనుడు, మణికంధరుండు— స్వామీ! నేను మణికంధరుం డను పేరుగలవాఁడను. జాతిచేత గంధర్వుండను. అని తనభృగుపాతకారణము వివరించుటలోఁ దనపూర్వవర్తనంబు సకలంబును వివరించి చెప్పె. ఆ వృత్తాంతంబునంతయు నాస్వభావసిద్ధుండు ఉత్కంఠమానమానసుం డగుచు విని, మఱియు వారల వృత్తాంతము మణికంధరుఁ డెఱిఁగినవఱకు సంప్రశ్నించి తెలిసికొనియె. ఇట్లుగాఁ దెలిసికొని యాసిద్ధుండు తాను సుగాత్రి తండ్రి యగుట మణికంధరునితో వివరించిచెప్పె. ఇట్లుగాఁ జెప్పి తనవర్తనం బంతయుఁ గూడ వివరించి యిట్లనియె. గంధర్వవర్యా! శారదాదేవి యా సుగాత్రి శాలీనులకిచ్చిన వరంబు లెట్లు ఫలితంబు లగునో యని చింతించెద. అయినను, మణికంధరా! అవి యట్లట్ల సఫలంబుగాక మానవు, అని మరల నిట్లనియె.

నీవు నారదుని పరిచర్య వలన రుక్మిణీకాంతునికతను సంగీతవిద్యాసిద్ధిం గంటివి. ఆమునీంద్రుని కరుణచేత హరిభక్తుండవై తీర్థయాత్రాదిపుణ్యంబుల నందితివి. నడుమను ప్రమాదవర్తనమున నందిని శాపము రాజ్యఫలముగాఁ బనుపఱచితివి. అధికపుణ్యమునఁ బొందఁదగిన గంధర్వజాతియందు పుట్టినాఁడవు. కావున నీవు రెండవజన్మములోఁ బుణ్యవాసనావశంబున సద్గుణసంపన్నుఁడవై యుండఁగలవు. ఇట్టి నీవు భృగుపాతంబు నేల యపేక్షింపవలయును. అనుడు మణికంధరుం డిట్లనియె.

సిద్ధశేఖరా! నేను శ్రీమహితులై శుచివర్తను లైనవారికిఁ దనయుఁడనై జనియించుటకుగా నీభృగుపాతంబు నవలంబింపఁ దలంచితిని. అనుడు సిద్ధుం డిట్లనియె.

గుణభూషణా! నీకు కూఁతురు నల్లుండును పవిత్రచరిత్రులుగాఁ గాన్పించిరేగదా. అట్టి వారు నీకుఁ దల్లిదండ్రులుగాఁ గోరుట మంచిదియేకదా, దానంజేసి నాకుఁ బ్రియమగు కార్యముఁగూడఁ జేసిన ఫల మెక్కువగును గదా, అట్లుగా నీవు నావిషయమై చూపిన ప్రియ మూరకపోవునది కాదు. నీకే నొక మహోపకారముఁ జేయఁగలను. ఒక పూర్వపుగాథను వివరించెద వినుము. నేనొకప్పుడు నాగురువులను దైవసంప్రేరణచేత నాత్మపరిరక్షఁజేయు నొకపట్టెము దయసేయుఁ డని యడిగినాఁడను. అపుడు వారొక కత్తిని సృజియించి దాని నాకు దయసేయుచు నిట్లనిరి. శిష్యా! ఇది యమోఘోద్యమము. నీవంశ మిఁక క్షత్త్రివంశము కాఁగలదు. అనిన నాగురువులవాక్యమును విచారించి

నను నీవు నాయల్లునకు గొడుకవై పుట్టుటకే యనుకూలించుచున్నది. నీవు క్షత్త్రిధర్మ మత్యుజ్జ్వల మగుచుండఁగా జగతి నేలఁగలవు. నీకుఁ గల తక్కిన సంశయము లన్నియు విడిచి నామాట నాచరింపుము, అనిపల్కెను. అపుడు మణికంధరుండు సిద్ధునితో నిట్లనియె.

ఓసిద్ధవర్యా! అట్లేని నాయాత్మచందము న్వినిపించెద వినుము. నేను పునర్జన్మము నందుటకు నందు రాజానౌటకును గారణములు కలవు. కాని పవిత్రులయింట జనన మొందు కాంక్షంజేసి యిపుడీశ్రీశైలమునందు భృగుపాతము జేయనున్నాఁడను. అయినను నామది లోని మెరమెర మానుట లేదు. నేనెంతటి రాజానైనను, నేనెంతటిపావనులయింటఁబుట్టినను, అంతశ్శత్రువులను బహిశ్శత్రువులనుజయించి ప్రవర్తించుట కడుదుర్లభము. కావున నావగపు నాచిత్తంబును గలంచుచున్నది. అదియునుంగాక రాజ్యమున్మహోభూతంబు సోఁకినవెంటనే యెట్టి సుగుణవంతునకైనఁ గొంత చీకుఁదనము, గొంతమూకత్వము, గొంతబధిరత్వము, గలుగక తప్పదు అట్టి కొఱఁతను వేదశాస్త్రాదిసర్వవిద్యలయందునుఁ బూర్ణులగుసద్బ్రాహ్మణగోష్ఠీమూలముగ నివారించుకొనవచ్చు నని నీవూహించెదవేని దానికిఁ గల ప్రతిబంధముల వివరించెద నాకర్ణింపుము. భోగ్యవస్తుతృష్ణాహీనుం డగు పృథ్వీపాలుని దానములు యోగ్యములు కాకుండుటంజేసి యట్టిదానముల నైకొనుటకుఁగా నుత్తమబ్రాహ్మణులు తటస్థింపరు. అట్టి పూజ్యము లగు వారి న్వెదకి తెచ్చుకొను భాగ్యము ప్రభుని కబ్బుట దుర్లభము. అట్లు చేయలేని బ్రతుకును బ్రతుకేనా! కావున నట్లుత్తమద్విజాలచిత్తముల నారాధించి తెచ్చుకొనియెదనన్నఁ దద్వివేకం బెన్నినాళ్ళకుఁ గలుగవలయు. ఎంచి చూడ నవి యొక్కొక్కటియు మిగుల నసహ్యంబులగుచు హృదయశల్యంబులైయున్నవి. నీవు సకలకార్యఘటనాతిసమర్థుండవు. నాకుంగల విచారముఁ దొలంగించుమార్గము చూపి రక్షింపుము. అను మణికంధరువాక్యంబులు విని స్వభావసిద్ధుం డిట్లనియె.

మణికంధరా! నీకుఁగల విషాదము నిపుడే నివారించెదఁ జూడుము. నాగురుం డగు దత్తాత్రేయయోగివర్యుని కటాక్షమున సకలజయావహ మగు నొకవిల్లును, నవశరములును సృజియించుచున్నాఁడను. దత్తాత్రేయునిదయ కకృత్య మెన్నఁడైన నుండునా? వీనితోటి పాటుగా నొకయద్భుత మగు మాణిక్యమునుగూడ సృజియించెదను. ఇది నీ సేవనందుటకుఁగాను సర్వామ్నాయశాస్త్రాదివిద్యలచే నొప్పు పండితుల నాకర్షింపఁ గలదు. అట్టిమణినిఁ జూచినమాత్రముననే తదాశ్రితాళికి క్షేమాయురారోగ్యములు లభియింపఁ గలవు. అని యాసిద్ధుం డాక్షణముననే యొకసింగిణివిల్లును, వాడిమెఱుఁగుటమ్ములును, గెంజాయందనరారు మణిశలాకయుఁ, దనమాహాత్మ్యప్రకాశితముగా సృజియించి, యో మణికంధరా! వీనింజూచితివిగదా, వీని నీవు నుదయమొందు కాలముదనుక వేచియుండి యాయుత్తరక్షణముననే నీకొసంగెద, నామాట నమ్ము, మనుడు మణికంధరుఁడును మహాప్రసాదం బని సతసించియుండె.

సిద్ధునికడకు మదాశయాగమనము.

ఇట్లుగా మణికంధర స్వభావసిద్ధు లాడుకొనుచుండు వాక్యము లచ్చోఁ బోవుచున్న మదాశయుం డను రాజు చెవులంబడియె. ఆరాజు శివరాత్రి మహోత్సవసమయములో మల్లికార్జునదేవుని సేవించుతలంపున భార్యాసహితుండై స్వపురోహితులు వెంటనంటిరా నావర కాపర్వతంబునకు వచ్చియుండె. వైసిద్ధునిఁజూచి యతనికడకుం బోయి యతని నామ మడిగి దానిం దెలిసికొనినతోడనే మహామోదముతో నతనిపదంబులకు సాష్టాంగదండప్రణామంబు లాచరించె. ఇట్లుగా నాచరించి లేచి చేతులు మొగిడ్చి యిట్లనియె.

ఓ సిద్ధవర్యా! మల్లికార్జునదేవసేవామహిమము మాకిపుడు సఫలం బయ్యెను. నిన్ను వెదకి వెదకి వేసారితిమి. ఇచట నిన్నుఁ గాంచుటంజేసి మాకన్నులున్న ఫలము గంటిమి. అవియును సాఫల్యగరిమం జెందినవి. నేను హైహయవంశసంజాతుండను. నాపేరు మదాశయుండు. ఈ యువతి నాభార్య. ఈ దివ్యతేజులును ఋగ్యజుస్సామాథర్వణ మహాగమక్రమసంప్రదాయ ధురంధరులు నగు వీరు నాపురోహితులు. నేను నాభార్యయు ధీమహత్త్వ గుణాభిరాములగు నీమాపురోహితుల సహాయమున మాహురీపురనిలయుం డగు దత్తాత్రేయయోగీంద్రుని బహువిధారాధనలఁ గొలిచితిమి. కార్తవీర్యార్జునుఁడు చక్రవర్తియై బహుప్రసిద్ధిఁ గాంచుట యాయోగీంద్రు నాశ్రయించుటంజేసి కాదే, అట్టి మహారాజువంశజుఁడ నగుటంజేసి నేను నామహాయోగి నావిధ నాశ్రయించి భజియించితిని. ఆదత్తాత్రేయయోగివరుం డంతట నాకు స్వప్నంబున దర్శనం బొసంగె. పిమ్మట నాతో నీక్రిందివాక్యంబులు పల్కె. ఎట్లనఁగా:—

మదీయ భక్తుండు స్వభావుం డను సిద్ధుం డొక్కరుండు గలఁడు. అతనివలన కాంక్షితం బీడేరు. అతనిదర్శనంబు సాధింపుము. అని చెప్పిన నేను దేవర యున్నచోటును స్వరూపము నెఱుంగక యనేకవిధంబుల నరయుచు నిచ్చటికి నిద్దేవతామహోత్సవంబునకు వచ్చి యిప్పటి మీమాటలలో దత్తాత్రేయశబ్దంబు వినఁబడ నది యద్దియో తెలిసికొని పోవుదము గాక యని చేరనేతెంచితిమి. మాకుఁ జిరప్రార్థితం బైన దేవరదర్శనంబు దొరకె. ఇంక మాయభీష్టములు సిద్ధించినట్ల యయ్యె. అనియిట్లు మదాశయుఁడు పల్కినవాక్యములవలన స్వభావసిద్ధుండు తనగురువులు తన్నుఁ బ్రసిద్ధంజేయుటకుఁ బన్నినపన్నుగడగా నద్దాని భావించి యద్భుతసంతోషంబు లంతరంగంబున నెంతయు గంపలింప 'నింతభక్తవత్సలుండవే' అని యమ్మునిం దలంచి కేలు మొగిచి యుండె. ఇట్లుగా నొనరించి యారాజుంజూచి సిద్ధుం డిట్లనియె.

రాజోత్తమా! నీకోరిక లీడేర్ప నేనెవ్వఁడను. అయిన నది మద్గురూక్త మని యంటివి గావున నానియతిచేత నేది యెట్లు కానున్నదో యది యట్లే కాఁగలదు. అట్లున్న

నీ వాంఛిత మెద్దియో వివరించి చెప్పుము. అనుడు, మదాశయుండు జయమును సంతతియును దన వాంఛితంబు లని విన్నవించె. అపు డా సంయమివరుండు మున్ను దా సృజియించిన ధనుర్బాణంబులు మణికంధరుం జూపుచు నిట్లనియె. ఓమానవనాథా! యీమణికంధరునకు భావిజన్మంబున విజయసిద్ధి యగుటకొఱకు నిప్పుడే నీ విల్లు నమ్ములును సృజియించియున్నాఁడను. కావున నీవతని కొక్కనికిఁ దక్క యితరరాజులచేతఁ బరాజితుఁడవు కాక యుండుటకును వారినందఱ నీవ జయించుటకును వర మొసంగితిని. అనుడు, మదాశయుఁడు గర్వంబున నిట్లనియె.

సంయమీంద్రా! మీకృప నాయెడఁ గలిగె: అదియ చాలును. కడమసంగతులకు నేనే చాలియున్నాఁడను. మణికంధరునకు ధనుస్సాయకముల నపుడు కాఁగలజయంబు తదితరకర్తృత్వమున సిద్ధింప నేర్చునా? అనియిట్లవలేపంబున మదాశయుండు పల్కినవాక్యములకుఁ గనలి సిద్ధుం డిట్లనియె.

ఓరాజా! మణికంధరుఁ డా యస్త్రప్రభావముచేత నిన్నీజన్మమునందె నిస్సంశయముగా గెల్చును. అట్లు గెల్చుటయేకాక నీచేతను నీకళత్రంబుచేతను నూడిగము చేయించుకొనఁ గలఁడు, అనుడు మదాశయుని పురోహితులు కేల్మొగిడ్చి సిద్ధునితో నిట్లు విన్నవించిరి.

ఓయుత్తమచరిత్రా! యీరాజున కేమి తెలియును. ఇతఁడు మూఁడుమాట లాడిన నాఱుతప్పు లుండును. మీతో మేము మాటలాడఁ గలమా, అట్టి మామాటలలో నుండు లోపములను మీ రెంచవచ్చునా, మీరు గురువులగుటఁ దలపోసి మిమ్ము వెదకికొనుచు వచ్చుటయే గుఱిగా నూహించి యీ నరపతికోరినకోరిక లెట్టులయిన నీడేరుప వలయును. అనుడు వారింజూచి సిద్ధుం డిట్టులనియె.

విప్రులారా! నామాటలు విధాతలిఖించిన వ్రాతలే సుఁడీ. కావున నవి తప్పక జరుగును. మీరాజు నేను చెప్పినవానిం దప్పఁ దక్కినరాజుల నందఱ జయింపఁ గలఁడు. నేఁ జెప్పినవానివలన జయింపఁబడుటయే గాక యుల్లమునందు విముక్తమానుఁడై యతనికి సేవయును జేయఁగలఁడు. మీరాజు తనమనిఁ గోరిన సంతానపుకోరికె కూడఁ బైవాని సేవసేయుతఱి దన భార్యయుఁ దానును దమయేలిక పూనిన యొకమణివిశేషము గనుఁగొనునపుడు ఫలియింపఁ గలదు. అనిపల్కిన సిద్ధునితో నాబ్రాహ్మణు లిట్లనిరి.

ఓమహాత్మా! ఈరాజు మాభోగములే తనభోగములుగా, మామాటయేఁ దనమాటగా, మమ్ము నడుపుకొనుచున్నాఁడు. ఇట్టి రాజు పరున కూడిగము సేయుచుండఁగా మాకిఁక సంసేవ్యుఁ డెవ్వఁడు కాఁగలఁడో యని విచారించుచున్నారము అనుడు, సిద్ధుం డిట్లనియె.

విప్రోత్తములారా! అట్టి సమయములో మీరాజున కెవ్వఁ డేలిక యగునో వాఁడే మీకు నారాధ్యుఁడు కాఁగలఁడు, అట్టి సమయములో నవీనప్రభ విభూషమణి మీ కెంతయుఁ బ్రమోదముం గావింపఁ గలదు. అప్పుడు ఈమదాశయుఁడును మీరును మీ

[illegible]తులు మఱచి సంతసమున నుండెదరు. కావున మీ రాజు మణికంధరుఁడు [illegible]నందాక యథేష్టవిజయవిహారంబులఁ బ్రవర్తిల్లఁగలఁడు అటుపిమ్మట నేఁ జెప్పిన [illegible] మణికంధరుని సేవ సేయఁగలఁడు. మీరును దన్మణిస్పర్శమహింబున మహానందంబు నందెదరు. అనిపల్కి స్వభావసిద్ధుండు వారి నందఱ ననిపి తానును మణికంధరుని వీడ్కొని నిజేచ్ఛం జనియె. ఆసిద్ధుని యమోఘప్రవచనానుసారంబుగ మదాశయుండును సకలశత్రుజయంబునఁ దేజరిల్లె. అనియిట్లు గా నాబాలిక వక్కాణింప నలఘువ్రతుం డిట్లనియె. బాలామణీ ! సిద్ధుఁడు చనినపిమ్మట మణికంధరుఁ డేమి చేసె. ఆవృత్తాంతముం గూడ దయతో నానతీవలయు ననిన నాబాలిక దాని నీక్రిందివిధంబునఁ జెప్పందొడంగె.

మణికంధరుని యనంతరవృత్తాంతము.

అట్లాసిద్ధుండు మణికంధరుని విడిచి వెడలినపిమ్మట మణికంధరుఁడు ధైర్యమును చలియింపనీయక పండితుల వాక్యానుసారము నియమవర్తనతో నుండి శుచియై యాపర్వతశిఖరం బెక్కి యుచితస్థితి నిలిచి యుఱుకుటకు సంసిద్ధుఁడై యుండఁగా నొక పెను మ్రోఁత వినఁబడెను. ఆట్టిమ్రోఁత కద్భుతంబందుచు మణికంధరుఁడు నలుగెలంకులఁ బరికింప నొకభామ యాత్యాతురతతో సమీపించి ధగద్ధగితాకాంత మగు నొక ఖడ్గ మతనిచేతి కందిచ్చుచు నిట్లనియె.

ఓగంధర్వవంశాగ్రణీ! నీవు చేయఁబోవు భృగుపాత ఫలమునకంటె నధిక మగు ఫలం బందఁగలవు. నీ వాపని మాని ప్రస్తుతములోఁ గల్గియున్న నీమహాక్షోభంబు నివారింపుము. అనుడు మణికంధరుండు తనయుద్యమమునుమాని నలుదెసలం బరికింపుచు వెండిగునుపములఁ బోలినట్టియు వెండికట్లగునుపముల ననుకరించు నేదుబందిముండ్లు వర్షము గాఁ గురియుచుండుట గాన్పించె. అపు డట్టి దారుణ శిలలీవృష్టి కత్యాశ్చర్య మందుచు మణికంధరుం డాప్రమదం జూచి యిట్లనియె.

ఓభీతకురంగాక్షీ ! ఈ యపూర్వశిలలీవర్ష మెక్కడిది? ఈ మహాఖడ్గముతో నే కార్యముఁ జేయు మని నాచేతికి వచ్చితివి? నీ వెవ్వతెవు? ఈవృత్తాంతమంతయు ముందుగఁ దెలియఁ జేయుము. అనుడు నాయింతి యిట్లనియె.

గంధర్వనాయకా! నేను చెప్పుటకుఁగాని నీవు వినుటకుఁగాని యవకాశము చాలదు. ముందుగా నీచేతిఖడ్గమున నీశిలలీవృష్టి నడంచి దానివెంబడినే వచ్చుచున్న దానవునిం దునుమాడుము. ఏదుబందిరూపంబున నున్న యొక రాక్షసుఁడు మిక్కిలి సమీపమునకు వచ్చి యున్నవాఁడు, వాఁ డిఁక నీ కెదురు రాఁగలఁడు. ఆదుష్టుఁడు మించి రాకుండ నతివేగంబున నడ్డుకొని వానిం దునుమాడుము. అని సత్వరంబుగాఁ బ్రార్థించిన నాయింతిం జూచి మణికంధరుం డిట్లనియె.

ఓచంచలాక్షీ ! నీవు భయపడకుము. నీవుపోయి భయపడుచున్న [illegible] భయము దీర్పుము. నే నిదెపోయి యా యమరవిరోధిం ద్రుంచివైచెద. అని [illegible]రుండు [illegible]భుజదండమునందుఁ బ్రచండమండలాగ్రమును ఝుళిపించుచు గిరగిరఁ ద్రిప్పి యొగురవైచిపట్టుచు బయలు వెడలె. ఇట్లుగా నత్యంతోత్సాహంబున మణికంధరుండు బయలువెడలి శిలలీసందోహమును దన ఘోరాసిం దునిమివైచుచు నాశిలలదనుజుం గాంచె. ఇట్లు గాంచి నిరంతరాసారంబైన తద్ఘోరశిలలీవృష్టి తనకృపాణ విహారణ విచిత్రవేగంబునఁ దుత్తుమురు సేయుచు నక్కపటదానవు నుద్దేశించి యిట్లనియె.

ఓరీ యవివేక రాక్షసా! ఈరూపవికారవృత్తివలన నీకుఁగలుగు లాభ మెద్ది ? నీవు చేయుం జగద్ద్రోహారంభము నిన్నుఁ జెయుపక విడుమునా, అని మఱియు నిట్లనియె.

సీ. దిగ్గజంబులకును దేరిమాడఁగరాక యేపారు గజదైత్యుఁ డేమియయ్యె
మొగులలోనుండి యమ్ములవానఁగురియించు నింద్రజిద్దానవుం డేమియయ్యె
విశ్వమంతయునిండి వృద్ధిఁబొందుచు సురాహితకారియగువృత్రుఁ డేమియయ్యె
జగమెల్లఁ జాపచుట్టుగ ఘనశక్తిచే నెసఁగు హిరణ్యాక్షుఁ డేమియయ్యె

గీ. వెండియును పెక్కుమాయల వెలయునట్టి వారు శంబరప్రముఖు లేమైరి వినవె
యకట గౌరిదురాత్మ యీవికృతిరూప మేమిటికివచ్చు నిదె వధియింతు నిన్ను.

అని యిట్లుగాఁ బల్కిన మణికంధరుంజూచి శిలలదనుజుం డిట్లుచింతించె. ఆహా, వీఁడెక్కడివాఁడు, వీఁ డచేతనుఁడో, లేక మతిభ్రమార్తుఁడో, లేక మదస్ఖలితాత్ముఁడో, లేక పుట్టువెఱ్ఱియో, కానన్నుఁ దన భుజసత్త్వమును ఎదిరిభుజసత్త్వము నెఱుఁగక యిట్లు సాహసించునా. విధాత వీని నిట్లుగాఁ బేరేచి యుండనోపు. అని మణికంధరుం జూచి యిట్లనియె. ఓమతిహీనుఁడా, నీవు బ్రతుకొల్లకున్న నాకెదురుగా రమ్ము, నీగ్రొవ్వ డంగించెదను. అనిపల్కుచు శిలలదనుజుఁడు తన శరీరమును కొంతయులచి యత్యుగ్ర శిలలీవృష్టిఁ గురియించి మణికంధరుఁడు మునుఁగునట్లుగా నొనరించె; అపుడు మణికంధరుఁడు తన ఖడ్గవిహారచాతుర్యముం జూపుచు నేదుముండ్లం దునిమివైచుచు రాక్షసుని సమీపించి వాని కంఠంబుందునిమి, వాని శిలల నడుమఁదగులుటంజేసి మణికంధరుండు గతాసుం డయ్యె.

పదుమూఁడవ ప్రకరణము

అలఘువ్రతుఁడు శిలలదనుజుంగూర్చి యడుగుట.

అట్లుగా నాబాలిక మణికంధరుని నిర్యాణ వృత్తాంతంబు దెలుపుటయును విని యలఘువ్రతుం డావెతో నిట్లనియె. ఓబాలికామణీ! శిలలుం డను రాక్షసుం డెవ్వాఁడు?

అతని నాశీలం దునిమించిన స్త్రీ యెవ్వతె యగు. ఆయిర్వురి వృత్తాంతంబును విన నత్సహించుచున్నాఁడను. అనుడు నాశికు వాయిర్వురి వృత్తాంతములను వివరించెద విను మని యిట్లనియె.

శలలదనుజుని వృత్తాంతము.

ఓవిప్రవర్యా! ఆశలలదైత్యుఁడు మహిషాసురుని దుర్గ సంహరించుటంబట్టి ఆదేవత యందు చలపట్టి యీదానవుఁడు దుర్గ కెటులైన నపకృతిఁ జేయు తలంపుతో నుండె. ఈరాక్షసునకు శల్యరూపత నుండుటంజేసి శల్యాసురుం డను నామంబుఁ గలిగె. వాని శలలములు గడ్డపారలవలె నుండుటంజేసి వానికి ఖనిత్రశలలుఁ డనియుఁ బేరుగలిగె. మహిషాసురసంహారం బొనరించుటంజేసి దుర్గయెడలఁ దనకుఁ గల్గిన బద్ధమత్సరంబున నీభూలోకంబుననుండుఁ జండికాయతనము లన్నియు నిర్మూలములుగాఁ జేయుదు నని యత్యాగ్రహంబున శపథంబుఁ జేసె. ఇట్లుచేసి భార్గవు దీవెనఁ గనినట్టియు ననర్గళ బలమహత్త్వముగలిగిన తాను దుర్గమశక్తిని దుర్గాశక్తికి వెఱువ నని నిశ్చయించుకొని శలలుఁడు మరల నిట్లు చింతించె. రమేశుఁ డొక్కఁడు మాత్రము రాక్షసకులనాశకుఁడుగాఁ గాన్పించుచున్నాఁడు. అతనికి మాత్రము దొరకక యుండునట్లు శాంతరూపమును ధరించిన ధార్మికునివలెనే కానిపించుచుండెద. అని యిట్లు విచారించుచు నా సమీపములోనున్న యొక వనములో సంచరించుచుండఁగా, దైవవశమున నావనికి నభినవకౌముది యను తుషారకరకిరణాప్సరోజాతికన్నె యొకతె వచ్చె. ఇట్లుగా వచ్చిన యాకోమలి విలాసవిభవంబున కచ్చెరువందుచు నా దనుజేంద్రుఁడు తన మనంబు మిక్కిలి హెచ్చిన పచ్చవిల్తుని పసచేతఁ జంచలభావము నందఁగా నాచంచలాక్షితో నిట్లనియె.

ఓ కోమలాంగీ! నాకు సమస్తలోకములును గొట్టినపిండియే, కావున నీవు కోరెడు పదార్థ మెట్టిదుర్ఘటమైనది యైనను నేఁ దెచ్చియిచ్చెదను. ఇంతియకాక రమణీయమగు నీరూపమునకుఁ దగినట్టి యేపురుషరూపము నైనఁ గామరూపినై ధరియింపఁ గలను. కావున నన్నేలుకొనుము, అని యిట్లు పలుకుచున్న రాక్షసుని వాక్యము వినియును విననట్లుగా నభినవకౌముది యభినయించుచుఁ జనుచుండె. అపు డా రక్కసుండు తన్ను ననాదరావలోకనములఁ దిరస్కరించి పోవుచున్న యువతింగాంచి కినుకవొడమ నిట్లనియె.

ఓహాలఁతీ! ఇట్లుగా నిన్ను వేఁడుచున్న నన్నాదరింపక పోవుచున్నావు. నీవు నాకుఁ బ్రియవైతి వని నే ననుకొనుచుండ నట్టి నాప్రియను ముట్ట నన్యుల కెన్నిగుండెలు గలవు. కావున నిన్నిఁక నేపురుషుని ముట్టనీయను. అనుచు నా దానవుండు బెదిరింపఁ జెప్పిన వాక్యముల కలిగి యభినవకౌముది యిట్లనియె.

ఓరాక్షసాధమా! నీకింత కండక్రొవ్వేల, నీకంత పంతమేయున్నచో నిన్ను మడియించిన వానినేగాని నేను వరియింప నని నేనును బ్రతిజ్ఞ పట్టుదానను. అని నిర్భయం

బుగా శపథంబు జేసె. అట్టి యావిలాసిని క్రూరవాక్యములకు విశేషముగాఁ గోపించియు నాదానవుఁ డెప్పటికైనఁ దన మనోరథావాప్తి యావిలాసినివలనఁ గాఁగల దను నడియాసతో నపుఁ డేకీడును చేయక యాయింతిం బోవిడిచె. అది మొదలుగ నాకన్నియ యాదానవుని మడియింప శక్తుఁ డెవ్వఁడు దొరకు నని విచారించుచుండె. ఆరాక్షసుఁడును దనను జంపఁ బూనువాని జంపు నుపాయ మెద్దికల దనియు, నావరము తన కెట్లు లభియింపఁ గలదను విచారము చేయుచు నుండె.

ఇట్లుండ నద్దానవుండు దైవవశంబున నొకనాఁడు మృగేంద్రవాహనాలయంబున కరుగుదెంచి అచ్చటి విశేషముల నరయుచు నందుఁ బ్రస్తరస్తంభ లిఖితాక్షరములు చూచి వానిం జదువుచుండె. అందు క్రింది పద్యము తనకోర్కె కనుకూలింప దానినే మఱిమొకపరి చదువుకొనియె. అది యెద్దియనఁగా:—

క. ఈమెఱుఁగుగండగత్తెర, చేమిడిదలయిచ్చు సాహసికుఁడు శిరంబ
ట్లే మగుడఁగ నదుకుకొనం, గామనిచంపుఁ దనుజంపఁగడగిన వానిన్.

ఇట్లు చదివి 'శుభస్యశీఘ్రం' మ్మనియుండ నిఁక నాలస్యమేల యని తదుక్తరీతిని గార్యంబంతయు నడిపె. ఇట్లు నడపి తత్ఫలసంసిద్ధి కెందును నెదురులేదని నిశ్చయించుకొని యాఖలుండు వెంటనే యమ్మహాశక్తి దేవాలయమునే నిర్మూలింప నాయత్తమయ్యె.

అభినవకౌముదియు నాశలలదనుజుని సంహరింపఁ దగు భుజబలాఢ్యు నరయుచుఁ దిరిగి తిరిగి మృగేంద్రవాహనాశక్తి శుభమహిమలు విని తనకోర్కె కనుకూలించు త్రోవ లచ్చో సమకూఱు నేమొ యనుతలంపున నాస్థలంబునకు వచ్చి చేరె. ఇట్లు వచ్చి హఠాత్తుగా ఖనిత్రశలలుంజూచి, హా వీఁ డెచ్చటినుండి యిచట ప్రత్యక్ష మాయె. దైవమా వీని నెట్లుగాఁ దప్పించుకొందు. అతి సమీపంబునకు వచ్చితి; ఏవైపునకుఁ దొలంగుదును; అని యెంచుచుండె.

ఇంతలో శలలదనుజుం డభినవకౌముదిం జూచి — ఓచకోరాక్షీ! నే నానాఁడు ప్రార్థింప నన్నుఁ గరుణింపక గర్వంబున నను బరిమార్చువానిం గాని వరియింప ననిపల్కితివి. ఇపుడు నేను పడసినవరవిశేషములు విను మని శాసనస్థపద్యార్థముం దెల్పె. అట్టి దనుజుని గర్వవాక్యములు సైరింపలేక యభినవకౌముది 'నేను నిను హరించు బలాఢ్యునే గాని వరియింప నంటి, ఆమాటల కెగ్గు గలదా! అనుడు నాదనుజుం డిట్లనియె.

ఓయంబుజాక్షీ! 'యెగ్గన' నిఁక నెట్టిది. జాతికంబున వ్రాసిన వ్రాత ననుసరించి నామూర్ధమును గండగత్తెరతోఁ గూలఁదన్నియుఁ గ్రమ్మఱ బ్రతికినాఁడను. అట్టి నన్ను మరలఁ జూచియు వృథావాక్యము లేల పల్కెదు. అనుడు నాయచ్చరమచ్చకంటి యచ్చట నున్న స్తంభలిఖితాక్షరములను దత్సమీపమున నున్న గండగత్తెరను దాని

నంటి క్రిందికిఁ గారుచున్న రక్తస్రావమును జూచి వానిపల్కులు యథార్థములే యనియును, తనమాటయే బూటకము కాఁగలదనియు నూహించి ఆకులపాటు నందె. ఇట్లుగాఁ గొంతతడ వుండి తన దుఃఖనివారణచేయఁ గలవా రెవ్వరున్నారు. అన్నింటికి నీమహాశక్తియే గలదు; ఆమెదే భారము. ఆమెపదంబులనే యాశ్రయించెద. అని యతివేగంబునం బోయి యాయింతి మృగేంద్రవాహన గర్భాగారంబు చొచ్చి, ఓయీమహాదేవీ! నన్నుఁ గృపఁజూచి రక్షింపుము: నిన్నే శరణంబు వేఁడితి, నని యాదేవిపదంబులు పట్టుకొని భూమిపయిం బడియుండె. ఇట్లుండి లేవక యమ్మహాదేవితో నభినవకౌముది తన తొల్లింటి ప్రతిజ్ఞా ప్రకారంబును ఖనిత్రశిలలుంచు పలికిన యుల్లసంపుఁ బలుకులును, నతని గర్వకారణంబును వినిపించి—ఓమహేశ్వరీ! యేను వెనుకముందుఁ గానక పల్కిన వాక్యములు నెఱవేర్చుకొనవలసివచ్చినది. నాకు నెట్టన బ్రతిజ్ఞాభంగము గాకయుండు త్రోవ యొకటి సంఘటించి రక్షింపవలయును. అని ప్రార్థించె.

శక్తిచేసిన యుపాయము.

మృగేంద్రవాహన యమ్మహారాక్షసునిచేత సంప్రాప్తమైయున్న తన సద్యోమహోపద్రవనివారణమునకుఁ దా నరయుచున్న యుపాయమునకు సహకారిగా నైన యభినవకౌముది రాక కెంతయు సంతసిల్లి యప్పటి యాయింతిప్రార్థనమునకు శీఘ్రప్రసన్నయగుచు నిట్లనియె.

ఓయింతీ! ఈరాక్షసుఁడు తన్నువధియింపఁ గడఁగువానిఁ జంపు వరమును దనమస్తకచ్ఛేద మిచ్చో నొనర్చుటంజేసి పడసె. కావున శాసనోక్తపద్ధతి తప్పదు. నీ ప్రతిజ్ఞయుఁ బరిగణించి యుపాయాంతరము నాలోచించెదను. అని కొంతసేపు చింతించి—ఓకమలవదనా! ఈ రాక్షసుని సాహసకార్యమువలన లభించిన వరబలంబునఁ దన్నుఁ జంపఁబూనువానిని వీఁడు చంపును. ఇంతియకాని తా నట్టివానిచే మడియుకయుండు నను నియమము లేదు. కావున నధికవిక్రముఁ డగువాఁడు వీనిం జంపి తానుం జచ్చును. ఆ నియమశక్తియు నీప్రతిజ్ఞయుఁ దలఁప వానిని సంహరించిన తీవ్రశౌర్యుని నీవు వరియించుట యొకటి కొఱఁతగా మాత్ర ముండు. అట్టివాని నతని రెండవజన్మము నందైన నీవు వరియించి నీప్రతిజ్ఞ నెఱవేఱుపవచ్చును. ఇపు డట్టివరుని మాత్రము నిర్ణయింపవలసి యున్నది అని కొంతతడవు చింతించి తదుపాయంబుగాంచి సంతసంబున, సుందరాంగీ! మణికంధరుఁ డను నొక గంధర్వకుమారుఁడు విశేషగుణవంతుఁడు గలఁడు. అతఁడు తన కొకకారణమున సంప్రాప్తమైన యవితథోద్యమ మను మహాసిని నా సన్నిధిని యుంచి పోయెను. ఆఖడ్గమును నీవు గైకొనిపోయి మణికంధరునిచేతి కిచ్చి, దాని చేత నీ శిలలదనుజాని దురాత్ముని జంపుము. ఈ రాక్షసుఁడు నీరూపుపసఁ జిక్కి నీవెంట నంటి రాఁగలఁడు. అట్టి వాని నలయింపుచు మణికంధరునికడకుం గొంపో

వుము. దనుజాండు నెంత వివేకియును నీమీఁద నించుక యైనఁ దెగఁడు. కావున నీవు మనంబు పదిలపఱుచుకొని యతివేగమ్మునఁ బొమ్ము. అని తనసన్నిధి నున్న ఖడ్గము నెత్తికొనిపొమ్మని తెల్పి మృగేంద్రవాహన మరల నిట్లనియె.

ఇమ్మహాఖడ్గమును దొల్లి దత్తాత్రేయుండు స్వభావనామధేయుం డగు సిద్ధున కిచ్చె. ఆ సిద్ధుఁడు మణిస్తంభుం డను తన యనుఁగుశిష్యునకొసంగె. అతఁ డిక్కడ నొక్క ప్రయోజనంబుకొఱకు గంధర్వుం డైన మణికంధరున కిచ్చె. ఆకారణంబున నిద్దివ్యాయుధంబు, మణికంధరునకు సంప్రదాయాగతం బగుచుఁ గార్యకారి యగుఁ గాని, యది యన్యులకుఁ బనుపుసేయదు. కావున దీనిని నీవు గొంపోయి యాతని కీయవలసి యున్నది. ఇప్పు డతఁడు శ్రీశైలంబున నొక్క శాపకారణమున భృగుపాతమున కాయత్తపడుచున్న వాఁడు. నీవు వేగంబ మణికంధరునికడకుం జని యాభృగుపాతఫలం బీ నీకార్యంబు చేయుటచేతనే యగు నని పల్కి, యతని భృగుపాతోద్యమమును మాన్పి యాదానవుని సంహరింప నియోగింపుము. ఆగంధర్వుండు రెండవమేనఁ గళాపూర్ణుం డను నామమునం బుట్టి నాసారనామకపురంబునఁ బుట్టఁగలఁడు. అతని నీవు వరియించి నీప్రతినఁ జెల్లించుకొనుము. నీవు ఇపుడు పోయిరమ్ము. అని మృగేంద్రవాహన యాజ్ఞ నిచ్చినతోడనే యభినవకౌముది మృగేంద్రవాహనకుఁ బ్రణమిల్లి ప్రయాణోన్ముఖ యయ్యె.

అభినవకౌముది మణికంధరునికడకు బోవుట.

ఇట్లు గాఁ బ్రయాణోన్ముఖయై యభినవకౌముది పైఁట బిగియించి దానిని నడుముపై బిరిచుట్టుచుట్టి కుంతలములు దృఢముగా ముడిచి వేగముతో నచ్చోనుండు మండలాగ్రమును దన శయమునఁ బూని యవక్రవిక్రమోదయభాసమాన మగు దర్పమున జయలక్ష్మియో యనునట్లుగా గుడి వెడలె. అపు డట్లుగాఁ బైటవచ్చు నాయింతిం జూచి, 'నాపై కత్తిదూసి వచ్చుచున్నది,— దీనిమూలముగ నీయింతి నాశనమందునేమొ గదా, నేనేమి చేయుదును.' అని వెఱచుచు నారాక్షసుం డభినవకౌముదితో నిట్లనియె.

ఓ,సుధాకరనిభాననా! నాపై నీకు వచ్చిన నీ యిష్టదైవముల యాన, నీవు వచ్చిన నే భయపడువాఁడను గాను, దుర్మతివై నీవు నాపై సాహసించినచో నిష్కారణముగ నశియించి పోఁగలవు. అనుడు నభినవకౌముది— ఓయిరాక్షసేంద్రా! నీవు నాహానికో ర్వక యిటు లాడఁగా, నేను నీమీఁదరా నంత యెఱుంగని దాననా? నీయిష్టానుసారముగానే నడిచెద, నన్నిదె చూడుము, అని యతనికి సంశయము కలుగని విధంబుననే యతని నతిక్రమించి యభినవకౌముది నడుచుచుండె. అపు డాయింతి పల్కిన వాక్యముల రీతి నిజాభివాంఛితమున కనుకూలమైనట్లే కానిపింప నారాక్షసుఁ డా యింతివెంటఁ బేరాసం జనుచుండె. అభినవకౌముదియును నతని నెడఁబాసిపోక యొక్కొక మిషఁ

గల్పించుకొని యొక్కొక్కచో పాలసించుకొని వానిం గూడ రానిచ్చుచుఁ బోవుచుండె. ఆ రాక్షసుండు నా ప్రయాణపురీతి యాత్మానురాగమై తన మానసమును హరియింప నుద్భూతానంగవిజృంభణమున దూరత్వము నెఱుంగకయే శ్రీశైలపర్యంతముం జనుచుండె. అంతట నారాక్షసుఁడు విసికి యా రాకేందువదనతో నిట్లనియె.

ఓచంచలాక్షీ ! నీతలంపువెంబడి నడిచెదను.' అని నీవు నాతోఁ జెప్పితివి. నీవిధ మారసిచూడ నన్ను భ్రమియించున ట్లున్నది. అనుడు నభినవకౌముది యిట్లనియె.

ఓ దానవోత్తమా ! నేను నీతలంపు పద్ధతినేగాక దాని నతిక్రమించి యేమైన నడిచితినా? నేను నిన్ను వధియింప వచ్చెద నను సంశయముతో నాపై నలిగి రావల దని యానలు పల్కితివి. అపు డేను 'నీతలఁపు పద్ధతిగా నడిచెదను' అని పల్కినదానను. ఆ మాటనే యిపుడును దప్పను. అనుడుఁ గ్రోధతామ్రాక్షుం డగుచు శిలలుం డాయింతితో నిట్లనియె.

ఓమాయలాడీ! నేను ప్రాణభయంబున కలిగెడువాఁడ నే. వధింపఁజాలక నా నిన్ని సరిణి కదుదవ్వుగా వెంటనంటి వచ్చితి ; ఆ నావ్యాపారము నసదుగాఁ దలఁచితివి కాఁబోలు. తెలుపకున్న నేరికిఁ దెలియకయుంట యుక్తమే యగును. నాలావుఁ బరీక్షింపఁ గోరికయే యున్నఁ బరికింపుము. అని శిలలదనుజుం డాపెకుఁ దాఁకక యుండు నట్లుగాఁ దన శరీరమునుండి ఘోరమగు శిలలవృష్టి గురియింపఁ దొడంగె. అవి గాఢత గురియ గిరులును దరుచయంబులును విరిగిపడఁ దొడంగె. జంతుసంతానములు నేలఁ గలయం దొడంగె. ఇట్లుగాఁ జేసి తన శక్తి యభినవకౌముది కెఱుకపఱిచి యిట్లనియె.

ఓయింతీ! ఇఁక వరియింపక వెడలఁగలవా? నీవు చనెడుచోటు లన్నియు నాబల స్ఫూర్తిచేతఁ బిడుగుబారిన డొంకయై పెంపడఁగి యుండఁగలదు. దానంజేసి నీ వఖిలభయ నిధానంబవు కాఁగలవు. నీ యన్వయంబున లేనట్టి తిట్టుఁదిన నీకుఁ దగునా? దాని నయిన నెంచి నను వరియింపుము. అనుడు నాయింతి మాఱువలుకక తడసినచోఁ గార్యంబు తప్పు నని యూహించి సత్వరంబుగా శ్రీగిరికిం జనియె. దనుజుండును వెన్కొని శిలలవృష్టిఁ గురియించుచుండె. అప్పు డప్పర్వతంబున శివరాత్రి మహోత్సవమునకుఁ జేరిన సకల దిగ్దేశజనసముదయంబున కా రాక్షసునిరాక నెఱింగించుచు వారిని గతులు చూచుకొమ్మని నుడువుచు నక్కన్నియ మణికంధరుం డున్నచోటికిం బోయి యతనిచేతికిఁ దన చేత నున్న యామోఘోద్యమ మగుఖడ్గంబు నొసంగె. అనంతర వృత్తాంత మీవరకే చెప్పి యుంటినిగదా, యని మధురలాలస తదనంతరవృత్తాంతంబుఁ జెప్పెద విను మని యలఘువ్రతునితో నిట్లనియె.

అట్లు అభినవకౌముది మణికంధరునిచేత శల్యాసురుం జంపించి యద్దానవుచేతఁ బొలిసిన మణికంధరుని రెండవజన్మంబునకై వేచి యుండె. అంత నతఁ డీకళాపూర్ణుండై

జనియించె. అపు డభినవకౌముది యుచితగతి నితనిం జేరి తన పూర్వవృత్తాంతంబు వివరించి దివంబునకుఁ జన నొల్లక యతని యాగజ్జీవంబు నతఁడు నిలిచినచోటనే నిలుపుట కొడంబడి గాంధర్వవివాహవిధి నిక్కళాపూర్ణుని వరియించె. అంతట మదాశయుండు స్వభావసిద్ధుని వచనప్రకారంబుగా సకలశత్రులజయించి గర్వించి యథేచ్ఛను సంచరించుచుండె. ఇట్లుండ నతఁడు గతివశంబునఁ గాసారపురిపై నేతెంచి యిమ్మహారాజుతో యుద్ధం బొనరించె. అట్టి యుద్ధములోఁ గళాపూర్ణుండు విజయ మొందఁ బరాజితుం డైనమదాశయుఁడు భార్యయును దానును దాసత్వంబునఁ గళాపూర్ణునికడ నివసింప నంగీకరించిరి. ఇట్లుగా నాదంపతు లిర్వురును దాసత్వంబునఁ గళాపూర్ణునకుఁ బనులు సేయుచుండు కాలంబున వారికీ మహామణిని సందర్శించుభాగ్యంబు గలిగె. తన్మహిమంబున నేను వారల కుదయించితిని. అంతట నాతల్లిదండ్రులు తేలికచిత్తంబున కెడసిరి. తత్ప్రకారం బంతయు సరస్వతీ కనకగర్భుల సల్లాపకథలయందు వినంబడియె గదా. అల్లెడబాసి వార లీ క్రముకకంఠోత్తరపురంబు వెడలి పోయి ప్రయాణక్షోభంబునఁ గృశత్వంబు నంది తేఱక యున్న నన్నుం జూచి జాలినంది నన్నుఁ గైకొని తిరిగి యీపురంబు చేరిరి. అది నేఁటిదిన మింతకు మున్నుగా జరిగె ; నేను నేతన్మాణిక్యవిలోకన మహత్త్వంబున నారోగ్యంబు నందితిని. అట్లుగా నేఁ బొదల హృదయంబుల ముదంబు నద్భుతంబు నొందుచు నివ్విధంబున నన్నవ్విభుని సన్నిధి నిడి నా తల్లిదండ్రులు మదీయ దౌర్బల్యనివర్తనప్రకారంబు లీరాజేంద్రునితో విన్నవించుచు సన్నుతి చేయుచున్నారు. మాతండ్రి పురోహితు లగు ప్రథమాగమాదులును మణిమహిమవశీకృతమానసు లగుచు నిమ్మేదినీశ్వరుఁ గ్రమ్మఱ నాశ్రయింప నిదె వచ్చియున్నవారు. అనుడు నలఘువ్రతుండు మగలఁ గేల్మోగిచి యబ్బాలికతో నిట్లనియె.

ఓదివ్యమహిమశోభినీ! ఆపురోహితు లెవ్వరు? వారి వృత్తాంత మెట్టిది ? దానిం గూడ నెఱింగించి నాకర్ణంబులఁ దృప్తినొందింపుము. అనుడు నాబాలిక చిఱునగవులను నలఘువ్రతునితో నిట్లనియె. శ్రోత్రియోత్తమా! వారి తెఱంగు నీవే యెఱుఁగుదువు. వారు నీసత్పుత్త్రులు; నీభాగ్యమే నిన్ను వారి నిచ్చోఁ జేర్చెను. అనుడు నలఘువ్రతుఁ డత్యాశ్చర్యంబు నొందుచు, ఓబాలికామణీ! నన్నుఁ గేలిసేయక యాప్రథమాగమాదులు నా పుత్త్రు లెట్లుగా నయిరో వివరించి చెప్పఁ బ్రార్థించుచున్నాఁడను. అనిపల్క యా విప్రుండు సభాపతింజూచి యిట్లనియె.

రాజేంద్రా! కని పెంచెడు కాలములోనుం డీపుణ్యశీలయుతు లైన నా సతులఁ బోఁగొట్టుకొనిన నాకును బుత్త్రు లున్నట్లుగాఁ జెప్పుట నమ్మ శక్యము గాదు; నగుబాటు ననగు. భార్యలు గతించిన మార్గముగూడఁ దక్కినవారియట్టిది కాదు. వారు సముద్రములోఁ బడిపోయినదే పోకగా మరలఁ దేలరైరి. అట్టి భార్యల యన్వయ సుగుణ సురూ

పములపైఁ గల మక్కువచేత నే నన్యకాంతాసంపాదనేచ్ఛ వదిలియున్నవాఁడ. అట్టి నాకీ ప్రథమాగమాదులు పుత్త్రికలగుదు రను నాకు సంశయ మైనఁ గలుగఁగదా! ఈకథ యొక్క టిరియే యసంగతముగాఁ గాన్పించుచున్నది. ఈవిచిత్రకథలతల్లి యీకథకొఱకుగా నెట్లు బట్టతలలును మోకాళ్లును ముళ్లుపెట్టి చెప్పనో విన వేడుక వొడముచున్నది. అనుడు, కళాపూర్ణుం డబ్బాలిక పల్కినపల్కు లెట్లు తప్పఁ గలవు. అయిన నబ్బాలిక నే యడిగి తెలిసికొనియెదముగాక. అని నవ్వుచు మధురలాలస నాలోకించి కళాపూర్ణుం డిట్లనియె.

బాలికాతిలకమా! ఈబ్రాహ్మణుని సందియంబు దీఱ నీ బ్రాహ్మణుని జన్మాదివృత్తాంతంబును, నితనికిఁ బ్రథమాగమాదులు పుత్త్రిక లైన ప్రకారంబును, వారు మదాశయనమునఁ బురోహితు లైనఁ తెఱంగును, వివరింపఁ జనును. అనుడు నమ్మధురలాలస యాకథ సవిస్తారంబుగాఁ దెల్పెద, మీరందఱును సావధానచిత్తులరై వినుఁడని చెప్పందొడంగె.

పదునాలవ ప్రకరణము.

అలఘువ్రతుని పూర్వవృత్తాంతము.

మహారాజా! అలఘువ్రతుని వృత్తాంతము మిక్కిలి చమత్కారభూయిష్ఠమై యుండును. అని తెల్పి మధురలాలస దాని నీ క్రింది విధంబున వక్కాణింపం దొడంగె.

పాండ్యదేశమున నురగాఖ్యతో నొప్పు నొకపట్టణము గలదు. అందు సోమశర్మ యను నొక విప్రుండు గలఁడు. అతఁడు శ్రుతిపారగుఁడు, తపోయోగాధికుఁడు, శ్రీయుతుఁడు నై యుండె. అతఁడు తత్త్వజ్ఞుఁ డయ్యును గుప్తమాహాత్మ్యము గలవాఁడగుచు జగదనుగ్రహార్థము గృహస్థాశ్రమధర్మములు నడపుచుండెను. అట్టి ధర్మములలో నిరతాన్నదానధర్మమునం దధికశ్రద్ధాళువై దానిచేతఁ విప్రులం దనియింపుచు నుండువాఁడు. ఆసోమశర్మపుత్త్రుఁడు యజ్ఞశర్మ యనువాఁడు. ఆతని కెన్నిపాట్లుపడినను వేదాదివిద్యలలో నొక్కటి యైన నంటదయ్యె. అట్టి దుఃఖమును మఱపించుటకై యతనికిఁ గులశీలాది గుణములు గల నల్వుర సౌందర్యవతుల నతని కతనితండ్రి పెండ్లి చేసె. ఇట్లుగాఁ బెండ్లి సేసి కోడండ్రకు సోమశర్మ సొమ్ములు, బట్టలు, పరిమళద్రవ్యాదు లతివిశేషములుగాఁ గుమారుని మనస్సు రంజించుటకుఁగా నొసంగె. ఇట్లుగాఁ జేసి యాసోమశర్మ తన యంత్యదశలోఁ దనకోడండ్రు వినునట్లుగాఁ గొడుకుతో నెట్లుగా నైన నన్నదానవ్రతము మాత్రము జరుపు మని యాజ్ఞనిచ్చి శరీరమును జాలించెను. యజ్ఞశర్మయుఁ దన తండ్రివాక్యములలోఁ దనకుఁ జతురాగమసంతానముఁగూడఁ గల్గు నని యుండుటచేత నతని వాక్య

నియమము తప్ప దను నమ్మకముతో నేమైన నగుఁగాక యని యన్నదానవ్రతము తానును విరివిగాఁ జేయ సంకల్పించె. ఇట్లు సంకల్పించి పాయసాపూపసూప బహుభక్ష్యలేహ్య చోష్య పానీయాదులంగూడిన యన్నం బనేకవర్షములు విప్రసంతతికిం బెట్టె. ఇట్లుండ నతనికిఁ గల సర్వస్వంబును హ్రస్వంబయ్యె. అపుడు పతివ్రతలగు తన సతుల యాభరణాదుల కాసింప వారును మంగళసూత్రములుదక్క తక్కిన తమ సర్వాలంకారంబులు తెచ్చి భక్తితో భర్తకు సమర్పించిరి. అట్టి భూషలఁ గైకొని విశేషోత్సాహంబున నాభూసురుం డన్నదానంబుఁ జేయుచుండె. ఆయజ్ఞశర్మయే యీయలఘువ్రతుఁడు. ఇతఁ డన్నదానవ్రతము నేయెడ విడువనికి నలఘువ్రతుం డను నామముం గాంచె. ఇట్టి నామముం గాంచి తన యన్నదాన నియమమును మఱికొన్నిదినములు భక్తితో నడపె. భార్యల విభూషణములు సెలవుచేసిన వెనుక భార్యల నమ్మి యైన దన నియమంబు నడుపుకొన నిశ్చయించి యీపాఱుండు వారికి దాని నెఱుంగింపకఁ గపటమార్గంబునఁ నొక్కనాఁ డక్కొమ్మలతో నిట్లనియె. తామ్రపర్ణీనదీతీరంపు రేవున నోడలు దిగి యున్నవి. నే నొకనిపాత్తుఁ గూడి యన్నదానముకొఱకుగా నోడబేరమునకుఁ బోయెదను. నేవచ్చునందాక నింటిని భద్రపఱచుచుండుఁడు, అనుడు నాయువతులు నిముసమైన నిన్నెడబాసి యుండమనియు, మేమును నినుఁగూడి వచ్చెదము మమ్ముం దోడ్కొనిపొండనియు విన్నవించిరి. అట్టి సతులమాటలు విని వారిని వెంటం గొనిపోయె. ఇట్లు వారిం గొనిపోయి యొక్కచో నునిచి యొకబేహారితో రహస్యనియతి న్వారి నమ్మఁ జూపి మూల్యము నిర్ణయించుకొని కైకొని తన యువతులను రేవుకడకుం గొంపోయె. పిమ్మట వారి నొక్కనావ యెక్కింప వారు పదియైదుబారలు కడచినమీఁద ధైర్యం బాపలేక యెలుగెత్తి యతి దుష్టమగు నాథనేచ్ఛ మిము నింతవఱకుఁ దెచ్చె. సతులారా! మీరు గుణవంశస్ఫూర్జితలు, ఇట్టి మిమ్ముఁ గష్టస్థితి నోడబేహారులపాలు చేసితిని. మీరింపులకేనా నాచెట్టఁ బట్టితిరి! అని పల్కి హా! యని పెద్దపెట్టున నేడ్చె. ఆ యేడ్పు విని యతని సతులు వంచించి యీ నావికాధిపుఁడు తమ్ముం గొనిపోవుచున్నాఁ డని యూహించి యతి సంభ్రమంబున నా నల్వురును నావనుండి జలధిలోనికిఁ బడ నురికిరి. అట్టివారిం బట్టనే యుపాయంబుఁ గానక నావికులు హాహారవంబుల శోకసంభ్రమాకలితు లైరి. అపుడు వారిం గొన్నట్టి సెట్టి యావిప్రుని బలాత్కారంబుగ నాక్రమించి నీ యేడ్పుకతన నింత పుట్టె. నామూల్యంబును నా కిమ్ము. అని నిర్బంధించి తమ ధనంబుఁ గ్రమ్మఱ నొడిచికొని బ్రాహ్మణుని విడిచి పెట్టెను. అట్టి దుష్టకార్యం బొనరించిన యీకష్టచరితుఁ డితనికి సతు లున్నారని, నేను చెప్పినమాటకు నెట్లాడిన నాడవచ్చును. ఆ తలిరుఁబోండ్ల యవ్వలివృత్తాంతంబు వినిపించెదను వినుండు. ఆ సమయంబున నొక పెద్దమీను సలిలంబులఁ గ్రోలుచుండ నా చెలువలు నలువురు నా సలిలంబులవెంటఁ దద్వదనకుహరంబునం

ప్రవేశించి లోనికిం బోయిరి. అంత నయ్యంబుచరంబు దవ్వులకుఁ బోయి యూష్మపూర్ణ వక్త్రాంతరతోయం బూర్ధ్వముఖమై ప్రవహింపఁగ మూర్ధ్నరంధ్రనిష్క్రాంతముం జేసిరి. అప్పు డా యుదకములతో నా పోలఁతులు మిగుల దవ్వుగ నెగసి యుత్తరంబుగఁ జనుచున్న యొక విమానంబులోఁ బడిరి. దానిలో జూదమాడుచుఁ బరధ్యానంబున నున్న యువయుగ్మ మిట్టిపాటున కదరిపడిరి. పై నల్వురు యువతులును విమానంబుమీఁదఁ బడి మూర్ఛిల్లి యొక్కింతతడవునకుఁ దేరి కనువిచ్చి చూచిరి.

అట్టి చెలువల తడివలువలు చూచి యలఘు కారుణ్యంబున నద్దివ్యదంపతులు వారికి దివ్యాంబరంబు లొసంగి యూరడించి, మీ రెవ్వ? రెచ్చటనుండి యిచ్చటఁ బడితిరి? అని ప్రశంసించిరి. ఆయువతీచతుష్కమును వడవడవడఁకుచు దమవృత్తాంతము విన్నవించిరి. అట్లు విన్నవించు నాయింతుల సొబఁ గెంతయు నద్భుతంబున నద్దివ్యకాంత చూచి తద్రూపలావణ్యమ్ములకుఁ దన నాయకు చిత్త మెట్లగునో యని శంకింపం దొడంగె. కావున నద్దివ్యాంగన యాముద్దియల నిలుప డింప నుద్యోగించి యధోభాగంబునకు ముఖము వంచి పరికింపుడు నపుడు వారి విమానము గోదావరీసరిత్సమీప పరిదృశ్యమాన ధర్మపురీనామ గ్రామము పైఁ బోవుచున్నట్లు తోఁచె. ఆధర్మపురి నొక వారముఖ్యాకేళీసౌధంబు గగనంబుతో నొరయుచు సమీపంబుగా దీపింపఁ దచ్చంద్రశాలాప్రాంగణంబుఁ జేర నా దివ్యదంపతు లాత్మీయవిమానంబు నడిపి యాగరితల నలువుర సౌధంబుపై డించిరి. అచ్చో నాదివ్యుండు తన యువతిచేత ననుమతింప కట్టిట్టు నట్టుకొట్టుచుండె. అట్టి తన వల్లభుం జూచి యాదివ్యాంగన యుల్లంబున దక్కన చింతవదలి పదుఁడు పదుం డని వేగిరించె. అప్పు డా దివ్యపురుషుఁడు తన సతిం గని యిమ్ముగుదల కాహారం బెట్లు సమకూడు ననుడు నాదివ్యస్త్రీ యతనికి నా సౌధోత్తమంబులోని పలు తెఱఁగులగు నఱలు చూపుచు నిట్లనియె.

చూచితిరే! అదె ఘృత తండుల ప్రకరము. అల్లవె చీరలు. అవియే భూషణాది సంపదలు. ఇట్టివానిని యూషలె నురు లెవ్వరు ముట్టిన బ్రదుకరు. అనిచెప్పి యాదివ్యభామిని తనకాంతునితో విమానం బెక్కి యథేచ్ఛం జనియె. ఇట్లుగా నాదివ్యపురంధ్రి యా మేడపై స్త్రీచతుష్టయంబు న్నిలిపి పలికినమాటలును దిరిగిపోవుచున్న విమానరాజంబును సౌధస్వామిని యగు గణికామణి మఱుఁగున నుండి చూచెం గావున దలఁకెడు మనంబుతో నిట్లు చింతించె. దివ్యస్త్రీ లెవ్వరో మనసౌధంబు నాశ్రయించిరి. దీనికింక మనము దూర మైతిమి. ఇచటి వస్తువులకు నాశింపఁ దగదు. అని నిశ్చయించుకొని యా సౌధంబుడిగ్గి యావారనారి దూరమున నిలిచి యిట్లనియె.

ఈమేడపై నిల్పఁబడిన యమ్మలారా! యిపు డిందున్నట్టి నా సర్వవస్తువులును మీకు ధారవోసితిని. దీని నంగీకరింపుఁ డని తోయాక్షతములఁ జల్లెను. ఇట్లు చల్లి తల్లులారా, యిదియె కా దీచుట్టుపట్ల నుండు మదీయగృహావనముఖ్యంబు లెల్ల దీనితో

పాటు మీ సొమ్మె. మమ్ముఁ జల్లగఁ జలికాలఁ దన్ని సాఁకుఁడు. అని యాచుట్టుపట్ల నున్న తన జనులం బిలిచికొని యావేశ్యయు సౌధంబువదలి పోయెను. ఆసుద్దు లాపట్టణంబులోని జనుల కందఱకు నచ్చెరువుం బుట్టింపుచు వ్యాపకము లయ్యె. విప్రస్త్రీలు తద్విధం బెల్లఁ జూచి యిది కరంబు చోద్యంబు, దీనజనులపాలిట నెందును దేవుఁడు గలం డని చెప్పుకొనుట యిచ్చోఁ దార్కాణ యయ్యె. అని యిట్లుగా నిశ్చయించుకొని యా విప్రాంగనలు తమ తలవాకిటి తలుపు బోరవెట్టి యేసమయములం దెరువక పదిలము సేయుచు, శకునాదులచే నిజనాయకుని పునరభిసంగమాశ లుదయింప వికలత నొందని వైరాగ్యాధిక్యముచే దేహములను భరించి వర్తిలుచుండిరి. అప్పటి కప్పుడు తత్పురీజనులు సౌధమార్గంబునఁ బోవుచు నాస్త్రీలం జూచి కరములు మోడ్చి మ్రొక్కుచుందురు. ఇట్లు కొన్ని నాళ్లు జరిగె. ప్రపంచములోని యితర మనుజులవలె వండుకొని వార్చుకొని గణికార్జితధన మనుభవింప వీ రేవ్రతముఁ బట్టిరో అని కొందఱు, నిది యెన్నినాళ్లవఱకో యని కొందఱు, నావేశ్య యెట్టి ధన్యాత్మురాలో యని కొందఱు, నై యాపురంబున జెప్పికొనుచుండిరి. ఇట్లుండి తాము సమర్పించిన వస్తువుల నెట్లైన వీరు గయికొనియెదరేమో యనుతలంపునఁ గొందఱు పురజనులు తద్గృహద్వారభూమి నలికి ముగ్గ తండుల ఘృత పయ ముఖ్యవస్తువు లుంచుచుండిరి. అట్టివానిం బరిగ్రహింప నా యువతులు సౌధంబు డిగి రాఁ గని పురజనులు దూర మేఁగి వారికి మ్రొక్కులిడుచుండిరి. ఇట్లుగా మఱికొన్ని నాళ్లు జరిగె. అంత నాపతివ్రతలు నలువురకును శోభనత్వంబున గర్భచిహ్నంబులు గానిపించె. నెలలు నిండిన వెనుక, దద్గర్భంబులలోనుండు నర్భకు లొక్కొక యెడ చతురాగమ సూక్తులును, నొక్కొక్క వేళ షట్ఛాస్త్రప్రసంగంబులును, నొక్కొకచోఁ బురాణేతిహాసంబులును, జేయునట్లు వినఁబడుచుండు. అంత జ్యేష్ఠానుపూర్వికముగా నా నల్వురకును నలువురు కుమారులు గలిగిరి. ఆబాలురు దినదిన ప్రవర్ధమాను లగుచుండ యదృచ్ఛాసంచారంబున నొదవిన యొక్క సంయమీంద్రుండు విహితాచారంబునడపుచు వారలకు జాతకర్మాది సంస్కారంబు లొనర్చె. నామకరణసమయంబున నాతఁ డాశిశువుల యనుభావం బంతయు తన విజ్ఞానదృష్టిం బరికించి వీరలు మూర్తిమంతంబు లయిన వేదంబు లని నిశ్చయించి జన్మాగమప్రకారంబు ననుసరించి వరుస నల్వురకును బ్రథమాగము, ద్వితీయాగము, తృతీయాగము, తురీయాగము లను పేళ్లు గల్పించె. తన్మాతలు పూర్వకాలంబున తమ మామ పలికిన చతురాగమసంతానశబ్దంబున కర్థంబు వీరే యని తమలోఁ దారు సమపుచ్చుకొని సంతసిల్లి యిప్పటి సంయమీంద్రుని యెఱుకకు వెఱగుపడుచుండిరి. ఇట్లుండి యాసంయమీంద్రు నుచితకాలంబున వచ్చి తత్కుమారోపనయనసిద్ధి యొదవింపుఁ డని ప్రార్థించిరి. ఆతపస్వియు దాని కంగీకరించి యప్పుడు పనివిని యుచిత సమయంబున వచ్చి యుపనయనంబులు చేయించె. ఆ బ్రహ్మవాదులు స్వయంప్రకాశిత

సకలవిద్యలయ్యును శాస్త్రసిద్ధికొఱకు గా నాసంయమీంద్రునియొద్ద నిఖిలవిద్యలక్ష్యాల్ప కాలంబులోపల నధ్యయనంబు గావించిరి.

అంతఁ దన్మాత లెంతకాల మట్లున్నఁ దమ పెనిమిటి సమాగమంబు దుర్లభం బని భావించి యచ్చోటు విడిచి యెచ్చటికేనియుం బోదలంచి తమ కుమారులకుఁ దమ యుద్దేశ మెఱింగించిరి. అట్టి మాటలు విని యాకుమారకు లిట్లనిరి. పెద్దతలలేక మీ రీరూపములతో నెచట నిలచినను మనకుఁ బెద్దఱికము రాఁ జాలదు; కావున మీరిచటనే దైవవనితలను గట్టుచెడక యుండునట్లుగా నుండి కాలము గడపుడు. ఇంతలో మే మేరాజు నైన నాశ్రయించి ధన ముపార్జించుకొని వచ్చెదము. అంతకుఱకును మాతండ్రి యున్న యట్టిచోటు నరయుటకు మీరు వన వలనుపడదు. అని తెల్పి యాబాలురు తమ నివాస మెరుల కెఱుక పడకయుండ బైలువెడలిరి. ఇట్లుగా బైలుదేరి యాబ్రాహ్మణపుత్త్రులు పురంబులో నొక కొంత సంచారంబు చేసి యప్పడాపురి నేలు మదాశయుం డను రాజువాకిలి జేరిరి. అతఁడు సకలవిద్యావిశేషజ్ఞుఁ డని వినిరి; కాని యారాజదర్శనం బతనిపురోహితుని యనుమతిలేనిది దొరకుట దుర్లభం బనియు వినవచ్చె. ఆపురోహితుఁడో తాను విద్యాధికుఁడు కాకుండుటంజేసి నిజగౌరవశైథిల్య భయంబున విద్యాధికు లగు వారిని రాజసన్నిధికిఁ బోక యుండునట్లుగాఁ జేయ యత్నించియుండెం గావునఁ బండితులను లోనికిఁ బోనీక నిల్పునట్లుగా దౌవారికాది సకలపరివారంబులను గట్టుకొని యుండె. ఇట్లనేకదినంబులు జరిగె. అంతట నొకసమయంబున నాప్రభునకు యాగేచ్ఛ గలిగి తదార్త్విజ్య సమర్థులగు విప్రులఁ జూడుఁడని తన పురోహితున కాజ్ఞ యొసంగె. అతఁ డట్టివారిం బరిశీలించుచున్నట్లే కొన్నిదినంబు లభినయించి యజ్ఞకార్యసమర్థు లగు వా రెచ్చట జతపడరే దని రాజుతో విన్నవించె. అట్టి పురోహితతంత్రమును బ్రథమాగమాదు లగు బ్రహ్మచారులు కర్ణాకర్ణికగా వినిరి. పైగా దౌవారికులును లోనికిఁ బోవ సమకట్టినవారి నందఱను బరీక్షించి వాక్ప్రగల్భత లేనివారి నేగాని రాజమందిరములోనికి వదలరనియు, వదలినవారి నైన మీ నేమము ప్రభుఁడు కోరి మాటలాడిన నతనితో నీ వీయిల నేలగా నెపుడును శుభమే అని మాత్రము చెప్పవలయు ననియు, వార్త లేమి యని యడిగినచో మేము మాయిండ్లలోనే యుండువారము గావునఁ బైవార్తలు మాకేమియుఁ దెలియ వనియుఁ జెప్పునట్లు బోధించి యామాటకు సమ్మతించి ప్రమాణము చేయువారి నేగాని లోపలికిఁ జొరనీయరనియుఁ గూడ వినిరి. కావున నావటువులు తత్తదుచితము లగు రీతినే వచియించి ప్రభునకుఁ దమ వాంఛితముం దెలుపుటకు ననుకూల మగు వాక్పద్ధతి నేర్పఱుచుకొనిరి. ఇట్లు చేసి తమ రూపములు మఱుఁగుపడునట్లుగా నీచబాలవేషముల ధరియించి యాబుడుతలు నల్వురును భూవరుని సన్నిధికిం బోవు మామిడిపండ్లగంపలు మోయు కూలివాండ్రతోఁ గలిసిరి. ఇట్లుండి మూఢజానపదులచేష్టలు చేయుచుఁ బ్రతీహారజనంబుల కిష్టమైన వాక్యాలు చెప్పి లోనికిం

బోయి పండ్లగంపలు రాజసన్నిధిం బెట్టిరి. ఇట్లు పెట్టి వెనుకకుం జని భయచేష్టలు చపలత గన్పింపఁగా నిల్చియుండిరి. అట్టి యాబాలకులఁ జూచి నవ్వుచుఁ గృపతో నృపవర్యుం డిట్లనియె. బాలులారా, మీకు సంతోషమే గదా! మీ కెప్పుడును చింత చేకుఱదు గదా, దాఁచక యథార్థము నాతోఁ జెప్పుఁ డనుడు, నాబాలకు లిట్లనిరి.

క. మాయమ్మా నను నీ వే । రాయలవై కావ దేవరా జేజేజే
మాయాతుములానినయది । పాయక సంతోషమున్న ఫలమిల సామీ.

అనిన నామాటల చందము తన యప్పటి వాక్యములకుఁ దగు నుత్తరమై యుండుటయేకాక క్రతుబుధ నేహోఘునోపదేశంబు నగుచుఁ గూడఁ గాన్పింప నారాజు తన యంతరంగంబునకు విస్మయంబుఁ దోఁపించువారి రూపాంగసి నిగురుగప్పిన నిప్పుకలువోలె గూఢముగ నుండు వీరలు సామాన్యులు గా రని యూహించి సంతసించి భక్తితాత్పర్యములతో లేచి వారల కా నరపాలుండు సాగిలి మ్రొక్కె. అని యిట్లు బాలిక చెప్పఁగాఁ గళాపూర్ణుండు విని మదాశయుఁ డింత శబ్దవిదుఁడే, దీని నే నీవర కెఱుంగ ననుచు మదాశయుని బహుమాన గౌరవదృష్టితోఁ గనుంగొని, మదాశయా! కూర్చుండుము, కూర్చుండుమని బలవంతపెట్టి కూర్చుండ నియమించి, మధురలాలసం జూచి మీఁదివృత్తాంతంబుఁ జెప్పుమనుటయు నబ్బాలిక యిట్లనియె. అట్లు మదాశయుం డానలువురు బ్రహ్మచారులకును మ్రొక్కి వారి కాసనపాద్యాది విధు లిచ్చి పూజించి నిజాస్థానజనులం జూచి యిప్పటి వీరల వాక్యంబులందు నేమివిశేషములు కలుగుటంజేసి నేనిట్లు వీరిం బూజించితి నని మీ మనంబుల నుండవచ్చును, ఆవాక్యముల మహిమ చెప్పెద వినుండు.

సీ. ఆయంబుసగమసేయకుము శోభనమూలధనుఁడ ధనంబచ్చిదంబు ముఖ్య
మైనయట్టిది ధన్వి నదియు నేనిక జూయజించు వానికి లక్ష్మి చేరుఁ బాత
కములుచేరవు రతుకా కోవిదులుకల్గి రాయసమోదుఁడవై యరుగక
సమ్మిశ్రభావంబుసలుపుచు మాలక్ష్మి కోవిదు లనియెడు దేవభాష
గీ. వచుసఁ బదవిభాగ విరచనతోనర్థ । మరయఁ దోఁచుచున్నయది గరంబు
తెలియఁ జూడుఁడీ తదీయాంధ్రవచనసం । దర్భమునను శబ్దతంత్రవిదులు.

అనిపల్కి మదాశయుండు ప్రథమాగమాదుల కభిముఖుఁడై వినయావనమితుఁడును ముకుళితకరకమలుండు నగుచు నిట్లనియె.

ఓ విప్రవర్యులారా! మీరలెవ్వరు? ఇట్టి ప్రచ్ఛన్నవేషంబుల వచ్చుటకుఁ గారణం బేమి? మీవిధం బంతయు నాకు నానతీయవలయును. అనియిట్లు ప్రార్థనాపూర్వకంబుగా నడిగిన పార్థివుం జూచి ప్రథమాగముఁడు తమతండ్రి యన్నదాననియమము మొదలుగాఁ గల యతని పూర్వవృత్తాంతంబును, దమ తల్లులవలన వినిన యనంతర వృత్తాంతమును, అనంతరము తాము స్వయముగ నెఱిఁగిన తమ వృత్తాంతము నెఱింగించె. అపుడు మదా

శయుఁడు తన పురోహితుని దుస్తంత్రంబునఁ బూజార్హుల నాదరింపఁజాలకుండుట కెంతయు లజ్జించి యిట్లనియె. విప్రకుమారులారా! నే నిట్టివాఁడ నగుదు నని యెఱుంగకుంటిరే. కావలయును నాకు మావారలు మదాశయముఁ దమ నామకరణంబు జేయుట కటస్థించె. ఇఁక నైన జాగరూకత నుండెదను. అనిపల్కి తన పురోహితుని దండింప నుద్దేశించి వారిం బిలువనంపుడు నాభూసురకుమారు లద్దానికి సమ్మతింపక రాజును వారించిరి. వారి యాజ్ఞానుసారముగా నారాజు తన పురోహితదండనము మాని పురోహితకృత్యంబు నుండి తొలఁగునట్లు చేసె. పిమ్మట తన పురోహితకపటకృత్యములో సహాయులుగా సంచరించినవారి నందఱ వారివారి దోషానుసారముగా దండించి వారిని వినీతులం జేసె.

పిమ్మట నీప్రథమాగమాదులం బ్రార్థించి వారిని ధర్మవిధిని పురోహితత్వమున నిలుపుకొనియె. అంతఁ బ్రథమాగమాదులు సర్వవృత్తాంతమును దమ తల్లుల కెఱింగించి వారి యనుజ్ఞప్రకారముగా దమ కనుకూలకన్యకలం దెచ్చుకొని వివాహితులై ప్రభుసమ్మానంబున నత్యంతవిభవమునఁ బ్రవర్తిల్లుచుండిరి. పిమ్మట వారు తమ ప్రభు నభిమతయజ్ఞంబులు సేయించుచుఁ దమ జనకునియునికిఁ దెలియ నురగపట్టణంబు మొదలు పాండ్య కేరళ చోళ ద్రవిడాది దేశంబులలో వెదుకఁదగినవారిం బంపిరి. అట్టిపట్ల నెందును నతని వృత్తాంతంబు తెలియకుండుటంబట్టి వారు చింతాక్రాంతులై యుండియుఁ దమ తల్లుల కుచితవిధంబునఁ గొన్ని యాసలు చూపుచు నూరార్చుచుండిరి.

ఇట నలఘువ్రతుండు వృథాభార్యాపరిక్రయలజ్జితుం డగుచుఁ దన జనపదంబులోని సుహృజ్జనులకుఁ దలచూప నోడి దూరదేశంబులకుం బోయి యాయావరవృత్తి నర్థార్జనం బొనర్చుచుఁ దత్పరిమితాన్నదానంబు నడుపుచుఁ గొన్నినాళ్లుండె. అది నెఱయ న్నాగకున్నందున నన్నవర్జంబు చేసి కంద మూల పయః ఫలాదుల దేహయాత్ర సలుపుచుండె. ఇట్లుండియు నన్నదానార్థముగ ధనార్జనంబు సేయ బహువిధోపాయంబులు వెదకుచుండెను. అంతట మృగేంద్రవాహనామహాశక్తి మహిమలు విని తదారాధనంబునకు నొక విప్రునివలన మంత్రోపదేశంబు సాధించె. ఇట్లు చేసి యలఘువ్రతుండు యనంతగమ్మమహాదేవి సన్నిధికిం జని, యచ్చట భగవత్కథాశ్రవణఫలంబున సకలసంపదాయురభివృద్ధిపుత్రపౌత్రాది లాభంబు గలుగు నని విని యందున్న పుత్రపౌత్రాదులమాట జరుగక పోయినను దక్కినఫలంబు గల్గుట సిద్ధంబే కదా యనియెడు తలంపున జపంబు చేసి భగవత్కథాశ్రవణంబు సాధించెదగాక యని నిశ్చయించుకొని యట్టిపనిని సాధించె. తుది నది యత్యంత సంభావనీయం బైన పుత్రాది లాభంబును గల్గింపక మానదయ్యెను. రాజేంద్రా! దేవరకథామహిమం బిట్టిది సుమీ, అనిపలికి మధురలాలస యూరకుండె.

అంతఁ గళాపూర్ణుండు నలఘువ్రతునింజూచి—విప్రోత్తమా! నీ సందియము లెల్లం దీరెను గదా, అని పలికి ప్రథమాగమాదుల నీక్షించి యిప్పుడు మీతండ్రికిఁ దగిన యుప

చారాదులు సలుపక యునుట పాపహేతు వగుగదా. [illegible] ప్రథమాగమాదులును లేచి భయ భక్తి వినయ సమ్మోదములు గ్రమ్ముకొన సంభ్రమంబున నలఘువ్రతునిపాదంబులకుఁ బ్రణామంబులు గావించిరి. అలఘువ్రతుండు సానందబాష్పవారిపూరితలోచనుం డగుచుఁ బుత్రుల నాలింగనంబు చేసికొని మూర్ధాఘ్రాణాది వివిధోపలాలనంబుల వారి నాదరించె. ఇట్లు చేసి వారల నతఁడు తనచేరువఁ గూర్చుండఁ బెట్టుకొనియె. అప్పు డబ్బాలకుల తొంటి యాంధ్ర గీర్వాణభాషాశ్లేషవైచిత్రి చిత్తంబునం బాఱఁ గళాపూర్ణుండు వారిం జూచి తొంటి విచిత్రకవిత యిప్పుడును మీ మతులకుఁ దోఁచునో యని పల్కుడు ప్రథమాగముఁ డిట్లనియె.

క. తాఁ బినువారికి సగవిగ । భావనతో నాను నతివిభావసుతేజా
దేవర గౌరవమహిమన । మావలసినకవితమఱఁగి మాను నధీశా.

అనుడు భళిర! మహాకవిశిఖామణీ! మదుక్తభాషణంబున కిపు డిచ్చు నుత్తర మీ పద్యమయ్యె, మేలు మేలు. అని ప్రభుఁ డాడఁగా నది యటులనే యని కవీంద్రుఁడు నవ్వె. ఇట్లు నవ్వుచు నా రాజాపద్యము తిరుగఁ బఠియింపుఁ డనుడు తదుక్తికి విప్రుండును మెచ్చె. ఇట్లుగా నాయిర్వురును దమలోఁ దమరే సరిపుచ్చుకొనగఁ దత్పద్యచమత్కారము నారసి యేమియుఁ గానక సభాజను లద్భుతం బందుచుండిరి. అప్పు డవనీకాంతుఁడు సభాసదులం జూచి యాపద్యమును దిరుగ బఠింపుమనుట మఱియును పఠియింపుమనుటకాదు. వినుఁడు, దాని విశేషముల నెఱింగించెద నని యిట్లనియె:—

సీ. ఏలుమోనాయక యిల గిరు లెంతకాలం బంతకాల మోసమ్మతుండ
మివుల శోభిల్లెడు లవకుమారసమాన మానుఁడఁ మహిమ ననూనమైన
గౌరవం బొసఁగు చక్కని ప్రభు లిట్లు గల్గఁనోయి పురుషుఁ డీ గౌరవమున
నభినవతేజస్కుఁ డై వాణిరసములు గులికెడునట్టిది గలుగఁ గాను
గీ. వినుతి సేయనివాఁ డెయంచును మనోర్థ । మున్న యది సంస్కృతంబునఁ జెన్ను మీఱ
వరుస తుదినుండి మొదలికిఁ దిరుగఁ జదువ । నా తెనుఁగుపద్యమున బుధు లరసికొనుఁడు

అని యిట్లుగా రాజు వలుక సభవా రాపద్యము నవరోహణముగాఁ జదువుకొని దాని విశేషములం దెలిసికొని కవినృపుల యాశు విచిత్ర మృదుకవిత్వకృతియునుఁ దదవగతియు నెంతయు మెచ్చిరి. అంతఁ గళాపూర్ణుం డనేకమణిభూషణవిచిత్రాంబరప్రధానంబు లైన పారితోషికంబులఁ బ్రథమాగము నలంకరించె.

అనంతరము కళాపూర్ణమహారాజు మంత్రి యగు సత్వదాత్ముఁడు మధురలాలసకుం బ్రణామంబు చేసి యిట్లనియె:—

ఉ. ఓరుచిరాత్మ యోపగమయోగిని యేనటుపూర్వమైన నా
పేరుకులాదులు న్మఱచి పిమ్మట నొక్కెడనుండఁ దెచ్చి కా

సారపురంబులో నిడిరి సమ్మతి నాపను సత్యదాత్ముఁడిక
పేరడి తెల్పవమ్మ మతి పెద్దలఁ గానము యొందు కిద్జ్ఞులక్.

అని యిట్లడుగుచుండ నాబాలిక కనులు నులుముచుఁ బెదవివిఱిచి మొగ్గవారు చందంబునఁ బొత్తులమీఁద నడు మొత్తుకొనుచుఁ గేరున నేడువ నారంభించె. అపు డబ్బాలికం గని యో చోద్యంపుతల్లీ! యీ విపరీతపుచేఁత లేల? నే నడిగిన సంప్రశ్నముల వివరింపఁగదే యని, సత్యదాత్ముఁడు మఱియొకపరి నమస్కరించె. అపుడు తక్కిన సభాసదులు నోతల్లీ, మాకుఁ గల సందేహములు నీవలనఁ దెలిసికొనవలయు నని యుంటిమి. ఈ వెడమాయలతోఁ బనియేమి? మాయం దనుగ్రహింపు మని ప్రార్థించిరి. ఇట్లెవ్వరే మనినను దన్నెన్ని విధంబుల వేఁడుకొనిన నించుకయేని విజ్ఞానంబులేక బాలిక నిజముగ నాఁకటనే యేడ్వ నారంభించె. అపుడు సభవారందఱు నేదియైన దైవావేశకారణంబున నబ్బాలిక కట్టి మాహాత్మ్యంబు గల్గె ననియు నది మఱలఁ గాన్పింపదాయె ననియు నూహించి విచారించిరి.

తదనంతరంబ కళాపూర్ణుండు రూపానుభూతిని మదాశయుం బిలిచి మీబాలిక కథలన్నియు వింటిరిగదా? మీభాగ్యవైభవంబున కెందును నీడులేదు. ఇది మొదలుగ నాకు మీ రత్తమామలైతిరి; సందియంబు లేదు. ఇఁక మీరు తక్కిన కొలువుమాని యీ శిశువు నింటికిఁ గొంపోయి పెంచుచుండుఁడు. అను మాటలు విని సత్యదాత్ముం డిట్లనియె.

ఓపార్థివేంద్ర! వారిపసుచు మెడను మణిహారము మీ రెపుడు పెట్టితిరో యపుడే వార లత్తమామలైరి. ఆబాలికకథలును తదనుగుణములే యయ్యె; ఈశిశువు లక్షణములఁ జూడ నానాభూనాథవధూమౌళిమణినిర్మితనూపురాంగ్ఘ్రనీయాంఘ్రి యగు నని తోఁచుచున్నది. అను మంత్రివాక్యములను గళాపూర్ణుండువిని దరస్మితాననుం డగుచు మీరటులనే యాబాలిక శ్రేయస్సుఁగోరఁదగు గదా యని, యాబాలిక జననీజనకుల వారి గృహంబునకనిపి వారివెంటనే కాంచనభూషణప్రముఖసంపద నిచ్చి పంపె. అనంతరము కళాపూర్ణుఁడు మధురలాలసకథ లెవ్వియుఁ దనభార్య యగు నభినవకౌముది వినక యుండునట్లుగాఁ జేయఁగోరి తమ శుద్ధాంతమునకుఁ బోవువారికిఁ బ్రయత్నముతో నాకథ నెన్నఁడును దడవఁగూడదని చెప్పిపెట్టె.

ఇది యంతయు నైన యనంతరము కళాపూర్ణుండు మదాశయుని పురోహితుల దిక్కు మొగంబై మీరు మీజనకుం దోడ్కొని మీ నివాసంబులకుం బోయి మీజననీజనకులకుఁ బునస్సమావేశసంతోషంబు గల్గింపుఁడు. అనిపల్కి యా రాజలఘువ్రతుని యథేష్టాన్నదానకరణపర్యాప్తబహుధనగ్రామసంపదల నొసంగి, యాలఘువ్రతా! నీవు నీపుత్త్రులఁ గళత్రములఁ గూడి సుఖంబుగ నుండి తొంటియట్ల నిత్యాన్నదాననియమంబు జరుపుకొనుచుండుము; అని సబహుమానంబుగాఁ బంపె. అట్టి పతియొక్కయు పుత్త్రుల

యొక్కయు అదుభుతసమాగమనంబున కలఘువ్రతుని భార్యలు హర్షాంబుధి నోలలాడుచుఁ బెన్నిధిగన్న పేదలమాడ్కి నుండిరి.

మధురలాలస యౌవనము.

ఇచట మధురలాలసను మదాశయునిభార్య తనయింటికిఁ గొంపోయి క్షితిపతి చేసిన గౌరవాదికములు మదిలోఁ దలంచుచు నతి ప్రేమాతిశయంబునఁ బెంచుచుండె. మధురలాలసయుఁ దన బంధులకెల్ల నల్లారుచెల్లమైఁ దల్లికిఁ దోఁచుచుఁ బెరుఁగుచుండె. అపుడు సాముద్రికలక్షణవేత్త లాబాలిక చేతనుండు రేఖలంజూచి యాపె యశేషరాజ్యవిభవభోగాతిశయము నందఁగల దనియు, మృదుచరణకంజాతరేఖలంజూచి రాజపత్నుల నతులకర్త్రి కాఁ గలదనియుఁ జెప్పుచుండిరి. ఇట్లుండ మఱికొన్ని దినంబులకు యౌవనోదయం బయ్యె, అది యెట్లుండె ననఁగా:—

సీ. గురుతర స్తనకేళిగిరులను గంభీరతర నాభికూపమతల్లికయును
జారురోమాళిశృంగారధారాసరణియు నంగుళీకిసలయచయంబు
సుకుమారబాహువల్లికలును రమ్యోరుకదళికాస్తంభప్రకాండములును
సలలితాధరబింబఫలవిలాసము పుష్పవిసరసాండిమ హాసవిభ్రమంబు.

తే. కలికిపలుకులు శుక పిక కలకలముగఁ । గుంతలంబులు మధుకరకులముగాఁగ
శంబరారాతి కేళీవనంబు వోలె । సుదతి యపుడొప్పె నొక వింతసోయగమున.

ఇట్టి వయఃకాలములోపుననే యాలతాంగి వివిధములగు సంగీత సాహిత్య విద్యల నెల్ల నభ్యసించె. ప్రాగ్జన్మవాసనావిశేషంబున నప్రయత్నముగాఁ గావ్యరచనయు నేర్చె.

ఇక్కడఁ గళాపూర్ణుండు మధురలాలసను మున్ను తల్లిదండ్రులయింటనే పెరుఁగ నిమ్మని యనుపుట తదాదిగా నభినవకౌముదీవిహారవేషంబులవలనను, రాజ్యకార్యవ్యాసంగంబులవలనను మఱచి మఱియెన్నఁడును దడువఁడయ్యె. మదాశయుండును నతని చిత్తంబు తెలియంగలుగక యూరకుండె. ఇట్లుండఁ బెక్కుదినంబులు జరిగె. మధురలాలసయు నవ్విధంబున జవ్వనంబు ప్రాపించి యంకురితమదనవికార యగుచు నాకళాపూర్ణు పాణిగ్రహణం బభిలషించుచుండె. అట్టి కోరిక నన్యులతో నివేదింపరామికి నాపె మనంబుననే దానిం జింతింపుచుఁ గ్రమక్రమంబుగఁ గృశింప నారంభించె. అపు డాబాలికామణి సఖీజనులు తమ సఖి కృశియించుటకుఁ గారణం బూహించి యా చంచలాక్షి మదికి వేడుక బుట్టించు తలంపున నుద్యానవనమునకుం గొంపోయిరి.

వనవిహారము.

అందు నాయిందువదనలు మందగమనస్వభావంబు నతకరించు కుతుకరయంబు నకుఁ బ్రతికూలంబులగుచుం బిగువుపాలిండ్ల వ్రేగునకుఁ బిఱుదులగరిమయుఁ దరము గాక

కర మలయం జేయుచుండ నొండొరులంగడుచుచు, నుద్దవిడి నడచుచుం, గూడమికిం గేలి సేయుచుం, గ్రొవ్విరులు ద్రుంచికోయుచుం, గమ్మగొజ్జంగులకుం జేరుచు, గన్నేరు గేదంగులకుం బోరుచుం, బొన్నలకు మూగుచు, బొండుమల్లెలకు నేగుచు, సంపెంగలకు డాయుచు, మల్లెలకు నిగుడుచు, మవ్వంబునకు మగుడుచుం, గురువేరులకుం గొల్లలాడుచు, గంధంబులకు మల్లలాడుచు, బొగడలకు జరుగుచు, బోకపాళికలకు దిరుగుచుం, దిలకంబులకుం జనుచు, దిరిసెనపువ్వులు గైకొనుచు, నవమల్లికలం గ్రీడింపుచు, నారంగంబుల గ్రేడించుచుం, దరికొట్లకుం దత్తరిల్లుచుం, గంకేళిమంజరులకు రంజిల్లుచు, గ్రొమ్మావినీడలా శ్రయించుచుం, గురువిందపందిరుల విశ్రమింపుచు, నీరంబుల మారుచు, నెందేనియుం బారుచుం, బూదేనియలం దోగుచుం, బొదరిండ్ల డాగుచుం గని నవ్వుచుం, గమ్మవిరులు రువ్వుచు, దీంగెయుయ్యాలల నాడుచుం, దియ్యవిలుకానిం బాడుచుం, బరాగంబులు రాల్చుచుం, బయ్యెదలు విదల్చుచు, నందరానిపూంగొమ్మలకు నిక్కుచు, నలతిమ్రానుల నెక్కుచుం, గొంజిగుళ్లకుం బదరుచుం, గెరలు తేంట్లకు బెదరుచుం, గోకిలస్వనంబు లాలింపుచుం, గొరవంక లాలోకింపుచుం, జిలుకలకుం బలుకు లందిచ్చుచుం, జిన్నిగాయంచలనడలు మెచ్చుచుం, బూబంతుల వేటాడుచు, నొకరొకరిం జీఱుచు, నుబ్బునం గేరుచు, నిబ్బరంపుం దమినిం దమకుం దమకంబు హెచ్చింప నింపుమీరు విహారంబులచేత నడుము బడలికలుం బొడము వెడవెడ జిఱుచెమట తడి యొడళ్లం గడుం బ్రబలి గుబులుకొను మృగమద ఘనసార గంధసార కాశ్మీర విలేపన పరిమళంబులు పరిమిళితదిగంతంబు లగుచు, నంతట జోడుముట్టిన సహజ కృశత్వంబునకుం దోడు క్రీడల యలత నెంతయు ఘనంబైన బడుగుందనంబునం దడంబడుచు, నపూర్వవిభ్రమంబుల సొంపొందుచుండిరి.

జల క్రీడ.

అనంతర మంతరంగముల జలక్రీడాకుతూహలంబున నొక కొలనికడకుం బోయి మెట్లు డిగి యుదకమధ్యంబు ప్రవేశించి:—

లయగ్రాహి.

నెమ్మొగములం గిరతలమ్ములం గుచమ్ములం గచమ్ములను జూడ్కి నయనమ్ములం బరాభూ
తమ్ములునుబోలె విరితమ్ములను రక్తజలజమ్ములను గోకమిథునమ్ములును శైవా
లమ్ములును భృంగనిచయమ్ములను మీననికరమ్ములు గలంగె జలజమ్ములు భజింపన్
గొమ్మ లపు డెంతయును సమ్మదకుతూహలభరమ్ముల నొనర్చిరి కరమ్ము జలకేళిన్.

కవిరాజవిరాజితము.

గుభులుగుభు ల్లనుఘూర్ణణఁ దోయశకుంతతతు ల్లలగుండువడన్
క్షుభితఘనస్తనకుంభ పరిచ్యుత కుంకుమ చందన కుంతలనూ

నభరవిలాసమున న్బహుళవర్ణము నవ్యసుగంధగుణంబు గొలం
కభినుతిభాజనమై భజియింపఁగ నంబువిహారిణు లైపొసఁగన్.

ఇట్లుగా జలక్రీడ లాడి యాబాలికలు కాసారంబు వెలువడి నవీనవస్త్రాభరణగంధ మాల్యాలంకృత లైయుండిరి. మధురలాలసయుం గాంతుని మీఁది పరాకునం జెలికత్తియల బలిమిని వనక్రీడాదు లెట్టకేలకు నిట్టట్టు సలుపుచుండెను.

పదునైదవ ప్రకరణము.

కళాపూర్ణాగమనము.

ఆదినంబునఁ గళాపూర్ణమహారాజు డేగవేటకు మధురలాలస యున్నయుద్యానవన సమీపస్థోపవనమ్మునకు వచ్చియుండె. అట్టి డేగవేటతఱి నందొక పక్షి పాఱిన దానిం బిలుచుచు దానివెంటనంటి మధురలాలస యున్న యుద్యానవనిలోఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించి యారాజశేఖరుం డటు నిటు చూచుచు హఠాత్తుగ మధురలాలసం గనుంగొనియె ఆటులనే యాసుందరాంగియు నాలోకసుందరుం బొడఁగాంచె ఆవరకే మధురలాలస కళాపూర్ణుని సౌందర్యాదులు విని యున్నది గావున నతనింబోల్చి యతని కౌఁగిలిఁ జేర్పలేమి కెంతయు వగఁగుందె. కళాపూర్ణుండును మధురలాలసయెడఁ దన మనంబు దగిలి మఱలి రానన్నింజేసి యొక్కొక నెపంబున నారాకేందుముఖి యున్న దెసకు మఱలి మఱలి చూచుచు నెట్టకేలకు నిజనివాసంబునకుం జనియె.

మధురలాలస తపించుట.

అంత నక్కాంతయు నంతరంగంబునఁ దనకాంతుం జింతింపుచుఁ దాలిమి చలియింప సంభ్రమింపుచుండె. అపుడా బాలిక యాకృతిచందము బోటులు పరికించి యిట్లు చింతించిరి. అయ్యయ్యో, మన మీబాలికకుం గల్గిన మనోజాతసంతాపనివారణకుం గాం బొరపడి మన్మథుని పట్టపురాజధాని యగు నీపూందోటకుం గొనివచ్చితిమి. దానికిం జోడుగా మనోనాథుని దర్శనముగూడ నీచంచలాక్షికి సిద్ధించె. దానివలన నావరలో నంటియున్న మన్మథానలంబు ప్రతిదర్శనానిలంబునం బ్రజ్వలితంబుగాం జేయంబడియె. దీని వారింప నిఁక మనకేమి సాధనం బున్నయది. అని చింతింపుచుండ మధురలాలస మదనతాపభరంబున కోపంజాలక యుస్సురనుచుం గనుఱెప్పం దేలవైచి సొలసె.

అపుడా యింతిని చెలులందఱుం జెంగల్వరేకుల సెజ్జం జేర్చి జగతింగ[illegible] శైత్యోపచారంబు లన్నియుం జేయ నారంభించిరి. అట్టి యుపచారవిధు లుపయోగకారులుం గాకయుండుడు సఖీజనులు ప్రయత్నముతోం జెవులలోం గర్పూరమూఁది పూవిసనకఱ్ఱలు గొజ్జంగి

నీటం దడిపి వీచుచు, నరికాళ్లయందును బాణిపల్లవములయందు నప్పులుగాఁ జందనము నలదిచూ, నవియుపకారులుకాకయుండఁ దుదిఁ గొందల మందిరి. అపు డొకచతుర యగు బోటి యాబాలికం గాంచి బోటులతో నిట్లనియె. చెలులారా, మధురలాలస మేనంటినఁ జెయి పొక్కుచున్నయది. ఇఁక శైత్యక్రియలవలన ప్రయోజనము లేదు. మార్గాంతర మరసి యీబాధ తొలఁగింపవలయును, మీరు తొలంగుడు; అని శైత్యవిధులు నిలిపియుంచి, కొంతసేపూరక కూర్చుండె. అంత మధురలాలస కొంత తెప్పరిల్లఁగా నాయింతి యిట్లనియె.

చిగురుఁబోడీ, నీవు సిగ్గున నింతవరకు వెనుకకుఁదీసి నీయంతరంగాభిప్రాయము చెప్పవైతివి. ప్రాణసఖికిఁ జెప్పరాని రహస్యంబు లుండునే, ప్రాణసఖియన్నఁ బ్రాణం బన్న నొకటియే గదా! అని యిట్లుగాఁ బల్కిన చెలివాక్యంబులు వినియుఁ దనకోరిక వెలిపరుప మనమున నొక్కింత కొంకియు సాహసం బూని లజ్జవెంపునఁ జెప్పఁజాలక వ్యాకులపడి యుండె. అంత నాచెలికత్తియ తనపై నానలు పెట్టి గ్రుచ్చి గ్రుచ్చి యడుగ నానిర్బంధవాక్యంబుల కోపఁజాలక మధురలాలస యిట్లనియె.

ఓ యేణాక్షీ! నీకు నాయుల్ల మింక దాఁచనేల? చెప్పెదను వినుము. ఒకనాఁడు జగన్మోహనమూర్తి యగు నావిభుండు కలలోఁ గాన్పించి కామకేళి ననుం దేలించె. అని యిట్లు చెప్పి మధురలాలస తదుత్సవలీలలు మనసునం బొటుటంజేసి వివశయై మోడ్పుఁగను దోయితో ఘర్మపులకవతియై కొంతతడవుండి మరలఁ దెలిసి ఓలతాంగీ, యిఁక జెప్పవలేమి యున్నది. ఆపురుషోత్తముఁడు నన్నట్టు రసాబ్ధినోలలాడించి నన్నెప్పుడు విడనాడ నని యూరడిలం బలికి యంతర్హితుం డయ్యె. అది యటుండ, నాసుందరాంగుఁడే యింతకు మున్ను మనసమీపమునకుఁ దన వేగం బిలిచికొనుచువచ్చి నాధైర్యంబు నపహరించె. అదిమొదలు మదనదశావిహ్వలమతి నైతిని. ఇపు డతని మన్నన దక్కనన్యము లగు చలువలు గిలువలు నామదికి సహ్యములగునా? నాజీవితము నిలుపఁదలఁచితివేని యతిత్వరలో నాకు నానాథుని పొందించు నుపాయ మారయుము. అంతదనుకను బ్రాణంబుల నాఁపుకొనియెదను అనుడు, నాచెలి యిట్లనియె.

బాలామణీ! నీవిభుఁడు దయైకనిదానుఁడును దీనవత్సలుఁడుఁ గావున నే నీపని నతిశీఘ్రములోఁ జేయఁగల నను నమ్మక మున్నయది. అంతవరకును సాహించి యేమార్గముం ద్రొక్కకుము. ప్రాణంబులు బిగఁబట్టి యుండుము. అనుడు, మధురలాలస యాచెలిపలుకులు తనచెవుల కమృతముచిల్కినట్లుండి హృదయతాప ముడుప సేద దేరి నిజగృహంబునకు సఖీజనపరివృతయై చనియె.

కళాపూర్ణుని మనోవ్యథ.

ఇక్కడఁ గళాపూర్ణుండు మధురలాలస సౌందర్యాదులఁ జూచి తనమనంబు తదాయత్తమైయుండ నింటికి వచ్చి వికలితమనోధైర్యుండై యాసుందరాంగిరూపునే సర్వ

సమయములలో భావించి చేతోజాతహేతిఘాతంబుల కోర్వలేక వ్యథఁ జెందుచుండె. ఇట్లుండి యొకయేకాంతగృహంబునకుఁ బోయి తనకు నర్మసచివుండును, తిథివారాది శంసకుండు నగు నొకవృద్ధవిప్రుం బిలిపించి యతనితోఁ గొంతతడవు నర్మగోష్ఠి నుండి యనంతర మతనితో నిట్లనియె.

ఓ యనుఁగుచెలికాఁడా! నిన్నొకటి యడిగి తెలిసికొనవలయు నని యనుకొనుచుండుదు, నీవు వచ్చినయపు డద్దాని నేమని యడుగుదు నని యూరకయుందు, కాని యడుగకున్న నాసందియము తీరదని నిశ్చయించి యడుగఁ దలఁచితిని, తెలియకున్నఁ దెలిసికొనియైన నాసందియముఁ దీరుపవలయును. అది యెద్దియంటేని చెప్పెద వినుము; మన నగరమునకుఁ దూర్పుననుండునవి మదాళయుని మేడలు గదా. ఆయుప్పరిగల కవ్వల నున్న నూతనకుసుమప్రవాళ లలిత మగు కేళీవనం బెఱుంగుదు గదా. ఆయుద్యానమున నేను డేగంబిలువఁ బోయి యొక కుటిలాలక నళీనివహంబుల నడుమ నడువం గాంచితిని. అక్కంజాక్షి చక్కందనంబులరాసి గాఁ గాన్పించె. ఆపడఁతి వింత బెడంగుల నేమని వర్ణింపవచ్చు. ఆపర్వేందుముఖిం జూచి నే నపగతధైర్యుండ నైతిని. నీతో దాపరిక మెందులకు? ఆచంచలాక్షి నీక్షించినదిమొదలు పంచబాణుండు నాపైఁ గినిసి నాప్రాణంబులకుఁ దెగి నన్నింతయుఁ బాధించుచున్నాఁడు. అప్పటి నాదృష్టి కాకాంత కన్నియగా నున్నట్లే కానుపించినది. నీ వా తెఱవ తెరువెఱింగితేని నాకు వినిపించి నాహృదయతాపంబు వాపుము. అను రాజుమాటలు విని యాబ్రాహ్మణుం డితఁడు మరుబారిం బడియున్నవాఁడు కావున నే నిపు డన్యగసం బొనరించెదఁగాక యని యతని విలోకించి నవ్వుచు నిట్లనియె.

సిద్ధాంతి హాస్యరసము.

రాజోత్తమా! యాయమ్మ కన్నియయయ్యేఁ గానిమ్ము. కాక మాననిమ్ము. కాని యాపై నిన్నింతవరకు నపగతధైర్యునిగా నొనరించినమాట వినుటచేత నామనము చల్లనాయె. ఆతల్లి పదివేలరాజ్యము లేలుగాత మని నే నిట్లు సంతసించుటకుఁ గారణ మడిగితివేని తెల్పెద వినుము.

సీ. ఓమన్యథాయంచు నొరయువిద్వాంసుల గోష్ఠికెన్నఁడుఁ గడుగుబుతు లేదు
పౌరాణికులుచేరి పచరించు శుష్కవాచాలత విడువని వేల మెపుడు
చెవులుచిందఱపోవఁ జెలఁగు కవీంద్రుల పోరంటిమే శనివారపుజడి.
మతిప్రధానులవట్టిమంత నా లెటులన వానివి ప్రేగులలోని తీట
తే. అంతనంతఃపురంబున కరిగితేని। నీదుకొలువు బుధప్రకాశోదయంబు
మమ్ము నున్నారె యనుమాటమాత్రకైన। నడగలదె నీకు మాకొలువిపుడుకాక.
అదియునుం గాక:—

సీ. స్థలశుద్ధిగా వసుంధరఁ ద్రవ్వి పూడ్చిరే గట్టింపుమును బచ్చకప్పురమునఁ
సమ్మపన్నీటియగడ్త లుదీర్చిరే వెలిబెచ్చు వరుసలు విస్తరిలఁగ
బిసకాండములలోన పసియార్చి నిలిపిరే మంచిగందమ్మున మదురుగోడఁ
నవచంద్రకాంత మండపములోఁ బన్నిరే తలిరాకుదళ్ల చెంగలువచవికె
గీ. ఎన్నఁడైనను దొల్లి నీకిపుడు వోలె । నీమది న్నిల్వసాగనే యామ్రగాత్రి
వేతఁ బఱుపఁబట్టి దినమును వింతవింత । యైనయాపనుల్చూడ మాకబ్బెఁగాక.

అనుమాటలకుఁ బ్రభుం డిట్లనియె. మిత్రవర్యా, నిన్న మొదలనుండి యెఱుఁగమా! నీవు అప్పులకు నేరుపరివే గదా, దానికేమి? నేనడిగిన యాబాలిక కులస్థానవార్తల నెఱింగింపుము; నామనంబు వేగిరపడుచున్నది. అని గ్రుచ్చిగ్రుచ్చి యడిగిన భూపాలున కాభూసురుండు-

మహాప్రభూ! నీవు తొల్లి యొకనాఁడు రూపానుభూతితోఁ దద్విభుం డగు మదాశయునితోఁ బల్కినవాక్యంబులు జ్ఞాపకములో లేవా? వారిఁజూచి మీరిఁక నాకత్తమామలైతి రని పల్కినమాటలు మఱచితివా? అట్లుగా నామాట నీవలన మఱువంబడుటచేత నీ మనం బింత పరితప్తమగుచున్నది. ఆరూపానుభూతి పుత్త్రికయుఁ బరితప్త యగునట్లుగాఁ జేసినదియు నీమఱుపే గదా! అనిపల్కి యూరకుండె. అట్టి బ్రాహ్మణుంజూచి మఱల రా జిట్లనియె. ఎట్టెట్టూ, మిత్రవర్యా! నన్నలయింపక నిజముగాఁ దెల్పుము, పూఁదోఁటలో నేఁజూచినయది మదాశయుని పుత్త్రికయేనా? ఎంతవేగముగ నాబాలిక మనోజ్ఞ యౌవనము బూనినది. అద్భుతముగా నున్నదియే. అనుడు నాబ్రాహ్మణుఁ డిట్లనియె.

మహాప్రభూ! ఇంకను నన్నేమని తెల్పు మనియెదవు. మీమన మింతగాఁ గొల్లలాడ సకలగుణరాశి యగు నాయమకుఁగాక యన్యుల కలవియగునా! అబ్బాలిక కెలఁబ్రాయమును నీకీర్తియుఁ గొల్లురాచఁగా మదనుఁ డాపెపై నలిగి కత్తులు నూరుచుండును. ఇట్టిచో నాపెకు నీయవలోకనంబుఁగూడ యొదవె. అవి యాబాలను నేలకుఁ గోలకుఁ దెచ్చుచున్నట్లుగా నాపెచెలులు నాతోఁ జెప్పిరి. ఇట్లున్నను నాయమను గన్నదంపతులు పాపపురాచజాతిగుణభంగుల నెఱుంగుచుఁ దమ ముద్దుకూఁతురు ప్రాణాపద నొందుచున్నను నీవు పరికింపలేదను దురహంకారంబున నీకింతయైనఁ దెల్పరైరి. ఆకన్నియపడుబాధ చూడలేని తత్సఖీజను లుమ్మలింపుచు నీకేఁ జెప్పుదు నను తలంపున నాతో వినిపించుచుండిరి. నేను నుచితకాలముఁ బ్రతీక్షించుచు నీచిత్తవృత్తి తెలియక యాసుద్ది తలపెట్టఁ గూడదని మిన్నక యుంటిని. నీవు రూపానుభూతికిని మదాశయునకును మున్ననుగ్రహించిన మాట నీకుఁ దలఁపుచేసిన జాలు ననియు నీవు బొంకులేనివాఁడ వనియు నెఱింగి సమయ నిరీక్షణము చేయుచున్నవాఁడను. బ్రహ్మజాతి చాపలమున మఱలఁ గొంకుదును. నీవిరాళి భంగులు గణించియు నవి యితరమూలములు కాఁగూడదా యనియెంచి మిన్నకయుంటిని. ఇపుడు నీవు పిలిచి యడిగిన నప్పుడైన నే వెంటనే చెప్పకుంటకుఁ గారణము గలదు.

ముందుగ నీవార్త తెలుపుట గల్గినచో నిది మదాశయపుత్త్రికయేనా యని సులభతాగుణమున వదులుదేమో యను తలంపున నామాట నుడువక చిక్కఁబెట్టితిని. లోకములో నసాధ్యమైనచో నారనాళమునుగూడ నతితమితోఁ గాంక్షింతురు. సులభమగునపు డమృతమునైనఁ గైకొనఁబడదుగదా. పెరటిచెట్టు మందున కెన్నఁడైన పనికివచ్చునా. ఇది సామాన్యుల లక్షణము. నీవు విశేషజ్ఞుఁడవు. ఇట్టివి నీయెడలఁ గలుగకున్న నాయవివేక మింతదనుక దానిం దోఁపింపక యుండె. పిమ్మట నీవాయింటికి జాత్యాదు లడుగుట మాని దానిం గూర్చినచో నీకు లంచమీయనా యని పలుకగా నీకాపెయెడలఁ గలప్రేమ యధికమైనదిగాఁ దెలిసికొని యిపు డాపె చరిత్రమంతయు నీకుం దెల్పితిని. సంబంధసాదృశ్యము చూచిన నాయింటి కార్తవీర్యార్జునవంశభవుఁ డగు మదాశయుని పుత్త్రిక యాగటం జేసి యొకకొదువయు లేదు. ఆమదాశయునిభార్య యగు రూపానుభూతియును గులీనుం డగు సుగ్రహునియక్క. ఆసుగ్రహునివిశేషములు వివరించెద వినుము. అతని కనేకులు రాజపుత్త్రులు తమకన్యకల నిచ్చెదమని బడిబడి చెప్పిపంపఁగా వారిం దిరస్కరించి వారియీసుచేత దేశాంతరుఁడైన నయ్యెదం గాకని వారికన్యలఁ బరిగ్రహింపఁడయ్యె. అతని జననవేళయందు భాగ్యనిమిత్తములగు మ బహుగ్రహము లుండుటం జేసి యతనికి సుగ్రహుం డను నామ మిచ్చిరి. అట్టి శాస్త్రి యేమి యయ్యెనో యతఁ డేమియయ్యెనో మాఁడుఁడు; అది యెట్లైనఁ గానిమ్ము; ప్రస్తుతములో మనసు వలయునని ముగురాలాలస యుభయకుల శుద్ధిగలదని చెప్పుటయే గదా. అవనితామణి జీవితములు నిలుపుటకు నీకిష్టముగలదేని తద్వివాహమంగళకార్యమును వైళము జరిగింపుము; అని తన పంచాంగపుస్తకమును విచ్చి యధికప్రయత్నమునఁ దిథివారాది నిరీక్షణచేసి ప్రవేశన్ని గ్రహాది నిఖిల బలముల నిరూపించి సంతసిల్లుచు మరల నిట్లనియె

రాజేంద్రా! దేవర సిద్ధసంకల్పత యేమి చెప్పుదు. ఎల్లి నీయిచ్ఛ పేర నత్యుత్తమంబైన దివాలగ్నం బున్నది. వివాహమహోత్సవంబునకుఁ దగిన సకల సామగ్రియు సార్వభౌమున కెప్పుడును సిద్ధముగనే యుండుట చెప్ప నక్కఱలేదు. నీపురంబు నేఁ బ్రొద్దున విహితమంగళాలంకారంబె గదా. ఐనను పెండ్లికిఁ దగిన నూత్నాలంకారంబు చేయుటకుఁ జాటింపంబంపుము. మామయింటికిఁ గన్యాకన్యయాచ్ఛాదము పెద్దలం బంపుము. ఇదియ నేఁ జెప్పఁగల దంతయు నని బ్రాహ్మణుండు చెప్పిన నారాజేంద్రుం డతని యుపకారంబున కెంతయు సంతసిల్లి నీకుఁ బ్రత్యుపకారంబుగఁ బ్రస్తుతము నా నమస్సు నందుకొనుము; నీమేలు మఱువను. నీ చెప్పినట్లే కార్యమంతయు నడిపెదను. ప్రొద్దాయె నీ వింటికిం బొమ్మని యాబ్రాహ్మణునకు సెలవొసంగి కళాపూర్ణుండు రహస్యభవనంబు వెడలి వచ్చి సత్వదాత్ముం బిలిపించి ముందు జేయనగు సన్నాహం బంతయుఁ జేయింపుఁడని యాజ్ఞ నొసంగె.

పురోహితులను మామయింటికిఁ బంపుట.

అనంతరము కళాపూర్ణుండు తన యగ్రమహిషికిఁ దన వివాహోద్యమము దెలిపి యామె ననుమతింపఁజేసి రమ్మని ప్రథమాగమముఖ్యుల నల్వురఁ బనిచె. అపు డానల్వురు నభినవకౌముది కడకుం జని ప్రభుఁడు తమతోఁ దెల్పినవాక్యము లామెకుఁ దెలిపి నీవీ పనికి సమ్మతించినఁగాని ప్రభుఁడు తన వెనుకటి వాగ్దానానుసారముగా మదాశయపుత్త్రికను వివాహమాడఁ జనఁ డనియు నా రాజువాక్యముల ననృతము నెఱయకయుండునట్లుగా నీవును దోడ్పాటు కావలసినదనియుఁ జెప్పఁగా నాసపతివ్రతామణి వారితో నిట్లనియె:—

గీ. చల్లఁదనముతోడ నెల్లబంధువులకుఁ । దత్తదుచితమధురతరగుణములఁ
జిత్తరంజనంబుఁ జేయుట నభినవ। కౌముది యనుపేరు గలిగె నాకు.

గీ. చంద్రకిరణభవాప్సరోజాతిఁ బుట్టి । యట్టి పేరొందివెలయు నే నకట యిపుడు
తగ సతులకెల్ల సామాన్యధర్మ మైన । పతిమనోనుకూలతకును బాయ దెరువె.

క. కావున నన్నే మడిగెద । రావసుధాధిపున కేది యభిమత మదియే
నావాంఛితంబు నిక్కువ । మీవృత్తాంతంబు దెల్పుఁ డేర్పడ నచటన్.

అనిపల్కి యభినవకౌముది వీడ్కొలుపుటయును బ్రథమాగమాదులు చని యా విధంబు భూవిభునకు విన్నవించిరి. అట్టి యభినవకౌముది సరసత కెంతయు సంతసించి కళాపూర్ణుండు వారిని మదాశయుని గృహంబునకుఁ దెలుపఁ బంపె. అపు డా ప్రథమాగమాదులు మదాశయుని గృహంబునకుఁ బోయి యతనితోఁ గళాపూర్ణునకుఁ గలిగిన మధురలాలసా వివాహోద్దేశ్యంబు తెలిపిరి. అపు డట్టి శుభవర్తమానంబునకు మదాశయరూపానుభూతులును వారిబంధుజనంబులును పరమాహ్లాదముం జెందిరి. మదాశయుం డా విప్రపుంగవులకు సాక్షితాంబూలాద్యుచితశుభవర్తనంబులు నడిపెను. ఇట్టి వృత్తాంతంబు కళాపూర్ణున కెఱింగించినతోడన యతని యాజ్ఞను మంత్రిజనులు తద్వివాహోత్సవంబుల కాయత్తపడుఁ డని పురజనులకుఁ దెలియఁ బురంబులోఁ జాటింపఁ బంచిరి.

మధురలాలసాపరిణయోత్సవము.

సీ. ఎక్కడఁ జూచిన నిండ్లపైఁ బసిడికుండలు క్రొత్తమెఱుఁగిడి నిలుపువార
లేవంకఁ జూచిన హిమవారితో గంధసారంబు కలయంపి చల్లువార
లెచ్చోటఁ జూచిన నెలమి గోడలదట్టి పునుఁగు జవ్వాదియుఁ బూయువార
లేదిక్కుఁ జూచిన నింపుగా మణివేదికలు గమ్మకస్తురి నలుకువారు
గీ. ప్రేమఁ గప్రంపు ముగ్గులు బెట్టువారు । కలువడంబులు మేల్కట్టు గట్టువారు
పచ్చతోరణములు పొందుపఱచువారు । నై రహోరాత్రసంభ్రమంబలర జనులు.

మఱునాఁడు మదాశయుని భవనంబున శుభలగ్నంబు సమీపింప నైదువతనంబును సుతసమృద్ధియుఁ గలుగుసతులు బహువాద్యనాదములు దెసలు నెఱప మధురలాలసకు

మంగళస్నానవిధు లాచరించిరి. అం దొక కోమలి వివాహవేదికకడకుం జని దానిఁ గ్రొత్తగఁ గస్తూరితో నలికె; ఇంకొకముత్తైదువ వేదికకు ముత్తియపుముగ్గులు వెట్టె; ఇంకొకబోఁటి పుత్తడిపెండ్లిపీట రయంబునఁ బెట్టె; దానిపై నింకొకగరిత యతిత్వరితగతి నుత్తరపుచెఱఁగులుగా నొక యుత్తరీయముం గప్పె.

ఇచ్చట నట్టిసమయంబునఁ బరిణయోత్సవమునకు కళాపూర్ణుండు ప్రథమాగమాదిభూసురవ్రాశీర్వాదంబులును, వివిధపుణ్యాంగనాసంఘాతమంగళగీతంబులును, వందివైతాళిక సూత మాగధ స్తుతికోలాహలంబులును జెలంగఁ, గట్టాయితం బయ్యె. అపుడు జయజయశబ్దంబులును, శంఖ కాహళ భేరీ పటహ ఝల్లరీ పణవ మర్దళ తమ్మట ప్రముఖ నిఖిలవాద్య నిర్ఘోషంబులును, మిక్కుటం బగుచు నెక్కమొగి దిక్కులు పిక్కటిల్ల మిక్కిలి యెక్కుడగు వైభవంబున నగరు వెడలి యారాజు శుభశోభనాభరణభరణాభిరామరూపం బగుచు దీపించు నౌపవాహ్యంబు నారోహణంబుచేసి మదాశయగృహంబునకు మహావిభవంబునఁ గదలి గభీరగమనంబుల నడుచుచుండె. అంత గుడ జీరక హరిద్రా శుభద్రవ్యపరిపూర్ణభాజనరాజమాన హస్తప్రశస్తపురంధ్రీలోకంబు లోకపావనత్వంబున విలోకనీయం బగుచు నొప్ప లోకాతిశయవిభవాభిరాముండును, రామణీయకవిశేషవిజయకాముండును, గామనీయకాఖర్వసర్వగుణసంపదుద్ధాముండు నగుచుఁ గళాపూర్ణుం డుచితగాంభీర్యంబునం బెండ్లియిల్లు ప్రవేశించి మదాశయుండు నఖండవైభవంబున దవ్వుదవ్వులన యెదుర్కోలు చేసె. అపు డొకించుకవడి యత్యంతసంభ్రమంబున రెండుతోయంబుల పేరఁటాండ్రును జిత్తముల నెంతయు వేడ్కయతిశయిల్ల నభినవశుభాక్షతంబులఁ జెలరేఁగి చల్లులాడిరి. ఇట్లుగా మదాశయుం డెదుర్కోలానరించి భూరమణుం దెచ్చి మణిపీఠికనిడి తనకూర్మియిల్లాలు పసిడిగిండిం గొని తోయములు వోయఁగాఁ బదక్షాళన మాచరించుచు మధుపర్క ముఖ్యక్రియలు నిర్వర్తించె. అంతఁ బెద్దలయనుమతిం బ్రగల్భమనీషను బ్రథమాగముండు లగ్నాష్టకంబులు పఠియించి విధివిధానంబున సర్వక్రియలు మదాశయాత్మజకును మాణిస్తంభికిం జేయించె. ఆయ్యంగరాజేంద్రుఁడును బుణ్యాంగనల పెండ్లిపాటలును మంగళికోళ్ల మృదుగీతమాధురియుఁ జెలంగ మధురలాలసకు మంగళసూత్రంబు గట్టె. పిదప నవ్వధూవరులు చూపఱకు వింతసొబగు నొసంగుచుఁ దలఁబ్రాలు వోసికొనిరి. అపు డా లతాంగి ప్రథమాగము పంపున లాజహోమము పావకునందు సలిపె. అపుడా బాలిక చెలికత్తియ లామెను ధ్రువదర్శనంబుకొఱకుఁ గొంపోయిరి. ధ్రువుంజూచియుండు తటి నామగువకు మిగుల సూక్ష్మమయి మిన్కుమిన్కు మను నరుంధతింగూడ వారు చూపించిరి. అట్టి వివాహోత్సవము ముగిసినతోడనే మదాశయుండు వంటకములు చేయించి ఖర్జూర గోస్తనీ కదళికా సహకార ఫలములతోఁ బనసతొనలతో తేనియ జున్నుమీగడ లానవాలు పానకములతోఁ బచ్చడులతోఁ బెండ్లివారికిని బ్రజలకును భోజనంబులు

పెట్టించె. పిదప నాకబలి చేయించి తదంగముగా వసంతముతైన పిమ్మట ప్రియపుత్రికకు సమస్తవస్తుజాలంబు నరణమిచ్చి పెండ్లికొడుకు వెంటనంపుటకు సిద్ధమైయుండ నాలో రూపానుభూతి తనకూఁతు మధురలాలసం బిలిచి యిట్లు చెప్పందొడంగె. కుమారీ! నీకు సుముఖాసక్తి మణిస్తంభయోగీంద్రు లత్తమామలు. వారు యోగరసనిశ్చలితనుండి నీకో దండ్రి మెఱుఁగరు. అత్తమామలన్న నాచార్యుఁడన్న నిష్టదైవమన్న నీకుఁ బతియేసుమీ! ఇది యేఁజేయు మహోపదేశము. నీసవతి నభినవకౌముది దివ్యాంగనయు భవ్యచరితయు నగు నీకాపె పతికంటెను సంసేవ్యురాలు. ఆమెయెడ నీవు భయ భక్తి వినయంబులతో నుండ నగు. రూప యౌవనగర్వభరంబునం జేసికాని, విభుఁడిచ్చు మన్ననలం జేసి చెయ్యంపుటాలు నను నమ్మకముచేతఁగాని, వినయాదు లేమరకుము. నీ హృదయేశుని బంధు మిత్రాదులను నీసపత్నిని నత్త్వావిధి ముదమొందఁ జేయుము. అని యిట్లు తెలిపి కూఁతుం గౌఁగిటం జేర్చుకొని బాష్పములు జడిగురియ నత్తవారింటికిఁ బనిచె. కళాపూర్ణుండును నవ్విధంబున మధురలాలస కల్యాణవైభవంబు నవధరించి గృహప్రవేశమహోత్సవంబు గావించె. ఇట్లు చేసి యామహీపాలుం డభినవకౌముదికిని మధురలాలసకును సమానప్రేమంబులు చూపుచు దక్షిణనాయకుం డనఁ దనరి యుండె.

గానప్రసంగము.

ఇట్లుండి యొకసమయంబునఁ గళాపూర్ణుండు తనపట్టమహిషి యగు నభినవకౌముది రాణివాసంబున నుండ నయ్యాస్పృగమచ్చకంటి రాగసౌరభము దలిర్పఁ దనవీణియఁబూని పాడుచుఁ గొల్చి యుండె. అట్టి సొంపు మధురలాలసయు వినుట కుద్దేశించి యా భూకాంతుండు మధురలాలస నత్త్యాదరంబున నచ్చటికిఁ బిలువ నంపించె. అప్పుడు వచ్చి యున్న మధురలాలసయు దా గానంబు వినుచుండఁగా నామహారాజు.—ఓకలకంఠీ! నిను బ్రవీణగా విందుము. నీ వావీణియ నందుకొని నీపాటనుగూడ వినిపింపుము. అనుడు, నాపల్కులు విని మధురలాలస భీతిల్లి యిటునటు నట్టుచుండె. అట్టి తెరవ తెఱంగు విభుం డీక్షించి నీకుఁ గల సందియం బేమి? దాఁచక వివరింపుమనుడు మధురలాలస యిట్లనియె.

ప్రాణేశ్వరా! యీవిపంచి సముంచితశ్రుతులకు నాస్వరపటిమ సమ మగునో కాదో యను శంక బొడముచున్నయది. అనుడు దాని కేమి స్వభావగతిం బాడు మనుడు భర్తకోరిక ననుసరించి యాభామిని తన గానప్రావీణ్యతం జూపె. అట్టిపాట కావీణియ శ్రుతులుగీతులు నధరితము లయ్యె. ఆ కంఠస్వరవిభవంబునకును నేరుపునకును విభుండు వెఱగంది యుండె. అభినవకౌముదియు నద్భుతంబందుచు నీ గానంబు త్రిభువనదుర్లభం బనియె.

పదంపడి యొక్కింత విచారించి యామేదినీనాయకుండు మధురలాలసం గాంచి.— బాలికామణీ! నీవు వాయించు విపంచిక యెట్లున్నదో చూడవలయును తెప్పింపుము.

అనుడు నాయింతి.—స్వామీ! యేరి కెట్లుగాఁ దోఁచిన దోఁపనిమ్ము. నేను నిజంబు చెప్పెద. నాస్వరముల యొత్తికోలునకు నీడుగాఁబల్కెడు వీణియ లేదు. ఈనగరునఁ గల యీవీణియంగూర్చి నేనీవరలో వినుచుందును. అప్పటినుండియు దీనిం జూచుతలంపు నాకుఁ గల్గియుండె. దీనికొలఁది యేపాటిదో యిపుడది దేవరకే తెల్లంబాయెఁ గదా అనుటయు నమ్మహీపాలుం డబ్బాలికతో నిట్లనియె.

వర్తమానంకాలంబునం గల వీణియలలో నిదియ యుత్తమం బైనయది. నేను మొదలనుండియు దీనిపరిచయంబునం దగిలియుండుటంజేసి యింతదనుక దీని కధికంబు నకు బుద్ధి పొఁడదయ్యె. కాని యిపుడు భవదీయగానంబు వినిన మంద్ర మధ్య తారస్వర విలాసవిశేషంబుల కిదియ కడకత్తుయనియు, నీవీణియపలుకులు సమగ్రములు గావనియు, నామదికి సరిదాఁపుచున్నయది. అని యభినవకౌముదింజూచి కళాపూర్ణుం డిట్లనియె.

కాంతా! ఈబాలిక కంఠస్వనంబునకుఁ దగిన వీణియ యెక్కడయేనిం గలదొకో యన విని యా యోషామణి.— భూవరోత్తమా! మదీయం బైన యీవల్లకి యెల్ల వీణలకు నెక్కుడనియుఁ, దొల్లి తుంబురుండు మెచ్చి దీనిక్షధరియించియుండె ననియు, నే నతని ప్రియశిష్యురాల నవుటంజేసి దీని నా కతం డొసంగె ననియు, గానప్రసంగంబున మున్నే దేవర కేను విన్నపంబు చేసియుంటిగదా. ఇంతకంటె నుత్తమంబు లెక్కడఁ గలిగెడు ననిపలికి యొక్కింత చింతించి మగల నిట్లనియె. నాగురుం డగు తుంబురుం డీనడుమ గానకళల నారదునకుఁ గీడ్పడియె నని వింటిని. దాని విశేషంబు లెవ్వియో పరికింపఁబంచిన సంతసించెదను. అనుడు నమ్మాటలకుఁ గళాపూర్ణుండు కొంతతడవు పరికించి మున్ను మధురలాలస కథలలోఁ దనకు వినఁబడిన నారదుని తుంబురీజయోద్యోగంబుఁ దలంచుకొని తత్ప్రసంగంబున నిజపూర్వజన్మవృత్తాంతంబు సంస్మృతం బైన నందు మృగేంద్రవాహనామందిరగుప్తం బైన తనవిపంచియునికి చింతించి మదాశయపుత్త్రి కంఠస్వనంబునకు నదియ తగినది యని వితర్కించుచు దానిం బరికించి తెప్పించుట కుద్యోగించి మధురలాసంజూచి యింకొక వీణయున్నది, అది నీపాట కనురూపంబుగా నొప్పు, దానికై ప్రయత్నించెద.

అభినవకౌముదికిఁ జెలులబోధ.

అనియిట్లు కళాపూర్ణుండు పల్కుచుండ నభినవకౌముదిసఖు లాపెను గనుసన్నలఁ బైకిఁ దోడ్కొని యేకతంబున నాపెతో నిట్లు తెలిపిరి. అకటకటా! నీవు ముగుద వన్నంతకుఁ గలవు; సపత్నిపాట తగులంబడి దానిం బ్రకటించుపతికిఁ దోడ్పడె సంతసిల్లుచు నెచ్చటి వీణియసుద్దులు చెప్పుచుంటివి. ఆపె గానంబు నీవీణె నధఃకరించుట మున్నె యెఱింగి యెఱుఁగన ట్లాపెను బిలిపించుట నిన్నుఁ జాలుకనజేయుటకుఁ గాకే, మామాట నమ్ముము. నీవాకృత్రిమము నెఱుఁగ వైతివి. నీవసుండు నేఁడు నీభవనంబున నీపాట

వినుచున్నాఁడట. ఆకతమై మనం బీడఁడేని యట్లేల చేయును? నీ వెఱుఁగవుగాని యొక్కరుఁడు కొంచెము మార్గమిడినఁ గూర్మికిఁ గొఱంతె యగునా. కొంచె మలుకఁ దెచ్చికొనుము. మామాట విని తమితో నీ వెప్పటివలెఁ బలుకక యించుక తడవుండుము. దానిని మధురలాలసవలన నీకుఁ గలిగిన కొఱంతగా భావించి నీకొఱంతమిఁదీర్చుటకు నుపాయంబు నీభర్తయే యూహింపఁగలఁడు. అని బోధించిన నాయించుబోఁడి యిట్లనియె.

చెలులారా! నా నెయ్యపుఁదమిని విభుని తెఱంగుఁ జింతింపలేక యుంటిని. దానిని మీరు తెల్పి మేలొనర్చితిరి. అయిన నేమాయె. మీయాలోచనకుఁ దగుకార్యముల నాచరించెద. అని యభినవకౌముది వారి కప్పటికిఁ దగిన యుత్తరము లిచ్చి నిశ్చలంబైన ధైర్యంబున నెప్పటియట్లుగా వచ్చి కూర్చుండె. అంత విభుండు మధురలాలసను నాపె రాణివాసంబునకుఁ బో నాజ్ఞ యొసఁగి తాను సభాభవనంబునకుం బోయి రాజ్యవ్యవహారంబుల దినకృత్యంబులు జరుపుచుండె.

అభినవకౌముది యలుగుట.

ఆభూనాయకుండు నాఁటిరేయి యభినవకౌముదియుండు శయనగృహంబునకుం జనియె. అంత నాయచ్చరపూఁబోఁడి యత్యంతభక్తినీతివిధేయతలు తేటపడఁగ నలంకారశూన్యం బగు నంగంబుతో నెనికిఁ బ్రత్యుత్థానంబు సేసి వానికిం బలెఁ బాద్యాదిపూజలు ఘటియించె. కాని సరసోక్తి వీక్షాలాలిత్యంబులేమియుఁ జూపదయ్యె. తలిమంబుపై నెరసులు లేకుండఁ దుడిచి సుకిదడిమపు దువ్వలువపైఁ బఱచి తలగడ నిలిపె. అంత దానియందు భర్త పవ్వళించియున్న దానిచేరువ నొక పసిండిగద్దియ నాముద్దియ కూర్చుండి యాకుమడిచి యొసంగుచుండె. తత్ప్రకారంబుఁ గనుఁగొని యాభూరమణుం డేలకో యీబాలిక శృంగారచేష్టలఁ జూపుట మాని యిట్లుగా శుష్కవినయభక్తిపాతివ్రత్యవిధులు చూపుచున్నది? ఏల నన్నిట్లు వంచించుచున్నది? అని సంశయించి నేఁటిపాటలీపాటలగంధికిఁ గౌటిల్యకారణములై యుండనోపు. పరీక్షించి చూచెదఁగాక, అని యా కమలవదనతో నిట్లనియె.

దేవీ! నీవేల యిపు డొకలాగుఁ గాన్పించుచున్నదానవు, నీయం దీవర కిట్టిమార్గ మెన్నఁడును జూచియుండలేదు. అనుమాటల కుత్తరంబీయక యున్న వనితం జూచి మరల ననునయింపుడు పొలయుచు నచ్చెలువ కాంతునితో నిట్లనియె.

నాథా! పాటలఁగెల్చినసతిపలుకులు పలుకులుగాని నోటమిన్న నేటినాపలుకులు నీకేల? మది మక్కువ వేఱొకచోటనుండఁగా మీబోంట్లకు బోటిదనాలు చనునే. మాపని యేమియున్నది! ఇంతటినుండి మీకీపరిపాటి సేవ రచియించుటకే తగినదానను; నాకుఁ దొల్లి మన్ననలు బహుమానములు గల్గియుండె. అట్టి ప్రియంబులు జనువులు గల్గియుండనిపుడు ప్రాణపరిత్యాగమే యుక్తము గదా. కాని యట్టి శోభనకార్యమునకు

విరోధి యగు పాపపుటాయువుం దిట్టకొనుటకంటె నిన్నవలసినది యేమియున్నది? అనుడుఁ గళాపూర్ణుండు.— ఓ నారీమణీ! ఏయపరాధము నావలనంగలుగఁ దెలిసి నన్ను దూరెదు? నీ కేయహితమును నేను ఘటియింపలేదు. నీచరణములపై నాన, అని పల్కుచు లేచి వచ్చి యానాతిపదాబ్జంబులఁ బట్టె. ఇట్లు పట్టినఁ జాలుంజాలు, నీమోహంపుదేవులకాళ్ళు బట్టుకొమ్ము. నాకేల యీ వట్టిదోసము గట్టెదు. అని యభినవకౌముది తన చరణంబు లదల్చికొంచుఁ దన రెండుచేతుల నాపుకొనుచు నతనిహస్తంబులు పట్టుకొనియె. పిమ్మట నామహీకాంతుండు— సరోజాక్షీ! నాకు నీకంటెను మోహంపుదేవులెవ్వరు? అనిపల్కుచు నాసతిం గౌఁగిలించె. అంత నత్తలిరాకుబోఁడి యశ్రుకణంబులు దొరుఁగ డగ్గుత్తికతో— రాజేంద్రా! నీదయకు, కూర్మికి, లాలనకుఁ, గొఱంతయుండునా! కాని నేఁడు నాచిత్తములో నొకవిధ మగు సిగ్గును, చిన్నదనంబును, దాపంబును, మానక యున్నది. అనుడు నమ్మహీకాంతుండు.— కాంతామణీ, నీ తెఱం గెఱుంగుదు. ఇంతదనుక నద్వితీయం బని పొగడ్తం గాంచిన నీవిపంచి యితరనారీ గానంబున నధరీకృత యగుటం జేసి యవమానితప్రాంతంబున వగచుచున్నదానవు. అట్టి వగ మానుము. దానికంటె నత్యుత్తమం బైన యొకవిచిత్రవల్లకిని మత్పూర్వజన్మంబున నేను ధరియించితిని. అది యొక్కచో నున్నట్లుగా వినియున్నవాఁడను. దాని నెటులనైన సాధించి తెచ్చి తద్వాదనాభ్యాసంబుతో డన్నైన నిన్నెంతటివారికిని మీఱ శక్యంబుగాని గానవిద్య నుద్యోతించునట్లుగాఁ జేసెద. నామాట నమ్ముము. అనుడు, నవ్వనితయు నతండు పూర్వజన్మంబున గంధర్వకుమారుం డగుట తాను నెఱింగినది గావున నతని కట్టివీణియ గల్గుట సంభవించు నని మనంబునకు సరిపుచ్చుకొని సంతసిల్లె. కళాపూర్ణుండు నవ్విధంబున నవ్వనిత డెందంబు కందువాపి సాంద్రానందంబున నభిమతక్రీడల విహరించి యారాత్రిగడపి సూర్యోదయంబున దినాహ్నికృత్యంబులు నడుపుటకు స్వభవనంబునకుఁ జనుదెంచె.

మధురలాలసకు భర్తయిచ్చిన వరము.

అట్టివార్త యభినవకౌముది నెచ్చెలుల ముచ్చటలవలనఁ గర్ణాకర్ణికగా మధురలాలస చెలికత్తెయలువిని యావృత్తాంతము నాపె కెఱిఁగించిరి. అపు డాపె యిట్లు చింతించె. అహహా, గానాదికళల కొదువలు పతి తాఁ దీర్చి నాకు ముదంబొనరించి నాకొఱకుఁగాఁ దేదలంచుకొనిన లోకోత్తరపు వీణియ నభినవకౌముది తనకిచ్చునట్లు చేసికొనియె. వరుని ప్రేమ నడువఁగాఁ దెకవాటుగొట్టె. ఆఁడుదియన నిట్లుండవలదా! అని విచారించి పతితనకడకువచ్చినప్పుడు వింతరీతి నుండెదను. అని నిశ్చయించుకొనుసమయంబునఁ బతి యాపె శయనగృహంబునకు వచ్చె. అపుడు మధురలాలస క్రోధవిధంబున నుండె. దానిం గనుపెట్టి కళాపూర్ణుం డాపె యట్లుండుటకుఁ గారణంబు తనపక్షపాతివర్తనమే గదా యని తెలిసికొని తాఁజేసిన నేరమును క్షమియింపు మని యాబాలికపదంబులపై నెఱఁగె.

ఇట్లు తిరస్కరించి, ఓయీ యింతీ! నీవు చింతింపకుము. శీఘ్రమున నేఁబోయి యష్టదిగ్గజపతుల జయించి వారి దారల మౌళిమణిసంతతిచేత నీకుఁ బాదనూపురంబులు చేయించి యిచ్చెద. నీవగపు మానుము. అనుడు మధురలాలసయుఁ దన యుమ్మలికంబు మానియుండె.

కళాపూర్ణుని యాలోచన.

అంతఁ గళాపూర్ణుఁడు తన భార్యల సంతసిలం జేయుటకుఁ దాఁజేయ నొడఁబడిన రెండు కార్యములుం జేయుటకుఁ దగుసాధనము నాలోచించుచుండె. వీణయున్న చోటు నభినవకౌముది కెఱుఁగించి దానిం దెచ్చికొనఁ బొమ్మనిన నామె దివ్యకామినిగావున నిప్పుడ పోయి తెచ్చుకొనఁగలదు. అట్లు పనుచుట నాసామర్థ్యహీనతం దోఁపింపక పోదు. అది నా కనుచితము. కావున నామార్గము వదలి యన్యుల నెవరినైన దానిందెచ్చుటకు నంపెద నంటినేని విఘ్నకారు లెవ్వరుగలరో నాకుం దెలియదు గదా. అట్టి విఘ్నములే గల్గినచో వాని న్వారించి తేఁగల సమర్థులు నుండవలయును. అట్టివారు లభించుట దుర్లభము. ఆ మార్గము వదలి యాదేశపాలకునకే వీణియ పంపుమని చెప్పి పంపిన నతఁడే దాని నాసించుట కలుగవచ్చును. అపు డతనిని శిక్షించుటకై బయలు వెడలుట లోకాపవాద హేతువగును. ఆమార్గముం గూడ వదలి నేనే దండెత్తి పోయెదను. అపుడు మార్గమధ్యమున నుండు శత్రురాజుల జయించుటయు వారిసంపదల నార్జించుటయుఁ దటస్థించును. మధురలాలస కొడంబడిన యాందియలు సాధించుటకూడ దిగ్విజయంబునఁ గాని శక్యంబు గానట్లు తోఁచుచున్నది. దండయాత్రవలన నుభయములును సాధించుట యగును.

మంత్రితోడి మంతనము.

అని యిట్లూహించి యూహాపోహార్థమునకు సకల నిజరాజ్యభారధారేయుం డగు సత్వదాత్ముండను మంత్రిం బిలిపించి యప్పటిలో లోనికి నెవ్వరిని రానీయకుండ ద్వారరక్షకులనిల్పి మంత్రవిధానోచితభవనంబునకు నిజామాత్యసహితంబుగఁ గళాపూర్ణుండు సనియె. ఇట్లుగాఁ జని సత్వదాత్మునితోఁ దనతలంపు ప్రకారం బెల్లఁ జెప్పిన నతండు— మహాప్రభూ ! నేఁటి యత్నమంతయు నాకు మధురలాలస భాగ్యలక్షణములు చూచియుండుటంజేసి సరిదాఁకె. అనుఁడు, నా రాజట్లే యగునని నవ్వుచు నిఁక దీనికిఁ గర్తవ్యమెద్దియో నీతిపదవి నరసి తెలియం దగును. నాకుంబోలిన విధంబునఁ జెప్పెద నని మఱియు నిట్లనియె. మంత్రివర్యా! మంత్రము యజ్ఞశీలునకును ధరాధిపునకుఁగూడ శ్రుతిచతుష్టయాదిగమ్యమై నిపుణమంత్రిసంప్రణీత మగునేని యపూర్వఫలము గావించు; నాకుఁ జూడఁగా నతికళాకలనము లల్పశౌర్యుల తెఱంగులు. జయమేకపదము శౌర్యబలమనియే తోఁచుచున్నది. ప్రబలశౌర్యుండు పరాక్రమించునదియే పోరికిఁ దగుదేశంబు. అదియే తగుసమయము, అదియ యాయుధంబును, అతఁడే గెల్వఁగొన సమర్థుండు, శౌర్యశాలికి యుద్ధమొనర్పఁబూనిన శత్రువు నెదుటఁ గనుఁగొనినతోడనే యొక్క తేజముద

యించు, అగ్ని విపినముం దహించుటకు జ్వాలామాలికలు గూర్చుకొని వచ్చునా? ఏనుఁగు శైలతుల్యదేహమును ధరియించియు మందగతిదోషమున వధ్యభావముం బొందు. పంచాననము కొంచెము దేహముగలదియైనను శరభసాతిశయంబున ఘాతుకత్వముం బొందు. కావున జయములు శౌర్యసాధ్యములు. ప్రతాపవంతుఁడు సకలకళానిపుణులచే సేవలు సేయించుకొనును. కళలన్నియుఁ బ్రతాపసంపదతో సరిగావు. కొంచెపు కార్యకర్తకు నీకార్యము సుకర, మీకార్యము దుష్కర మను భేదచింత కలుగును. ప్రతాపాఢ్యునకు దివియన్నియు విఫలంబులు. దావపావకునికడ దారువుల శుష్కాశుష్కతా భేదములు వ్యర్థములే గదా? కావున శూరుం డుత్సాహావేశం బయిన యప్పుడే యాహితులమీఁద దండు గదలింపవలయు నని నాయభిప్రాయము. అని యిట్లుగాఁ గళాపూర్ణ మహీపాలుండు పలుకగా సత్వదాత్ముండు సవినయంబుగా నిట్లనియె.

మంత్ర్యుపన్యాసము

మహారాజేంద్ర! నయస్థితిని నీవు కనినయట్లే నేఁ గానఁ జేర్తునా? అయిన నీ యనుమతిని నిర్భయత నాప్తులతో నిచ్చకమాడఁగూడ దని యున్నది గావున నామనంబునఁ దోఁచిన లాగున విన్నవించెదను. ప్రతాపోజ్జ్వలులైన నీభావమునకు నావృద్ధుల నమోక్తి యుంచక నొప్పియున్నచో జ్వలితశిఖండంబు జలముంగొనుటీపిం దైకొమ్ము. నరపాలకుండు నీతిపథమును, నీట నీఁదువాఁడు తెప్పను, వ్యాధిపీడితుఁడు పథ్యాశనిని, విడువఁగూడదు గదా? ఒక్కొకసమయములోఁ బయిని నిరాకరింపఁబడి సాధనసాహాయ్యము లేకున్న నృపతికి, నీఁదువానికి, వ్యాధిగ్రస్తునకు, గార్యానుకూలం బగుట గలదు. తప్పిపోయినచో మాత్రము వారు తగుసాధనములఁ బరిత్యజించిన నింద్యం జెందక పోరు. నీతిమార్గప్రవర్తకుఁ డగు ప్రభువున కొకసమయంబున నెగ్గులు తటస్థించినను లోకులు విధాతం దిట్టుదురుగాని యతనిం దిట్టరు. ఇంతియ గాక సిరి నీతిహీనుం జెందుటయే తటస్థించిన నట్టివానిని సిరియెట్లు చేరె నని శ్రీదేవినే తిట్టుదురు. ఇనుముం గూడియున్న యగ్నికి సమ్మెట పెట్లు గాకయుండునా? మహాప్రభూ! నీతి యనఁగా నీపని నీవిధముగా నాచరింపవచ్చుననియు, నిది యిట్టిదైన సాధ్య మగుననియుఁ జెప్పెడుమాటయే గదా? అట్టి నీతివివేకము మహాబలాఢ్యునకుఁ గానరాదు. దీనికిఁ ద్రిపురజయార్థముగాఁ గొండను జాపముగాఁ దాల్చిన రుద్రుఁడే సాక్షీభూతుం డగు. అంపకోల దేవునకైనను పట్టిచేతితో నడిపింపఁగా వింటఁదొడిగియేసినయంత దూరము నడిపింపవచ్చునా? కావున, బలిమికంటె నీతిబలిమియే యెక్కుడు. రాజోత్తమా! సంధియు, విగ్రహమును, యానంబును, నాసనంబును, ద్వైధమును, ఆశ్రయమును, అను నీయాఱుగుణంబులును దగువేళల నుపయోగింపవలయును. అట్లు సలుపగా మేలొసంగు; అసమయప్రయుక్తంబు లగునేనిఁ గీడు మూడించు; ఉపాయముల పేరులు సామ భేద దాన దండము లనియు, వాని లక్షణము

శిక్షించుటయుఁ జెప్పుట కందఱును సమర్థులే కాని, వాని ప్రయోగాప్రయోగవిధులు తెలియుట సుసాధ్యములు గావు. గోరుతోఁ జీరఁదగినది గొడ్డలితోడను, గొడ్డటఁ జీరఁదగినది గోటితోడను, జేయునట్లుగనే గురు లఘు వ్యవస్థను దెలియక పై చతురుపాయములు ప్రయోగించుట యనుచిత మగును. విపక్షుని పదవియుఁ దనపదవియు సరిగానుండు నప్పుడే సామవిధి నుపయోగింపవలయును. మూలబల మతిశయించుటంజేసి దుర్జయుం డగు శాత్రవునిమెడ భేదవిధి నడుపవలయును. సంధిని హితు లగు బలముగలవిభుని యందు దానవిధి నుపయోగింపవలయును. సాధునిశ్చితపరాజయుండై హీనబలుండైయున్న మార్తునియందు దండవిధి నుపయోగింపవలయును. బుద్ధియందు క్షయ స్థాన వృద్ధు లను త్రివర్గము నెఱింగి, పంచాంగవర్తనములఁ దెలిసి, శక్తిత్రయంబునం బ్రకాశింపవలయును. భూపతికిఁ దెలిసి విడువవలసినదోషములు పదునాలుగు. అవి యెవ్వి యనఁగా:—

(1) మంత్రగోపనము నేమరియుండుట. (2) దీర్ఘచింత. (3) నిరర్థకపుచింత. (4) ప్రసాదరహితత్వము. (5) బుధావిజ్ఞానము. (6) శుభాప్రయోగము. (7) విషయానురాగభరము. (8) అనృతమాడుట. (9) ఆలస్యము. (10) నాస్తికత్వము. (11) అర్థములయందనర్థమతి. (12) దీర్ఘమంత్రత్వము. (13) దీర్ఘగోపనము. (14) నిర్ణీతకార్యంబు లాచరింపకయుండుట. వీనితోఁబాటు కామదోషజము లగు సప్తవ్యసనములయందుఁ దగులకొనియుండుట. ఇట్టివి సర్వంబును బరిత్యజింపవలసినవియే యగును. ఇఁక ముఖ్యకర్తవ్యము లగు వాని మఱికొన్నిటింగూడఁ దెలియవలసియుండు. అవి యెవ్వి యనఁగా:— కొలిచినవారిజీతములు వేళతప్పక పూర్ణముగా నిచ్చివేయుట. అటులైనచో వారిప్రేమయును బలమును నృపాలున కెల్లసమయములను మిక్కిలి యుపయోగించును. మఱియు నెవ్వరెవ్వరికే యేకట్టడలు జరుగవలయునో వారివారి కాయాకట్టడలను నృపుఁడు తప్పక నడుపవలయును. తస్కరాదిబాధల నివారించుచు నృపాలుఁడు కృపాళుండై న్యాయముగాఁ బ్రజల నేలవలయును. దండార్హులైనవారల దండింపకుండుటయు, కాని వారల దండించుటయు, నీరెండును భూమిపాలున కిహమునం దపకీర్తినిఁ బరమున నిరయవాసముం గల్గించును. అని యిట్లుపన్యసించి సత్వదాత్ముండు మఱల నిట్లనియె. రాజేంద్రా! ప్రసంగవశంబున వీని నన్నిటిం దెల్పితినిగాని యివి నీకుఁ దెలియనివి కావు. నీవు సకలనీతికోవిదుఁడవే యగుదువు. ధర్మప్రవర్తన యనునది నీకే గలదు, సర్వసర్వంసహాచక్రంబు నిర్విక్రంబుగా జయించిన మదాశయుని నీవు జయించుకతంబుననె నీ కీలాగెల్ల దిశలం జెల్లుట సిద్ధంబే. అయినను నృపాలురశాంతి స్థిరమగునది గాదు. కావున నీవిపుడు దండు వెడలి యానడుమ నంకురితదర్పు లగుచు నెదుర్పంగడంగు గడుసుదొరల లెక్కడెక్కడ గలరో వారి నుక్కడించి దిక్కుల నీప్రతాపంబు నెఱపుటయ కర్జంబు. దేవర యానతిచ్చినట్లుగా దాని కుచితసమయం బిదియె యగును. ఎట్లంటేని చెప్పెద వినుము. నీవు

మధురలాలసకు సకలదిగ్దేశాధీశశుద్ధాంతకామినీమౌళిమాణిక్యనిర్మితనూపురసమర్పణం బతిశీఘ్రంబ సేయుటకుఁ బ్రతినవట్టినట్లు చెప్పుచున్నాఁడవు. తాదృశమంజీరధారణకారణంబైన యావారీమణి యదృష్టంబు శీఘ్రభావిఫలదం బగుచు నీచే నట్టి ప్రతిన వట్టించె. దానంజేసి జయం బవశ్యలభ్యంబు. అభినవకౌముది ప్రయోజనంబును దదానుషంగికఫలం బగుచు సిద్ధించుట వేఱ చెప్ప నక్కఱలేదు. కావున నీతిచాతురీపూర్వకంబుగా దండయాత్రసలుపుము, మఱియు శత్రులనడగించుటలోఁ గొంతధనంబును వెచ్చమైనపిమ్మట గెలిచిన గెలుపును గెలుపుగనే వాడుకొనఁబడును. బలహానియు ధనహానియు విశేషము కాకయుండ నీతిచేత జయించినదే జయము. నీసతిభాగ్యమును సార్థకమే యగును. నీదిగ్జైత్రయాత్ర ప్రదక్షిణక్రమముగాఁ బ్రారంభించుట యుక్తము. కావునఁ బ్రాచి, అవాచి, పాశ్చాత్యులం జయింపఁ గడంగుము. నీరాష్ట్రమున కెన్నొనర్పఁదలంచు పార్ష్ణిగ్రాహుఁ డగుమాగధుఁడు సారోదగ్రుఁడు. కావున నతనితో సంధిచేయుట యుచితి. అని యిట్లు సత్వదాత్ముండు తన ప్రభువునకు మంత్ర ముపదేశించె.

యుద్ధసన్నాహము.

అంతఁ గళాపూర్ణుండు తన మంత్రి యుపదేశించిన నీతిమార్గమున కెంతయు సంతసిల్లి సత్వదాత్ముని యుద్దేశ్యానుసారముగ మగధరాజుతో సంధి యొనరించె. అనంతర మా నృపాలుండు యథార్హవర్తనంబున సుమంత్ర, ధన, ధాన్య ప్రముఖముల నెందును గొదలేకయుండ గడిదుర్గంబులను, తనరాజధానిని భద్రపఱిచె. ఇట్లుచేసి దృఢప్రయత్నుండై యాభూకాంతుఁడు తనబలనాథులకుఁ దనకోర్కె చెప్పంబంపె. వారు నత్యుత్సాహంబునఁ దమప్రభుకార్యనిర్వాహదక్షులై క్రముకకంఠోత్తరపుంబునఁ జాటం బంచిరి. అట్టి సమయంబున సూర్యాస్తమయం బయ్యె. అపుడు పట్టణంబునంగల దండనాయకు లందఱు తమయేలిక జయప్రయాణంబునకుఁ దగిన సన్నాహంబున నాయత్తపడుచుండిరి. కళాపూర్ణుండు నభినవకౌముది మందిరంబున కరిగి యయ్యిగురుఁబోఁడితో నోకమలవదనా! నీకు నొడఁబడిన వీణియ సాధించుటకు దిగ్విజయంబొనర్పనంతవలసె. నేఁటి వేకువ తత్ప్రయాణ ముహూర్తంబు నిశ్చయింపఁబడియె నని తెల్పి, యాయింతిని సంతసిలంజేసి కళాపూర్ణుండు మధురలాలసపాలికిం జని యాకంజవదనతో నిట్లనియె. ఓపూఁబోఁడీ! నీ నూపురంబు ఘనులకై నిఖిల దిగంత విజయయాత్ర నొనర్పవలయుం గావున నెల్లి మంచిదివసం బని కార్యాంతికులు నిర్ణయించిరి. అని తెల్పి యాపె యనుమతింగొని ప్రయాణోన్ముఖుం డయ్యె.

విజయయాత్ర.

అంతట ప్రస్థానసముచిత బ్రహ్మమంత్రంబులు భూసురులు పఠియించుచుండఁగా జయజయశబ్దములతో బిరుదావళులు వందివరులు చదువఁగా వేత్రహస్తులు సామంతభూనాథులపేళ్లు వివరించి చెప్పుచుండఁగా జైత్రభేరీ ధణంధణశబ్దములు దిక్కులుగ్రక్కదల

శుభలగ్నమునఁ గళాపూర్ణుండు పట్టపేనుంగుపై నధిరోహించి తన భవనంబు వెడలె. అంతకు మున్నె సత్త్వదాత్ముండు సర్వరాజలోకంబునకును కళాపూర్ణుండు దిగ్విజయయాత్రకై వెడలు కారణంబులఁ దెల్పుచుఁ బత్త్రికలు వ్రాసిపంపెను. అవియెట్లున్న వనః—భూపతులారా! సకల సౌభాగ్యలక్షణధన్య యైనట్టియు జగదేకవీరపత్ని యైనట్టియు మధురలాలసకు పాదనూపురములు చేయించుటకును దానిమణులకై సకలదిగ్దేశధరాధిపతుల దేవులు ధరియించు మౌళిరత్నములఁ దన్నాథులఁ జయించి తెచ్చుటకును ప్రతినవట్టి యిదె మామహారాజు మీపై వెడలుచున్నాఁడు. ప్రాణంబులపై యాసగలదేని యతని నెదురింపక యతని యిష్టాపూర్తి జేసి తినుపుడు. ఇట్లుగాఁ గానుకలు పుత్తెంచిన రాజులనెల్లఁ నానృపోత్తముఁడు రక్షించును. అని పంపిన సత్త్వదాత్ముని పత్త్రికానుసారంబుగాఁ గార్యంబునడపిన ధరాపతులను గళాపూర్ణుండు గౌరవించి మనిచె. గౌడవిభుండు యాత్రాభంగుఁడను దండనాయకునితోఁ గూడి యెదుర్చి కళాపూర్ణునివలన పరాజితుండై తనసేనయుఁ దానును గలఁగి కెగుల తంగేళ్లునఁ ద్రొక్కికొనుచు నత్యంతభీతిం బాఱె. ఇవ్విధంబున పాఱి యాతండు నిజపట్టణంబు సొచ్చినఁ గళాపూర్ణుండును ప్రచండితర సింహనాద బంధుర జయదుందుభి ధణంధణ ఘోషభీషణం బగు సేనయుం దానును నతని వెనుకొని చని యతిరయంబునఁ బురంబు జొర నురువడించిన తద్రక్షకులు తమకు పసుమ గవనులు మూయించి దంచనంబులు శతఘ్నులు జబురుజంగులు తుపాకులు మొదలైన సాధనంబుల ముమ్మరంబుతోఁ గ్రమ్ముకొని కొమ్మకొమ్మకుఁ బెక్కండ్రుగా నుక్కుమిగిలి లెక్కకు నెక్కుడగుచు విక్రమాటోపమ్మునఁ గోటబలిసికొనుటయు వికటనటద్భ్రుకుటీ వికటిత ముఖుం డగు సత్త్వదాత్ముం డను గళాపూర్ణుని ప్రగ్గడ తెమ ముగ్గరంబు నగ్గలిక మెఱయ లగ్గలసడ్డగించిన తదుగ్రతకును గాక చీకాకుపడు ప్రజల గజిబిజి యాలింపుచు గౌడపతి వివిధోపాయనపురస్సరంబుగాఁ బురంబు వెడలి యాకళాపూర్ణ మహారాజుం గని కొలిచి యతనిదయ వడసె. ఇవ్విధంబున నిగ్గళ విజయస్ఫురణంబున భిన్నీలు నాసుముఖాసత్తినందను కడపఁ గళింగ ద్రవిళ చోళ పాండ్యాదిభూపతులువచ్చి తమయంతనే వశవర్తులగుచు నానావిధోపాయనంబులతోడ నెదుర్కొనుచు ననుప, దక్షిణసముద్రతీరంబునకుం జని కేరళమహీపాలునిమీఁద విడిసె. అతఁడును శూరతపాటించి చమూసమూహముతో నాకళాపూర్ణుని మార్కొని ఘోరతరంబగు పోరొనరించె. ఇత్తెఱంగున నత్యంత శౌర్యసాహసంబుల నిరువాగును దేహంబులఁ సరకుకొనక సంగ్రామంబు చేయుచుండఁ గేరళభూరమణుండు కళాపూర్ణు కడ కొకరాయబారిం బనిచె. అతనిముఖంబున వృథాబలక్షయంబువలన నయ్యెడు ఫలం బెద్ది? మన యిద్దఱము నద్దిండుకొని కటారుల నెక్కటి కయ్యంబు గావింపుచు శౌర్యంబులకొలఁది నెఱుఁగుద మని చెప్పపంచినఁ గళాపూర్ణుం డట్ల కానిమ్మని యియ్యకొనియె. అంత నుభయబలంబులవారును బోరు చాలించిరి. అప్పుడాబిరుదుకటారికాండ్రిద్దఱొకళ్లొకళ్లకు సరియగుచు

వెఱబంటుతనంబున నోర్చి రోషకటాక్షవీక్షణంబుల నీక్షింపుచు జోగక కటారిమొనలు కడుబెట్టునడిని యొకరికొకరుఁ బోట్లాడుచుండిరి. అంత కళాపూర్ణుం డతివిచిత్ర హస్తవేగంబున పరభూకాంతుఁ దడబఱిచి కటారిమొన యొకింతచొర ననేకస్థలంబుల గంట్లువెట్టె. అప్పుడు తత్ప్రతివీరుండు కళాపూర్ణుని నేర్పరితనంబునకును తన్ను జంపఁగా నొల్లమికిని మనంబున గడు వెఱగుపడుచుఁ దనకటారిని దూరంబుగాఁ బడవైచి యతని పాదయుగళికి ప్రణతుం డయ్యె. ఇట్లానతుండై కరకమలంబులు మొగిడ్చి కేరళేంద్రుఁ డిట్లనియె.

ఓ మహానుభావా! నీవు దివ్యపురుషుండవుగాక రాజమాత్రుండవే. ఆంధ్రదేశంబునుండి వచ్చిన యొక్క యత్యంత చాతురీధురీణుం డైన కటారిసాధనకానివలన ననేకకాలం బభ్యసించి పేరుగల బిరుదుమాష్టీల పెక్కండ్ర జయించి యొక్కఁడను మొక్కవోని మానుషంబున ననూనగర్వుండ నగుచు నునికిం జేసి నిన్నిట్లు పోరునకుఁ బిలిచితి, నన్నిట్లు పరిభవించుట యద్భుతంబు గాదే. అని కొనియాడి యమ్మనురలాలసాగమణుని పరివారంబుగా నిజపురంబునకుఁ బ్రార్థించి తోడుకొనిపోయి మహోపచారంబులం బూజించి యతనికభిమతంబు లయిన తన శుద్ధాంతకాంతల శిరోరత్నంబులు సమర్పించి ప్రణయపూర్వకంబుగా నంపె. అప్పుడంగాధిపతి యగు కళాపూర్ణుండు కేరళేంద్రునివలన మృగేంద్రవాహనా నిలయం బున్నచోటు విని యచ్చటికరిగి యమ్మహాదేవిని సేవించి తద్భవన వలభులఁ గని తనపూర్వజన్మంపు వీణియఁ గని పుచ్చుకొని యత్యంత సంతుష్టుండగుచు నంతనుత్తరాభిముఖంబుగా యాత్ర గావించె. ఇట్లు చనుచుండ నాచుట్టుపట్లనుండు రాజులు తనకిష్టములైన రత్నములిచ్చి కొలిచి యనుప నాభూపతిసింహుండు ఘూర్జరాధిపుని శౌర్యదర్పంబులు వినినవాఁడుగావున నతనిపై నడిచె. అతఁడును తద్వార్తవిని యతిభీషణ మగు తనధ్వజినీతతితోడవచ్చి ప్రతివీరుం దాఁకె. ఇట్లు తాఁకి యుభయబలంబులు నతినిష్ఠురంబుగఁ బోరుచుండిన సుముఖాసత్తిపుత్త్రుండు ఘూర్జరభూమిపాలునిపై క్రోధము మీఱ బాణవృష్టి గురియించిన, తత్సాయకనిషూదితుఁ డగు సూతుఁడును భగ్నకేతుఁడును నిర్జితబాహుశౌర్యుఁడును నిర్గతధైర్యుండునై యుద్ధంబు చాలించి కళాపూర్ణునకు శరణంబు సొచ్చి యాత్మీయశుద్ధాంతకామినీశిరోవతంసమణులఁ దెచ్చి కానుక యిచ్చె. అంతట నాకళాపూర్ణుని కురుకాదిదేశభూకాంతులువచ్చి కొల్చి తదభీష్టరత్నంబు లొసంగిరి. వారందఱును, మహారాజేంద్రా! రుక్మిణీకాంతుండగు శౌరి జగత్పరిరక్షయొనర్చి చనినపిదప నాకు దక్షతనీవకదా యని సన్నుతించిన నారాజోత్తముండు ద్వారకానగరంబును విపధి ముంచుట మున్ను వినినవాఁడు కాన వారిం దత్తీర్థలాదరంబున నడుగుచు యదుసింహుఁడగు నంబుజాక్షుండు తనపూర్వజన్మ గాంధర్వవిద్యాగురుండగుట నతనిఁ గనుఁగొను భాగ్యంబు తనకు మరల లభింపమికి నాత్మయందు చాలవగుచుచు నౌత్సుక్యంబున తత్ప్రాంతికమున కరిగి దండప్రణామంబు లాచరించి యటనుండి బయలువెడలి మాళవ బర్బర ధరణీపతుల

పై నడిచి భీషణం బైన ఖండనంబున వారిని భంగపఱిచె. అట్టివార్తలు పాంచాలాదిదేశాధిపతులు విని వేవేగమున వినయముతో నిజతన్వీమౌళిరత్నాదులవస్తువులఁ గళాపూర్ణునకుఁ గానుకగాఁ బంపిరి. అట్టి సమ్మానము నంది యాకళాపూర్ణుఁడు హిమగ్రావాంతంబునకరిగి వెంటనే దిరిగి తూర్పుదేశంబుపై నడిచె. అట్టివార్త విని ప్రాగ్జ్యోతిషపురాధీశుండువచ్చి యెదిర్చె. అప్పుడు సమరం బతితుములంబయ్యె. అట్టిచో పరానీకంబులు కాందిశీకంబులై చీకాకుపడ ప్రాగ్జ్యోతిషాధీశుని ప్రియసఖుం డగు చండబాహుం డనువాఁడు తనసేనల మిగిలి యయ్యంగరాజుతోఁ దలపడియె. అప్పు డయ్యిద్దరకును దద్దయు ప్రొద్దు మహాయుద్ధంబు వర్తిల్లె. అట్టిసమయంబున మధురలాలసావల్లభుం డెల్లవిధంబులఁ ద్రుళ్లుచుఁ దనతో నెదురించి కడుదడవుగాఁ బోరుచున్న యావైరివీరు బవరంబునకు వెఱగందుచు నతని గెల్చు టెట్లకో యని తలంపువోఁడమ ధనుర్ధరుండై స్వభావసిద్ధుం దలంచి తనమనంబున నమస్కరించి తదనుగ్రహలబ్ధంబు లయిన యమోఘనిజధనుర్బాణంబుల నుద్దేశించి, ఏమీ! మీకును లోకంబులోని శరశరాసనంబులు సరియగుచు నింతసేపుపోరించుట సహింపవచ్చునే, మీమహత్త్వంబుఁ జూపుట కిదియ యవసరంబనుచు హుమ్మనుచు నుత్సాహంబున హెచ్చి మిక్కిలి యుక్కుగైన హస్తలాఘవవిశేషంబున నొకక్రూరాస్త్రము సంధించి యేసి దాని వెనువెంటనే యనేక నారాచపరంపరలువోడిగి యేసిన నవి శత్రుని భుజాంతరముఁ దూరి పాఱె. అంత నాచండబాహుండు ధరణిం ద్రెళ్లె. దానింజూచి ప్రాగ్జ్యోతిషాధీశ సేనావారంబు చెల్లాచెదరై నలుదిక్కులకు భయంబునఁ బాఱె. అట్టి చండబాహు పాటువలన నాటోపంబుదక్కి ప్రాగ్జ్యోతిషపతి యంగపతికి శరణుసొచ్చి తనశుద్ధాంతకాంతాశిరోరత్నంబులు కానుకిచ్చె. అంత తద్వార్తచేత నతిభీతినొంది కోసలప్రముఖులును మాగధుండును తమయంతన వశవర్తులగుచు సమ్మణిస్తంభసుతునియభిమతార్థంబులం దనిపి తదనుగ్రహంబు వడసిరి.

ఇవ్విధంబునఁ గళాపూర్ణుండు సకలదిగ్దేశాధీశులజయించి తత్తత్ప్రియాంగనామౌళి మాణిక్యంబుల మధురలాలసాదరణమంజీరనిర్మాణంబుకొఱకు సాధించి యెందును నెదురులేక యమందవిజయానందంబున తిరిగి వంది మాగధ కైవారంబులు సెలంగ నిజపట్టణంబుఁ జేర నరుగుదెంచె.

పదునాఱవ ప్రకరణము.

నగరప్రవేశము.

అంత నారాజసేన లిదె పట్టణపురోభాగంబు; ఇంచుకవడినడిచినచో నిండ్లకుఁ జేరి మనము విశ్రమింపవచ్చును, తడయక రండురం డనువారును; నామిట్టుదాటి ధళధళ

గాన్పించు మనవీటి కనకహర్మ్యంబులు నూడం డనుమనువారును, గంగాసరయూసంగమప్రాంతవనరాజమహిమలంజూచితిరే యనువారును, ఇన్నిదేశములు తిరిగితిమిగాని యిట్టికోటల నెందునైనఁ జూచితిమే యనువారు నగుచుండిరి. ఇట్లుండఁ గొందఱు చూడుఁడు చూడుఁ డవె గోపురంబులు గాన్పించుచున్నవి, యవే పైడికోటలు, నదె క్రముకకంఠోత్తరపురంబు, మరల నెన్నిదినంబులకు దానిం బొడగంటిమి యనుచుండిరి. ఇంకొక కొంద ఱదే తొల్లిటి ప్రాంతపట్టణపుఁద్రోవ; అదే రోమపాదుండు తనయల్లుం డగు ఋశ్యశృంగునికి గట్టించియిచ్చిన సంపత్సమృద్ధంబగు మేడ, చూచితిరే యది నేటికిని క్రొత్తగనే గాన్పించుచున్నది. కర్ణాత్మజుం డగు వృషసేనుండు తనహయంబును దాఁటించినట్టి వ్రాఁగల్లియదె. నాఁటి కది యబ్బురముగా నుండెను గాని నేఁటికి వీటిలోని గుఱ్ఱా లీ గాడిం దాఁటుచుండు. ఈపట్టణమునకుఁ దూర్పున నొకయామడమాఁగంబున కాసారపురం బున్నయది. తద్విభుం డగు సత్వదాత్ముఁ డీపట్టణమును కళాపూర్ణునకై గట్టి యుందతఁ బట్టంబుగట్టి తా నమాత్యపదస్థుండై యుండె. అని యివ్విధంబున మఱియు దత్తత్ప్రదేశవస్తువిశేషదర్శనప్రసంగోచిత భాషణంబుల నవిదితాయాసంబు లగు తెరువులు జరుగ నరుగుచున్న సకలజనులు నక్కడక్కడం గడలుకొను దొలంగి కనుఁగొనుచుండ నుద్దండభేరీపటహశంఖకాహళాది నాదంబులు రోదోంతరంబునం బిక్కటిల్ల నక్కజంపువైభవంబునఁ గళాపూర్ణభూపురందరుండు నిజపురంబుఁ బ్రవేశించె.

ఇట్లు ప్రవేశించి తాఁ దెచ్చియున్న శుభతరవిపంచికాభినవకౌముదికి నొసంగి కళాపూర్ణుండు సత్వదాత్ముం బిలిచి రూపానుభూతిపుత్రికకు నూపురంబులు జేయింప నాజ్ఞ యొసంగె. అట్టి వృత్తాంతంబు విని మధురలాలస యానందంబునొందుచు నెందునత్యపూర్వంబులైన నానాభూషణవిశేషంబుల నలంకృతయగుచుండె; తత్సమయంబునఁ బ్రసంగవశంబున మధురలాలస తన చెలులవలన నాత్మబాల్యసమయసంప్రాప్తరత్నహారంబు సుద్దివిని యది ప్రాణవల్లభుని ప్రథమానుగ్రహవిశేషంబగుటం జేసి యాభూషణంబును ధరియించుటకు నభిలషించి దానిం దెప్పించె. ఇట్లు తెప్పించి దానిని నిజహృదయస్థలలంబియగుటకుఁ దగునట్లుగా నిరుగడలఁ గొన్ని మణులునిలిపి తనసూత్రంబునఁ గ్రుచ్చి ధరియించి తనవిలాసంబు పరిఢవిల్ల సురటిగొని వరునికడకరిగి పరిచర్య సేయుచుండె, నంత సత్వదాత్ముండు రాజాజ్ఞానుసారంబుగ నాయితంబుచేసిన యందియజోడు తనకరంబులఁ బట్టికొని యచ్చటికేతెంచె. ఇట్లు వచ్చి తాఁ దెచ్చిన యాభరణంబు లధిపుని కనుసంజ్ఞ నాయింతి యగ్రంబునం బెట్టి యిట్లనియె. మాయేలిక మీకొడబడ్డ సకలదిగ్దేశభూనాథశుద్ధాంతకాంతాశిరోమణిప్రకల్పితనూపురప్రకాండంబు లివియె. అమ్మా! వీని నంగ్రుఁగులం బూనుము. అనుచు వసుధపై సాగిలి మ్రొక్కె. ఇట్లు మ్రొక్కిన వలదువలదు, మాకు నీవు వందనార్హుండవు కావున మ్రొక్కఁగుడు, నీవు నాకు మేనమామ వగుదవు. నేఁటిదాఁక నీవు దీని నెఱుఁగవు.

అని యాతని కా తరుణీమణి సాష్టాంగప్రణామం బాచరించె. ఇట్లుగా మధురలాలస మ్రొక్కిన సత్వదాత్ముం డరువందుచు మేనువడకఁగా వెనుక వెనుక కొదిగె. అట్టి యాతనిం జూచి మధురలాలస లేచి వినయంబున నామాట నిక్కంబు సంకోచము దక్కుమని పల్కె. అప్పుడు కళాపూర్ణుండు నవ్వుచు నతనిం జూచి యిట్లనియె. మంత్రివర్యా! యాచెలువ యన్నయట్లు నిజంబు కావలయును; సంకోచింపక. తత్ప్రకారంబు తెలియ నడుగుటయే లెస్సయగుఁగాక. మధురలాలస శైశవముననుండ నీవు నీకలాఖ్యాదుల నడిగితివి, అవి యపుడా పెకుఁ దోఁపక నేఁటికిఁ దోఁచియుండ నోపు, మేలయ్యె; ఇపుడైన నడిగి తెలియుద మని మధురలాలస దిక్కు మొగంబై యిట్లనియె. తరుణీమణీ! నీ చిన్ననాఁటి బోధ విశేషము తిరుగ లబ్ధోదయమయ్యెనే, యితఁడు నీకు మేనమామ యగు పద్ధతి యెట్లు? తొల్లి యితం డడుగ నపుడు చెప్పకుండుటయు నేఁడు చెప్పుటయు నెట్లు గలిగె, శైశవంబున నట్టి విజ్ఞానంబు గలుగుటకుఁ గారణంబు నాడడిగి తెలిసికొనలేకుండుటకుఁ బశ్చాత్తప్తుండ నగుచుండుదు, దానిం గూడ నెఱుఁగింపుము. అనిన నట్లే చెప్పెద నని మధురలాలస తన చేతిసురటి విసరుచు వినయంబున మధురఫణితితో నిట్లు వినిపించె.

సత్వదాత్ముని పూర్వవృత్తాంతము.

రాజేంద్రా! సత్వదాత్ముండు తొల్లి మహారాష్ట్రదేశాధినాథుఁడు. ఇతని నే సుగ్రహుం డని చెప్పుచుండిరి మాతల్లి రూపానుభూతి యీతని యప్ప, ఇతఁడు కులీన శ్రేష్ఠుఁడు; కావున వేడుకపడి యనేకనృపతులు తమ కన్నెల నిచ్చి సంబంధబంధువులుగా నుండ గోరి పత్రికల నంపించిరి. అట్టివారిలో నెవ్వరివాంఛ నీడేర్తును? ఎవ్వరి నిపిసుతు? నను విచారముతోడ నిట్టట్టు నుడువక యీతండు బహుకాలంబు గడపె. అవి యవగణన గాక వగచి యొక్కొక్క నెపంబున వారు మేరదప్పి యతనిపై దండయాత్ర చెసిరి. ఇతఁడు తా వెలుపలిమై యెత్తెఱుంగున నైన వారి యేపడచి పరాభూతులం జేయుదు నని నిశ్చయించుకొని జవహయాధిరూఢుఁడై పురి వెడలిపోయెను. అట్లు రాజు కడఁ దొలఁగు వార్తం దెలిసికొని రాజు లేని రాష్ట్రంబుపైఁ జని జయముగొనుట యేమి శౌర్య మని తమ తమ దేశంబుల కారాజులు తిరిగిపోయిరి.

ఇతఁడు నహితభూపతులు తిరిగిపోవుట యెఱుంగఁడు గావున నతిదూరంబు పని యొక విపినమధ్యంబున నిలిచి యెవ్విధంబున శత్రుల జయింతు నను చింత నొక్కింత తడవుండి తనలో నిట్లు చింతించె. ఆహా! శత్రువులు ముట్టడించి రను భయంబున నసహాయత వడి వడి నింతదూర మరుగుదెంచితి; పుర మేమి యయ్యెనో, ప్రజ లేమైరో, విపత్తు లేమైరో, దీని నెఱుంగు నుపాయంబు లేకయున్నది; నేను తిరిగిపోయెదనంటి నేని శత్రువు లెచట నెట్లుగా నడ్డగించెదరో, కావున నట్లు చేయఁ బాడి గాదు. ఇంక నున్నచోట నే యుండి యుల్లమున సకలమును గాంచెదనంటినా యది సుకృతాత్మునకుఁ గాని నాయట్టివాని కేల

లభించు. అట్టి మహత్త్వముం గాంచినప్రమకే బ్రదుకు గాక నన్యమహత్త్వంబులవలన ఫలం బేమియున్న యది యని యిట్లుగాఁ జింతించి యితరం డట్టి సర్వజ్ఞత్వంబు సాధించుటకు దృఢనిశ్చయుండై మహోత్సాహుండై తురగాధిరోహణంబు నేసి వాసుదేవ నిత్య సాన్నిధ్య ప్రసిద్ధసిద్ధం బైన యమునాతీరంబున కరిగి యందు బృందావనంబున తాను నిత్యము నారాధించు బాలకృష్ణుని నుత్తానశయుని వటపత్త్రశయానుని మదిని నిలిపి యధికతపం బొనరించె నంత.

సీ. కొమరారు దుమ్మట్టి యాకున బవ్వళించి చూపట్టెటు బాలరూపంబుతోడ
వాణి యుష్టంబునఁ బదిలంబుగాఁ బట్టి మొగమున నిడు పదాంబుజముతోడ
జగదాంగుళీపాన బాసలాలాభిషిక్తం బైన చిన్నిహారంబుతోడ
బూని చూడ్కులకుఁ బ్రహ్మానంద హైత్యంబుఁ గలుగ నెయ్యపు ముద్దుచెలువుతోడ
గీ. నతనిమనమున నతిరతధ్యానమహిమ । దేరముగాఁ బాదుకొన్న యాదేవురూపు
వెలిప్రకాశింపఁ జేయుచు విష్ణుదేవుఁ । డధిక కారుణ్యలీలఁ బ్రత్యక్షమయ్యె.

అట్లుగా హరి ప్రత్యక్షుండై యితని యభీష్టంబు వేఁడుమనిన నతిప్రీతి నించుక తడ వేమియుఁ బలుక నెఱుంగనివాఁడై యుండె. పిమ్మట కొంతవడికిఁ బ్రబుద్ధుఁడై యితఁడు శ్రీహరి పదపద్మంబులకు సభక్తికంబుగాఁ బ్రణమిల్లి నిటలఘటితముకుళితకరకమలుండై యాదేవదేవునితో నిట్లు విన్నవించె. దేవదేవా! యత్యంతానందంబున మునిఁగియుండి మాటాటలాడ నెఱుఁగకున్నవాఁడ. పరమపురుషా! నీవలన సర్వజ్ఞత్వము నందుటకు నేఁ గోరుచున్నవాఁడ; గరుణించి నాకద్దాని దయసేయవలయు నని విన్నవించుటయు నద్దేవుండు తన మెడనున్న రత్నహారంబు దిగిచి దీని నాయకరత్నం బెవ్వరి హృదయస్థలంబున నెంతతడవు సోఁకియుండునో యంతతడవును వారికి సర్వజ్ఞత్వంబును సకలవాక్పటుత్వంబును గలిగియుండు కాని బ్రాహ్మణమనోవ్యథం గావించువారియొద్ద నిది యుండదు. అని యానతిచ్చి హారం బితనిచేతికిచ్చి విష్ణుం డంతర్ధానంబు నొందె. అంత నితం డమ్మహనీయ హారంబు వడసి వచ్చుచుఁ దత్సమీపవనంబులో నొక్క దేవాలయంబు గాంచి దానిలోనికిం బోవ నుద్దేశించి తద్ద్వారశాఖలదండ వెలయింపఁబడిన యొక్క స్త్రీప్రతిమం గని మనంబున మెచ్చుచు నాచేరువ నొకచోటఁ గూర్చుండె. అంతలో భవ్యాచారశీలుం డగు నొక వాచంయముఁడును మార్గవశంబున నాగుడిం జేరి కాషాయవస్త్రంబు చెఱఁగు విసరుకొనుచు హరిస్మరణంబు సేయుచు నచ్చో నధ్వశ్రమంబునఁ గొంతతడవు గూర్చుండె. ఇట్లుండి యా యతీశ్వరుం డతిగమ్యం బైన యా మెప్పంపుఁ బోఁడి యొప్పు చూచి యాహా శిల్పీ! బ్రహ్మను మీఱితివి. ఏగతి యీప్రతిమను జేసితి వని మెచ్చుచుఁ దలయూఁచుచు లోకములో నిట్టి పడతుక లుందురా! సన్న్యాసి దీని నీక్షింపఁ గూడ దని మాఱుమోము వెట్టి మరలఁ జూచుచు నతనువికృతికి లోనై యుండె. అని యిట్లుగాఁ జెప్పి మధురలాలస

నై వృత్తాంతంబు జెప్పక సంకోచించినట్లు గాన్పింప నద్దానిం దెలిసికొని సత్యదాత్ముం డొక దెసంబున నవ్వలికిం బోయె. అంత కళాపూర్ణుండు మధురలాలసతో నవ్వలికథ విన మనసగుచున్నది; దాని న్వినిపింపు మనుడు నాపె యిట్లనియె.

స్వామీ! యనంతర మేమి చెప్పుదు, మఱుంగున సుగ్రహుం డున్న యది యెఱుంగక నాయతిముఖ్యుండు మనసుపట్టలేక లేచివచ్చి యాప్రతిమను బిగియం గౌఁగిలించుకొనియె. అట్టి కార్యముం జూచిన సుగ్రహుండు నవ్వుపట్టలేక కికాకిక గా నవ్వె. ఇట్లు నవ్వినది వినియును విననిచందంబు గల్పించుకొని యయ్యతిశేఖరుండు తత్ప్రతిమాలింగనం బొక యదృచ్ఛాచేష్టావిశేషంబుగాఁ గల్పించుటకుఁ దాత్కాలికయుక్తి నద్దేవాలయంబున వెండియుఁ గల దౌవారికాది ప్రతిమల నట్లే యాలింగనంబు సేయుచు నమస్కరించుచుఁ దత్తత్ప్రదక్షిణంబులఁ గావింపఁ దొడంగె. అట్టి యతని కపటచేష్టల తెఱం గెఱింగి సుగ్రహుండు యతిం జూచి యిట్లనియె.

ఓవాచంయమీ! యిట్లు నీ వెంతచేసిన నీపూర్వపుసేఁత నే నెఱుంగుదును గదా? దాని నే మఱవను. అనుచుఁ బరిహాస మొనర్చె. దాన నయ్యతి యతివ్యథమానమానసుం డగుచుఁ గనలి యిదితుదిగా నీ మొదలియెఱుక యెంతగల దంతయు నిహతంబయ్యెడు మని శాపం బిచ్చె. సుగ్రహుండు నతిభయాకులుం డగుచు శాపమోక్షణంబు దయసేయు మని యాయతిపాదంబులం బడి లేవక యుండెను. అప్పు డాయతీశ్వరుండు కరుణార్ద్రహృదయుండై యీ నాగహాస్యచేష్టితము నే మెడఁ బ్రకాశితమగునో యపుడు నీపోయిన మది నప్రియము లేని కారణమున మరల రాఁగలదు. అని యనుగ్రహించి యాసంయమీంద్రుండు యథేచ్ఛం జనియె. తచ్ఛాపమహిమంబున సుగ్రహుండు ప్రథమమునుండి యాక్షణము తుదిగ విజ్ఞాత మగు ప్రపంచజాతమెల్ల మఱచిపోయె. ఇట్లుగాఁ దనపూర్వచరిత్ర మంతయు మరువంబడియెఁ గావున నావఱకు క్షణముక్రిందనే యొక కుచస్థలినిడిన హారోత్తమమును గైకొన మఱచియుండె. శిష్టుండు దీని మొదట ననుగ్రహించునపుడే బ్రాహ్మణవ్యథ గావించిన పాపముతి కెది నిలువదని పల్కియుండెం గావున నీసుగ్రహుండు బ్రాహ్మణవ్యథ బెట్టి యాహారముం గోలుపోయె. ఎంతవారికిని దైవఘటన తప్పదు గదా లోకములో సామాన్యులు చేసిన దురితము లుచ్చరించుటచేతనే దోస మగు నని చెప్పియుండఁగా మహాపురుషుల కొకతఱి ప్రమాదంబునఁ గల్గెడు కొద వెల్లడించు పాపము వృథయగునా?

అంత సుగ్రహుండు దైవసంఘటన నచ్చోటు వాసి దివ్యదేశాంతరములు చరియించుచు నిజాహ్వాయవంశచరిత్ర విస్మృతిం జెంది భ్రాంతునివలె మత్తునిగతి బాలునికైవడి జేనింగనిన నత్యద్భుతంబుగాఁ దోఁచుచుండ బ్రవర్తించుచుండె. ఇతనికి జాత్యాది సకల వ్యవహారజ్ఞతయు శూన్యం బయ్యె. అనంతరము క్రమక్రమంబున నుత్తమమధ్యమాధమకర్మదర్శనమున ద్రవ్య కర్మ గుణ జాతి విశేష వివేచనంబు బాలునకుఁబోలె నిఖల

వ్యవహార హేతువై యుదయించె. కాని తనకుల నామాదులఁ దెలుపు తద్జ్ఞాలు నేఁటివఱకు దొరకమినికిం జేసి వానినిమాత్రము దెలియజాలఁ డయ్యె.

సుగ్రహునికిఁగల్గిన రాజ్యలాభము.

ఇవ్విధంబున పరిభ్రమింపుచు సుగ్రహుం డొక్కనాఁడు గంగాసరయూసంగమ ప్రాంతవనంబు చేరి యందు వర్ధిల్లుచుండె. తత్కాలంబునందు కాసారపురం బరాజకంబైన నందుఁగల సామంతమంత్రిప్రముఖ రాజపురుషులు రాజనిశ్చయార్థంబై యొక్క యుత్తమగజంబు నలంకరించి దానికరంబున నొక పుష్పమాలిక నిచ్చి యది యెవ్వని కంఠంబునఁ దగులవైచు నతండు తమకు రాజగు నని దైవప్రార్థనాపూర్వకంబుగా నీమంబు చేసి దాని వెంబడినే బయలు వెడలిరి. ఆగజంబును తిరిగితిరిగి సుగ్రహుం డున్నచోటికి వచ్చి తన తొండంబున నున్న పుష్పమాలిక నతని మెడను వైచె. అపు డరాజకత్వ దుఃఖదుర్బలులై యున్న యామంత్రిముఖ్యులకం దఱకు నటమున్న యతనిదర్శనము మాత్రమున నొక్కసత్త్వ విశేషం బుదయించె. అయ్యుభయనిమిత్తంబుల నత్యంతసంతుష్టు లగుచు సుగ్రహుని గజాధిరూఢుం జేసి పురంబునకుం గొంపోయి రాజ్యాధిపత్యంబునకుఁ బట్టంబు గట్టిరి. తత్స్వరూపమాత్రంబ మున్న తమకు సత్త్వదాయకం బగుట సంస్మరించి యతనిని సత్వదాత్ముం డని ప్రశంసించిరి. అతని నామజాత్యాదు లప్పటికి నప్రసిద్ధంబు లగుట నానామమే యతనికి దిగంత విఖ్యాత మయ్యె. అతఁ డిట్లుగాఁ గాసారపురాధీశ్వరుండై రాజ్యభోగంబు లనుభవించుచుండి భవజ్జననీ జనకు లయిన సుముఖాసత్తి మణిస్తంభులఁ దనపురంబున నిలుపుకొని సేవచేయుచుఁ గ్రమంబున నీకు నమాత్యుం డయ్యె. తత్ప్రకారంబులు విస్తీర్ణంబుగా నా శైశవంబునందే నీకు విన్నవించినదానను గదా. అవ్విధంబున సత్వదాత్ముండు నీకు నమాత్యుం డైనవెనుక నంగదేశం బాశ్రయించి యిందుఁ గ్రముకకంఠోత్తరనామధేయం బైన యీపురంబు నూతనంబుగ నిర్మించి నిన్ను బట్టంబుగట్టినది నీకే విదితంబు, దానిం జెప్ప నేల? ఓవిశ్వవిశ్వంభరా! మండలేశ్వరా! యీసత్వదాత్ముని కులనామాది ప్రకారంబులు పూర్వంబున నతనివలన నడుగఁబడి యప్పు డే చెప్పకుండుటయు నిప్పుడు చెప్పుటయు నప్పటి నా సకలజ్ఞానోదయంబునకుఁ గల కారణంబు నీ వడిగితివి. దాని విన్నవించెద నవధరింపు మని మరల నిట్లనియె.

అట్లు సుగ్రహుండు మున్ను దేవతాలయంబున నుంచి మరలఁ బుచ్చికొన మఱచిన యమ్మణిహారమును మధురాపురీవాసి యగు నొక బ్రాహ్మణుండు దైవవశంబున నపు డచటికి వచ్చియుండుటం జేసి గైకొని యుండె. ఇట్లు పుచ్చుకొని దానిం దనగృహంబునకుఁ గొంపోయి యాబ్రాహ్మణుండు బహువర్షంబులు దానిని వేల్పుంబలె భక్తిం బూజింపుచుండె. ఒకనాఁ డాబ్రాహ్మణుండు త్రిలోకాధిపతి యగు నచ్యుతుని దర్శనంబునకు

ద్వారావళికిం బోయి యుపాయాంతరంబుగా నాయదుకులాభరణునకు నొసంగె. శ్రీకృష్ణుండు వాకానుక నాదరించి కైకొని యాబ్రాహ్మణున కభీష్టవస్తువుల నొసంగి యనిపె. అనంతరము మణికంధరుండు శౌరిం దర్శింపంబోయి యొకదండకమున నాలోకాధినాథుని స్తవంబు సేయ నావాసుదేవుండు వైహారమును మణికంధరున కొసంగె. నతండు మహాప్రసాదం బని దాని నందుకొని తనకంఠంబున ధరియింపుడు నది బాలత్వముననుండు విష్ణుని కలాపము గావున నతని భుజాంతరమున నది వ్రేలంబాలక గళసీమ నే యొప్పి యుండె. దాని నాయకమణి యతని హృదయమున సోంకక యుండుటం జేసి యతనికి సర్వజ్ఞత్వాదులు బైలుపడక యుండె. మణికంధరుండును తన యంత్యకాలంబున యీ మణిహారం బలఘువ్రతుం డను భూసురునకు నిచ్చె. నీ వద్దానిని యలఘువ్రతునివలనం బడసి నాకు దయసేసితివి. నేనపుడు శిశుతాసమయంబున నుండుటం జేసి యీహారగతరళము నాహృదయంబున సోంకె. దానం జేసి నేను బోధశాలి నైతిని. మహారాజా! నీవు తొలిజన్మంబున మణికంధరుండవై శ్రీకృష్ణునివలన నీహారంబువడసి మరల నీజన్మంబున నాభూసురోత్తమునివలన నిమ్మణిహారము గైకొంటివి. అట్టిదానిని కృపాబుద్ధితో నాకొసంగి నన్ను మన్నించితివి. అప్పటినుండి నేనిటునటుం గదల నానాయకమణి హృదయస్థలంబు వాసి ప్రక్కకు జరుగుటం జేసి యప్పటి విజ్ఞానం బంతటితో మరిగె. అటుపిమ్మట నీమంత్రీశ్వరుండు తన వృత్తాంతంబు తెల్పుటకు నన్ను సంప్రశ్నించె. విజ్ఞాన తిరోధానానంతరము సత్యదాసుండు నన్ను మరుగుటం జేసి యతని నాముజాత్యాదులు నపుడే చెప్పలేకుంటి. దాని కిదియ కారణంబు. అట్లు నాకు బోధోదయం బగుటయు మరల నది యుడుగుటయు నేతన్మాలం బని యెవ్వరు నెఱుంగకుండుటచేత నిది సామాన్యహారం బను తలంపున మావారు దీనిం దాచి దీనివృత్తాంతమే మఱచియుండిరి. నాంటనుండి నేంటిదనుక నిద్దివ్యహారం బెన్నండును నేను ధరియించుటలేదు. నేండాభరణాభరణసమయంబున ప్రసంగవశంబున దీనిప్రస్తావన వచ్చిన నా చెలులు తత్ప్రాప్తికారణం బెఱుంగించిరి. దానం జేసి యిది సుముహూర్తలబ్ధం బయిన ప్రథమభూషణం బనియు భవద్దత్తం బనియు నత్యాదరంబునం దెప్పించి హృదయభాగస్పర్శ నాయకరత్నంబుగా దీనిం జేయించి యిపుడు ధరియించియున్న దానం. ఇచ్చోటికిపుడు నూపురంబులం గొనుము సత్యదాసుం డేంగుదెంచిన నింత లోపలికొలువునకు వచ్చుపాటి పనువు కలిమికి నితం డెంత భాగ్యవంతుండో కో యని యొక్కించుక భావింప నితని జాత్యాదు లన్నియు మదీయహారనాయకమాణిక్యమాహాత్మ్యంబున నాకుం దోంచె. భూతభవిష్యద్వర్తమాన భువనప్రపంచంబునం దెద్దియైన దేవరకుం దెలియవలసినయది కరతలామలక సమానంబై కనంబడియెను. దీనిం ధరియించి చూడుండని యమ్మహనీయ రత్నమాలిక తనపయ్యెద వెలుపలికిం దిగిచి చూపిన నాభగవతీవల్లభుం డిట్లనియె. ఓయింతీ! యట్లు తివకయుండనిమ్ము; నీవు నిచ్చినట్టి హారముం దిరుగం

బుచ్చుకొనుట యొప్పగునే. అట్లుండంగనే దీనిమహిమను తెలుపుట మంచిదిగదా యనుడు మధురలాలస యిది జాణల యుపాయ మని నవ్వి యూరకుండె.

అంతట సత్యదాసుండు శాపమోక్షంబున నాబాల్యానుభూతపదార్థజాలం బంతయు తనంతన యాత్మసంస్మరణగోచరం బగుచు నటమున్న మధురలాలసచేతం దా విని నవి సరిదాంకుచుండ ప్రమోదంబు నద్భుతంబు నాపాదించుచుండ నేంగుదెంచి తగినయవసరంబు దెలిసి యాకళాపూర్ణమహారాజుం గాంచి తనకుం బునఃప్రాప్తం బయిన యా యొఱుక తెఱంగు విన్నవించె. ఇట్లు విన్నవించి నేను శాపముక్తుండ నగుట పుణ్యదంపతులగు మీకతంబుననే కదా? నాకు తొల్లింటి మహారాష్ట్రరాజ్యభోగంబునకంటె ననేకగుణంబుల నధికం బయిన యిప్పటి దేవరపాదపద్మసేవయే పరిపూర్ణసుఖంబు నొసంగుచున్నయది. దీని నెల్లకాలంబు నాకుం గలుగ ననుగ్రహింపవలయు నని తన యేలికకు సాష్టాంగప్రణామం బాచరించె. అంత మధురలాలస యతని బంధుత్వవిశేషజ్ఞానంబున నెప్పటికంటె నధిక గౌరవంబొనర్చి యాతని గృహంబునకనిపె. కళాపూర్ణుండును మధురలాలసయు దన్మాణిక్యవిశేషంబులం బ్రశంసింపుచు దినాహ్నకృత్యంబులు సేయం జనిరి.

ఇట్లు గాంగ కళాపూర్ణమధురలాలసలు దినాహ్నకృత్యంబుల దీర్చి నిశాసమయంబున కేళికాధామంబున కరిగి యిష్టవిహారంబుల నుండిరి. అంతటం గళాపూర్ణుండు మధురలాలసను బరిరంభణంబు గావింప నుభయహృదయదేశముల నమ్మణిస్పర్శ యేకరీతిం గలిగి నపుడా యిర్వురకును దన్మణిమహిమంబున నొకరి మనస్సున నొకరికి విస్పష్టంబు లయ్యె. అంత నామహీవల్లభుండు ధర్మశీల యగు నభినవకౌముదికిం దనయెడగల ప్రేమాధికముల దలంచికొని యామెసుగలభక్తి యధికమ్మై యుండుటకు మిక్కిలి సంతసించె. ఈహారమణిశక్తిచేం దెలివియుం బటుత్వమును బ్రవేశింపంగా నాభూతలనాథుడు తన పూర్వజన్మవాసనాబలములనంది వీణాపటుండై మధురలాలసను గానకళాప్రవీణగా దిద్దె. మధురలాలస భర్త తన్ను బరిరంభణముసేయు కాలంబునం దా నావలలో భర్తకుం దెలిపిన స్వరాష్ట్ర పరరాష్ట్రగుణాగుణ వర్తనల నెచ్చరింపుచుండె. కళాపూర్ణుండును మధురలాలస పరిరంభణసమయంబున హృద్దేశఘటితహారతరళమాహాత్మ్యమున సమస్తజ్ఞుండగుచుం దనచెలులనుకొన్న చిన్న కన్న యర్థములు చెప్పకుండ నని శిక్షింపుచుండె. అమాత్యులలో నొకండు రిపులకు లోనిచ్చి యపరాధియాయె నని పల్కుచుండె. మలిమ్లుచుల నుద్దేశించి మనస్సులో వీండు దొంగిలింప దలంచె నని మూదలించి దండించుచునుండె. మరియొకని నాలితో రాత్రి యతిమాత్రముగ నల్గెనది తగదని ఒగిసరీతిం జెప్పించె. ఇట్లు కొన్ని నాళ్లు జరిగె.

అంత నొక్కనాండు కళాపూర్ణుండు మధురలాలసతో నేకాంతంబుననుండి సర్వజ్ఞత్వకారణ దివ్యమాణిక్యప్రశంసాప్రసంగమున విష్ణుదేవుని మాహాత్మ్యంబులు తలంపునం

ధామము తదితరులకు దుర్గమం బిహపరసాధనం బని సంభావింపుచుఁ దత్ప్రసంగవశంబున తొల్లింటి జన్మంబునఁ దా ననంతశయనపద్మనాభునిసన్నిధిని భాగవతుల వచనానుసారముగ లక్ష్మీనారాయణులసంవాదకథనము నొనర్చుట దలఁచుకొనియె. ఇట్లు తలఁచికొని దానిని మధురలాలస మధురాలాపములచేత వినుట కాభూపాలునకు వేడ్క వొడమె. ఇట్లు వేడ్క వొడమ నానృపాలుం డా యిందీవరాక్షిం జూచి యనురాగం బలరుచుండ నిట్లనియె.

ఇందుబింబాస్యా! గతజన్మంబున నేను రమాముకుందులసంవాదమును కావ్యరూపమున వర్తిలం జేసితి నని నీబాల్యవాక్కులలో వింటి; నాకావ్యమును నీమణిమహిమంబున బరికించి యిప్పుడు శేషమును జెప్పఁ దగును. నీపరిరంభణ నాకు సంప్రాప్తం బగుచుండు తెలివిలో నీపై తమి నుండుటం జేసి దాని నరయ మఱచియుండు. దానిని నీవు ప్రకటింపఁ జేసిన సంతసిల్లెదను. అని పలుకు ప్రాణవల్లభుని పలుకులకు నగుచు నమ్మగువ, యో మహారాజా! దేవర మది కిపు డెయ్యది ప్రియంబో దాని నేఁ జేయుట నాకును పరమప్రేమాస్పదంబు కావున నప్పావనకథ సవిస్తరంబుగా వినిపించెద నవధరింపు మని పలికి యమ్మధురలాలస తనను సకలవిజ్ఞాననిదానం బగుచు హృదయప్రదేశంబు నలంకరించు మన్న దివ్యహారనాయకమాణిక్యంబునకు నమస్కరించి తదీయప్రాప్తికారణంబు లయిన యా కళాపూర్ణుని, యలఘువ్రతుని, మణికంధరుని, కృష్ణుని, విప్రుని, సుగ్రహుని, వటపత్త్రిశాయిని, హృదయంబునం దలంచి యీగురుపరంపర నాకు ననుగ్రహకారిణి యగు గావుత మనుచుఁ బ్రణమిల్లి యాలక్ష్మీనారాయణసంవాదకథ తొల్లిటి మణికంధరోక్తప్రకారంబున నిట్లని చెప్పం దొడంగె.

లక్ష్మీనారాయణసంవాదకథ.

సీ. అమృతపూరాశ్చర్యతమవిరజానదీసీమావరుద్ధ సంసృతికతంబు
పరిగణనాతిగ బ్రహ్మాండబుద్బుదప్రకృతిపాథోధి పారాయితంబు
సూర్యచంద్రాగ్నితేజోనిరపేక్షణ ప్రాకృతస్వప్రభా భాస్వరంబు
స్వేచ్ఛాగృహీత సమిద్ధ విశుద్ధసత్త్వశరీర నిత్యముక్త వ్రజంబు
గీ. నగుచుఁ బెంపొందు నిఖిల వేదాంతసిద్ధ । పరమకల్యాణగుణఘన బ్రహ్మతత్త్వ
సతతసాక్షాత్క్రియావిభూషితనిజాను । భవసుఖితకోవిదము శౌరిపరమపదము.

అట్టి పరమపదము చిదచిదీశ్వరాత్మకమై యశేష జగదుపాశ్రయమై యాపస్తేజో వాయు రాకాశాహంకార మహత్తత్త్వావ్యక్తావరణ మగు నజాండమున కవ్వలఁ బ్రకాశించుచుండు. అచ్చోఁ బ్రకృతిదోషము లణుమాత్రమును లేవు గాని, యనంతకోటిగుణ సమృద్ధి గలిగియుండు. నావిష్ణులోకముం జుట్టి విరజ యను నొకనది ప్రకాశించుచుండు. ఆసింధూత్తము చేరువ నైరమ్మదీయ మను సరసియుండు. ఆసరోజాకరముప్రాంతమున నొక బిల్వభూరుహము గలదు. అచ్చో సోమసదన మన నొప్పు నొక యశ్వత్థశాఖి సువర్ణమయము లగు శాఖాత్రయీశోభితం బగుచుఁ బ్రకాశించుచుండు. ఆమహీరుహమునీడను సుమధ్య లగు పంచశతాప్సరసలు సుమమార్ణకజ్జలపటాభరణంబులు కరంబుల ధరియించుకొని ముక్తత నచ్చటి కేఁగుదెంచువారల కెదురుగాఁ జని ప్రౌఢిమతో నలంక్రియాలోనర్ప వేచియుందురు. ఇట్టి యద్భుతభువనం బుభయకర్మతంత్రములకును నయోధనీయమగుటం జేసి యామ్నాయము లయోధ్య యని పేరు గాంచి యుండె. ఇదియు రాజీవలోచనుని రాజధాని. అట్టి పట్టణ మధ్యప్రదేశంబునందు.

సీ. రవిచంద్రకోటితిరస్కారధౌరేయ మహనీయదీప్తి సంపదలఁ బొదలి
వేదప్రసిద్ధమై వెలయు నద్భుతరత్నమయసహస్రస్తంభమంటపమున
మహితవిభూతియుగ్మవిచిత్రరూపమై ధర్మాదిసూరిపాదములతోడఁ
జెలువొందు మాణిక్యసింహాసనమున సహస్రదళాఖ్యపద్మంబునందు
గీ. శేషతల్పాభిరూఢుఁడై సిరియు ధరయు । నీళయును భజియింపంగ లీలనందు
గేవలభ్రూవిలాసానుభావభావి । తాఖిలాజాండవర్తనుం డచ్యుతుండు.

అట్టి యచ్యుతుని పూర్వదిశయందు అనుగ్రహ యవ్వధూటి పసిడికుంచియ వైచుచు గొల్వు సేయుచుండును. ఫణిపలోత్తముండును గరుడుండును సూత్రవతీవిభుండును కుముదాదినిత్యసంఘములును గొలుచుందురు. దుష్టనిగ్రహంబునకుఁ బాలుపడియున్న యాయుధపంచకము పురుషభావమున నావిశ్వభర్తం గొలుచుచుండు.

సీ. తనవిలోచనసంజ్ఞ దవునకు భువనసర్గముఖక్రియాచార్యకంబు నడుపఁ
దనవిలాసంబు కాంతునకు శృంగారసామ్రాజ్యనీతిధురీణమంత్రి గాఁగఁ
దననర్మలీల నాథునకు దశాకృతిప్రకృతి కాసూత్రధారతవహింపఁ
దనముద్దుపల్కు భక్తవితానవాత్సల్యకర్ణికార వికాసకారణముగ
గీ. నఖిలకళలందుఁ దోడునీడగుచు మెలఁగు । నధిపునకు బాలమున్నీటి యాఁడుబిడ్డ
యరిదిమక్కువ లెక్కువ యాపితంబు । నురుముడింపక యతఁడు తన్ను పచరింప.

అట్టి జగదేకమాత సంసృతిదవానలతప్యమానచేతనకోటిం బ్రోచు కరుణ యుత్సహింపఁగాఁ బ్రసంగవశంబున నిట్లనియె. దయాపరా! యిపు డొక యర్థము దేవర నడుగ బుద్ధిని దివిరెదు. నావిన్నపము ప్రసాదంబున నవధరింప వలయు. ఈభువనముననుసృజియింప భరియింప హరియింప గర్తవై నీవే ప్రకాశించుచుందువు. బ్రహ్మభవులు నీ యాజ్ఞానువర్తులై కృపాసమర్పితప్రాభవులై సర్గలయాధికారముల నందిరి. జీవకోటుల దరిఁజేర్ప నాత్మఁగోరి నీ వీ బ్రహ్మాండసృష్టి రక్షా విలయములఁ గావింతు వని శ్రుతులు నుడువును. ఆత్మబోధనార్థమై వేదశాస్త్రములఁ గలుగంజేసితివి. అట్టి శ్రుతిస్మృతులలోఁ దెలుపంబడు నుపాయము నాదరింప నిష్ఠానుసారముగఁ జరించి ముక్తి కెడయైన జనులఁ

శ్రీ మత్స్యకూర్మ రామకృష్ణాదిరూపంబులఁ దాల్చి ప్రవర్తించుచుండుదువు. అట్టి యకారణకృపావరు నిన్నే మని వర్ణింపవచ్చు? ఈవిధము వేసరక చెక్కిలిఁగొట్టి పాలుద్రావించిన విధంబున బలిమిని నీవు హితం బొనర్పం గృతార్థులు నచ్చటచ్చటఁ గొందఱే యుందురు. పెక్కుజీవులు భవార్ణవంబులో మునుఁగుచుందురు. ఇదియంతయు నీమాయావిలాసం బగు. నీవు మనమునఁ దలఁచిన సమకూడరాని దెయ్యది కలదు. కావున సమస్తజీవులు నమితసిద్ధి నొందునట్లుగాఁ జేయం గోరుచున్న దానను; జీవులయెడ సర్వశేషి వగు దేవరకు భేదము గలదా? అట్టిచోఁ గొందఱు సంసారము ద్రిం జెందుటయు మరికొందఱు భవబంధంబున నుండుటయు నేల సంభవింపవలయును. అని యివ్విధంబున సకలరక్షణార్థంబుగాఁ బరమ కరుణావేశకలితహృదయ యగుచు శ్రీదేవిపలికిన తియ్యంపుపలుకులను సమ్యంబుజాక్షుం డిచ్చ మెచ్చుచు నత్యాదరంబున నమ్మత్తకాశిని ప్రసాదమేదురదరహసితలోచనంబుల వీక్షించి యిట్లనియె.

ఓయరవిందముఖీ! జనకునికంటెను జననికే తనయులపై వాత్సల్యాధిక ముండుట నైసర్గికమేకదా? నీపలికినట్లే యసంకుచిత ప్రభావధార్ష్ట్యంబున నే ప్రవర్తించుట సత్యమే యగు, నైనను వారివారికర్మంబులు చూడక నందఱ సమంబుగాఁ బ్రోచుట న్యాయ్యమగునా? గుణదోషవివేకము నావశ్యకృత్య మగుఁగదా! ఆజ్ఞానాజ్ఞ కృత్యంబులు నేను ప్రియాంగంబులుగాఁ గొనుటయును తదుభయవ్యవస్థానిమిత్తం బైన వేదశాస్త్ర లోకంబున నిలుపుటయును గారణంబు మత్స్వాతంత్ర్యంబ. కావున వారి వారి కర్మంబుల వెంబడినే యేను శుభంబొనరించుట స్వాభావికంబగు నని తెలిసికొనుము. శుభవర్తనము కొంచెమైన జనులు బుద్ధిఁ దలకొలిపినమాత్రమున దాని నేనే యేర్పుచు [illegible] కారణ్యం బునం బ్రోతును. సుకృతంబులందు పరమశోభన మైన మదర్చనాసిద్ధికి ధార్మికజనంబులు కోరుటంజేసి కాదే దశావతారంబులం బూని పొసఁగించుట; [illegible] దత్తహోమహిమదర్శనము వృథయగు, నేనేమి సేయుదు, అప్పటి ప్రాప్యప్రాప్తసాధనంబులో మత్పూజనాదికము సకలజనులకు సమకూర్పనేకదా శ్రీరంగాది దివ్యధామంబులయందు నిత్యము నివసింతును. ఇట్టి దంతయును జాలక నింకను గృపనెల్లజీవులం బ్రోవ నెమ్మదిం దమకించితేని యది న్యాయనంబునకును సమ్మతియే యగును. సమస్తజీవ గారుణ్యంబు [illegible] మెవ్వరి కింపుగాదు? కావున నీప్రార్థనంబులం జేసి యిపు డొనర్చు [illegible] మనుము. లోకానుగ్రహార్థంబుగా నేను నిత్యసన్నిధిస్థానంబులుగా నంగీకరించిన శ్రీరంగ కాంచీ వేంకటాచలాహోబిల పురుషోత్తమ దివ్యస్థలంబులకు నేగి సేవింప నూహించున్న నాతమయున్న చోటనయుండి తత్తద్దివ్యదేశనివాసు నన్ను నిజేచ్ఛానుసారంబునఁ దలంచి కొలుచుచుండువారికి సంసారంబు నుద్ధరింపఁ జేయుదును. అని యానతిచ్చిన సంతసిల్లి యాదియే చాలు నని యమ్మహాదేవుని దీనవాత్సల్యంబుల నమ్మహాలక్ష్మి యనేకవిధంబుల సన్నుతించె

END OF TITLE